www.andhrajyothy.com
నిజామాబాద్ సిటీ*
ఆంధ్రజ్యోతి
పేజీలు: 16 + 20 + 32
పేజీల ఆదివారం అనుబంధం
వెల: రూ. 6.00
సంపుటి: 14
సంచిక: 212
ఆదివారం | 11-2-2018
శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి సా.5.25 తదుపరి ద్వాదశి; నక్షత్రం: మూల రా. 10.59 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: రా. 9.11-10.59; దుర్ముహూర్తం: సా. 4.41-5.26; అమృతఘడియలు: మ. 3.46-5.34; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.48; సూర్యాస్తమయం: 6.12
Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai


పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్ నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న ప్రధాని మోదీ

తూర్పు జెరూసలెంను రాజధానిగా ఒప్పుకుంటే...

ఇజ్రాయెల్‌తో చర్చలు

16

సంక్షుభిత రాజ్యానికి భారత్ సంఘీభావం.. మోదీ చారిత్రక పర్యటన

బహుళ-పక్ష శాంతి బృందం ఏర్పాటుకు చొరవ చూపాలని అబ్బాస్ వినతి



పాక్ సెనేటర్‌గా తొలి హిందూ మహిళ

కృష్ణకుమారి?

16

'తక్షణ తలాక్'పై

పాక్‌లో నిషేధం!

ఇస్లామిక్ కౌన్సిల్ సిఫారసు

నల్ల ధనంపై కొరడా!

మార్చి 31లోగా పక్కా లెక్కలు చెప్పాలి

లేకుంటే భారీ జరిమానా, జైలు శిక్ష

నోట్ల రద్దు తర్వాత ఖాతాల గుట్టుతేలాలి

పన్ను చెల్లింపుదారులకు ఐటీ హెచ్చరిక




ధవన్ 'రికార్డు' శతకం

కెరీర్ వందో వన్డేలో సెంచరీ కొట్టిన తొలి భారతీయుడు


15

ఆమ్రపాలి పెళ్లి 18న

23, 25న వరంగల్, హైదరాబాద్‌లో విందు


జమ్మూకశ్మీరులో పెళ్లి.. హనీమూన్‌కు టర్కీకి

11



పంచుడా... దంచుడా!

దక్షిణాదిని ముంచేస్తారా?



5 దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి జనాభా దేశ జనాభాలో 15 శాతం నుంచి 2050లోగా 12 శాతానికి పడిపోనుంది.

కేంద్రం పంచే నిధుల్లో బీమారు రాష్ట్రాల వాటా 40 శాతం నుంచి 44 శాతానికి పెరిగింది. బిహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లను బీమారు రాష్ట్రాలుగా పేర్కొంటారు.

జనాభా ప్రాతిపదికన రాష్ట్రాలకు నిధులు

వేగంగా పెరుగుతున్న ఉత్తరాది జనాభా

దక్షిణాది నిధుల వాటాకు భారీగా గండి

ఇప్పటికే హిందీ రాష్ట్రాల ఆధిపత్యం

ప్రయోజనాలు కాపాడుకోలేని దక్షిణాది

సంక్షేమ పథకాల్లోనూ అన్యాయం!

న్యూఢిల్లీ: దక్షిణాది రాష్ట్రాల ఆదాయం ఎక్కువ! కానీ కేంద్రం వాటికి కేటాయించే నిధులు తక్కువ!! ఉత్తరాది రాష్ట్రాల ఆదాయం తక్కువ! కానీ కేంద్రం వాటికి కేటాయించే నిధులు ఎక్కువ!! పన్నుల రూపంలో తెలుగు రాష్ట్రాలు కేంద్రానికిచ్చే ప్రతీ రూపాయిలో కేవలం 67 పైసలే వెనక్కి.

మిగతా 16వ పేజీలో...



6

కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న అరవింద్ మెహతా

దేశాభివృద్ధిలో 'కాళేశ్వరం' కీలకం!

అన్ని రాష్ట్రాల ప్రాజెక్టులకు ఇది నమూనా వంటిది

వానాకాలానికి తొలి మైలురాయిని దాటుతుంది

సర్కారు సంకల్పం గొప్పది.. ప్రాజెక్టులతోనే సేద్యవృద్ధి

15వ ఆర్థిక సంఘం కార్యదర్శి మెహతా ప్రశంసలు

ప్రాజెక్టు సందర్శన.. 4 నెలల్లో మళ్లీ వస్తామని ప్రకటన

పని మనుషులు కావలెను

సండే స్పెషల్

బ్యాంకు నుంచి రిటైరైన శివసాయి ప్రసాద్ ఇటీవలే హైదరాబాద్‌లో బేగంపేటలోని సొంతింటికి వచ్చారు. ఇంట్లో ఆయన, ఆయన భార్య మాత్రమే ఉంటారు. దుస్తులు ఉతకడం, ఇల్లు ఊడవడం, తుడవడం, కళ్లాపి చల్లి ముగ్గు వేయడానికి ఓ పని మనిషి కావాలనుకున్నారు. రెండు నెలలు వెతికితే అతికష్టం మీద కుదుర్చుకోగలిగారు.



సదాశివం, పార్వతమ్మ పిల్లలిద్దరూ అమెరికాలో ఉంటున్నారు.వారు విశాఖ జిల్లాలోని ఊళ్లో ఉంటున్నారు. పార్వతమ్మ ఈ మధ్య మంచానపడింది. ఆమెను చూసుకునేందుకు, ఇంటి పనులు చేసేందుకు పనిమనిషి అవసరమైంది. ఒకప్పుడు ఇంట్లోనే ఉండి అన్ని పనులూ చేసిన వ్యక్తులున్న రోజుల్ని చూసిన సదాశివానికి ఇప్పుడు మనిషి దొరకడమే గగనమైంది.

ఇంటి పనులు చేసే వారికి డిమాండ్

పల్లెల నుంచి మహా నగరాల దాకా!

పని మనుషుల కోసం యాప్‌లు, ఏజెన్సీలు

'పాలియేటివ్ కేర్' కావాలంటే మరింత ఖరీదు

'పని మనుషులు కావలెను'.. ఇప్పుడు చాలామంది ఇల్లాళ్ల నోటి నుంచి తరచూ వినిపిస్తున్న మాట ఇది. పని మనిషిని చూసి పెట్టాలంటూ ఇరుగుపొరుగును, తెలిసిన వారిని చెవినిల్లు కట్టుకుని పోరుతూనే ఉన్నారు. అయినా దొరకడం లేదు. ఎంత జీతం అయినా ఇచ్చేందుకు

మిగతా 2వ పేజీలో...


జమ్ములో సుంజువాన్ సైనిక శిబిరం వద్ద ట్యాంకులతో పహారా కాస్తున్న సైన్యం; అమరుడైన సుబేదార్ మదన్‌లాల్




సైనిక శిబిరంపై ఉగ్రదాడి

జమ్మూలో క్వార్టర్లలో జొరబడ్డ ముష్కరులు.. విచ్చలవిడి కాల్పులు

అమరులైన ఇద్దరు సుబేదార్లు .. పిల్లలు సహా 9 మందికి గాయాలు

మేజర్ పరిస్థితి విషమం.. ముగ్గురు ఉగ్రవాదులు హతం

16



కొత్తగా 24 మునిసిపాలిటీలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పూర్తయిన కసరత్తు

సర్కారుకు ప్రతిపాదన.. నిర్ణయమే తరువాయి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 24 కొత్త మునిసిపాలిటీల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ మేరకు ప్రభుత్వానికి శనివారం ప్రతిపాదనలు పంపారు. ఇందులో మేడ్చల్ జిల్లా పరిధిలో 13, రంగారెడ్డి జిల్లా పరిధిలో 11 మునిసిపాలిటీలు ఏర్పాటు కానున్నాయి. వీటిలో ఆమనగల్లు మినహా మిగతా మునిసిపాలిటీలన్నీ

మిగతా 3వ పేజీలో...

350 చేనేత సహకార

సంఘాల రద్దు

సర్కారు ఉత్తర్వులు జారీ

3

పర్సన్ ఇన్‌చార్జికి బాధ్యతలు



గంగమ్మకు అంత శక్తి ఎలా వచ్చింది?



పరంజ్యోతి (Paramjyothi)

మన సనాతన ధర్మంలో నదులు ప్రముఖమైన విశేషాన్ని పొంది ఉన్నాయి. మనమేదైనా పూజ చేయాలంటే మొదట కలశారాధన పేరుతో నదులను నీటిలోకి ఆవాహన చేస్తాం. పవిత్రమైన వస్తువు గురించి చెప్పవలసి వస్తే.. గంగ అంత పవిత్రం అంటారు. గంగ సంబంధం, స్పర్శ లేకుండా ఏ పురాణం, కావ్యం కనపడవు. గంగ స్నానం, సంప్రోక్షణ, దర్శనం, గంగానామం, స్మరణం అంత గొప్పవిగా కీర్తించబడ్డాయి. అంత శక్తి గంగకు ఎలా వచ్చింది? పాపాలెందుకు పోగొట్టగలిగింది? వాల్మీకి మహర్షి ఈ రహస్యాన్ని చెప్పారు. గంగ త్రిపథగామ్.. అంటే మూడు లోకాలలో ప్రవహించగలిగిన శక్తి కలది. ఆమె హిమవంతుని పెద్ద కూతురు. పార్వతీ దేవి అక్క. దేవతల కోరిక మేరకు స్వర్గానికి వెళ్లిన గంగను.. సగర పుత్రులకు ఉత్తమ గతి కలిగించేందుకు భువికి తీసుకొచ్చేందుకు భగీరథుడు పరమశివుని కోసం ఘోర తపస్సు చేశాడు. గంగను జటాజూటంలో ఒడిసిపట్టిన పరమశివుడు.. భగీరథుని అనుగ్రహించి గంగను విడిచిపెట్టగా ఏడు పాయలుగా ప్రవహించింది. శివుడి పాదాలు కడుగుతూ దిగిన పాయ.. భగీరథుని వెంట వెళ్లి భాగీరథి పేరుతో హిమవత్పర్వత ప్రాంతం నుంచి ప్రవహించింది. పరమశివుడి శరీరాన్ని తాకి వచ్చింది కనుక గంగకు అంత శక్తి అని వాల్మీకి మహర్షి చెప్పారు. శివశరీరాన్ని తాకి కింద పడింది కాబట్టి ఆ గంగకు జనుల సమస్త పాపాలనూ తొలగించగలిగిన శక్తి కలిగిందన్నారు. గంగ స్వర్గలోకంలో మందాకినిగా, భూలోకంలో భాగీరథిగా, పాతాళంలో భోగవతిగా ప్రవహిస్తుంది కాబట్టి త్రిపథగ సార్థకం అయ్యింది.

-చాగంటి కోటేశ్వరరావు శర్మ

పని మనుషులు కావలెను

సండే స్పెషల్

(మొదటి పేజీ తరువాయి)

కొందరు సిద్ధపడుతుంటే.. పని చేయడానికి వాళ్లు అడిగే జీతం విని మరికొందరు కళ్లు తేలేస్తున్నారు. పట్టణాల్లోనే కాదు.. పల్లెల్లోనూ ఇదే పరిస్థితి. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేయడం.. అనారోగ్యం.. కాస్త విలాసవంతమైన జీవితం గడపాలని కోరుకోవడం వంటి జీవన శైలి మార్పులు ఇటీవలి కాలంలో పెరుగుతున్నాయి. దాంతో పట్టణాల్లో పని మనుషులకు డిమాండ్ పెరుగుతోంది. కానీ, ఆ మేరకు పనివారు దొరకడం లేదు. పిల్లలు విదేశాల్లో ఉండడం, వృద్ధాప్యం తదితర కారణాలతో గ్రామాల్లోనూ ఇంట్లో పని మనిషిని పెట్టుకోవాలని కోరుకుంటున్నారు. కానీ, అక్కడా అదే పరిస్థితి. ఒకప్పుడు, పల్లెల్లో పని మనుషులకు కొదవ ఉండేది కాదు. కొంతమంది అయితే ఏకంగా ఇంట్లోనే ఉండి అన్ని పనులూ చేసేవారు. అందుకు ఏడాదికి ఇంత ధాన్యం అని తీసుకునేవారు. ఆ తర్వాతి కాలంలో జీతం తీసుకున్న రోజులూ ఉన్నాయి. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. తెలుగు పల్లెల్లో ఇప్పుడు వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉపాధి హామీ పనులు చేతినిండా దొరుకుతున్నాయి. నిర్మాణ పనులకూ కొదవ ఉండడం లేదు. దాంతో, ఇంట్లో పని చేసే కంటే కూలీకి వెళితే ఎక్కువ డబ్బులు వస్తున్నాయి. దీనికితోడు ప్రభుత్వాలు ఇచ్చే వెయ్యి రూపాయల పింఛన్లు, ఇతర పథకాలతో జీవనోపాధికి లోటు ఉండడం లేదు. అదే సమయంలో, పిల్లలు చదువుకుంటూ ఉండడంతో ఇళ్లల్లో పాచి పని చేయడాన్ని కొందరు నామోషీగా భావిస్తున్నారు. దాంతో, గ్రామాల్లోనూ పని మనుషులు దొరకడం గగనంగా మారింది. మెదక్ పట్టణానికి చెందిన ఓ వ్యాపారి కదల్లేని స్థితిలో ఉన్న తన తండ్రికి సపర్యలు చేయడానికి పని మనిషి కోసం వెతికాడు. కొన్ని నెలలు వెతికిన తర్వాత సమీప గ్రామానికి చెందిన వ్యక్తికి రూ.10 వేలు ఇచ్చేందుకు సిద్ధపడ్డాడు. అతడు నెల రోజులు చేశాడో లేదో చెప్పా పెట్టకుండా మానేశాడు. ఆ తర్వాత మరో వ్యక్తిని తీసుకొచ్చినా ఇదే పరిస్థితి. ఇక, హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాల్లో అయితే మరీ దారుణం. నెలల తరబడి గాలించినా తమకు అనుకూలమైన, నమ్మకమైన పని మనుషులు దొరకడం లేదు.

పనిని బట్టి జీతం

అటు ఆఫీస్... ఇటు ఇల్లు! రెండు చోట్లా సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం నేటి తరానికి ఓ యజ్ఞంలా మారింది. అవసరం కోసం తప్పనిసరిగా ప్రతి పనికీ 'మెయిడ్స్' నియమించుకున్న వాళ్లున్నట్లే... 'హోదా పెరిగిన తర్వాత మన పనులు మనం ఎందుకు చేసుకోవాలి?' అనుకుంటూ పనివాళ్లను పెట్టుకునేవారూ ఉన్నారు. 'నెలకు రూ.10 వేల నుంచి 15వేలు మనవి కావనుకుంటే అంతా హ్యాపీ' అనే ఉద్యోగులు ఎందరో ఉన్నారు. ఫలితమే, 'మంచి పని మనిషి ఉంటే చెప్పండి!'... మండల కేంద్రం నుంచి మహానగరాల దాకా వినిపించడం. ఇందులో 'మంచి'కి చాలా అర్థాలున్నాయి. ప్రతి రోజూ రావాలి. బాగా పని చేయాలి. నమ్మకంగా ఉండాలి. అన్నింటికంటే ముఖ్యంగా... 'తక్కువ డబ్బులు తీసుకుని... ఎక్కువ పని చేయాలి!'. ప్రపంచంలోని ప్రతి సేవా... డిమాండ్-సప్లై పైనే ఆధారపడి ఉంది. నమ్మకం, ఒద్దిక, సమయపాలన, చక్కటి పని తీరు... పని వారిలో గృహిణులు కోరుకునే ముఖ్యమైన లక్షణాలు ఇవి. అయితే... పని ఉందనగానే పరుపరుగున వచ్చి చేరిపోయే పరిస్థితులు దాదాపుగా లేవు. పనిని బట్టి జీతం డిమాండ్ చేస్తారు. బట్టలు ఉతకడం, పాత్రలు తోమడం... ఈ పనులకు ఇంట్లో సభ్యులను బట్టి ఒక్కొక్కరికి నెలకు 400 నుంచి 500 వరకు వసూలు చేస్తారు. ఇల్లు ఊడ్వడం, తడిబట్టతో తుడవడానికి అదనం. "పొద్దున పది గంటలకు వచ్చి గంటసేపు రెండు పూటలకూ వంట చేసి వెళతాం. కాఫీ, టిఫిన్ మీకు చేసిపెట్టి నేనూ తింటాను.. నెలకు 6 నుంచి 8 వేలు జీతం ఇవ్వాల"ని డిమాండ్ చేసున్నారు వంట మనుషులు. ఉదయం ఆఫీసుకు వెళ్లేలోగా వచ్చి గంటసేపు వంట చేసే వారికి భారీ డిమాండ్. ఆ టైంలో వచ్చి వంట చేసేందుకు 8 వేలకుపైగా అడుగుతున్నారు. నాన్ వెజిటేరియన్ వండి పెట్టాలంటే మరో 30 శాతం అదనంగా ఇచ్చుకోవాల్సిందే. డస్టింగ్, గార్డెనింగ్ వంటి నైపుణ్యం ఉన్న పనులు చేసేందుకు భారీగా జీతాలు ఇచ్చుకోవాల్సిందే. రోజంతా ఇంట్లో ఉండి చిన్న పిల్లల ఆలనాపాలనా చూసుకోవాలంటే 15 వేలు, ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు సేవలందించాలంటే 8 వేల వరకు తీసుకుంటున్నారు. నడిచే శక్తి ఉన్న వయోధికులకు వండిపెట్టి, మందులు అందిస్తే సరిపోతుంది. అనారోగ్యంతో ఉన్న వారికి అన్ని సేవలు చేయాల్సి ఉంటుంది. అలాంటి వారికి సేవలందించేందుకు ఇంట్లో ఉండే సమయాన్ని, మనం కల్పించే సౌకర్యాలను బట్టి 12 నుంచి 20 వేల వరకు తీసుకుంటున్నారు. పట్టణాల్లో పిల్లలను స్కూలుకు లేదంటే బస్సు వరకు దిగబెట్టి, మళ్లీ తీసుకు రావడం, రైతు బజారుకు వెళ్లి కూరగాయలు తీసుకు రావడం వంటి పనులు కూడా కొందరు చేస్తున్నారు. ఇందుకు నెలకు అదనంగా రూ.500 తీసుకుంటున్నారు.

పని మనుషులకూ ఏజెన్సీలు!

జీవన శైలి మారుతున్న కొద్దీ మనకు అవసరమైన సేవల జాబితా కూడా పెరిగిపోతోంది. ఇల్లు ఊడవడం, తుడవడం, దుమ్ము దులపడం, గిన్నెలు కడగడం, బాత్‌రూంలు కడగడం, వంట వండటం, చిన్నపిల్లల్ని చూసుకోవడం, వయసు మీదపడిన, అనారోగ్యంతో ఉన్న వారి ఆలనా పాలనా, తోట పనులు చేయడం తదితరాలకు పని మనుషులు అవసరం అవుతున్నారు. వారికి డిమాండ్ పెరిగిపోవడంతో ఇప్పుడు నైపుణ్యం, అనుభవం ఉన్న సేవకుల్ని పంపేందుకు ఏజెన్సీలు మొదలయ్యాయి. కమీషన్ తీసుకుని అవసరాలకు అనుగుణంగా ఫీజు నిర్ణయించి పని వారిని పంపుతున్నాయి. పనివారి జీతం, ఏజెన్సీల కమీషన్ కలుపుకొని ఖర్చు తడిసి మోపెడవుతోంది. హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై వంటి నగరాల్లో ఇలా పని వారిని ఏర్పాటుచేసే వందలాది ఏజెన్సీలు పని చేస్తున్నాయి. వెబ్‌సైట్‌లో సేవల వివరాలు, ఫీజులు, పనివారి అనుభవం, నైపుణ్యాలను వివరంగా పేర్కొంటున్నాయి. వైజాగ్, తిరుపతి, విజయవాడ వంటి పట్టణాల్లో పదేళ్లుగా ఈ సంస్కృతి విస్తరిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లా కేంద్రాల్లో చిటికెలో పనిమనిషిని ఏర్పాటు చేసే ఏజెన్సీలు పుట్టుకొచ్చాయి.

–స్పెషల్ డెస్క్, హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



ఓపిక ఉంటే పనికి ఢోకా లేదు!

నేను.. మా అమ్మా కలిసి ఎనిమిది ఇళ్లలో పని చేస్తాం. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 దాకా పని ఉంటుంది. 16 వేల వరకూ సంపాదిస్తాం. దాదాపు ఆరేడేళ్లుగా ఇదే చేస్తున్నాం. కొంత మంది బాగుంటారు. కొంతమంది ఓవర్ చేస్తారు. ఎవరు ఎలా ఉన్నా మా పని మేం చూసుకుని వెళ్లిపోతాం. పనికి ఢోకా లేదు. చేసుకునే ఓపిక ఉండాలంతే !

– లక్ష్మి, మోతీనగర్, హైదరాబాద్

టెక్నాలజీ బాట పట్టారు!

'ఒకరి అవసరం... మరొకరికి ఆదాయ మార్గం అవుతుంది!' ఇది పనివాళ్లను సరఫరా చేసే ఓ ఏజెన్సీ నిర్వాహకుడు జైశ్వాల్ మాట! ఇక్కడున్న 'ఆదాయాన్ని' దృష్టిలో పెట్టుకుని డొమెస్టిక్ హెల్పర్ల సమస్య తీర్చడానికి పలు వెబ్‌సైట్లు, యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. బుక్ మై బాయ్, మెయిడ్ అండ్ కుక్స్ డాట్‌కామ్, హెల్పర్4యు, గెట్ డొమెస్టిక్ హెల్ప్‌డాట్‌కామ్, హెల్ప్‌ఎట్ హోమ్ డాట్ కో డాట్ ఇన్... ఇలా ఎన్నో సైట్లు అందుబాటులో ఉన్నాయి. ఇవిగాక సులేఖ, క్వికర్, అర్బన్ క్లాప్ లాంటి సంస్థలూ ఈ సేవలను అందిస్తున్నాయి. ఇంకా... ప్రాంతం, మతం, భాష ప్రాధాన్యతలకు అనుగుణంగా కూడా సేవలు అందిస్తారు.

అన్నిటికీ వారే... మోసపోయేదీ వారే!

పని మనుషులకు డిమాండ్ ఎంత నిజమో... వారికి కష్టాలూ అంతే నిజం. వారి ఉద్యోగానికి భద్రత ఉండదు. సెలవులు ఉండవు. ఆరోగ్యం సహకరించక నాలుగైదు రోజులు పనికి వెళ్లకపోతే... 'ఇంక నువ్వు రానక్కర్లేదు'అని ముఖానే చెప్పేవారు ఎందరో. ఇక... ఏజెన్సీల ద్వారా నియమితులైన వారి నుంచే చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. చిన్న ఫిర్యాదు వచ్చినా జీతంలో కోత పెట్టడం రివాజు. ఇదే విషయమై బేబీ సిట్టర్‌గా పనిచేసి మానేసిన వాసంతి మాట్లాడుతూ... "ఓ ప్రముఖ ఏజెన్సీ ద్వారా బంజారాహిల్స్‌లోని ఓ ఇంటిలో చేరాను. ఆరు నెలలు చేసిన తరువాత మానేస్తే ఏజెన్సీ రెండు నెలల జీతం చేతిలో పెట్టారు. అదేమిటని ప్రశ్నిస్తే... ఇంటి యజమానులే ఇవ్వలేదన్నారు. ఇంటి వాళ్లను వెళ్లి అడిగితే... మొత్తం జీతం ముందే ఇచ్చామన్నారు. ఇలాంటి మోసాలు చాలా జరుగుతున్నాయి" అని తెలిపారు.

అందరూ బిజీ.. అందుకే..

భాగ్యనగరంలో 150కి పైగా సంస్థలు వివిధ సేవలు అందించే పని మనుషుల్ని కోరిన వారి ఇళ్లకు పంపుతున్నాయి. ఇంటి పనులు చేసేవారితోపాటు, చిన్నపిల్లల్ని చూసుకునే వారు కావాలని చాలామంది అడుగుతున్నారు. నెలకు కనీసం రెండు వందల మందికి సేవలు అందిస్తున్నాం. ఇంటి పనుల తోపాటు ఆఫీసులో పనులు చేసేందుకు కూడా మనుషుల్ని పంపుతున్నాం. బేబీ సిట్టింగ్ కోసం ఎనిమిది గంటలకు నెలకు 8 వేలు తీసుకుంటున్నాం. గ్రామాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి పేదలు భారీగా వలస వస్తున్నారు. డబ్బు పెట్టాలేకానీ పనిమనుషులకు కొరత లేదు.

– పద్మ, మేనేజర్, యునిక్ హోం ఫెసిలిటీ సర్వీసెస్, హైదరాబాద్

పెరుగుతున్న డిమాండ్

వైజాగ్‌లో మొదటి నుంచి పట్టణ సంస్కృతి ఉంది. పిల్లలు విదేశాలకు వెళ్లినప్పుడు వయోభారంతో ఉన్నవారి ఆలనా పాలనా చూసుకునే వారు కావాలని చాలామంది అడుగుతున్నారు. చిన్నపిల్లల్ని చూసుకోవడం, ఇంటి పనులు చేసేందుకు కూడా పని మనుషుల్ని పంపుతున్నాం. ఏడేళ్లుగా మా సంస్థ ఇలాంటి సేవల్ని అందిస్తున్నది. నడిచే ఓపిక ఉన్నవారికి పగటిపూట సేవలు అందిస్తే నెలకు 10 వేలు, నడిచే స్థితిలో లేనికి వారికి సేవలందిస్తే నెలకు 12 వేలు తీసుకుంటున్నాం.

– బాలయ్య, నిర్వాహకులు, అలంకృత సర్వీసెస్, వైజాగ్

చట్టాలపై అవగాహన పెరుగుతుంది..

హైదరాబాద్‌లో కనీసం 7 లక్షల నుంచి 10 లక్షల మంది డొమెస్టిక్ హెల్పర్లు ఉంటారని అంచనా. యూనియన్‌లో 70వేల మంది వరకూ ఉంటారు. కానీ... యాక్టివ్‌గా ఉండేవారు తక్కువ. కనీస వేతన చట్టం కన్నా ఎక్కువ సంపాదించేవారు చాలా మంది ఉన్నారు. కాకపోతే అంతకన్నా ఎక్కువ మంది కనీస వేతనం కూడా పొందలేకపోతున్నారు. డొమెస్టిక్ హెల్పర్లకు వేధింపులు సర్వసాధారణంగా మారాయి. గతంతో పోలిస్తే పరిస్థితి మారింది. అందుకు చట్టాల పట్ల అవగాహన పెరగడం కూడా ఓ కారణంగా చెప్పవచ్చు!

– సిస్టర్ లిజి, తెలంగాణ డొమెస్టిక్ హెల్పర్స్ అసోసియేషన్ గౌరవ సెక్రటరీ, నేషనల్ వర్కర్స్ మూవ్‌మెంట్ ప్రతినిధి

అత్యవసరం 'పాలియేటివ్ కేర్'

దీర్ఘకాలం మంచాన పడిన వారిని జాగ్రత్తగా చూసుకోవడం అంత సులభం కాదు. ఓపిక, సహనంతోపాటు కనీస వైద్య పరిజ్ఞానం ఉన్న వారిని ఇందుకు నియమించుకోవాలి. 'పాలియేటివ్ కేర్' బాగా ఖరీదైన సేవ! కొంతమంది ఇందుకు నెలకు 10 నుంచి 15 వేలు డిమాండ్ చేస్తున్నారు. ఇక, ఏజెన్సీలు అయితే రోజుకు రూ.1500 వరకు వసూలు చేస్తున్నాయి. రెడ్ క్రాస్ వంటి సంస్థలు మాత్రం తక్కువ మొత్తానికే ఈ సేవలు అందిస్తున్నాయి.

రెండు గుండెల అనుసంధానం

- 56 ఏళ్ల వ్యక్తికి 17 ఏళ్ల బాలుడి గుండె జత
- రెండు గుండెలతో కొత్త ఊపిరి
- అపోలో ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స


హైదరాబాద్ సిటీ, కరీంనగర్ క్రైం/కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రాణం కాపాడేందుకు ఒక హృదయానికి మరో హృదయం తోడైన వేళ.. గుండెనొప్పితో బాధపడుతూ కొన ఊపిరితో ఉన్న ఓ వ్యక్తి ప్రాణం నిలిపారు జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రి వైద్యులు. రెండు గుండెలను ఒక చోటుకు చేర్చి కొత్త ఊపిరిని ప్రసాదించారు. విజయవాడకు చెందిన 56 ఏళ్ల వ్యక్తి కొంతకాలంగా గుండె నొప్పితో బాధపడుతున్నాడు. కాళ్లు, చేతులు, ముఖంలో వాపు రావడం, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండడం వంటి సమస్యలు తీవ్రమయ్యాయి. వైద్యులు పరీక్షలు చేయగా 'డైలేటెడ్ కార్డియోమయోపతి' అనే సమస్య ఉన్నట్లు తేలింది. అతడికి గుండె మార్పిడి తప్పనిసరి. గుండె మార్పిడి చేయాలంటే ఊపిరితిత్తులను కూడా మార్చాల్సిన పరిస్థితి. తొలుత గుండెకు అసిస్ట్ డివైజ్‌ను ఏర్పాటు చేయాలని యోచించారు. దానికి రూ.కోటి అవుతుంది. అంత ఖర్చును అతడు భరించలేడు. గుండె మార్పిడి చేద్దామంటే వయసుకు సరిపడే గుండె లభించలేదు. చిన్న వయసు గుండె అమరిస్తే ఊపిరితిత్తులు కూడా మార్చాలి. దీంతో పాత గుండెను అలాగే ఉంచి, మరో గుండెను ఏర్పాటు చేసి ప్రాణాలు నిలపాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో ఓ ఆస్పత్రిలో బ్రెయిన్‌డెడ్‌గా ఉన్న మేకల నవీన్ అనే 17 ఏళ్ల బాలుడు అతడి పాలిట వరమయ్యాడు. నవీన్ అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. సమాచారం అందుకున్న అపోలో ఆస్పత్రిలోని డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే.. వైద్య బృందంతో శనివారం తెల్లవారుజామున కరీంనగర్‌కు వెళ్లి గుండెను ప్రత్యేక బాక్స్‌లో పెట్టుకుని అపోలో ఆస్పత్రికి తీసుకువచ్చారు. బాధితుడి గుండె వద్ద చిన్ని చిన్ని ఎముకలు, కొన్ని నరాలను తొలగించి కొత్త గుండెకు స్థానం కల్పించి అమర్చారు. ఇలా పాత గుండెకు బాలుడి గుండెను అనుసంధానం చేసి బాధితుడికి కొత్త ఊపిరి పోశారు.



2 గంటల్లో కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు..

ఈ నెల 8న జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం చిన్న మెట్‌పల్లికి చెందిన మేకల నవీన్‌కుమార్(17) బైక్‌పై వెళ్తూ ఆర్టీసీ బస్సును ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌లోని అపోలోరీచ్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించక శుక్రవారం రాత్రి బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో వైద్యులు అతడి గుండెను జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 56 ఏళ్ల వ్యక్తికి అమర్చాలని నిర్ణయించుకున్నారు. గుండెను హైదరాబాద్‌కు చేర్చాలి. అందుకు వైద్యులు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులను ఆశ్రయించారు. గుండెను హైదరాబాద్‌కు చేర్చేందుకు ట్రాఫిక్‌కు ఎక్కడా ఆటంకం కలగకుండా గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ వీబీ కమలాసన్ రెడ్డిని కోరారు. వెంటనే స్పందించిన పోలీస్ కమిషనర్ సిద్దిపేట, హైదరాబాద్ పోలీసుల సమన్వయంతో ట్రాఫిక్‌కు ఎక్కడా ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారు. శనివారం ఉదయం కరీంనగర్ ట్రాఫిక్ సీఐ జీ సీతారెడ్డి, ఇతర వైద్య నిపుణులతో 6:50 గంటలకు కరీంనగర్ అపోలోరీచ్ ఆస్పత్రి నుంచి ప్రత్యేక వాహనంలో బయల్దేరి 8:50 గంటలకు హైదరాబాద్ అపోలో ఆస్పత్రికి చేరుకుని వైద్యులకు గుండెను అందజేశారు.

షిట్.. పురీషనాళం పడిపోయింది!



బీజింగ్, ఫిబ్రవరి 10: చాలా మంది మరుగుదొడ్లలోకి మొబైల్‌ఫోన్లు తీసుకెళుతుంటారు.. అక్కడ ప్రశాంతంగా 'కూర్చొని' మొబైల్‌లో వార్తలు, వాట్సప్, ఫేస్‌బుక్ మెసేజ్‌లు చూసుకోవడం, గేమ్స్ ఆడటం చేస్తుంటారు! కానీ, కొన్ని సార్లు ఈ అలవాటే కొంప ముంచుతుంది! విపరీత పరిణామాలకూ దారితీస్తుంది! అందుకు ఈ ఘటనే ఉదాహరణ. చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని ఝూంగ్‌షాన్‌లో ఓ వ్యక్తి మరుగుదొడ్డికి వెళుతూ తన మొబైల్‌ఫోన్‌ను కూడా తీసుకెళ్లాడు. దాదాపు అరగంటకు పైగా కూర్చొని గేమ్ ఆడాడు. ఆటలో లీనమై మల విసర్జన కోసం కాస్త గట్టిగా ప్రయత్నించాడు. అంతే మలంతో పాటు చిన్నపాటి బంతి పరిమాణంలో ఉన్న గడ్డ కూడా పడిపోవడం గమనించాడు. భయంతో ఆస్పత్రికి పరిగెత్తాడు. మరుగుదొడ్లో పడిపోయింది పురీషనాళం(పెద్దపేగు చివరన ఉండే భాగం) అని తేల్చారు వైద్యులు. ఎక్కువ సేపు టాయ్‌లెట్‌లో కూర్చొని ఉండడం వల్ల ఈ పరిస్థితి తలెత్తుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం అతనికి శస్త్రచికిత్స చేశామని, కోలుకుంటున్నాడని తెలిపారు. శరీరం లోపల ఉండాల్సిన పురీషనాళం కొందరికి బయటకి వచ్చేస్తుందని, ఈ స్థితిని రెక్టల్ ప్రొలాప్స్ అంటారని వెల్లడించారు. తాజాగా పురీషనాళం బయటపడిపోయిన బాధితుడికి కూడా ఈ సమస్య చాలా ఏళ్ల నుంచి ఉందని చెప్పారు. దీన్ని త్వరగా గుర్తించి చికిత్స చేయించుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మొత్తం మీద మొబైల్‌ఫోన్ అతిగా వాడితే అనర్థమే అనడానికి ఇదో నిదర్శనం అన్నమాట!



ఉడుత చారలతో పంది పిల్లల జననం

శాలిగౌరారం, ఫిబ్రవరి 10: నల్లగొండ జిల్లా శాలిగౌరారం పంచాయతీ బాలిశెట్టిగూడెం గ్రామంలో పొట్టేటి భిక్షానికి చెందిన ఓ పంది శనివారం ఐదు పిల్లలకు జన్మనిచ్చింది. అందులో మూడు పిల్లలకు ఉడుతచారలు ఉన్నాయి. ఆసక్తికరంగా ఉన్న వాని చూసేందుకు జనం తరలి వస్తున్నారు. అయితే జన్యుపర లోపాలవల్లే ఇలా చారలు వచ్చాయని పశువైద్యులు పేర్కొంటున్నారు.

లోకం తీరు



ఈ బడ్జెట్ పథకాలతో వాళ్ల ఆకలి తీర్చగలమంటావా!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	11.5	29.5
రామగుండం	16.3	31.4
హైదరాబాద్	17.9	30.5
నల్లగొండ	19.2	29.0
వరంగల్	21.0	30.0



గోవాకు వచ్చేది అలగాజనమే..

ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులు గోవాను మరో హరియాణాగా మారుస్తున్నారు. ఇక్కడకు వచ్చేది అలగాజనమే. స్థానికులు నింపుతున్న చెత్తను తొలగించేందుకే నానా తంటాలు పడుతున్నాం. గోవాలో కాలుష్యం పెరుగుదలకు ఉత్తరాది పర్యాటకులే కారణం. వారికి బాధ్యత లేదు. సామాజిక స్పృహ అంతకన్నా లేదు.

- గోవా మంత్రి విజయ్ సర్దేశాయ్



అమ్మాయిలూ బీర్లు తాగడం చూస్తే భయమేస్తోంది..

అమ్మాయిలు బీర్లు తాగడం ప్రారంభించారు. అలాంటి వారిని చూస్తే భయమేస్తోంది. కష్టపడటానికి యువత ఇష్టపడటం లేదు. సులువుగా పనిచేసే ఉద్యోగాలపై మక్కువ పెరుగుతోంది. అందుకే ప్రభుత్వ గుమాస్తా కొలువుల కోసం భారీగా క్యూ కడుతున్నారు. - గోవా సీఎం మనోహర్ పర్రీకర్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.77.68	పాత ధర 69.65
కొత్త ధర రూ.77.54	కొత్త ధర 69.43
తగ్గుదల : 14 పైసలు	తగ్గుదల: 22 పైసలు

శ్రీవారి సర్వదర్శనానికి 10గంటలు

తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. 75వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి 10గంటలు, దివ్యదర్శనానికి 2గంటల సమయం పడుతోంది. సోమవారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో ఆదివారం లాటరీ ద్వారా జారీచేసే టికెట్లు.. కల్యాణోత్సవం:80, డోలోత్స వం:25, విశేషపూజ:125. ఆన్‌లైన్‌లో రూ.300 టికెట్లు పొందడానికి www.ttdsevaonline.comలో సంప్రదించాలి.

–ఆంధ్రజ్యోతి, తిరుమల



రక్తంలో సోడియం తగ్గితే ఆలోచనలపై ప్రభావం

న్యూయార్క్, ఫిబ్రవరి 10: రక్తంలో సోడియం మోతాదు తగ్గితే వయసు పెరిగే కొద్దీ ఆలోచనా శక్తి తగ్గుతుందని పరిశోధనలో తేలింది. సాధారణంగా రక్తంలో సోడియం మోతాదు 135 మిల్లీ మోల్స్ కంటే తగ్గితే స్పృహ కోల్పోవడం, మగతగా ఉండడం జరుగుతుంది. తాజా పరిశోధనలో ఆలోచనా శక్తి తగ్గిపోతుందని, హృద్రోగాలు తలెత్తుతాయని తేలింది. అమెరికాలోని కొలరాడో వర్సిటీ పరిశోధకులు 65 ఏళ్లు దాటిన వారిని పరిశీలించి ఈవిషయాన్ని వెల్లడించారు.

అస్తమా, బీపీ ఔషధాలను గుర్తించే కొత్త పరికరం!

లాస్ ఏంజెలిస్, ఫిబ్రవరి 10: అస్తమా, రక్తపోటు, కండరాల సమస్యలకు ఔషధాలను వేగంగా గుర్తించేందుకు సరికొత్త పరికరాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఫ్లీక్స్ పేరుతో పిలిచే ఈ పరికరం ద్వారా దెబ్బతిన్న కణాలను పరిశీలించి ఎలాంటి మందులు ఉపయోగించాలో సులువుగా తెలుసుకునే అవకాశముందని చెబుతున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీతో పోలిస్తే కొత్త పద్ధతి ద్వారా కణాల శక్తిని 100 రెట్ల వేగంగా గుర్తించడంతో పాటు యథాస్థితికి తీసుకు రావచ్చని వర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు తెలిపారు.

350 చేనేత సహకార సంఘాల రద్దు

ఉత్తర్వులు జారీ.. పర్సన్ ఇన్‌చార్జ్‌లకు బాధ్యతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 350 ప్రాథమిక చేనేత సహకార సంఘాల పాలక వర్గాలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంఘాల వల్ల సమాజానికి ఎటువంటి ప్రయోజనం లేనందున, వీటిని రద్దు చేస్తున్నట్లు సహకార శాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారథి శనివారం రాత్రి జీవో జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేనేత సంఘాల కోసం రెండు పథకాలను ప్రకటించిందని, సంఘాల ఎన్నికలు సమీపిస్తున్నందున పథకాలను సమర్థంగా అమలు చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పర్సన్ ఇన్‌చార్జ్‌లు కార్యక్రమాలను చేపట్టాలని స్పష్టం చేశారు. 2013 ఫిబ్రవరి 11న ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. పాలక మండళ్ల గడువు శనివారం(ఈనెల 10వ తేదీ)తో ముగిసింది. దీంతో ఈ మండళ్ల గడువును పొడిగించకుండా రద్దు చేయడమే శ్రేయస్కరమని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

చెల్లెలు కవితకు కృతజ్ఞతలు : పవన్‌కల్యాణ్



హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విభజన హామీల అమలు విషయంలో కేంద్రం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఏపీకి మద్దతుగా మాట్లాడిన ఎంపీ కవితకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ట్వీట్ చేశారు. 'ఏపీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పార్లమెంట్‌లో కోరిన చెల్లెలు కవిత(టీఆర్ఎస్ ఎంపీ)కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు.' అని పేర్కొన్నారు.

ముచ్చర్ల ఫార్మాసిటీని అడ్డుకుంటాం: లక్ష్మణ్

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10: ముచ్చర్లలో ఏర్పాటు చేసే ఫార్మాసిటీని అడ్డుకుంటామని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కంపెనీ ఏర్పాటును రద్దు చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. ఈ కంపెనీతో అనేక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం ఇబ్రహీంపట్నంలోని శాస్త్రా గార్డెన్స్‌లో జరిగిన ఓబీసీ మోర్చా జిల్లా సంగ్రామ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం అమలుకు నోచుకోవడం లేదని, ముస్లింలను బీసీ జాబితాలో చేర్చి బీసీలకు అన్యాయం చేశారన్నారు. సాగు, తాగు నీరు అందించకుండా ఊరూరా బెల్టుషాపులు పెట్టి మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని విమర్శించారు. మద్యానికి ఏటా రూ.21 వేల కోట్లు ఖర్చు చేస్తుంటే ప్రజల జీవన ప్రమాణాలు ఎలా పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం నివేదికను వెల్లడించకుంటే అసెంబ్లీని అడ్డుకుంటామన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తోందన్నారు.

బాధ్యతలు మరచి అడ్డగోలు మాటలు: రావుల

హైదరాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అధికార టీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీల నేతలు బాధ్యతలు మరచి, ప్రజాసమస్యలు విస్మరించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. లోఫర్లు, బ్రోకర్లు అంటూ పరస్పరం విమర్శించుకోవడం ద్వారా రాజకీయాలను ఎటువైపు తీసుకెళ్లదలచుకున్నారని మంత్రి కేటీఆర్, సీఎల్పీ నేత జానారెడ్డిలను నిలదీశారు. శనివారం ఎన్టీఆర్ భవన్‌లో రావుల మాట్లాడుతూ.. "భాషను నియంత్రించుకోండి. లేకుంటే ప్రజలు మిమ్మల్ని జోకర్లుగా భావించాల్సివస్తుందేమో..! పరస్పర విమర్శలు మానుకొని విభజన చట్టం హామీలను కేంద్రం నుంచి ఏమేరకు సాధించామో ఆత్మవిమర్శ చేసుకోండి" అని హితవు పలికారు. ప్రజాసమస్యలపై తాము పోరాడుతుంటే టీడీపీ ఎక్కడుందంటూ టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు అవహేళన చేయడంపై రావుల మండిపడ్డారు. టీడీపీ ఎమ్మెల్యేలను టీఆర్ఎస్ నాయకులు ఫిరాయింపులకు ప్రోత్సహిస్తే ఎందుకు స్పందించలేదని కాంగ్రెస్‌ను నిలదీశారు. టీఆర్ఎస్ పార్టీ గ్రాఫ్ పడిపోయినప్పుడల్లా ఎవరో ఒకరితో కామెంట్స్ చేయిస్తారని రావుల ఆరోపించారు.

కోదండను కలిసిన స్థానిక ప్రజాప్రతినిధులు

హైదరాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): టీజేఏసీ చైర్మన్ కోదండరాంతో కలిసి పని చేసేందుకు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు సుముఖత వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేటకు చెందిన పలువురు స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు పలువురు న్యాయవాదులు శనివారం తార్నాకలో కోదండరాంను కలిసి మద్దతు తెలిపారు. టీజేఏసీ ఏర్పాటు చేయబోతున్న పార్టీలోకి రావాల్సిందిగా కోదండతో పాటు ఆ సంస్థ నేతలు పలువురితో సంప్రదింపులు జరుపుతున్నారు.తమతో కలిసి వచ్చేందుకు పలువురు నేతలు సుముఖత వ్యక్తం చేస్తున్నారని టీజేఏసీ ముఖ్య నేత ఒకరు తెలిపారు.

అర్హులందరికీ ఆసరా పింఛన్లు ఇవ్వాలి : చాడ

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆసరా పథకం కింద అరవై ఏళ్లు పైబడిన అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. బోదకాలు బాధితులకు పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని ఆయన స్వాగతించారు. ఆసరా పింఛన్ అందాల్సిన అర్హులైన వృద్ధులు ఇంకా 5 లక్షల మంది ఉన్నారని శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా కొందరు వృద్ధులకు అన్యాయం జరుగుతోందని, ఈ విషయమై ప్రభుత్వం స్పందించాలని కోరారు.

త్వరలో బీఎల్ఎఫ్ జిల్లా కమిటీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నేతృత్వంలో ఏర్పాటైన బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టింది. బీఎల్ఎఫ్ కన్వీనర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కూటమి సంస్థాగత నిర్మాణానికి వీలుగా కార్యాచరణను సిద్ధం చేశారు. ఈ ఏడాది జనవరిలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆవిర్భవించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆవిర్భావ సభలోనే తమ్మినేని వీరభద్రం కన్వీనర్‌గా 44మందితో రాష్ట్ర కమిటీ ఏర్పాటైంది. ఏప్రిల్ నెలాఖరుకల్లా అన్ని జిల్లాల్లో కూటమి ఆవిర్భావ సభలు నిర్వహించటంతోపాటు జిల్లా కమిటీలు వేయాలని లక్ష్యం విధించుకున్నారు. ఇందులోభాగంగా రాష్ట్ర స్థాయి నేతలు జిల్లాల్లో పర్యటించి బీఎల్ఎఫ్ కమిటీని ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు కూటమి రాష్ట్ర నేతలతో ప్రత్యేకంగా నాలుగైదు బృందాలను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత మే, జూన్ నెలల్లో నియోజకవర్గ కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా కూటమిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు.

ఆరెస్సెస్ సీనియర్ కార్యకర్త పురుషోత్తం మృతి



బర్కత్‌పుర/హైదరాబాద్, ఫిబ్రవరి, 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నింబోలిఅడ్డకు చెందిన ఆరెస్సెస్ సీనియర్ కార్యకర్త పురుషోత్తం భడ్ భడేజీ (90) శుక్రవారం రాత్రి మరణించారు. భడ్ భడేజీ నింబోలిఅడ్డలోని సేవాభారతి కార్యాలయ స్థలదాత. చాలాకాలం నింబోలిఅడ్డలోని శ్రీ సరస్వతీ శిశుమందిరం అధ్యక్షులుగా పనిచేశారు. నాటి తరం స్వయం సేవకులందరికీ మార్గదర్శి. ఆయన నివాసం సంఘ్ కార్యక్రమాలకు కేంద్ర స్థానంగా ఉండేది. ఎమర్జెన్సీ కాలంలో, అయోధ్య రామ మందిర ఉద్యమ సమయంలో ఆయన క్రియాశీలకంగా పనిచేశారు. భడ్ భడేజీ కోరిక మేరకు ఆయన పార్థివ దేహాన్ని ఉస్మానియా వైద్య కళాశాలకు అప్పగిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పురుషోత్తంకు నివాళులర్పించిన వారిలో ఆరెస్సెస్ నేతలు దేవేందర్‌జీ, భాస్కర్‌జీ తదితరులు ఉన్నారు.

చనిపోయాడనుకున్నారు.. తిరిగొచ్చాడు!



మంచిర్యాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చనిపోయాడనుకున్న వ్యక్తి తిరిగి రావడంతో ఆ కుటుంబంలో సంతోషం నెలకొంది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం తాళ్ల గురిజాలకు చెందిన బానయ్య(55) మతిస్థిమితం లేక గత ఏడాది ఏప్రిల్‌లో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అదే సమయంలో తాండూరు మండలం బోయపల్లి రహదారిపై గుర్తు తెలియని మృతదేహం పోలీసులకు దొరికింది. చనిపోయింది బానయ్యే అనుకున్న కుటుంబసభ్యులు ఆ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే ఇంటి నుంచి తిరుగుతూ వెళ్లిన బానయ్య చివరకు చౌటుప్పల్‌లోని అమ్మానాన్న ఆశ్రమం చేరుకున్నాడు. అక్కడ ఆశ్రమ సిబ్బంది అతన్ని మామూలు మనిషిని చేశారు. అనంతరం శుక్రవారం బానయ్య కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో చౌటుప్పల్ వెళ్లిన బానయ్య కుటుంబసభ్యులు అతన్ని శనివారం ఇంటికి తీసుకొచ్చారు. బానయ్య తిరిగి రావడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

'అసైన్డ్' ఆక్రమణకు చట్టబద్ధత!

త్వరలో ఆర్డినెన్స్ తెచ్చే యోచనలో సర్కారు. మార్చి 12లోగా అసైన్డ్ భూముల రీఅసైన్డ్

- **2014 జూన్ 2వ తేదీ దాకా వర్తింపు**
- **నియోజకవర్గ, జిల్లా స్థాయిలో కమిటీలు**
- **చైర్మన్లుగా ఎమ్మెల్యే, జిల్లా ఇన్‌చార్జి మంత్రి**



హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరాధీనమైన అసైన్డ్ భూములు పేద వర్గాల్లో చేతుల్లో ఉంటే క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2014 జూన్ 2వ తేదీ నాటికి ఆక్రమణదారుల చేతుల్లో భూములుంటే, వారంతా పేదవారై ఉంటే.. ఆ భూములను వారి పేరిట రీ అసైన్డ్ చేయనున్నారు. దీనికోసం అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా స్థాయిలో కమిటీలు వేయనున్నారు. ఇందుకు అనుగుణంగా తెలంగాణ అసైన్డ్ ల్యాండ్స్ (ప్రొహిబిషన్‌ఆఫ్‌ట్రాన్స్‌ఫర్) యాక్ట్-1977లోని సెక్షన్ 4(1)(బీ)(1)లోని నిబంధనల్ని సవరించనున్నారు. పాత నిబంధన ప్రకారం 2007 జనవరి 29వ తేదీ నాటికి ఆక్రమణలో ఉన్నవారికే ప్రయోజనం చేకూరనుండగా.. తాజాగా చేయనున్న సవరణతో 2014 జూన్ 2వ తేదీ నాటికి ఆక్రమణలో ఉన్నవారికీ ప్రయోజనం కలగనుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని మార్చి 12వ తేదీకల్లా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. దీంతో అసైన్డ్ చట్టాన్ని సవరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. శాసనసభ బడ్జెట్ సమావేశాలు మార్చి 11వ తేదీ నుంచి జరిగే అవకాశాలుండటంతో ఈలోగా ఆర్డినెన్స్ తెచ్చే యోచనలో ఉంది. ఆర్డినెన్స్ రాగానే అసెంబ్లీ స్థాయిలోని అసైన్డ్ కమిటీ.. అసైన్డ్ ఆక్రమణల్ని పరిశీలించి నిర్ణయం తీసుకోనుంది. ప్రతి నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో స్థానిక ఎమ్మెల్యే చైర్మన్‌గా, ఆర్డీవో కన్వీనర్‌గా ఉండే కమిటీ విచారణ జరుపుతుంది. అనంతరం ఆ కమిటీ నిర్ణయానికి అనుగుణంగా తహసీల్దార్లు అసైన్డ్ ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

ఎట్టకేలకు రీ అసైన్డ్

ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలో ఉండగా.. అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ చేపట్టి పేద వర్గాలకు రీ అసైన్డ్ చేశారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే అసైన్డ్ క్రమబద్ధీకరణ తెరపైకి వచ్చింది. ప్రతి గ్రామంలో 60 శాతానికి పైగా అసైన్డ్ భూములు పరాధీనమైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. వాస్తవానికి అసైన్డ్ భూములను పేద వర్గాలకు రీ అసైన్డ్ చేయాలని రెండు నెలల క్రితమే రెవెన్యూ శాఖ మెమో నంబరు 24196/అసైన్‌మెంట్-1(3) 2017-1ను ఇచ్చింది. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన రికార్డుల నవీకరణ, ఆధునికీకరణలో 30 జిల్లాల్లో 84,706 మంది ఆక్రమణదారుల చేతుల్లో అసైన్డ్ భూములు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

అసైన్డ్ ఆదేశాలు ఇవీ..

- పేదల చేతుల్లో ఉండే భూములపై డివిజన్ స్థాయిలోని అసైన్డ్ కమిటీ నిర్ణయం తీసుకోవాలి. పేదలైతే రీ అసైన్డ్ చేయాలి.
- వ్యవసాయేతర అసైన్డ్ భూములు ఆక్రమణలుంటే స్వాధీనం చేసుకోవాలి.
- ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల చేతుల్లో అసైన్డ్ భూములుంటే వారికే రీ అసైన్డ్ చేయాలి. గిరిజనేతరుల చేతుల్లో ఉంటే ఎల్‌టీఆర్ వర్తింపజేయాలి.
- వ్యవసాయేతర భూములు అసైనీల చేతుల్లో ఉంటే ముట్టుకోవద్దు.

అసెంబ్లీ కమిటీలే కీలకం

అసెంబ్లీ స్థాయిలో సంబంధిత ఎమ్మెల్యే చైర్మన్‌గా, ఆర్డీవో/సబ్ కలెక్టర్/అసిస్టెంట్ కలెక్టర్, ఫారెస్ట్ రేంజ్ అధికారి, ముగ్గురు సామాజిక కార్యకర్తలు(ఎస్సీ, ఎస్టీ, బీసీ/మైనారిటీ), మండలాధ్యక్షుడు, జడ్పీటీసీ సభ్యుడు, జాతీయ లేదా ప్రాంతీయ పార్టీ నుంచి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, కనీసం 10 శాతం ఓట్లు సాధించిన ప్రతినిధి, సంబంధిత మండల తహసీల్దార్ సభ్యులుగా కమిటీ ఉంటుంది. జిల్లా స్థాయిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా, జేసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ప్రాజెక్టు డైరెక్టర్ (డ్వామా), జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌వో), సంబంధిత ఆర్డీవో మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. వీరంతా అసైన్డ్ క్రమబద్ధీకరణ భూములపై చర్చించి, విధాన నిర్ణయం తీసుకుంటారు.

శివాయ్ జమేదార్ల భూములు కూడా..

జమాబందీ సందర్భంగా బీ-మెమోరాండం రిజిస్టర్‌లో ప్రభుత్వ భూములను సాగు చేసుకున్నందుకు జరిమానాలు కట్టిన (శివాయ్ జమేదార్లు) భూములను కూడా క్రమబద్ధీ కరించే అవకాశాలున్నాయి. దీనికోసం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేయనున్నారు. అయితే బీ మెమోరాండం రిజిస్టర్‌లో ఫలానా ఫస్లీ ఇయర్ (వ్యవసాయ సంవత్సరం)లో నాజిమ్ జమాబందీ అధికారి (ఆర్డీవో లేదా తత్సమాన కేడర్) ఉత్తర్వులకు అనుగుణంగా శివాయ్ జమేదార్లుగా గుర్తించి, ఆయా భూములకు అపరాధ రుసుము చెల్లించినవారికి క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకోనున్నారు.

'మూడెకరాల'కు నిధుల కొరత!

- **ఆలస్యమైతే భూమి కొనుగోలు కష్టమే**
- **ఇప్పటికే భూమిని గుర్తించిన ఎస్సీ కార్పొరేషన్**
- **కొనుగోలుకు నిధులు ఇవ్వని ఆర్థిక శాఖ**

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దళితులకు మూడెకరాల భూ పంపిణీ పథకానికి నిధుల సమస్య ఏర్పడింది. అందుబాటులో భూములున్నా.. వాటిని కొనుగోలు చేసేందుకు డబ్బు లేకపోవడంతో ఎస్సీ కార్పొరేషన్ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ పథకం కింద దళితులకు పంపిణీ చేసేందుకుగాను 8నెలల క్రితం ఇతర రైతుల వద్ద భూములను గుర్తించారు. కానీ, ఆ భూముల కొనుగోలు ఆలస్యం కావడంతో.. అప్పటి ధరలకు రైతులు ప్రస్తుతం విక్రయిస్తారా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2017-18 వార్షిక సంవత్సరంలో 10 వేల ఎకరాలు పంపిణీ చేయాలని ఎస్సీ కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకోగా.. అందులో నాలుగో వంతు కూడా పంపిణీ చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వద్ద సాగు యోగ్యమైన, సారవంతమైన భూములు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేసి అర్హులకు ఇచ్చేందుకు సిద్ధమైంది. కానీ, కేవలం 2559 ఎకరాల సాగు యోగ్యమైన భూములను మాత్రమే అధికారులు గుర్తించగలిగారు. ఈ భూమిని విక్రేతల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత లబ్ధిదారులకు హక్కులను బదలాయించాల్సి ఉంటుంది. ఇందుకుగాను భూ విక్రేతలకు రూ.110 కోట్లు చెల్లించాల్సి ఉంది, కానీ, ఇప్పటివరకు కేవలం 1500 ఎకరాలకు సంబంధించి రూ.60 కోట్లు మాత్రమే చెల్లించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

తక్షణ అవసరం రూ.50 కోట్లు..

ఎస్సీ కార్పొరేషన్ కొనుగోలు చేసేందుకు క్షేత్రస్థాయిలో మరో 1000 ఎకరాల భూమి అందుబాటులో ఉంది. ఇందుకు సంబంధించి భూములు అమ్మిన రైతులకు రూ.50 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తం కోసం ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఆర్థిక శాఖ నిధులు విడుదల చేయకపోవడంతో భూముల కొనుగోలు అయోమయంలో పడింది. రోజులు గడుస్తుండడం, భూముల రేట్లు పెరుగుతుండడంతో రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరిస్తారా? అనే ప్రశ్నలు సైతం ఉత్పన్నమవుతున్నాయి.

కొత్తగా 24 మునిసిపాలిటీలు

(మొదటిపేజీ తరువాయి)

నగర శివార్లలోనే ఏర్పాటవుతున్నాయి. ప్రస్తుత రంగారెడ్డి జిల్లా పరిధిలోని 53 గ్రామాలు, మేడ్చల్ జిల్లాలోని 29 గ్రామాలు.. మొత్తం 82 గ్రామ పంచాయతీలు కలిపి 24 మునిసిపాలిటీలుగా మారనున్నాయి. అయితే ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ని మరింత విస్తరించేందుకు ఉమ్మడి జిల్లాలోని ఔటర్‌కు లోపల ఉన్న గ్రామాలను గ్రేటర్‌లో విలీనం చేయాలని ప్రభుత్వం గతంలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిపై అధికార పార్టీ నాయకుల నుంచే వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఇటీవల రాష్ట్ర పట్టణ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ స్థానిక అధికార పార్టీ ప్రజా ప్రతి నిధులతో నిర్వహించిన సమావేశంలో విలీన ప్రతిపాదనలను అందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించారు. భవిష్యత్తులో రాజకీయంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానిక ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేయడంతో సర్కార్ వెనుకడుగువేసింది. ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు శివార్లలో పంచాయతీలను మునిసిపాలిటీలు, నగర పంచాయతీలుగా మారుస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి కొత్త ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా అధికారులు కొత్త మునిసిపాలిటీలు, నగర పంచాయతీల ప్రతిపాదనలు రూపొందించారు. వీటిని శనివారం ప్రభుత్వానికి పంపారు. వీటిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం సూచించిన విధంగా కొత్తగా 24 మునిసిపాలిటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినప్పటికీ మార్పులు, చేర్పులు జరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

రంగారెడ్డి జిల్లాలో

రాజేంద్రనగర్ మండలం : మణికొండ: (మణికొండ, పుప్పాలగూడ, నెక్నాపూర్) నార్సింగ్: (నార్సింగ్, కోకాపేట, వట్టినాగులపల్లి, ఖానాపూర్, గండిపేట, మంచిరేవుల) బండ్లగూడ: (బండ్లగూడ, కిస్మత్‌పూర్, హైదర్‌షాకోట, పీరం చెరువు, హిమాయత్‌సాగర్)
హయత్‌నగర్ మండలం : తుర్కయాంజల్:(తుర్కయాంజల్, కమ్మగూడ, రాగన్నగూడ,ఇంజాపూర్, మునగనూరు, తొర్రూర్, బ్రాహ్మణపల్లి, కోహెడ, ఉమర్‌ఖాన్‌దాయర)
శంషాబాద్ మండలం: శంషాబాద్: (శంషాబాద్, ఊట్‌పల్లి, తొండుపల్లి, సాతంరాయి, కొత్వాల్‌గూడ, చిన్నగొల్లపల్లి)
ఇబ్రహీంపట్నం మండలం : ఆదిభట్ల: (ఆదిభట్ల, బొంగులూరు, రాందాస్‌పల్లి, కొంగరకలాన్, మంగల్‌పల్లి, పటేల్‌గూడ)
శంకరపల్లి మండలం : శంకరపల్లి: (శంకరపల్లి, ఫతేపూర్, చందిప్ప, రామంతాపూర్, బుల్కాపూర్, సింగాపూర్)
మహేశ్వరం మండలం : తుక్కుగూడ : (తుక్కుగూడ, సర్దార్‌నగర్, మంఖాల్, రావిర్యాల)
ఆమనగల్లు మండలం: ఆమనగల్లు: (ఆమనగల్లు, విఠాయిపల్లి)
కొత్తూరు మండలం: కొత్తూరు: (కొత్తూరు. తిమ్మాపూర్, తీగాపూర్)
నందిగామ మండలం: నందిగామ: (మేకగూడ, రంగాపూర్)

మేడ్చల్ జిల్లాలో

మేడ్చల్ మండలం : కండ్లకోయ:(కండ్లకోయ,సూతారిగూడ,గౌడవెల్లి)
శామీర్‌పేట మండలం: శామీర్‌పేట: (శామీర్‌పేట, తూంకుంట)
కాప్రా మండలం : జవహర్‌నగర్: (జవహర్‌నగర్)
కుత్బుల్లాపూర్ మండలం: నిజాంపేట: (నిజాంపేట) ప్రగతి నగర్ : (ప్రగతి నగర్, బాచుపల్లి) కొంపల్లి :(కొంపల్లి, దూలపల్లి) బహుదూర్‌పల్లి: (బహుదూర్‌పల్లి,దొమ్మరపోచంపల్లి, బోరంపేట, మల్లంపేట) దుండిగల్ : (దుండిగల్, గాగిల్లాపూర్)
ఘట్‌కేసర్ మండలం : ఘట్‌కేసర్: (ఘట్‌కేసర్, ఎన్ఎఫ్‌సీనగర్, కొండాపూర్) పోచారం:(నారపల్లి.ఎన్నాంపేట,ఇస్మాయల్‌ఖాన్‌గూడ)
కీసర మండలం : నాగారం: (నాగారం,రాంపల్లి) దమ్మాయిగూడ: (దమ్మాయిగూడ,అహ్మద్‌గూడ,గోధుమకుంట కుందన్‌పల్లి)

సబ్సిడీ గొర్రెల తరలింపులో ముడుపులుగా రూ. కోటిన్నర!

- **పట్టుబడిన గొర్రెలను తప్పించేందుకు లంచాలు**
- **పోలీసులు, పశు వైద్యాధికారులు, దళారులకు భాగం**
- **గద్వాలలో బాధితుల ఫిర్యాదుతో మొదలైన విచారణ**



ఇటీవల స్వాధీనం చేసుకున్న సబ్సిడీ గొర్రెలు (ఫైల్)

గద్వాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ గొర్రెల రీసైక్లింగ్‌లో భారీ కుంభకోణమే చోటుచేసుకుంది. రీసైక్లింగ్‌కు తరలిస్తుండగా పట్టుబడిన గొర్రెలను తప్పించేందుకే రూ.కోటిన్నర ముడుపులు చేతులు మారినట్లు తాజాగా వెల్లడైంది. ఈ వ్యవహారంపై కొందరు బాధితులు ఇటీవల గద్వాల జిల్లా ఎస్పీ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు మానవపాడు పంచాయతీకి చెందిన గొర్రెలకాపర్ల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకట్రాములును అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. అతడు సబ్సిడీ గొర్రెల రీసైక్లింగ్‌లో ముడుపులు తీసుకున్నవారందరి జాతకాలను అందించాడు. ముడుపులందుకున్న వారిలో పోలీసులు, గొర్రెల కాపర్ల సంఘాల నాయకులు, ఏపీలోని దళారులు, పశువైద్యాధికారులతోపాటు కొందరు మీడియా ప్రతినిధులు కూడా ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ విషయమై ఎస్పీ విజయకుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. విచారణ పూర్తయ్యాక నిందితులపై కేసులు నమోదు చేస్తామని, ఎంతటి వారైనా వదిలేది లేదని చెప్పారు. గద్వాల జిల్లాలో నేషనల్ హైవే 44పై ఉన్న ఆర్టీవో చెక్ పోస్టు వద్దకు వచ్చిన గొర్రెల వ్యాన్ల సమాచారాన్ని ఆర్టీవో అధికారులు ఎప్పటికప్పుడు పోలీసులకు అందజేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు వ్యాన్లను పరిశీలించి, అందులో సబ్సిడీ గొర్రెలు తీసుకెళ్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇలా.. అలంపూర్ నియోజకవర్గంలోని ఉండవెల్లి, మానవపాడు పోలీస్‌స్టేషన్లలో వేర్వేరు సందర్భాల్లో 500 గొర్రెలను, గద్వాలలో 204 గొర్రెలను, మానవపాడులో 150 గొర్రెలను పట్టుకున్నట్లు కేసులు నమోదయ్యాయి. పట్టుకున్న గొర్రెలు సబ్సిడీ గొర్రెలో, కావో పశు వైద్యాధికారులు నిర్ధారించాల్సి ఉంటుంది. కానీ, చాలా గొర్రెల వాహనాలను పోలీసులు పట్టుకొని.. వాటిపై కేసులు నమోదు చేయకుండా వదిలేశారు. ఇందుకోసం పశువైద్యాధికారులు, పోలీసులు, గొర్రెల కాపర్ల సంఘం నాయకులు, సర్పంచ్‌లు, మీడియాకు చెందిన వారు భారీ ఎత్తున ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో గద్వాల పోలీసులు మూడు రోజులుగా చేస్తున్న విచారణలో ఎవరెవరి వద్ద ఎన్నెన్ని ముడుపులు తీసుకున్నారనే విషయం బయటకు వచ్చింది.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉత్తమ్ చిత్రంలో జానా, గీతారెడ్డి, శ్రావణ్

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- **చరిత్రను మోదీ వక్రీకరిస్తున్నారు.. నిన్నటికి నిన్న పుట్టిన బచ్చా కేటీఆర్**
- **దేశంలో పరిస్థితులు మారాలి : ఉత్తమ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రజలకు కనీస హక్కులు లేకుండా అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఈ పరిస్థితిని విద్యావంతులు, వృత్తి నిపుణులు గట్టిగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ పార్లమెంట్ సాక్షిగా చరిత్రను వక్రీకరించేలా మాట్లాడుతున్నారని, ఇంతకన్నా దురదృష్టం ఇంకేమీ ఉండదని దుయ్యబట్టారు. వల్లభాయ్ పటేల్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పని చేసిందంటూ విష ప్రచారం చేస్తున్నారని, ఆర్ఎస్ఎస్‌ను నిషేధించింది పటేలేనన్న సంగతిని మోదీ మర్చిపోయారని ఎద్దేవా చేశారు. మరోవైపు రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. నిన్నటికి నిన్న పుట్టిన బచ్చా కేటీఆర్.. దేశం కోసం గాంధీ, నెహ్రూ చేసిందేమీ లేదంటున్నారని ధ్వజమెత్తారు. హుస్సేన్‌సాగర్ నీళ్లను కొబ్బరి నీళ్లలా మారుస్తామని, హైదరాబాద్‌లో ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తామని, స్కైవేలు ఏర్పాటు చేస్తామని ప్రగల్భాలు పలకడం తప్ప కేసీఆర్, కేటీఆర్ చేసిందేమీ లేదన్నారు. 2019లో కాంగ్రెస్ తప్పకుండా అధికారంలోకి వస్తుందని, ఇందుకు ప్రొఫెషనల్స్ కూడా దోహదపడాలని కోరారు. తెలంగాణలో పర్యటన సందర్భంగా ప్రొఫెషనల్ కాంగ్రెస్ సభ్యులతో భేటీ అయ్యేందుకు రాహుల్ ఆసక్తి కనబరుస్తున్నారని వెల్లడించారు. సీఎల్పీ నేత జానారెడ్డి మాట్లాడుతూ దేశ భద్రత, ఆత్మగౌరవం కాపాడుకునేందుకు వృత్తి నిపుణుల నుంచి నాయకులు రావాల్సిన అవసరం ఉందన్నారు. దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలోకి పెద్ద ఎత్తున ఉన్నత విద్యావంతులు రావడం వల్లే రాష్ట్రం సాకారమైందన్నారు. కాగా, పక్షవాతం వచ్చిన వారిని కూడా వికలాంగులుగా గుర్తించి రూ.1500 పింఛన్‌ఇవ్వాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లకోసారి పే రివిజన్ చేసినట్లుగా సామాజిక భద్రత పెన్షన్‌ను కూడా పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా అడిగిన ఎంపీ కవితకు తెలంగాణలో సమస్యలు కనిపించడం లేదా అని వీహెచ్ ప్రశ్నించారు. కేసీఆర్‌కు సంబంధించిన కిటుకు ఏదో మోదీ వద్ద ఉందని, అందుకే ఆయనను ప్రశ్నించేందుకే జంకుతున్నారన్నారు.

కోర్కెలు తీర్చే మోతెగడ్డ వీరభద్రుడు

- **గిరిజనుల ఆరాధ్య దైవంగా ప్రసిద్ధి**
- **ఏటా శివరాత్రి సందర్భంగా కల్యాణం**
- **ఇప్పటికీ నాటు పడవల్లోనే భక్తుల రాక**



మోతెగడ్డ వీరభద్రస్వామి ఆలయం(ఇన్‌సెట్‌లో) కొలువుదీరిన వీరభద్రుడు

బూర్గంపాడు, ఫిబ్రవరి 10 : గోదావరి నదిని ఆనుకుని చిన్న గుట్ట.. కాకతీయుల కాలంలో నిర్మించిన ఆలయం.. గిరిజనుల ఆరాధ్య దైవంగా ప్రసిద్ధి చెందిన వీరభద్రుడు... ఇలా చారిత్రక నేపథ్యంతోపాటు రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ఏకైక ద్వీపకల్ప ఆలయంగా ప్రసిద్ధికెక్కింది మోతెగడ్డ వీరభద్రేశ్వరాలయం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ఇరవెండి పంచాయతీ పరిధిలోని మోతె గ్రామ సమీపంలో గోదావరి నది మధ్యలో ఈ ఆలయం ఉంది. మోతెగడ్డ వీరభద్రుడిని గిరిజనులు ఆరాధ్య దైవంగా కొలుస్తారు. శివరాత్రి పర్వదినాన జరిగే స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి అధిక సంఖ్యలో గిరిజనులు తరలివస్తుంటారు. గిరిజనుల సంప్రదాయ పద్ధతిలోనే ఇప్పటికీ ఇక్కడ పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గోదావరి మధ్యలో ఉన్న ఈ గుట్టకు మోతెగడ్డగా పేరుండటంతో మోతెగడ్డ వీరభద్రస్వామిగా భక్తులు కొలుస్తుంటారు. గోదావరి నది ప్రమాదస్థాయికి మించి ప్రవహించినా ఆలయం ఎప్పుడూ ముంపునకు గురి కాలేదని ప్రతీతి. ఈ ఆలయాన్ని చేరుకోవాలంటే ఇప్పటికీ నాటు పడవలే ఆధారం.



మోతెగడ్డ ద్వీపకల్పంలో భక్తుల స్నానాలు(ఫైల్‌ఫోటో)

వీరభద్రుడి చెంత సూర్య భగవానుడు

సాధారణంగా శివాలయంలో నందీశ్వరుడు కొలువుదీరి ఉంటాడు. కానీ, ఇక్కడ ఆలయానికి తూర్పు భాగంలో నందితోపాటు సూర్య భగవానుడి విగ్రహం కొలువుదీరి ఉంది. కాకతీయులు నిర్మించిన ఈ ఆలయం ఇప్పటికీ చెక్కు చెదరకుండా నాటి కళావైభవాన్ని కళ్లకు కడుతోంది. గిరిజనులు సూర్యదేవుడికి నమస్కరించుకొని తమ ఇష్టదైవమైన వీరభద్రస్వామిని కొలుచుకుంటారు. గోదావరి నదిని దాటి ఆలయాన్ని చేరుకునేందుకు భక్తులు ఇప్పటికీ నాటు పడవల్లోనే ప్రయాణిస్తుంటారు. శివరాత్రి సమయంలో స్వామి వారికి నిర్వహించే కల్యాణాన్ని తిలకించేందుకు రావాలన్నా ఇదే పరిస్థితి. కోరిన మొక్కులు తీర్చే దేవుడి పేరుండడంతో కష్టనష్టాలకోర్చి భక్తులు ఇక్కడికి వస్తుంటారు. కాగా, గోదావరి నది మధ్యన ఉన్న మోతెగడ్డ వీరభద్రస్వామి వారి ఆలయానికి ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తే పర్యాటకంగా మరింత ప్రసిద్ధి చెందే అవకాశాలున్నాయి. ఆలయాన్ని చేరుకునేందుకు రోప్‌వేతో పాటు, ఆలయంలో సోలార్ విద్యుత్తు సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. ఆలయాన్ని అభివృద్ధి చేస్తే మరింత ప్రాచుర్యంలోకి వస్తుందని ఆలయ చైర్మన్ తాళ్లూరి శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు.



■ ఆర్కే RK

కొత్తపలుకు

మోదీదే బాధ్యత!

"రాష్ట్ర విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగింది. తెలంగాణ ఏర్పాటు వల్ల ఆదాయం కోల్పోయింది. పార్లమెంట్ తలుపులు మూసి మరీ రాష్ట్ర విభజన చేశారు. ఆ పాపం కాంగ్రెస్‌దే!" లోక్‌సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు ఇవి! ఏపీకి అన్యాయం జరిగిందని ప్రధానమంత్రి స్వయంగా ఒప్పుకొన్నప్పుడు న్యాయం చేయవలసింది కూడా ప్రధానమంత్రే కదా! ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రాన్ని హడావుడిగా విభజించారని కూడా చెప్పిన నరేంద్ర మోదీకి ఆ పాపంలో తమ పార్టీకి కూడా సమాన వాటా ఉందన్న విషయం తెలియదా? భారతీయ జనతా పార్టీ మద్దతు లేకుండా నాడు రాష్ట్ర విభజన సాధ్యమయ్యేది కాదు కదా? పార్లమెంట్ తలుపులను కాంగ్రెస్ పార్టీ మూస్తే లోపల నుంచి బోల్టులు పెట్టింది భారతీయ జనతా పార్టీ కాదా? సమన్యాయం జరిగే వరకు రాష్ట్ర విభజనకు సహకరించవద్దని చంద్రబాబు పదేపదే విజ్ఞప్తి చేసినా అప్పటికే ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటితమైన నరేంద్ర మోదీ బేఖాతరు చేయడం నిజం కాదా? తెలంగాణ ఏర్పాటు ఖ్యాతిని తాము కూడా పొందాలని భారతీయ జనతా పార్టీ ఆశించలేదా? ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అన్యాయం చేయడంలో కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపిన వారే ఇప్పుడు తమకు ఏమీ సంబంధం లేదనడం సమర్థనీయం ఎలా అవుతుంది? ఏపీ విషయంలో అధికారంలో ఉన్న పార్టీలు అనుసరించిన, అనుసరిస్తున్న వైఖరి అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నది. అధికారం ఉంది కదా అని అడ్డగోలుగా వ్యవహరిస్తే నష్టపోయే ప్రజలకు ఎవరు బాధ్యత తీసుకుంటారు? ఏమి పాపం చేశారని నాడు ఏపీ ప్రజలను వంచించారు? రాజధాని కూడా లేకుండా ఒక ప్రాంతాన్ని పక్కకు నెట్టివేసి, మీదొక రాష్ట్రం అంటే ప్రజలు నిస్సహాయంగా చూస్తుండిపోవాలా? న్యాయం చేయవలసినవారే అన్యాయం జరిగింది గానీ ఏమీ చేయలేం అంటే సహించి ఊరుకోవడమేనా? అన్ని రాష్ట్రాలనూ సమానంగా చూడవలసిన బాధ్యత కేంద్రంలో అధికారంలో ఉన్నవారికి ఉండదా? న్యాయం చేయమని ఒక ప్రాంతానికి చెందిన ప్రజలు వీధుల్లో, ఎంపీలు పార్లమెంట్‌లో నిరసన ప్రదర్శనలు చేసినా పట్టించుకోకపోతే దేశ సమగ్రత నిలబడుతుందా? పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఉంటుందా? మొన్న ఏపీకి జరిగిన అన్యాయం రేపు మరొకరికి జరగదని గ్యారంటీ ఏమిటి? ఈ ధోరణి వల్ల యూనియన్ ప్రభుత్వంపై ప్రజలు ధిక్కారస్వరం వినిపిస్తే

> **తెలుగుదేశం పార్టీ వంటి నమ్మకమైన మిత్రపక్షాన్ని కాదని వైసీపీతో కలవడానికి ప్రయత్నించడం ద్వారా దేశానికి ఏ సందేశం ఇవ్వాలనుకుంటున్నారని జయదేవ్ నిలదీయడాన్ని ప్రజలంతా ముక్తకంఠంతో అభినందించారు. జయదేవ్‌లాంటి వాళ్లు లోక్‌సభలో ఉండి తీరాలని తెలుగు ప్రజలే కాకుండా ఆయన ప్రసంగాన్ని విన్నవారంతా అభిప్రాయపడుతున్నారు. మిత్రపక్షానికి చెందిన ఒక ఎంపీ నిండు సభలోనే ప్రధానమంత్రిని ఎందుకు నిలదీయవలసి వచ్చిందో భారతీయ జనతా పార్టీ నాయకత్వం ఇప్పటికైనా ఆలోచించుకోవాలి.**

ఎవరు బాధ్యత తీసుకుంటారు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పవలసింది నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్, నేడు అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీలే! అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీని ఏపీ ప్రజలు శిక్షించారు. ఆ అన్యాయానికి సహకరించిన భారతీయ జనతా పార్టీ అయినా అధికారంలోకి వస్తే తప్పు సరిదిద్ది న్యాయం చేస్తుందని ఏపీ ప్రజలు ఆశించడం తప్పు కాదు కదా? తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎంపీలు కూడా ఏపీకి న్యాయం చేస్తే తమకు అభ్యంతరం లేదంటున్నారంటే న్యాయం ఎటువైపు ఉందో స్పష్టమవుతోంది కదా! తెలంగాణ ఎంపీ కవిత పార్లమెంట్‌లో మాట్లాడుతూ ఏకంగా 'జై ఆంధ్రా' అని అన్నారంటే ఏపీ ప్రజల పట్ల వారికి కూడా సానుభూతి ఉన్నట్టే కదా! సహాయం చేయండి అని దాయాదులు కోరుతున్నా కూడా పట్టించుకోకపోవడాన్ని ఏమనుకోవాలి? తమవాళ్లు ఎందుకు ఇలా చేస్తున్నారో అర్థంకావడం లేదనీ, నమ్మకమైన మిత్రపక్షంగా ఉండే తెలుగుదేశం పార్టీతో ఇలా ఎందుకు చేస్తున్నారో తెలియడం లేదనీ లాల్ కృష్ణ ఆడ్వాణీ వంటి వాళ్లు నిర్వేదం వ్యక్తంచేశారంటే ఏమనుకోవాలి? అన్యాయం చేసిన వారితోపాటు ప్రతి ఒక్కరూ 'నిజమే, అన్యాయం జరిగింది. ఇప్పుడు న్యాయం చేయండి. సహకరిస్తాం' అని నమ్మబలుకుతున్నా మోదీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఏమిటి? విభజన సందర్భంగా హైదరాబాద్ ఆదాయంలో కొంత వాటాను ఏపీ నాయకులు కోరి ఉండవలసిందని తెలంగాణకు చెందిన ఒక ప్రముఖుడు అభిప్రాయపడ్డారంటే ఆర్థికంగా ఏపీ ఎంతటి దయనీయ స్థితిలో ఉందో అర్థం కావడం లేదా? అయినా ప్రధాని మోదీ మనస్సు కరగడం లేదంటే ఏమనుకోవాలి? ప్రధాని మోదీకి ఒళ్లంతా పొగరే అని ఇవ్వాళ ఏపీ ప్రజలే కాకుండా ఇతరులు కూడా భావిస్తున్నారంటే అందుకు ఆయన వ్యవహార శైలే కారణం. చాయ్‌వాలాగా జీవితాన్ని ప్రారంభించి ప్రధానమంత్రి స్థాయికి ఎదిగిన నరేంద్ర మోదీ అహంభావం ప్రదర్శించడాన్ని తెలుగువాళ్లే కాదు, ఈ దేశ ప్రజలు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు. రెండు రోజుల క్రితం పార్లమెంట్ సెంట్రల్ హాల్ నుంచి నరేంద్ర మోదీ వెళుతున్నప్పుడు అక్కడ ఉన్న అనేక పార్టీల ఎంపీలు లేచి నిలబడి నమస్కరిస్తే ఆయన ప్రతి నమస్కారం కూడా చేయలేదని అక్కడే ఉన్న ఒక ఎంపీ ఆవేదనగా చెప్పారు. యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు సోనియాగాంధీ సెంట్రల్‌హాల్‌కు వస్తే తనను గమనించనివారిని కూడా వెనుక నుంచి తట్టి పలకరించేవారని ఆయన గుర్తుచేసుకున్నారు. ప్రధానమంత్రి పదవిలో ఉన్నవారిపై ప్రజలకు అభిమానం ఉండాలే గానీ భయం ఉండకూడదు. ఇప్పుడు మోదీ విషయంలో ఇందుకు భిన్నంగా జరుగుతోంది. భయపడటం అనేది ఒకస్థాయి వరకే– ఆ తర్వాత భయపడినవారే ఎదురు తిరుగుతారు. ఇందుకు తెలుగుదేశం పార్టీ ఎంపీ గల్లా జయదేవ్ లోక్‌సభలో చేసిన ప్రసంగమే నిదర్శనం! అటు ప్రధానమంత్రిని, ఇటు ఆర్థికమంత్రిని ఆయన కడిగిపారేశారు. తెలుగుదేశం పార్టీ వంటి నమ్మకమైన మిత్రపక్షాన్ని కాదని వైసీపీతో కలవడానికి ప్రయత్నించడం ద్వారా దేశానికి ఏ సందేశం ఇవ్వాలనుకుంటున్నారని జయదేవ్ నిలదీయడాన్ని ప్రజలంతా ముక్తకంఠంతో అభినందించారు. జయదేవ్‌లాంటి వాళ్లు లోక్‌సభలో ఉండి తీరాలని తెలుగు ప్రజలే కాకుండా ఆయన ప్రసంగాన్ని విన్నవారంతా అభిప్రాయపడుతున్నారు. మిత్రపక్షానికి చెందిన ఒక ఎంపీ నిండు సభలోనే ప్రధానమంత్రిని ఎందుకు నిలదీయవలసి వచ్చిందో భారతీయ జనతా పార్టీ నాయకత్వం ఇప్పటికైనా ఆలోచించుకోవాలి. నిజాయితీగా ఉంటున్నామని చెప్పి నిర్దయతో వ్యవహరించడాన్ని ప్రజలు హర్షించరు. ఇవ్వాళ ఏపీలో మోదీ నిజాయితీ ప్రజలకు కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీ కంటే

> **తెలుగుదేశం–బీజేపీ మధ్య పొత్తు ఉంటుందా? లేదా? అన్నది ప్రజలకు అప్రస్తుతం. రాష్ట్రానికి ఏమిస్తారు? అని మాత్రమే ప్రజలు ఎదురుచూస్తున్నారు. విభజన చట్టంలో పేర్కొన్న అన్ని హామీలు అమలుచేస్తే బీజేపీపై ప్రజలలో ఉన్న కోపం పోతుంది. ఇవ్వాళ భారతీయ జనతా పార్టీ కంటే ప్రధాని నరేంద్ర మోదీపైనే ప్రజలు ఎక్కువ ఆగ్రహంగా ఉన్నారు. ఈ పరిస్థితి పోవాలంటే ప్రధాని మోదీనే స్వయంగా ప్రకటన చేసి, వాటి అమలు ప్రారంభించడం వాంఛనీయం. అలా చేయడం బీజేపీకే మంచిది. లేనిపక్షంలో ఇవ్వాల్సినవి ఇచ్చినా ప్రజలకూ మోదీకీ మధ్య ఉన్న అంతరం తొలగిపోదు. అప్పుడు తెలుగుదేశం–బీజేపీ మధ్య పొత్తు కొనసాగినా ఫలితం ఉండదు.**

దారుణంగా వ్యవహరిస్తున్నారని భావిస్తూ ఆయన పేరెత్తితేనే మండిపడుతున్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా తాము తప్పు చేశామనీ, ఇప్పుడిప్పుడే అర్థమవుతోందని సోనియాగాంధీ సైతం పశ్చాత్తాపం వ్యక్తంచేశారు గానీ మోదీ మనస్సు మాత్రం కరగడం లేదు. అధికారంలో ఉన్నవారు తమ స్థానం శాశ్వతమని భ్రమిస్తుంటారు. ఏ ఒక్కరూ శాశ్వతంగా అధికారంలో ఉండబోరని చరిత్ర చెబుతోంది. మోదీకి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. అధికారంలో ఉన్నప్పుడు చేసిన మంచినే కాదు, చెడును కూడా ప్రజలు గుర్తుంచుకుంటారు. ఇందిరాగాంధీ మహా నాయకురాలు. ఆమె అంత గొప్ప నాయకురాలైనా దేశంలో ఎమర్జెన్సీ విధించడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. చివరకు ఆమె రాజకీయ జీవితంలో అదొక మచ్చగా మిగిలిపోయింది. నిజానికి నరేంద్ర మోదీకి లభించినంతటి అద్భుత అవకాశం ఈ దేశంలో ఇంకెవరికీ దక్కలేదు. ఏపీ ప్రజలే కాదు– దేశ ప్రజలంతా ఆయనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. దేశం దశా దిశా మారుస్తారని నమ్మకం పెట్టుకున్నారు. నాలుగేళ్లు గడిచేసరికి ప్రజల్లో భ్రమలు తొలగిపోవడం మొదలయ్యింది. ఒక రాష్ట్రానికి చెందిన 30 మందికిపైగా ఎంపీలు పార్లమెంట్ ఉభయసభల్లో నిరసన వ్యక్తంచేస్తూనే ఉన్నా కనీసం నోరెత్తి అనునయించని ప్రధానమంత్రిని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎందుకు అభిమానించాలి? ఎందుకు గౌరవించాలి? ఏపీకి అన్యాయం జరిగిందని అంగీకరిస్తూనే పార్లమెంట్‌ను వేదికగా చేసుకుని రాజకీయ ఉపన్యాసం చేసినంత మాత్రాన ఏపీ ప్రజల కడుపు నిండదు. "నేను ఉన్నాను– అధైర్యపడవద్దు" అన్న మాటలు చెప్పడానికి కూడా నరేంద్ర మోదీకి నోరు రాలేదంటే ఏమనుకోవాలి?

'అయినా మన బంగారం మంచిదైతే' అన్న సామెత చందంగా ఇవ్వాళ ఏపీ ప్రజలు ఇంతలా నష్టపోవడానికి ఆ రాష్ట్ర రాజకీయ నాయకులే కారణం. రాష్ట్ర విభజన తథ్యమని తేలిపోయిన తర్వాత కూడా సమైక్యాంధ్ర పేరిట ఉద్యమం నడిపి ప్రజలకు నాడు ద్రోహం చేసినవారిలో కొందరు ఇప్పుడు మళ్లీ రాజకీయం చేయడం మొదలుపెట్టారు. ఇల్లు కాలిందని ఒకరు ఏడుస్తుంటే బొగ్గులు ఏరుకోవడానికి ఒకరు, చుట్ట కాల్చుకోవడానికి మరొకరు ప్రయత్నించినట్టు రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్నారు. శుక్రవారంనాడు పార్లమెంట్ బయట ఆందోళన చేస్తున్న తెలుగుదేశం పార్టీ ఎంపీల వద్దకు వచ్చిన కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్ అక్కడున్న శివప్రసాద్ వేషధారణ చూసి వెర్రినవ్వు నవ్వారు. హడావుడిగా విభజన బిల్లు రూపొందించి ఏపీకి అన్యాయం చేసినవారిలో జైరామ్ రమేశ్ ముఖ్యుడు. అలాంటి వ్యక్తి ఇప్పటికైనా పశ్చాత్తాపం ప్రకటించకుండా వెటకారంగా నవ్వడం ఏమిటి? ఏపీకి జరిగిన అన్యాయం విషయంలో పోరాటం పేరిట రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలు మళ్లీ మొదలయ్యాయి. రాష్ట్రంలో భూస్థాపితమైన పార్టీని బతికించుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తుండగా, జరిగిన అనర్థానికి తెలుగుదేశం వైఫల్యమే కారణమని చెప్పడానికి వైసీపీ ప్రయత్నాలు మొదలెట్టింది. ప్రస్తుత పరిస్థితులలో రాజకీయంగా నష్టం జరగకుండా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే ప్రయత్నాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేశారనే చెప్పవచ్చు. అవసరమైతే భారతీయ జనతా పార్టీతో తెగదెంపులకు సిద్ధమేనన్న సంకేతాలను ఆయన బలంగా పంపారు. కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరిగిందన్న అభిప్రాయంతో ఉన్న ప్రజలు భారతీయ జనతా పార్టీపై మండిపడుతున్నందున అలాంటి పార్టీతో అంటకాగితే ఏమి జరుగుతుందో తెలుసు కనుకే చంద్రబాబు అమీతుమీకి సిద్ధపడ్డారు. బడ్జెట్ తర్వాత తెలుగుదేశం పార్టీనే తీవ్రంగా స్పందించగా, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రశంసించడం గమనార్హం.

వేళ్లన్నీ ప్రధాని వైపే..!

తొలుత మీరు కాకపోతే జగన్మోహన్‌రెడ్డి ఉన్నారన్న ధీమాతో ఉన్న బీజేపీ అగ్రనాయకత్వం రాష్ట్రంలో పరిస్థితులను గమనించిన తర్వాత మెత్తబడింది. అప్పటిదాకా మేం అంతా ఇంతా అని గొప్పలు చెప్పుకొన్న స్థానిక బీజేపీ నాయకుల నోళ్లకు తాళం పడింది. తెలుగుదేశం పార్టీని తిట్టినవాళ్లు తమది భార్యాభర్తల బంధమని వ్యాఖ్యానించడం మొదలుపెట్టారు. రాష్ట్రంలో చంద్రబాబును వ్యతిరేకించే బీజేపీ నాయకులు కలుగుల్లోకి వెళ్లిపోయారు. ఇదంతా చంద్రబాబు గొప్పతనం కాదు. భారతీయ జనతా పార్టీ పట్ల ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత కారణంగానే పరిస్థితులలో మార్పు వచ్చింది. ప్రజల మూడ్‌ను గమనించిన చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతూ పోయారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడేది లేదన్న అభిప్రాయం కలిగించే దిశగా పార్లమెంట్ లోపలా, వెలుపలా ఆందోళన చేయించారు. ప్రజలలో నెలకొన్న ఆగ్రహావేశాలు తనవైపు మళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పార్లమెంట్ సమావేశాలు పునః ప్రారంభం అయ్యేలోపు న్యాయం జరగకపోతే కేంద్రంలో ఉన్న ఇద్దరు మంత్రులతో రాజీనామా చేయించాలన్న నిర్ణయానికి కూడా వచ్చారు. ఇప్పుడున్న పరిస్థితులలో బీజేపీతో పొత్తు కొనసాగిస్తే మొదటికే మోసం వస్తుందని ఆయన గ్రహించారు. తెలుగుదేశం–బీజేపీ కలిసి ప్రజలను మభ్యపెట్టాయన్న అపవాదు చుట్టుకోకుండా ఉండటానికై కమలనాథులతో కటీఫ్‌కు సిద్ధమయ్యారు. అయితే ప్రతిపక్ష వైసీపీ ఈ మొత్తం వ్యవహారంలో తెలుగుదేశం పార్టీని ఇరికించే వ్యూహాన్ని ఎంచుకుంది. ప్రత్యర్థి పార్టీగా తెలుగుదేశాన్ని టార్గెట్ చేసుకోవడంలో తప్పులేదు గానీ, క్షేత్రస్థాయి పరిస్థితులను దృష్టిలో పెట్టుకోకుండా ఆ పార్టీ వ్యూహరచన చేసిందని అనిపిస్తోంది. రాష్ట్రానికి భారతీయ జనతా పార్టీ అన్యాయం చేసిందనే ప్రజలు భావిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కూడా తోడుదొంగేనన్న అభిప్రాయానికి ప్రజలు ఇంకా రాలేదు. అలాంటప్పుడు అసలు దోషిగా ప్రజలు భావిస్తున్న భారతీయ జనతా పార్టీని, కేంద్ర ప్రభుత్వాన్ని పల్లెత్తు మాట అనకుండా తెలుగుదేశం పార్టీని నిందిస్తే వచ్చే ప్రయోజనం ఏమిటో తెలియదు. కేంద్రంలో మంత్రిగా ఉండి నిరసన తెలపడం ఏమిటని సుజనా చౌదరిని నిలదీయడానికి ప్రయత్నించి వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అభాసుపాలయ్యారు. ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నవారు నిరసనలు తెలపడం ఇవ్వాళ కొత్తేమీ కాదు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆనాడు యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రులుగా ఉన్న ఏపీ కాంగ్రెస్ నాయకులు చిరంజీవి, కావూరి సాంబశివరావు, పురందేశ్వరి వంటివారు సభలోనే నిరసన తెలిపారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా నియమితులైన కిరణ్‌కుమార్‌రెడ్డి ఏకంగా సొంత పార్టీపైనే తిరుగుబాటు చేశారు. సంకీర్ణ ప్రభుత్వాలు ఉన్నప్పుడు సొంత ప్రయోజనాల కోసం నిరసనలు, ఆందోళనలు చేయడం సహజం. ఇందులో అభ్యంతర పెట్టవలసింది ఏమీ లేదు. అంతే కాదు–రాష్ట్రానికి న్యాయం చేయాల్సిందేనని మిత్రపక్షమైన తెలుగుదేశం ఎంపీలు డిమాండ్ చేయగా, ప్రత్యేకంగా ఏ బంధం లేని వైసీపీకి చెందిన విజయసాయిరెడ్డి వంటి ఎంపీలు విజ్ఞప్తితో సరిపెట్టారు. నిండుసభలో 'వుయ్ డిమాండ్' అని తెలుగుదేశం ఎంపీ గల్లా జయదేవ్ హుంకరించడాన్ని ప్రజలు విన్నారు. న్యాయం చేయవలసిన భారతీయ జనతా పార్టీని వదిలిపెట్టి, తెలుగుదేశం పార్టీని మాత్రమే లక్ష్యంగా ఎంచుకుంటే వైసీపీకి కలిగే ప్రయోజనం ఏమిటో తెలియదు. తెలుగుదేశం పార్టీతో పాటు కేంద్ర ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న బీజేపీని దుమ్మెత్తిపోసి ఉంటే ఎంతో కొంత ప్రయోజనం ఉండేది. ఇప్పుడు ఏపీ ప్రజల దృష్టిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విలన్! అలాంటి వ్యక్తిని పార్లమెంట్ లోపలా, బయటా ఏమీ అనకపోవడాన్ని ప్రజలు గమనించకుండా ఎందుకుంటారు. రాజకీయ పార్టీలు తమ ప్రయోజనాల కోసం పాకులాడటం సహజం! అయితే ఆంధ్రుల హక్కుల కోసం పోరాడుతున్నామని ప్రకటించుకుంటున్న కొందరు వ్యక్తులు, చిన్నాచితక పార్టీలు కూడా లక్ష్యం లేకుండా ప్రకటనలు చేయడమే ఆశ్చర్యం కలిగిస్తోంది. తెలుగుదేశం పార్టీ కేంద్ర ప్రభుత్వం నుంచి బయటకు రావాలనీ, భారతీయ జనతా పార్టీతో తెగదెంపులు చేసుకోవాలనీ ఆ వర్గాలు డిమాండ్ చేయడం అర్థరహితం. అలా చేయడం వల్ల నష్టపోయిన ఏపీకి ఏమి వస్తుంది? రాష్ట్ర విభజన సమయంలో కూడా ఇలాగే చేశారు. రాష్ట్రానికి ఏమి కావాలో కోరుకోకుండా సమైక్యాంధ్ర అంటూ వ్యర్థ ప్రయత్నం చేశారు. ప్రగల్భాలు పలికారు. ఫలితంగా అప్పటి ఎంపీలు, మంత్రులు నోళ్లు మెదపలేని పరిస్థితి కల్పించారు. విభజన వల్ల నష్టపోతున్న ఏపీకి హైదరాబాద్ ఆదాయంలో వాటా ఇవ్వడానికి కూడా సోనియాగాంధీ అప్పట్లో సిద్ధపడ్డారు. అయితే అలా కావాలని ఎవరూ కోరలేని పరిస్థితి కల్పించి ప్రజలను ముంచారు. ఇప్పుడు మళ్లీ అదే తంతు మొదలయ్యింది. దానికి కొన్ని చానెళ్లు కూడా వంతపాడుతున్నాయి. ఏపీకి న్యాయం చేయకపోతే రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీకి జరగబోయే నష్టం గురించి చెప్పకుండా ప్రగల్భాలు పలికి ప్రయోజనం ఉండదు. ఎవరు అవునన్నా కాదన్నా ఇవ్వాళ తెలుగుదేశం పార్టీ తీసుకున్న వైఖరి, చేపట్టిన ఆందోళనల వల్ల భారతీయ జనతా పార్టీ ఆత్మరక్షణలో పడింది. మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రానికే న్యాయం చేయకపోతే తమకు మాత్రం ఏమి చేస్తారని మిగతా రాష్ట్రాల ప్రజలు ప్రధానమంత్రిని అనుమానించే పరిస్థితి ఇప్పుడు వచ్చింది. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ రాజకీయ విశ్వసనీయత కూడా ప్రశ్నార్థకమైంది. బహుశా ఈ కారణంగానే కాబోలు కేంద్ర పెద్దలు దిగివచ్చి ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని వరాలు ప్రకటించడానికి సిద్ధపడినట్టు వార్తలు వస్తున్నాయి.



> **నిజానికి నరేంద్ర మోదీకి లభించినంతటి అద్భుత అవకాశం ఈ దేశంలో ఇంకెవరికీ దక్కలేదు. ఏపీ ప్రజలే కాదు– దేశ ప్రజలంతా ఆయనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. దేశం దశా దిశా మారుస్తారని నమ్మకం పెట్టుకున్నారు. నాలుగేళ్లు గడిచేసరికి ప్రజల్లో భ్రమలు తొలగిపోవడం మొదలయ్యింది. ఒక రాష్ట్రానికి చెందిన 30 మందికి పైగా ఎంపీలు పార్లమెంట్ ఉభయసభల్లో నిరసన వ్యక్తంచేస్తూనే ఉన్నా కనీసం నోరెత్తి అనునయించని ప్రధానమంత్రిని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎందుకు అభిమానించాలి? ఎందుకు గౌరవించాలి? ఏపీకి అన్యాయం జరిగిందని అంగీకరిస్తూనే పార్లమెంట్‌ను వేదికగా చేసుకుని రాజకీయ ఉపన్యాసం చేసినంత మాత్రాన ఏపీ ప్రజల కడుపు నిండదు.**

మోదీ చెబితేనే..!

ఈ మొత్తం వ్యవహారంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఇప్పుడు మళ్లీ కీలక పాత్ర పోషించడం మొదలుపెట్టారు. విభజన బిల్లు చర్చకు వచ్చినప్పుడు రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని కోరింది కూడా ఆయనే! అప్పుడు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న అరుణ్ జైట్లీ రాష్ట్రానికి అన్యాయం జరిగింది అని కూడా అనలేదు. ఆ మాట ఇప్పుడు చెబుతున్నారు. విభజన వల్ల ఏపీకి ఆదాయం తగ్గిందంటున్న జైట్లీకి అప్పుడు ఆ విషయం తెలియదా? ఏది ఏమైనా వెంకయ్యనాయుడు చొరవతో బీజేపీ–తెలుగుదేశం పార్టీల మధ్య చర్చలు మొదలయ్యాయి. శుక్రవారం సాయంత్రం చోటుచేసుకున్న పరిణామాలను బట్టి కేంద్రం దిగివచ్చిందనే చెప్పవచ్చు. మీడియాలో వచ్చిన వివరాలను బట్టి రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని ఆశించవచ్చు. ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగుతున్న వాటిని ఇవ్వడానికి కేంద్రం అంగీకరించిందనే అభిప్రాయం కలుగుతోంది. అయితే కేంద్ర ప్రభుత్వం చేయనున్న ప్రకటన, వివరించనున్న కార్యాచరణ ప్రణాళికను బట్టి ప్రజలు సంతృప్తి చెందుతారా? లేదా? అన్నది ఆధారపడి ఉంటుంది. ఇప్పుడున్న పరిస్థితులలో ప్రధాని మోదీపై ఏపీ ప్రజలు పట్టలేనంత కోపంగా ఉన్నందున వారు సంతృప్తి చెందితేనే భారతీయ జనతా పార్టీ– తెలుగుదేశం పార్టీల మధ్య సంబంధాలు మళ్లీ పూర్వస్థితికి వస్తాయి. తూతూమంత్రంగా ఏవో కొన్ని ప్రకటనలు చేసినంత మాత్రాన ప్రజల అభిప్రాయం మారిపోదు. మీడియాలో వచ్చినవన్నీ ఇవ్వడానికి కేంద్రం నిజంగానే అంగీకరిస్తే రాష్ట్రానికి న్యాయం జరిగినట్టే! అప్పుడు ప్రజలు కచ్చితంగా సంతృప్తి చెందుతారు. నేను ఉపరాష్ట్రపతిని అయిపోయాను. ఇక నాకు రాజకీయాలతో, రాష్ట్రంతో ఏమి పని అనుకోకుండా వెంకయ్యనాయుడు పరిధిని దాటి మరీ రాష్ట్ర ప్రజల కోసం చేస్తున్న కృషిని అభినందించాల్సిందే! ఆయన చొరవ తీసుకోకుండా ఉండి ఉంటే తెలుగుదేశం–బీజేపీ మధ్య బంధం తెగిపోయేది. అందుకు చంద్రబాబు మానసికంగా సిద్ధపడ్డారని తెలుగుదేశం వర్గాలు చెబుతున్నాయి. కేంద్రంలో కదలిక వచ్చిందని తెలిసిన తర్వాత ఆయన కొంత తగ్గారనీ, లేనిపక్షంలో శనివారంనాడు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఫలానా తేదీలోపు న్యాయం చేయని పక్షంలో బీజేపీకి విడాకులు ఇస్తామని ప్రకటించాలని భావించినట్టు ఆ వర్గాలు చెప్పాయి. అయితే ఇప్పుడు ప్రచారంలోకి వచ్చిన అంశాలను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటిస్తారా? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటిస్తారా? పార్లమెంట్ సమావేశాలు మార్చి 5 నుంచి పునఃప్రారంభం అవుతాయి కనుక అప్పుడు ప్రకటిస్తారా? లేక ఈలోపే ప్రకటిస్తారా? అన్నది తేలవలసి ఉంది. కేంద్ర ప్రభుత్వంపై ఏపీ ప్రజలకు నమ్మకం పోయింది కనుక పార్లమెంట్ సాక్షిగానే ప్రధానమంత్రి స్వయంగా కార్యాచరణను ప్రకటిస్తే తప్ప ప్రజలు సంతృప్తి చెందరు. ఇంతకు ముందు ప్రత్యేక హోదా బదులు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించి కూడా అమలుచేయకపోవడంపై ప్రజలకు అభ్యంతరాలు ఉన్నాయి. ఈ కారణంగా మళ్లీ మళ్లీ మోసపోవడానికి ప్రజలు సిద్ధంగా లేరు. చంద్రబాబు కూడా ఈ విషయం దృష్టిలో పెట్టుకోవాలి. తెలుగుదేశం–బీజేపీ మధ్య పొత్తు ఉంటుందా? లేదా? అన్నది ప్రజలకు అప్రస్తుతం. రాష్ట్రానికి ఏమిస్తారు? అని మాత్రమే ప్రజలు ఎదురుచూస్తున్నారు. విభజన చట్టంలో పేర్కొన్న అన్ని హామీలు అమలుచేస్తే బీజేపీపై ప్రజలలో ఉన్న కోపం పోతుంది. ఇవ్వాళ భారతీయ జనతా పార్టీ కంటే ప్రధాని నరేంద్ర మోదీపైనే ప్రజలు ఎక్కువ ఆగ్రహంగా ఉన్నారు. ఈ పరిస్థితి పోవాలంటే ప్రధాని మోదీనే స్వయంగా ప్రకటన చేసి, వాటి అమలు ప్రారంభించడం వాంఛనీయం. అలా చేయడం బీజేపీకే మంచిది. లేనిపక్షంలో ఇవ్వాల్సినవి ఇచ్చినా ప్రజలకు –మోదీకి మధ్య ఉన్న అంతరం తొలగిపోదు. అప్పుడు తెలుగుదేశం–బీజేపీ మధ్య పొత్తు కొనసాగినా ఫలితం ఉండదు. ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని ప్రధాని మోదీ ఏ నోటితో అన్నారో, ఏ సభ సాక్షిగా అన్నారో అదే నోటితో అదే సభ సాక్షిగా 'నేను ఇలా న్యాయం చేస్తున్నాను' అని అన్నప్పుడే పరిస్థితిలో మార్పు వస్తుంది. ఏపీకి అన్యాయం జరిగిందని, ఆ పాపం కాంగ్రెస్ పార్టీదేనన్న మోదీ అన్యాయాన్ని చక్కదిద్దడానికి ఏమి చేయబోతున్నారో చెప్పకపోవడాన్ని ఏపీ ప్రజలు అవమానంగా భావిస్తున్నారు. ఇప్పుడు ఏపీ ప్రజల గుండెల్లో ఆయన దైవంగా ఉండిపోతారా? దెయ్యంగా మిగిలిపోతారా? అన్నది తేల్చుకోవలసింది భారతీయ జనతా పార్టీ నాయకత్వమే! ■

> **మీడియాలో వచ్చినవన్నీ ఇవ్వడానికి కేంద్రం నిజంగానే అంగీకరిస్తే రాష్ట్రానికి న్యాయం జరిగినట్టే! అప్పుడు ప్రజలు కచ్చితంగా సంతృప్తి చెందుతారు. నేను ఉపరాష్ట్రపతిని అయిపోయాను, ఇక నాకు రాజకీయాలతో, రాష్ట్రంతో ఏమి పని అనుకోకుండా వెంకయ్యనాయుడు పరిధిని దాటి మరీ రాష్ట్ర ప్రజల కోసం చేస్తున్న కృషిని అభినందించాల్సిందే! ఆయన చొరవ తీసుకోకుండా ఉండి ఉంటే తెలుగుదేశం–బీజేపీ మధ్య బంధం తెగిపోయేది.**

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం
http://www.youtube.com/abntelugutv


చరిత్రను వక్రీకరిస్తే....!

> **1980కి ముందు మనకు ఉత్తర ఆఫ్ఘనిస్థాన్, తుర్క్‌మెనిస్థాన్, తజిక్‌స్థాన్లలో 3000 ఏళ్ళపాటు విలసిల్లిన వక్షునదీ నాగరికత (బిమాక్) గురించి తెలియదు. సింధు నాగరికత గురించిన అనేక కొత్తవిషయాలు గత 60ఏళ్ళలోనే వెలుగులోకి వచ్చాయి. రాజకీయ అవసరాలకోసం మేధాసంపన్నుల రచనలను వక్రీకరిస్తే, చరిత్రహీనులుగా మిగిలిపోతారు.**

'అంబేడ్కర్ దృష్టిలో ఆర్యద్రావిడ వివాదం' శీర్షికతో రాంవిలాస్ శర్మ హిందీ మూలానికి ఆచార్య వి. క్రిష్ణ అనువాదంగా జనవరి 25న ప్రచురితమైన వ్యాసానికి సమాధానం ఇది.

ఆర్యులు బయటినుండి వచ్చారనే వాదన పచ్చి అబద్ధమని, విదేశీయులు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న తప్పుడు ప్రచారమనీ, ఆర్యులు లక్షల ఏళ్ళుగా జంబూద్వీపంలో, అందునా పవిత్ర గంగా తీరంలో నివసిస్తూ, వేద ధర్మాలను పాటించారని, ఆ అపార వేదవిజ్ఞానాన్ని దొంగిలించి విదేశీయులు తమ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకున్నారనే హిందూత్వ వాదుల వాదన కొంతకాలంగా ప్రచారంలో ఉన్నది. రుగ్వేదం క్రీ.పూ. 1200 నాటికి కూర్చబడినా, ఆ తరువాత వచ్చిన ఇతర వేదాలతో కలిపి తరువాతి తరాలకు మౌఖికంగానే దాదాపు వెయ్యేళ్ళపాటు అందజేయబడ్డాయి. ఆ కారణంచేత ఇదమిత్థంగా వేదాలలో రాసి ఉన్న విషయాలు తొలినాటినుండీ అదే విధంగా ఉన్నాయని చెప్పటానికి అవకాశంలేదు. పైగా ఆ తరువాత తాళ, భూర్జ పత్రాలపై వ్రాయబడిన గ్రంథాలను ప్రతీ రెండు, మూడు తరాలకు తిరగరాయవలసి ఉండడంతో, ఎంత ఎక్కువస్థాయిలో మార్పులు జరిగి ఉండవచ్చునో ఊహించుకోవచ్చు. వేదాలు పవిత్రగ్రంథాలు కనుక, మౌఖికంగా అందజేయబడినవి అయినా, వాటిలో మార్పు జరగటం అసంభవం అన్న వాదన ఊకదంపుడు కాక మరేమిటి?

మహాభారతంలో కురువంశస్థులు తాము ఉత్తర కురు అనే పుణ్యభూమి నుండి వచ్చామని చెప్పుకున్నారు. అంటే ఉత్తర ఆఫ్ఘనిస్తాన్, తజికిస్తాన్‌ల మధ్యన ప్రవహిస్తూన్న ఆక్సస్ నదికి ఆవలనుండి వారు వచ్చినట్లుగా భావించాలి. వక్షు నది (నేటి ఆక్సస్) తరువాత వారిచే వరుసగా రసా, అనితభా, కుభా (కాబూల్), క్రము (కుర్రం) నదులు వర్ణించబడ్డాయి. ఈ నదులన్నీ వరుసగా ఉత్తర ఆఫ్ఘనిస్తాన్ నుంచి కింద ఉన్న సప్త సింధు (నేటి పంజాబ్) వరకూ వర్ణించబడ్డాయి. రుగ్వేద కాలం ఆ తరువాత చాలా వందల ఏళ్ళ వరకూ సప్త సింధులో స్థిరపడిన ఆర్యగణాల సరిహద్దు యమునా నది మాత్రమే. ఆ తరువాత చాలా కాలానికి వారు గంగానది ప్రస్తావన తెచ్చారు. అథర్వ వేదం కాలంలో (క్రీ.పూ. 8–9 శతాబ్దాలలో) మాత్రమే వారు గంగకు తూర్పున ఉన్న భూములను వివరించారు. రుగ్వేదం కూర్చబడిన కాలం క్రీ.పూ. 1500 నుండి 1200 వరకూ అని చరిత్రకారులు చెప్తున్నారు. అంటే ఉత్తర ప్రాంత నదుల వర్ణన వారు సప్త సింధులో స్థిరనివాసం ఏర్పరచుకోక పూర్వానివని అర్థమవుతోంది. తొలి ఆర్యులు భారత పశ్చిమోత్తర భూభాగంలోనికి ప్రవేశించిన కాలం క్రీ.పూ. 2000కు ముందు కాజాలదు. ఆకారణంచేత ఆర్యులు ప్రవేశించేనాటికి వారికి సంస్కృతంగాని, వేదాలు గాని ఇంకా రూపుదాల్చలేదు. వారు నేడు వాడుకలో లేని ఇండోయూరోపియన్ భాషను మాట్లాడుతుండేవారని భాషా చరిత్రకారులు భావిస్తున్నారు. ఇండో యూరోపియన్ భాషలయిన నేటి పర్షియన్, ఆర్మేనియన్, రష్యన్, లిథుయేనియన్ తదితర భాషలతో దగ్గరగానూ,



లాటిన్, గ్రీకు భాషలతో దూరపు సంబంధం కలిగి ఉండటం మూలాన ఈ భాష ఆర్యులు దక్షిణ ఆసియాలోకి ప్రవేశించక ముందు నుంచి వాడుకలో ఉండి, బహుశా కాస్పియన్ సముద్ర తీర దక్షిణ, తూర్పు ప్రాంతాలనుండి వారు ఇక్కడకి వచ్చినట్లుగానూ నిర్ధారించారు. పైగా క్రీ.పూ. 1200 కాలంనాటికి రుగ్వేదం కూర్చబడినా, ఆ తరువాత కూర్చబడిన యజుర్, సామ, అథర్వ వేదాలలో వాడబడిన సంస్కృతానికి చాలా వ్యత్యాసాలు కనిపిస్తున్నవి. ఏ భాష అయినా కాలం గడిచిన కొద్దీ మార్పునకు లోనవటం సహజం. తరువాతికాలంలో కూర్చబడిన ఉపనిషత్తులలోనూ, పురాణాలలోనూ మరింత మార్పు కనిపిస్తున్నది. వేదాలలో అనేక సందర్భాలలో అనార్యులైన ఫణులు (సింధు నాగరికతా వాసులు) లింగపూజకులని ఎద్దేవా చేసిన ప్రస్తావనలు ఉన్నాయి. మరి ఆ ఆ తరువాతి కాలంలో శివుడు ఆర్య దైవం ఎట్లా అయ్యాడు? అట్లానే, వేద కాలంలో ఇంద్రుడొక్కడే ఆర్యుల ఆరాధ్య దేవత. ఆ తరువాత అగ్ని, వరుణులను చేర్చారు. మరి నేటి హిందూమతంలోని విష్ణువు, రాముడు ఎక్కడనుండి, ఎప్పుడు పుట్టుకొచ్చారు? అనే విషయాన్ని పరిశీలించవలసి ఉంది. ఆర్యధర్మం ఒకే విధంగా తొలినుండీ నేటి వరకూ చెక్కుచెదరకుండా నిలచిలేదు. ఇందుకు రుగ్వేద శ్లోకాలే తార్కాణం. వేద విజ్ఞానాన్ని సర్వాంతర్యామే స్వయంగా వేద వ్యాసునికి అందిచ్చాడని పురాణాలు ఘోషిస్తున్నాయని ప్రచారం చేస్తున్నారు. అయితే రుగ్వేదంలోని పదవమండలానికి చెందిన 129వ శ్లోకం, నాసదీయ సూక్తంలో వేదకారులు సృష్టికర్తపట్ల తమ మీమాంసను 'యదీ వ దధే, యది వా నః' అంటూ తెలియపరిచారు. అసలు ఈ సృష్టికి ఒక కర్త ఉన్నాడో, లేడోననే మీమాంస సనాతనకాలం నుంచీ చర్చించబడుతూనే ఉన్నది. అనాదిగా భారతీయ తత్వచింతనలో ఆస్తిక, నాస్తికవాదాలు సమాంతరంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఉద్దాలక ఆరుణి, పాయసి, అజితకేశకంబళి ఆదిగా అనేక నాస్తిక తత్వవేత్తలు ఈ విషయాన్నే ఉటంకిస్తూ, 'వేదకారుడైన భగవంతునికే తాను ఉన్నానా, లేదా అనే సందేహం కలిగిందంటే, నిస్సందేహంగా, వేదాలు దైవ ప్రసాదం కాదు. నిజానికి రుగ్వేదం ఆనాడు ఉన్న అనేక తత్వభావనల సంకలనం మాత్రమే!' అనే వాదనను లేవదీశారు. క్రీ.పూ. 800లో, బ్రిహదారణ్యక ఉపనిషత్తులో ఆస్తికుడైన యాజ్ఞవల్క్యునికి, నాస్తిక వాది అయిన ఉద్దాలక ఆరుణికి జరిగిన సంవాదం వివరించబడింది. నాస్తికవాదం వేదాలకంటే ముందుగానే ఈ దేశంలో వేళ్ళూనుకున్నది. మనం సింధునాగరికతగా గుర్తించే 'మెలూహ' నాగరికతలో, 4500 ఏళ్ళక్రితమే భౌతికవాద భావనలు ప్రాచుర్యంలో ఉన్నట్లుగా చారిత్రక ఆధారాలు లభిస్తున్నాయి. ఆ కారణంచేత, నాస్తికవాదం ఈమధ్యనే విదేశాలనుండి దిగుమతి అయిందని చెప్పటం నిరాధారమైన వాదన, ఉద్దేశ్యపూర్వకంగా చేసిన చరిత్ర వక్రీకరణ. భారతదేశంలో ఉన్న ప్రజలంతా ఆర్యులేనని, తెలుపు, నలుపు రంగులు దైవ నిర్ణయమని, దానికి జాతులతో ఏవిధమైన సంబంధం లేదనీ, వనవాసీలు తమ ఇష్ట ప్రకారమే అడవులలో నివసించటానికి ఎంచుకున్నారు కాని, వారు నిజానికి ఆర్యజాతులేనని మరొక ప్రచారం. కులవ్యవస్థ దైవ నిర్ణయమని, కొందరు ఆర్యులు తమంత తాముగా సమాజ సేవకోసమై చర్మకారులుగా, పారిశుధ్య కార్మికులుగా వృత్తులను ఎంచుకుని, తద్వారా దైవ నిర్ణయాన్ని పాటిస్తున్నారనీ, కులవ్యవస్థను అంతం చేయాలనటం దైవ ద్రోహమని ఆర్.ఎస్.ఎస్ ప్రచారం. అంటే కొంతమంది ప్రజలు దైవ నిర్ణయం ప్రకారం నలుపు శరీర ఛాయను పొంది, తమంత తాముగా అంటరానివారుగా, ఊరి ఆవల మాల, మాదిగ పల్లెలలో గర్భ దారిద్ర్యంలో, వివక్షను, అవమానాలను భరిస్తూ, నివసించటానికి ఎంచుకున్నారని వీరి భావన. అగ్రకులాలవారు తెలుపు శరీర ఛాయ, సంపద కలిగి ఉండటం, వారు నిమ్న కులాలవారిని దోపిడీ చేయటం కూడా దైవనిర్ణయమేనా? ముస్లిమ్ దండయాత్రల పర్యవసానంగా భారత దేశంలో కుల వ్యవస్థ పుట్టుకొచ్చిందనీ, అసలు వైదిక ధర్మంలో వర్ణవ్యవస్థ అనేది లేనేలేదని మరొక కథ. సరే అలాగే అనుకుందాం. మరి 7 వేల ఏళ్ళక్రితమే జరిగిందని వీరు చెప్పుకుంటూన్న మహాభారతంలో కర్ణుణ్ణి సూత పుత్రుడని ఎందుకు అవమానించారు? అంటరాని వాడైన ఏకలవ్యుడు ధనుర్విద్య నేర్చుకున్నపాపానికి, అతని బొటనవేలిని ఎందుకు కోయించారు? ముసల్మానుల రాకకు వెయ్యి ఏళ్ళక్రితమే, వేదాలను శూద్రులు, పంచములు వినరాదని, విన్న వారికి కఠిన శిక్షలు విధించాలని మనుధర్మ శాస్త్రంలో ఎందుకు రాసి ఉంది? జన్యుశాస్త్రం తమ సిద్ధాంతాలకు ఊతమిచ్చిందని, భారత దేశంలో ఆర్యులు, ద్రావిడులు అనే భేదం అనేది అసలే లేదని రుజువయిందనీ వీరి సరికొత్త ప్రచారం. అయితే, గత పదేళ్ళుగా జరుగుతూన్న జన్యుపరిశోధనలు ఖచ్చితంగా ఈరకమైన ప్రచారం అంతా వట్టి బూటకమని తేల్చిచెప్పింది.

అంబేడ్కర్ రచనలకు వక్రభాష్యంచెప్పి, ఆయన శూద్రులకు, ఆర్యులకు సాంస్కృతికమైన భేదంతప్ప, జాతిపరమైన విభేదం ఏదీలేదని చెప్పారని ప్రచారం చేయటం హిందూత్వవాదులకు కొత్తకాదు. మహామేధావి అంబేడ్కర్ కాలంలో భారతీయ చారిత్రిక పరిశోధన ప్రారంభ దశలోనే ఉన్నది. ఇక జన్యుపరిశోధన ప్రారంభం కానేలేదు. ఎందుకంటే, నేటి హ్యూమన్ జెనోమ్ ప్రాజెక్టుకు సూపర్ కంప్యూటర్ల అవసరం ఉన్నది. ఆయన వెలువరించిన విషయాలను ఆధారంగా చేసుకుని, నేటి చరిత్ర పరిశోధన, విజ్ఞాన శాస్త్రంలో వచ్చిన కొత్తమార్పులను చేర్చుకుని, మనం మన అవగాహనను పెంచుకోవాలి. ఉదాహరణకు 1980కి ముందు మనకు ఉత్తర ఆఫ్ఘనిస్తాన్, తుర్క్‌మెనిస్తాన్, తజిక్‌స్తాన్‌లలో 3000 ఏళ్ళపాటు విలసిల్లిన వక్షునదీ నాగరికత (బిమాక్) గురించి తెలియదు. సింధునాగరికత గురించిన అనేక కొత్తవిషయాలు గత 60 ఏళ్ళలో వెలుగులోకి వచ్చాయి. రాజకీయ అవసరాలకోసం చరిత్రను ఉపయోగించుకోవడానికై మేధోసంపన్నుల రచనలను వక్రీకరిస్తే, చరిత్రహీనులుగా మిగిలిపోతారు.

■ మర్ల విజయకుమార్
అఖిల భారత అభ్యుదయ వేదిక

'కంది' పోతున్న రైతు

- రంగారెడ్డిలో 113.58 కోట్ల బకాయిలు
- 48 గంటల్లో నగదు జమ ఉత్తి మాటే
- కంది పప్పుకు తగ్గిన ఆదరణ
- తాండూరులో 11 దాల్ మిల్లులు మూసివేత

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కంది రైతులకు కష్టాలు తప్పటం లేదు. కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన కందులకు సకాలంలో డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 48 గంటల్లో నగదు జమ చేస్తామని చెప్పిన మాటల్లో వాస్తవం కనిపించడం లేదు. బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతూ రోజులు, వారాల పాటు నిరీక్షిస్తున్నారు. ఒక్క ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే కంది రైతులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.113.58కోట్లు ఉండడం గమనార్హం. జిల్లాలో 20,236 మంది రైతుల నుంచి 2.42 లక్షల క్వింటాళ్ల కందులను సేకరించారు. వీటికి గాను ఇప్పటి వరకు 16.30 కోట్లు మాత్రమే చెల్లించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో డీసీఎంఎస్, పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 18 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కర్ణాటకలో క్వింటాలుకు రూ.5,500 మద్దతు ధర ఉంది. పైగా ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ.450 బోనస్‌గా ఇస్తోంది. తెలంగాణలో మాత్రం మద్దతు ధర రూ.5450గానే ఉంది. బయటి మార్కెట్లో క్వింటాలుకు రూ.4200 చెల్లిస్తున్నారు. రైతన్నకు క్వింటాలుకు అదనంగా రూ.1,250 వస్తుండడంతో కొనుగోలు కేంద్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. కాగా కొంత మంది వ్యాపారులు కొనుగోలు కేంద్రాల్లో కందులను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో వెలుగు చూడటంతో కొనుగోలు కేంద్రాలను మూసివేయాలని నిర్ణయించారు. వికారాబాద్ జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాలకుగాను ఇప్పటికే ఆరింటిని మూసేశారు. రంగారెడ్డి జిల్లాలో షాద్‌నగర్, ఆమనగల్లు కొనుగోలు కేంద్రాలను సోమవారం మూసివేయనున్నారు. తాండూరు నియోజకవర్గంలో 34,978 హెక్టార్ల విస్తీర్ణంలో కంది సాగు చేశారు. అయితే, ఈ ఏడాది కూరగాయల సాగు పెరగడంతో ప్రజల్లో కందిపప్పుకు ఆదరణ తగ్గింది. ఎగుమతులూ తగ్గిపోయాయి. దీంతో తాండూరులో 16 దాల్‌మిల్లులు ఉండగా 11 మిల్లులు మూతపడ్డాయి.

జిల్లా	సేకరించిన కందులు(క్విం)	చెల్లించింది (రూ. కోట్లలో)	బకాయి
రంగారెడ్డి	43,155	4.34	17.09
వికారాబాద్	1,98,508	1.91	96.26
మేడ్చల్	513	0.41	0.23



షాద్‌నగర్ కేంద్రంలో కందులు అమ్ముతున్న రైతులు

డబ్బుల కోసం బ్యాంకుకు తిరుగుతున్నా..



ఈ సారి ఐదెకరాల్లో కంది సాగు చేశా. 11 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. 20 రోజుల క్రితం షాద్‌నగర్ కందుల కొనుగోలు కేంద్రంలో అమ్మా. ఇప్పటి వరకు డబ్బులు రాలేదు. రోజూ బ్యాంకు, అధికారులు చుట్టూ తిరిగుతున్నాను. - కె.కృష్ణ, నాన్‌దార్‌ఖాన్‌పేట


కేంద్రాలను మరో నెల కొనసాగించాలి



మరో నెల పాటు కంది కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలి. ప్రభుత్వం కందులకు కల్పించిన మద్దతు ధర బాగుంది. బయట మార్కెట్లో కంటే క్వింటాలుకు రూ.1,200 వరకు మిగులుతున్నాయి. - మల్లారెడ్డి, చేవెళ్ల

లక్ష టన్నుల కందులు కొనండి

- కేంద్రానికి మంత్రి హరీశ్‌రావు లేఖ
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో లక్ష మెట్రిక్ టన్నుల కందులను కొనుగోలు చేయాలని మంత్రి హరీశ్‌రావు కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి రాంవిలాస్ పాశ్వాన్‌కు ఆయన లేఖ రాశారు. మద్దతు ధరకే 75,300 మెట్రిక్ టన్నుల కందుల సేకరణకే కేంద్రం అంగీకరించడంపై శనివారం 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన మంత్రి.. తెలంగాణలో 2.84 మెట్రిక్ టన్నుల కందులు సాగయ్యే అవకాశం ఉందని, మద్దతు ధర రూ.5,450 ఉంటే వ్యాపారులు రూ.3,800-రూ.4,200లకే కొంటున్నారని మంత్రి విచారం వ్యక్తం చేశారు. 2017-18లో పండించిన కందుల్లో 25 శాతం కొనుగోలు చేస్తే రైతులు మోసపోతారని చెప్పారు. ప్రతి హెక్టారుకు 10 క్వింటాళ్ల కందులు సాగయ్యాయని నివేదించారు. ఇప్పటికే వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి లక్ష మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేయాలని ప్రతిపాదనలు సమర్పించారని, వీటికి అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని గుర్తు చేశారు. కేంద్ర నోడల్ ఏజెన్సీ నాఫెడ్ ద్వారా కేవలం 75,300 టన్నుల కందులే మద్దతు ధరకు సేకరించాలని నిర్ణయించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే మార్క్‌ఫెడ్, హాకాలు కొనుగోలు కేంద్రాల ద్వారా 1.40 లక్షల టన్నుల మేర కందులు సేకరించారు. ఇంకా క్షేత్రస్థాయిలో కందుల సేకరణ జరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో లక్ష మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేయాలని కేంద్రాన్ని మంత్రి కోరారు.

దశకంఠుడిపై ఊరేగిన నీలకంఠుడు



శ్రీశైలం, ఫిబ్రవరి 10: ప్రముఖ పుణ్య క్షేత్రం శ్రీశైలంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం నీలకంఠుడు భ్రమరాంబ సమేతుడై దశకంఠుడి భుజస్కంధాలపై ఊరేగాడు. ఉభయదేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో భ్రమారంబ మల్లికార్జున స్వామివారికి రావణవాహనసేవ జరిపారు. రావణుడి భుజస్కంధాలను అధిష్ఠించిన ఉత్సవ మూర్తులను క్షేత్ర ప్రధాన వీధుల్లోకి తీసుకువచ్చి అశేషభక్త జనం మధ్య జానపద కళారూపాలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా హారతులు పట్టారు. కార్యక్రమంలో దేవదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు, దేవస్థానం ఈవో భరత్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల ఆరోరోజు ఆదివారం సాయంత్రం మల్లికార్జున స్వామికి పుష్పపల్లకి సేవోత్సవం నిర్వహిస్తారు.

రా.. రమ్మంటున్న 'లకారం'!

- ఖమ్మంలో ట్యాంక్‌బండ్ ముస్తాబు
- నేడు ప్రారంభించనున్న మంత్రులు హరీశ్, తుమ్మల

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 10: ఖమ్మం నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు లకారం ట్యాంక్‌బండ్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. స్వచ్ఛమైన నీరు, అందమైన కట్టలు, పచ్చికబయళ్లు, కుటీరాలు, నడకదారులు.. ఇలా అనేక హంగులతో రా రమ్మని పిలుస్తోంది. మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఈ ట్యాంక్‌బండ్‌ను ప్రారంభించనున్నారు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రూ. 24కోట్లతో నీటిపారుదల అధికారులు లకారం చెరువును అభివృద్ధి చేశారు. నిధులు మంజూరుకు మంత్రి తుమ్మల విశేష కృషిచేశారు. ప్రారంభోత్సవ సందర్భంగా ఆదివారం ఉదయం నగరంలో 5కే రన్‌ను నిర్వహించనున్నారు. రన్‌లో పలువురు సినీతారలు పాల్గొననున్నారు.



ట్యాంక్‌బండ్‌పై ఆహ్లాదకర పరిసరాలు

మిషన్ కాకతీయతో మహర్దశ

లకారం చెరువు అంటే.. ఒకప్పుడు చెత్తాచెదారం, మురుగునీరు, గుర్రపుడెక్కతో కంపుకొట్టేది! ఇప్పుడు మిషన్‌కాకతీయ రూపంలో దాని రూపం మారిపోయింది. 2015 ఏప్రిల్ 25న చెరువు అభివృద్ధి పనులు మొదలయ్యాయి. పూడికను తీసి చెరువుకట్టను అభివృద్ధిచేశారు. మురుగునీటిని పూర్తిగా నిరోధించారు. చెరువు చుట్టూ 15 మీటర్ల వెడల్పుతో సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర కట్టలను నిర్మించారు. చెరువులో పర్యటించడానికి వీలుగా బోటింగ్‌ను ఏర్పాటుచేశారు. లకారం చెరువుకు అనుసంధానంగా ఉన్న ఎన్నెస్పీ ఖమ్మం మేజర్ కాలువ-2ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు అధికారులు పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. రూ. 5 కోట్లతో 4కిలోమీటర్ల మేర కాలువకు మరమ్మతులు చేపట్టి.. దాని ద్వారా లకారం చెరువుకు 800క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

నగరానికి మణిహారం: మంత్రి తుమ్మల

లకారం ట్యాంక్‌బండ్ ఖమ్మం నగరానికి మణిహారంగా నిలుస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం సాయంత్రం ఆయన ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్, నగర మేయర్ డాక్టర్ పాపాలాల్, కలెక్టర్, సీపీతో కలిసి చెరువును సదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువును రూ. 24కోట్లతో అభివృద్ధి చేశామని వివరించారు. అనంతరం బోటు షికారు చేశారు. ఎలక్ట్రికల్ వాహనంలో లకారం చెరువుకట్టలపై ప్రయాణించారు.



అసిస్టెంట్ ప్రొఫెసర్లతో వనజీవి

పర్యావరణంపై ప్రొఫెసర్లకు వనజీవి తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీలో పద్మశ్రీ గ్రహీత వనజీవి రామయ్య శనివారం అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 20నిమిషాలు పాటు పర్యావరణం, మొక్కల పెంపకంపై పాఠాలు బోధించారు. ప్రతి ఒక్కరు మొక్కలునాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఓయూలో హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ అకడమిక్ స్టాఫ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఒరియంటేషన్ తరగతులు నిర్వహిస్తున్న సందర్భంగా పర్యావరణంపై వనజీవి అవగాహన కల్పించారు. - ఖమ్మం రూరల్

90ఎంఎల్ ఇస్తేనే దిగొస్తా..!

- ములుగులో చెట్టెక్కిన మందుబాబు
- గ్లాసును చూసి సర్రున దిగొచ్చిన వైనం

ములుగు, ఫిబ్రవరి 10: కొందరికి మందు నిష.. నషాలానికి ఎక్కితే ఏం చేస్తారో వారికే తెలియదు. శనివారం సాయంత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగులో ఓ మందుబాబు ఏకంగా చెట్టెక్కేశాడు. 90ఎంఎల్ మద్యం పోస్తానంటేనే కిందికి దిగుతానని, మారాం చేశాడు. అరగంటపాటు అతగాడి హంగామా సాగింది. చింతకుంటకు చెందిన కేలోతు బాలు.. భార్యతో కలిసి వారం క్రితం ఏటూరునాగారానికి వెళ్లి అక్కడ మిరపతోటల్లో పనులు చేశాడు. శనివారం కుటుంబసభ్యులతో కలిసి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ములుగులో దిగి మందుకొట్టాడు. ఆ మత్తులో స్థానిక ఏరియా ఆస్పత్రి ప్రహరీ గోడ పక్కనున్న చెట్టును ఎక్కేశాడు. తనకు ఓ 90ఎంఎల్ కొనిస్తేనే దిగివస్తానని, లేదంటే దూకేస్తానని బెదిరించాడు. ఇద్దరు కానిస్టేబుళ్లు అక్కడికి చేరుకొని దింపేందుకు విశ్వప్రయత్నం చేశారు. అయినా తాగుబోతు దిగలేదు. దీంతో ఓ గ్లాసులో మద్యం తెప్పించగా.. అదిచూసిన బాలు సంబరపడుతూ దిగి వచ్చి గుటుక్కున గ్లాసును ఖాళీ చేసేశాడు. అతడిని అదుపులోకి తీసుకున్న కానిస్టేబుళ్లు.. నాలుగు తగిలించి వదిలేశారు.



చెట్టెక్కి బెదిరిస్తున్న బాలు

గంగారం అడవుల్లో ఉపగ్రహ బెలూన్

వాతావరణ పరిస్థితులను పరిశీలించేందుకు హైదరాబాద్ నగరం ఈసీఐఎల్ నుంచి టీఐఎఫ్ఆర్ (టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్) సంస్థ ఆకాశంలోకి వదిలిన ఉపగ్రహ బెలూన్ మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం తిర్మలగండిలోని పొలాల్లో నేలవాలింది. శనివారం రైతు సాంబయ్య తన పొలంలో దీనిని గుర్తించి, బెలూన్‌లోని యంత్రాలపై ఉన్న ఫోన్ నెంబర్ల ఆధారంగా టీఐఎఫ్ఆర్ శాస్త్రవేత్తలకు సమాచారం అందించారు. శాస్త్రవేత్తలు అక్కడకు వెళ్లి బెలూన్‌ను తీసుకున్నారు. - గంగారం



బెలూన్‌ను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సంప్రదాయ పంటలే ఆరోగ్యానికి రక్ష

- డాట్ సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఉమారెడ్డి



ఝరాసంగం, ఫిబ్రవరి 10: సంప్రదాయ పంటలే ఆరోగ్యానికి రక్ష అని వరంగల్ జిల్లా డాట్ సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఆర్.ఉమారెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం మాచ్నూర్ శివారులోని డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీలో శనివారం 19వ పాత పంటల జాతర ముగింపు ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాల్లో అన్ని రకాల పోషకాలు లభిస్తాయని, మన పూర్వీకులు సంప్రదాయ పంటలను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించారని గుర్తు చేశారు. జనాభా పెరుగుతుండడంతో అవసరాలకనుగుణంగా సంకరజాతి విత్తనాలు పెరిగిపోయాయని, చీడపీడల నివారణకు రసాయన పురుగుమందులు వాడడం పరిపాటిగా మారిందని పేర్కొన్నారు.

శ్రీరాంపూర్ ఓసీ-2 విస్తరణకు అనుమతి

- నాలుగు గ్రామాల తరలింపు
- నిర్వాసితులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, పరిహారం
- కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ నిపుణుల కమిటీ అంగీకారం

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కోల్‌బెల్ట్‌లోని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్-2 విస్తరణకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ నిపుణుల కమిటీ అంగీకారం తెలిపింది. 707.63 హెక్టార్లలో ఉన్న ఈ ఓసీని 1604.11 హెక్టార్లలో విస్తరించేందుకు రూ.272.73 కోట్లు అవసరమని ప్రతిపాదనలు సిద్ధంచేశారు. నిర్ణీత షరతులకు లోబడి మైనింగ్‌కు కమిటీ అనుమతినిచ్చింది. ఓపెన్ కాస్ట్-2 విస్తరణ కోసం 276.38 హెక్టార్ల అటవీ భూమి, 1161 హెక్టార్ల వ్యవసాయ భూమి, 20.15 హెక్టార్ల చెరువులు, 5.24 హెక్టార్ల రోడ్లను సేకరించనున్నారు. తాళ్లపల్లి, సింగాపూర్, గుత్తేదార్‌పల్లి, దుబ్బపల్లి గ్రామాలను తరలించనున్నారు. నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లతోపాటు పరిహారం అందించనున్నారు. పునరావాసం కోసం రూ.72.13 కోట్లను ఖర్చుచేయనున్నారు. మైనింగ్‌కు 276 హెక్టార్ల అటవీ భూమి వాడుకోనుండటంతో ఆ స్థానంలో మైనింగ్ ప్రక్రియ పూర్తయ్యేదాకా 840 హెక్టార్ల భూమిలో అడవులను పెంచనున్నారు. మరోవైపు కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల పరిధిలోని తాండూరు మండలం అబ్బాపూర్‌లో బెల్లంపల్లి ఓపెన్‌కాస్ట్-2 విస్తరణ ప్రతిపాదనలపై ఈ నెల 15,16 తేదీల్లో కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ నిపుణుల కమిటీ చర్చించనుంది. ఆ తర్వాత ఆచార్య జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘన్‌పూర్ మండలం బస్వారాజుపల్లిలోని కాకతీయ ఖని-3(ఫేజ్-1) కోల్‌మైనింగ్ ప్రాజెక్టును కూడా పరిశీలించనుంది. ఇదే జిల్లాలోని భూపాలపల్లిలో కాకతీయ ఖని-5(భూగర్భ గని) విస్తరణ ప్రతిపాదనలపైనా కమిటీ చర్చించనుంది.

ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- బండారు దత్తాత్రేయ

పెద్దపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్న ప్రాజెక్టుల నిర్మాణాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ డిమాండ్ చేశారు. శనివారం పెద్దపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టుకు రూ.1600 కోట్లు కేటాయిస్తే, 15 శాతం మాత్రమే పనులు చేశారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.760 కోట్లు కేటాయిస్తే రూ.102 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని అన్నారు. రైతుల ఆత్మహత్యలు ఆగినప్పుడే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని చెప్పారు.

ముగ్గురు రైతుల ఆత్మహత్య

దుగ్గొండి/కామేపల్లి/సిరిసిల్ల, ఫిబ్రవరి 10: అప్పుల బాధతో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలం కేశవపురం గ్రామానికి చెందిన దుగినాల బాబురావు(50) తన మూడు ఎకరాలతో పాటు మరో 3 ఎకరాలు కౌలు తీసుకొని పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేశాడు. పంటకు తెగుళ్లు రావడంతో రూ.3లక్షల వరకు అప్పులు మిగిలాయి. దీంతో మనస్తాపానికి గురైన బాబురావు శుక్రవారం వ్యవసాయ బావిలో దూకాడు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం రాజీవ్‌నగర్ తండాకు చెందిన భూక్య నాగేశ్వరరావు(22) తన ఎకరన్నర పొలంతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చి, బొప్పాయి, పుచ్చ సాగు చేశాడు. సాగులో నష్టాలు వచ్చి, అప్పులు తీర్చలేక పురుగు మందు తాగాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన రైతు గోపాల్(37) సాగులో నష్టాలు వచ్చి, కుటుంబ పోషణ భారం కావడంతో ఆరేళ్ల క్రితం అప్పు చేసి ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. ఏడాది గడవకముందే దుబాయ్ ప్రభుత్వం గోపాల్‌ను జైలులో పెట్టింది. ఆయనను స్వదేశానికి రప్పించడానికి కుటుంబీకులు తిరిగి అప్పులు చేశారు. గోపాల్ స్వదేశానికి రాగానే ఐదు ఎకరాలు కౌలు తీసుకుని వ్యవసాయం చేశాడు. అయినా నష్టాలు వచ్చి, సుమారు రూ.8 లక్షలు అప్పులు పేరుకుపోవడంతో పొలంలో ఉరేసుకున్నాడు.

పింఛన్ కోసం వెళ్లి వృద్ధుడి మృతి

ఆర్మూర్, ఫిబ్రవరి 10: పింఛన్ డబ్బుల కోసం వెళ్లి ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన శనివారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగింది. పట్టణంలోని అశోక్ నగర్‌కు చెందిన ముకుంద్ రాజన్న (68) పింఛన్ డబ్బుల కోసం ఐడీఎఫ్‌సీ కౌంటర్‌కు వెళ్లాడు. హఠాత్తుగా బీపీ పెరగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతిచెందాడు.

మనుగొండలో కుల బహిష్కరణ

- ఉద్యోగాలు వచ్చినందుకు రూ. 10లక్షలు కట్టాలని హుకుం

గీసుగొండ, ఫిబ్రవరి 10: ఉద్యోగాలు సాధించుకున్నందుకు ప్రతిగా లక్షల రూపాయలు కుల సంఘానికి కట్టాలని కుల పెద్దలు హుకుం జారీ చేశారు! కట్టలేమన్నందుకు ఏకంగా మూడు కుటుంబాలను కులం నుంచి బహిష్కరించారు. ఈ ఘటన వరంగల్ రూరల్ జిల్లా గీసుగొండ మండలం మనుగొండలో జరిగింది. గ్రామంలోని దళిత వర్గానికి చెందిన తుప్పరి సమ్మయ్య, సాంబయ్య, రాములుకు ఇటీవల వీఆర్‌ఏ ఉద్యోగాలు వచ్చాయి. దీనికిగాను రూ.10 లక్షలు కుల సంఘానికి ఇవ్వాలని కుల పెద్దలు డిమాండ్ చేశారు. ఇందుకు ఒప్పుకోకపోవడంతో తమను కులం నుంచి బహిష్కరించారని, పైగా పంటపొలాన్ని చెడగొట్టారని బాధితులు విలేకరులకు తెలిపారు. తమ కుటుంబాలతో ఎవరైనా మాట్లాడితే రూ.500 జరిమానా, 5చెప్పు దెబ్బలు తప్పవని తీర్మానించారని వాపోయారు. బాధితులు శనివారం గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కులస్థులను సీఐ విచారించారు.

కేసీఆర్, తుమ్మల చిత్రపటాలకు క్షీరాభిషేకం



బోదకాలు వ్యాధిగ్రస్తులకు పెన్షన్‌తోపాటు అవసరమైన మందులు ఇతర వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్టు ప్రకటించిన సీఎం కేసీఆర్, మంత్రి తుమ్మల చిత్రపటాలకు ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల కేంద్రంలో క్షీరాభిషేకం చేశారు. శనివారం టీఆర్ఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బాలసాని, బోదకాలు వ్యాధిగ్రస్తులు తదితరులు పాల్గొన్నారు. - తిరుమలాయపాలెం

సుందిళ్ల బ్యారేజిని సందర్శించిన నేహాల్



తెలంగాణ నీటిపారుదల శాఖ బ్రాండ్ అంబాసిడర్ కోట నేహాల్ శనివారం పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని గోదావరినది వద్ద కొనసాగుతున్న సుందిళ్ల బ్యారేజీ, అన్నారం పంపుహౌస్‌లను పరిశీలించాడు. ప్రాజెక్టు నిర్మాణం పనులపై నేహాల్ అడిగిన ప్రశ్నలకు అధికారులు అవగాహన కల్పించారు. నేహాల్ వెంట తల్లిదండ్రులు రజనీ, హన్మంతరావు, డీఈలు భద్రయ్య, వెంకటయ్య, మధుసూదన్, వర్క్ ఏజెన్సీ ప్రతినిధులున్నారు. - మంథని

ఐఐటీ-హెచ్‌లో దుమ్మురేపిన ఎలాన్ ఫెస్ట్

సంగారెడ్డి జిల్లా కందిలోని హైదరాబాద్ ఐఐటీలో శనివారం ఎలాన్- ఎన్ విజన్ ఫెస్ట్ ఘనంగా జరిగింది. యువతీయువకులు తమ ఆటపాటలతో దుమ్మురేపారు. రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు వచ్చి ఫెస్ట్‌లో సందడి చేశారు. సాంకేతిక విప్లవంలో వస్తున్న మార్పులపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్ ఎడిషన్ ఇండియా-2018 హిప్‌హప్' పేరుతో ప్రదర్శించిన నృత్యాలు ఉర్రూతలూగించాయి. మహిళల భద్రతపై నిర్వహించిన పోటీల్లో హైదరాబాద్ బిట్స్, చైనాకు చెందిన మరో గ్రూప్ తలపడగా.. బిట్స్ విజయం సాధించింది. ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో విజయవాడ వీఆర్ సిద్దార్థ కళాశాల విద్యార్థుల ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. సాయంత్రం ప్రముఖ గాయకుడు కైలాస్‌ఖేర్ తన ఆటపాటలతో ఐఐటీ ప్రాంగణాన్ని మార్మోగించారు. - కంది



వేడుకలో విద్యార్థుల సందడి

పెరగనున్న పట్టణాల 'హోదా'

- స్పెషల్ గ్రేడ్‌గా నల్లగొండ
- అదే బాటలో మరికొన్ని

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జనాభా, వనరులు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలే ప్రామాణికంగా రాష్ట్రంలోని పలు మునిసిపాలిటీల హోదా (గ్రేడ్) పెరగనుంది. ఇందులో భాగంగానే.. నల్లగొండ పురపాలక సంఘాన్ని గ్రేడ్-1 నుంచి స్పెషల్ గ్రేడ్‌కు మారుస్తూ.. ప్రభుత్వం ఇటీవల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇదే క్రమంలో.. మరికొన్ని పట్టణాలు స్పెషల్ గ్రేడ్‌కు మారనున్నాయి. సిద్దిపేట, మహబూబ్‌నగర్‌లు ప్రస్తుతం స్పెషల్ గ్రేడ్‌లో ఉన్నాయి. ఈ రెండింటినీ త్వరలో కార్పొరేషన్లుగా మార్చేందుకు మునిసిపల్ పరిపాలన, పట్టణ అభివృద్ధి శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఫస్ట్ గ్రేడ్‌లో ఉన్న మునిసిపాలిటీలను జనాభా, రెవెన్యూ ప్రాతిపదికన స్పెషల్ గ్రేడ్‌గా మార్చనున్నారు. ఈ జాబితాలో మిర్యాలగూడ, సూర్యాపేట, సంగారెడ్డి, ఆదిలాబాద్, జగిత్యాల, కొత్తగూడెం, మంచిర్యాల ఉండే అవకాశాలున్నాయి. కిందిస్థాయి గ్రేడ్‌లలో ఉన్న మునిసిపాలిటీల్లో కొన్నింటి హోదాను పెంచే యోచనలో సర్కారు ఉన్నట్లు సమాచారం. పట్టణాల్లో శివారు గ్రామాల విలీన ప్రక్రియ ముమ్మరమైన నేపథ్యంలో.. 40కి పైగా కొత్త మునిసిపాలిటీలు/నగర పంచాయతీలు అభివృద్ధి చెందనున్నాయి.

నేడు వరంగల్‌లో 'రెడ్డి శంఖారావం'

కాళోజీ జంక్షన్, ఫిబ్రవరి 10: రెడ్డి సామాజిక యువతకు ప్రభుత్వాలు చేయూతనందించాలనే డిమాండ్‌తో ఆదివారం 'రెడ్డి శంఖారావం' పేరుతో బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్లు.. రెడ్డి శంఖారావం ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి గోపు జయపాల్ రెడ్డి తెలిపారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ సభ ప్రారంభమవుతుందన్నారు. మంత్రులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు డీకే అరుణ, కిషన్‌రెడ్డి, గుజ్జుల రామకృష్ణారెడ్డి, దొంతి మాధవరెడ్డి, పలు పార్టీల నేతలతో పాటు.. పలువురు ఈ సభలో పాల్గొంటారని వివరించారు.

ఫణీంద్ర సేవలు అందుతున్నాయి: ప్రభుత్వం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : స్టేట్ ఇన్నోవేషన్ అధికారిగా 3నెలల క్రితం నియామకమైన ఫణీంద్ర సామ సేవలు ప్రభుత్వానికి అందుతున్నాయని ఐటీశాఖ శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. 'పత్తాలేని ఫణీంద్ర' శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన ప్రభుత్వం.. తెలంగాణ ఉన్నత విద్యామండలి పలు వర్సిటీల్లో ప్రారంభించనున్న ఇంక్యుబేటర్లకు కావాల్సిన సహకారాన్ని ఫణీంద్ర అందిస్తున్నారని వివరణ ఇచ్చింది. స్టేట్ ఇన్నోవేషన్ సెల్‌ను విస్తృతం చేసేందుకు, జీఈఎస్‌లో మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చిన ఉమెన్ ఆంత్రప్రెన్యూర్ హబ్‌ను మార్చిలో ప్రారంభించేందుకు సిబ్బంది నియామకాల ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొంది. ఈ పనులను ఫణీంద్ర పర్యవేక్షిస్తున్నారని ఐటీశాఖ తెలిపింది.

వైద్య విధాన పరిషత్ కమిషనర్‌గా శివప్రసాద్



హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌గా డాక్టర్ బి.శివప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న వాకాటి కరుణను ప్రభుత్వం ఆ బాధ్యత నుంచి తప్పించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్‌గా నిర్వహిస్తున్న అదనపు బాధ్యతల నుంచీ ఆమెను తప్పించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్‌గా సోనీ బాలాదేవికి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రభుత్వం జీవోలో పేర్కొంది.

పంటినొప్పితో ఇంట్లోనే కేసీఆర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పంటినొప్పికి చికిత్స కోసం ఢిల్లీ వెళ్లిన సీఎం కేసీఆర్ శనివారం ఇంటికే పరిమితమయ్యారు. తుగ్లక్ రోడ్డులోని అధికారిక నివాసంలో ఉండి విశ్రాంతి తీసుకున్నారు. రెండు రోజుల్లో ఆయన చికిత్స తీసుకుంటారని అధికార వర్గాలు తెలిపాయి. మరో నాలుగైదు రోజులు కేసీఆర్ ఢిల్లీలోనే ఉండే అవకాశం ఉందని ఓ అధికారి చెప్పారు.

లోక్ అదాలత్‌లలో 28 వేల కేసులు కొలిక్కి

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశం మేరకు తెలుగు రాష్ట్రాల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లలో సుమారు 28వేల కేసులకు పరిష్కారం చూపారు. రూ.58 కోట్ల మేర కక్షిదారులకు పరిహారం చెల్లింపులు జరిగాయి. ఏపీలో అన్ని మండల, జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో 18వేల కేసులు పరిష్కరించినట్లు ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథార్టీ సభ్యకార్యదర్శి పీవీ రాంబాబు తెలిపారు. తెలంగాణవ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లలో 10వేల కేసులకు పరిష్కారం చూపినట్లు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథార్టీ సభ్యకార్యదర్శి బీఆర్ మధుసూదన్‌రావు తెలిపారు. హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ నేతృత్వంలోని జస్టిస్ యూ దుర్గాప్రసాదరావు, జస్టిస్ షమీమ్ అఖ్తర్, జస్టిస్ పీ కేశవరావు, జస్టిస్ ఎం.గంగారావు, జస్టిస్ జీవీ సీతాపతి(రిటైర్డ్) న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాలు 119 కేసులకు పరిష్కారం చూపాయి.

ఫార్మా-డీ కోర్సుకు ఎన్‌వోసీ ఇవ్వండి: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అదనపు కోర్సులకు అనుమతించరాదని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందనే కారణాలు చూపుతూ జేఎన్‌టీయూహెచ్ ఎన్‌వోసీ నిరాకరించడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. సైదాబాద్‌లోని బొజ్జం నర్సింహులు మహిళా ఫార్మసీ కాలేజీలో 'ఫార్మా-డీ' కోర్సు ప్రారంభించేందుకు జేఎన్‌టీయూహెచ్ ఎన్‌వోసీ నిరాకరించడంతో ఆ సంస్థ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు ధర్మాసనం సదరు కాలేజీకి ముందుగా ఎన్‌వోసీ జారీచేయాలని స్పష్టం చేసింది. అనంతరం ఆ సంస్థ ఏఐసీటీఈ, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ) అనుమతి పొందితే... జేఎన్‌టీయూ(హెచ్) నిబంధనల ప్రకారం కళాశాలలో తగిన మౌలిక సదుపాయాలున్నాయో లేవో తనిఖీలు చేసి నిర్ధారించుకోవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది.

5 కిలోల గంజాయి పట్టివేత.. నలుగురు అరెస్ట్

రఘునాథపాలెం ఫిబ్రవరి10: కారులో అక్రమంగా తరలిస్తున్న 5కిలోల గంజాయిని శనివారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం పోలీసులు పట్టుకున్నారు. గంజాయితో పట్టుబడిన సూర్యాపేటకు చెందిన అనంతుల మనోజ్, పుల్లూరి శివరాం, దోన్‌వాన్ చక్రధర్, విన్నపురెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీళ్లు ఏపీ శివారు డొంకరాయి నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు.

మద్యం మత్తులో తల్లిపై అత్యాచార యత్నం

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 10: వావివరసలు, వయసుతో సంబంధం లేకుండా చిన్న పిల్లల నుంచి ముసలివాళ్ల వరకు కామాంధులు ఎవర్నీ విడిచిపెట్టడం లేదు. ఇటీవల సిద్దిపేట జిల్లాలో ఓ వ్యక్తి అత్తపై అత్యాచారం చేయగా.. తాజాగా ఓ వ్యక్తి మద్యం మత్తులో కన్నతల్లిపైనే అత్యాచారయత్నం చేశాడు. ఈ దారుణ ఘటన ఖమ్మంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఖమ్మం అర్బన్ మండలం కైకొండాయిగూడేనికి చెందిన ఓ కుటుంబం కొంతకాలంగా ఖమ్మం శ్రీనగర్‌కాలనీలో నివాసం ఉంటోంది. మద్యానికి బానిసైన వారి పెద్ద కుమారుడు(25) జులాయిగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో.. విచక్షణ కోల్పోయి కన్నతల్లిపైనే అత్యాచారం చేయబోయాడు. ఆ తల్లి కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి రక్షించారు. బాధితురాలి భర్త ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కేటీఆర్, నాయిని తదితరులు

ఇంత మంచి సీఎం దొరకడం

మన పూర్వజన్మ సుకృతం: కేటీఆర్

సికింద్రాబాద్/హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటు పడుతున్న ముఖ్యమంత్రిగా కేసీఆర్ లభించడం మన పూర్వజన్మ సుకృతమని మునిసిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో పలుచోట్ల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు నాయిని, తలసాని, ఎమ్మెల్యే సాయన్నలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం వంటి పథకాలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా దేశ ప్రజల అభిమానాన్ని చూరగొంటున్న సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర ప్రజలు కూడా మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు. రూ.18 వేల కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న 2.76 లక్షల డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లలో హైదరాబాద్‌లోనే లక్ష ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఈ ఏడాదిలో అన్ని ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయించి, లబ్ధిదారులకు అందజేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. కంటోన్మెంట్ మీదుగా 2 స్కైవేల నిర్మాణానికి సహకరించాలని కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరానన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో సైనిక మెడికల్ సైన్స్ కాలేజీ కోసం ప్రయత్నిస్తామన్నారు.

బడి సమస్యలపై

హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు లేఖ

సాంఘిక శాస్త్రం పాఠం స్ఫూర్తితో ఇద్దరు విద్యార్థినుల చొరవ

- కోర్టు జోక్యంతో కదిలిన ప్రభుత్వ యంత్రాంగం
- రూ.11 లక్షలతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు





పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు, (ఇన్‌సెట్‌లో)లేఖ పంపిన విద్యార్థినులు రశ్మిత, వైష్ణవి

కోరుట్ల, ఫిబ్రవరి 10: బడిలో ఉన్నది ఒకటే మూత్రశాల. తాగేందుకు నీళ్లు లేవు. మధ్యాహ్న భోజనం వండేందుకు షెడ్డు లేదు. భోజనం చేసేందుకు హాల్ లేదు. తరగతి గదుల్లోనో.. చెట్లకిందనో తినాల్సిన పరిస్థితి. సరిపడా తరగతి గదులు కూడా లేవు. ఇలా బడిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకొనేందుకు ఆ ఇద్దరు విద్యార్థినులకు ఓ పాఠం స్ఫూర్తిగా నిలిచింది. తొమ్మిదో తరగతి సాంఘిక శాస్త్రంలోని 'బాలల హక్కులు-పరిరక్షణ' పాఠం చదివారు. బడిలో విద్యార్థుల సమస్యలపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాస్తే పరిష్కరిస్తారని తెలుసుకున్నారు. తమ పాఠశాలలో సౌకర్యాల లేమి, ఎదుర్కొంటున్న ఇబ్బందులను అంశాల వారీగా పొందుపరుస్తూ జనవరి 11న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు రశ్మిత, వైష్ణవిలు చూపిన చొరవ ఇది. విద్యార్థినులు రాసిన లేఖపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వెంటనే స్పందించారు. కోరుట్ల జడ్పీహెచ్ఎస్‌లో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలంటూ 15 రోజుల క్రితం విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిని ఆదేశించారు. అంతే.. ప్రభుత్వ యంత్రాంగం ఆగమేఘాలపై కదిలింది. జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు పాఠశాలకు వచ్చి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రూ.8 లక్షలతో 4 అదనపు తరగతి గదుల నిర్మాణం, రూ.1.5 లక్షలతో బోరు, మోటారు, రూ.1.5 లక్షలతో బాలికల మూత్రశాలల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేసి విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శికి పంపించారు. వీటన్నింటికి వారంలో నిధులు మంజూరయ్యే అవకాశాలున్నాయి. తమ బడిలో సమస్యలు తీరనున్నాయని తెలిసి అక్కడి విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం



"పాఠశాల అభివృద్ధికి రూ.11 లక్షల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తాం. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

- నరేశం, ఎంఈవో, కోరుట్ల

న్యాయవ్యవస్థపై నమ్మకం కుదిరింది

"మా పుస్తకంలో ఉన్న పాఠం చదివి సమస్యలు గురించి వివరిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాం. ఆయన మా లేఖకు స్పందించి మా పాఠశాలలో వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. మా కష్టాలు త్వరలో తీరనున్నాయి. న్యాయవ్యవస్థపై మాకు మరింత నమ్మకం కుదిరింది"

- రశ్మిత, వైష్ణవి, 9వ తరగతి విద్యార్థినులు



పట్టికను విడుదల చేస్తున్న మంత్రి పద్మారావు

మద్యం రేట్ల కోసం

యాప్

- ప్రారంభించిన మంత్రి పద్మారావు

హైదరాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మందుబాబులు మద్యం రేట్లను ఇక మొబైల్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. రాష్ట్రంలో వినియోగిస్తున్న 880 రకాల బ్రాండ్ల రేట్లను తెలుసుకునేందుకు యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఫుల్ బాటిల్, హాఫ్ బాటిల్, 180ఎంఎల్ బాటిల్ ధరలూ తెలుసుకునే వెసులుబాటు కల్పించారు.జిల్లాల్లో ఎక్కువగా అమ్ముడయ్యే 25 రకాల బ్రాండ్ల ధరలను వైన్‌షాపుల వద్దే తెలుసుకునేందుకు చార్టులను ఏర్పాటు చేస్తున్నారు. మొబైల్ యాప్(తెలంగాణ లిక్కర్ ప్రైస్ యాప్)ను, 25 బ్రాండ్లతో ఏర్పాటు చేసిన చార్టులను శనివారం ఎక్సైజ్ మంత్రి టి.పద్మారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొన్ని మద్యం షాపుల్లో ఒక్కో క్వార్టర్ సీసాపై రూ.10-20 ఎక్కువ చేసి విక్రయిస్తున్నారని, ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకే యాప్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. దుకాణదారులు ఎమ్మార్పీ ఉల్లంఘనలకు పాల్పడితే వినియోదారుడు వెంటనే వాట్సాప్ ద్వారా(7989111222) లేదా టోల్ ఫ్రీ నెంబర్ 18004252523కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. షాపు యజమాని మొదటిసారి తప్పు చేస్తే రూ.2 లక్షల వరకు, రెండోసారి రూ.2.5 లక్షల వరకు ఫైన్ వేస్తామని, అప్పటికీ మార్పు రాకుంటే వైన్‌షాపును 7 రోజులు సీజ్ చేస్తామన్నారు.

అక్రమ కట్టడాలపై జరిమానా ఎంత?

- అసెంబ్లీ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీలో చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లోని అక్రమ కట్టడాలపై ఎంత జరిమానా విధించాలనే అంశంపై అసెంబ్లీ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చర్చించింది. కమిటీ చైర్మన్ చెన్నమనేని రమేశ్ అధ్యక్షతన శనివారం కమిటీ సమావేశం జరిగింది. అక్రమ కట్టడాలపై ఎంత మేరకు జరిమానా విధించాలనే విషయంతోపాటు అందుకుగాను ప్రస్తుతం ఉన్న నియమావళికి ఏమైనా సవరణలు చేయాల్సిన అవసరం ఉందా? అనే విషయమై కమిటీ చర్చించిందని తెలిసింది.

100 ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు

- మంత్రి వర్గ ఉపసంఘం వేసిన ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీని రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. రాష్ట్రంలో వంద నియోజకవర్గాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. వ్యవసాయ శాఖ మంత్రి పోచారం చైర్మన్‌గా మంత్రులు ఈటల, హరీశ్, కేటీఆర్, జూపల్లి సభ్యులుగా కమిటీ ఏర్పాటైంది. తెలంగాణ పరిస్థితులను అధ్యయనం చేసి, 3నెలల్లోగా ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీపై ప్రభుత్వానికి కమిటీ నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఈ మేరకు సీఎస్ ఎస్కే జోషి శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి ఉంటారు.

దేశాభివృద్ధిలో 'కాళేశ్వరం' కీలకం!

హైదరాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు దేశాభివృద్ధిలో కీలకం కానుందని 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని సవాలుగా తీసుకున్నదని ప్రశంసించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్రానికి వచ్చిన 15వ ఆర్థిక సంఘం సభ్యులు శనివారం కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. రూ.88 వేల కోట్లతో చేపట్టిన కాళేశ్వరానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లను కేటాయించాలని కూడా కోరింది. ఈ నేపథ్యంలో ఆర్థిక సంఘం సభ్యులు ప్రాజెక్టును సందర్శించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ బృందం వెంట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాగునీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులున్నారు. ఈ సందర్భంగా మెహతా నేతృత్వంలోని బృందం అన్నారం బ్యారేజీ పనులు, రంగనాయక సాగర్ వద్ద టన్నెల్ పనులను పరిశీలించింది. సండ్లాపూర్‌లోని రంగనాయకసాగర్ వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, కాళేశ్వరం నమూనా మ్యాప్‌ను మెహతా పరిశీలించారు. సిద్దిపేట జిల్లాలోని కోమటిబండలో మిషన్ భగీరథలో భాగంగా నిర్మించిన పంప్‌హౌస్, నీటి సరఫరా విధానాన్ని పరిశీలించారు. ఎల్లంపల్లి నుంచి కుళాయి ద్వారా ప్రతి ఇంటికీ నీటిని అందించే విధానంతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు గురించి జోషి, రామకృష్ణారావు ఆయనకు వివరించారు. అరవింద్ మెహతా కాళేశ్వరం ప్రాజెక్టు పనుల వేగాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఈ ప్రాజెక్టు ఒక నమూనా కానుందని చెప్పారు. మిషన్ భగీరథ లాంటి కార్యక్రమాలను ఇతర రాష్ట్రాల అధికారులు కచ్చితంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. మరో 4నెలల్లో ఆర్థిక సంఘం ప్రతినిధుల మంతా మళ్లీ వచ్చి పరిశీలిస్తామని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల ద్వారానే వ్యవసాయ వృద్ధి సాధ్యమవుతుందన్నారు. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో పురోగతి నమోదవుతుందని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం ముఖ్య ఉద్దేశం కూడా సమగ్ర గ్రామీణాభివృద్ధేనన్నారు. కాళేశ్వరానికి జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాల రీత్యా ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని చెప్పారు. మూడు షిఫ్టుల్లో కొనసాగుతున్న పనుల వేగాన్ని బట్టి చూస్తే.. వచ్చే వానాకాలం నాటికి ప్రాజెక్టు మొదటి మైలు రాయిని దాటుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని పేర్కొన్నారు. ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేస్తే నిర్మాణ వ్యయం పెరగదని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల ప్రత్యేక శ్రద్ధ, పట్టుదల వల్ల దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రాజెక్టు నిర్మాణం వేగంగా సాగుతుందని సీఎస్ జోషి వివరించారు. రాష్ట్రంలోని అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టుల కోసం అప్పులు చేస్తున్నామని ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు వివరించారు. రాష్ట్రం మిగులు బడ్జెట్‌తోనే ఉన్నప్పటికీ నిధులను ఆచితూచి ఖర్చు పెడుతున్నామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల సేకరణ, వాటిని వ్యయం చేస్తున్న తీరు పట్ల ఆర్థిక సంఘం సంతృప్తిని వ్యక్తం చేసిందని తెలిపారు. రాష్ట్రాల్లో నిధుల వినియోగంపై తనిఖీల్లో భాగంగానే ఆర్థిక సంఘం బృందం రాష్ట్రంలో పర్యటిస్తోందని చెప్పారు.



భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు వివరాలను అరవింద్ మెహతాకు వివరిస్తున్న సీఎస్ జోషి

కస్తూర్బా టీచర్లపై వివక్ష

- సమాన పనికి సమాన వేతనాలివ్వాలి: నాగేశ్వర్
- యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఎస్ఈ ముట్టడి
- పాఠశాల విద్య డైరెక్టర్‌తో టీచర్ల భేటీ రసాభాస
- కిషన్ తీరుపై ఉపాధ్యాయ సంఘాల నిరసన



ఆందోళన నిర్వహిస్తున్న కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీలు), పట్టణ గురుకుల పాఠశాల (యూఆర్ఎస్)ల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందని ప్రొఫెసర్ నాగేశ్వర్ ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలంటూ శనివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (డీఎస్ఈ) కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ కార్యక్రమానికి నాగేశ్వర్ హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్టు విధానమే ఉండదని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్.. ఆ విధానాన్నే కొనసాగించడం ద్వంద్వనీతికి నిదర్శనమన్నారు. కాగా రాష్ట్రంలో 475 కేజీబీవీలు, 29 యూఆర్ఎస్‌లు.. సర్వశిక్షా అభియాన్ పథకంలో భాగంగా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని, దీనిలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరూ కాంట్రాక్టు పద్ధతిపైనే విధులు నిర్వహిస్తున్నారని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడు సీహెచ్.రాములు అన్నారు. వేసవి సెలవుల్లో వేతనం చెల్లించడం లేదని, సెలవుల మంజూరు విషయంలోనూ వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటానికి దిగాల్సిన పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వమే కల్పించిందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు.

ఉపాధ్యాయ సంఘాల ఆందోళన..

పాఠశాల విద్యలో సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించేందుకు శనివారం ఏర్పాటు చేసిన సమావేశం రసాభాసగా మారింది. సమావేశం ప్రారంభానికి ముందు పాఠశాల విద్య డైరెక్టర్ జి.కిషన్ తీరును తప్పుబడుతూ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఆందోళనకు దిగడంతో ప్రారంభం కాకుండానే వాయిదా పడింది. శనివారం సాయంత్రం ఉపాధ్యాయ సంఘాలు సమావేశానికి సిద్ధమవుతుండగా.. పాఠశాలలకు ఉపాధ్యాయులు రెగ్యులర్‌గా హాజరుకావడం లేదని పేర్కొన్న జిరాక్స్ ప్రతులు వారి చేతికి అందాయి. దీంతో తమను పిలిచి.. అవమానించడం తగదంటూ నిరసన వ్యక్తం చేశారు. మంచీ, చెడూ రెండూ ఉన్నాయని, రెండింటినీ పరిశీలించాలని డైరెక్టర్ సూచించినా శాంతించలేదు. ఎజెండాలో లేని అంశాన్ని ముందుకు తీసుకురావడం భావ్యం కాదని మండిపడ్డారు. ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దాంతో ఉపాధ్యాయులకు హక్కులతో పాటు బాధ్యతలు ఉన్నాయని, అందరం కలిసికట్టుగా వ్యవస్థ బాగుకోసం కృషి చేద్దామని జి.కిషన్ సూచించారు. రాజ్‌భవన్ స్కూలు వార్షికోత్సవం ఉందని, ప్రొటోకాల్ ప్రకారం తాను ఆ కార్యక్రమంలో ఉండాలని చెప్పి.. మరోసారి సమావేశమవుదామని పేర్కొన్నారు. ఈ నెల 15న తిరిగి సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు.

మాపై ఇంత చిన్నచూపా?

- రొటీన్ ఇంక్రిమెంట్లు డీఈవోల చేతికా?
- ప్రభుత్వ ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధం
- మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల ఆవేదన

కొమురవెల్లిరూరల్, ఫిబ్రవరి 10 : గోరు చుట్టుపై రోకలి పోటు అన్నట్టుంది మోడల్ స్కూల్ టీచర్ల పరిస్థితి. ఇప్పటికే పలు సమస్యలపై పోరాడుతున్న వీరిని.. ప్రభుత్వ తాజా ఉత్తర్వులు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 194 ఆదర్శ పాఠశాలలుండగా, 3,123 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరికి సంబంధించిన వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్ మంజూరు ప్రక్రియ ఇప్పటి వరకు పాఠశాల డీడీవోగా వ్యవహరించే ప్రిన్సిపాల్ ఆధీనంలో ఉండేది. తాజాగా ఈ నెల 3వ తేదీన ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం.. ఇంక్రిమెంట్ మంజూరు ప్రక్రియ డీఈవో పరిధిలోకి మారింది. దీనిపై మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. కేవలం ఆదర్శ పాఠశాలలకే ఈ తరహా ఉత్తర్వులు జారీ చేయడాన్ని తప్పుపడుతున్నారు. తమపై ప్రభుత్వం చిన్నచూపు చూపిస్తోందని ఆరోపిస్తున్నారు. జీవో 40, 70 ప్రకారం ఇంక్రిమెంట్లు, సెలవులు సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్ పరిధిలోనే ఉండాల్సి ఉన్నా, అందుకు విరుద్ధంగా ఉత్తర్వులు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. డీఈవోల పరిధిలోని ప్రధానోపాధ్యాయుల ఇంక్రిమెంట్ల ప్రక్రియ పూర్తి కావడానికే నెలల కొద్దీ సమయం పడుతుందని, ఇక ఉపాధ్యాయులను కూడా చేర్చితే మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది, ఇంటర్ తరగతుల్లో తక్కువ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయుల నుంచి వివరణలు అడుగుతున్నారని, భవిష్యత్తులో చర్యలు తీసుకోవడానికి వీలుగా తాజా ఉత్తర్వులు జారీ చేశారని ఆరోపిస్తున్నారు.



మోడల్‌స్కూల్స్ ఏడీ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆదర్శ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధి

ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

ప్రభుత్వం మాపై శీతకన్ను వేసింది. ఇప్పటికే సమస్యలతో సతమతమవుతున్నాం. రొటీన్‌గా జరిగే ఇంక్రిమెంట్లను డీఈవో పరిధిలోకి చేర్చడం అన్యాయం. తక్షణమే ఈ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి.

- యాకమల్లు, 'మోడల్ టీచర్ల' అధ్యక్షుడు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
ఆదివారం • 11 ఫిబ్రవరి 2018



హీరోయిన్‌పై హీరోకి ప్రేమ ఉంటుంది.
అయితే... అది కెమెరా ముందు మాత్రమే!
మరి, కెమెరా వెనుక?
స్నేహం మాత్రమే ఉంటుందంటున్నారు హీరో తరుణ్!
'నువ్వే కావాలి', 'నువ్వులేక నేను లేను', 'నువ్వే నువ్వే'...
ప్రతి ఒక్కరూ 'ప్రేమికుడు అంటే నువ్వే తరుణ్' అనేలా ఆయన చాలా ప్రేమకథల్లో నటించారు. విజయాలు సాధించారు. కానీ, కొన్నాళ్లుగా ప్రేక్షకులకు, విజయాలకు దూరంగా... విజయం సాధించాలనే ప్రయత్నానికి దగ్గరగా... సినిమాలు చేస్తున్నారు. ఆయన ప్రయాణంలోని ఈ ఎత్తు పల్లాల గురించి, జయాపజయాల గురించి నవ్య'తో పంచుకున్నారు.

లవర్‌బాయ్‌నే!

..నిజజీవితంలో కాదు!

చాలారోజుల తర్వాత ప్రేమకథతో మళ్లీ ప్రేక్షకుల ముందు కొస్తున్నారు! ఆల్మోస్ట్ రీ-ఎంట్రీ లాంటిదే! వెల్‌కమ్ బ్యాక్!

థ్యాంక్స్ అండీ. అఫ్‌కోర్స్... నేను చేసినవన్నీ ప్రేమకథలే. 'ఇది నా లవ్‌స్టోరి' కూడా ప్రేమకథే.

తరుణ్‌కి గ్యాప్ రావడానికి కారణం ఏంటి? చిత్రపరిశ్రమా... ప్రేక్షకులా... తరుణా?

తప్పకుండా చిత్రపరిశ్రమ అయితే కాదు. ప్రేక్షకులు ఎందుకు అవుతారు? వాళ్లు ఎప్పటికీ కాదు. నేను నేనుగా ఏం చేయలేదు. ప్రత్యేకంగా కారణాలు అంటూ ఏం లేవు. సరైన కథలు రాకపోవడం... వచ్చినవి మెటీరియలైజ్ కాకపోవడం... కొన్ని చిత్రాలు ఆలస్యం కావడం... వంటి పరిస్థితుల వల్ల ఆలస్యమైంది. నేను రిలాక్స్ కావాలని గ్యాప్ తీసుకోలేదు. అలా జరిగిందంతే. ఇప్పుడీ 'ఇది నా లవ్‌స్టోరి' సక్సెస్ కానివ్వండి. వరుసగా సినిమాలు చేస్తా. ఇటీవల కాలేజీలకు టూర్ వెళ్లా. అక్కడ స్టూడెంట్స్ కూడా ఇదే ప్రశ్న అడుగుతున్నారు. 'గ్యాప్ ఎందుకు వచ్చింది?' అని. 'ఈ సినిమా సక్సెస్ చేయండి! వరుసగా సినిమాలు చేస్తా' అన్నాను.

మీ తర్వాత వచ్చిన హీరోలు మిమ్మల్ని దాటుకుని వెళ్తుంటే ఎలా అనిపించేది?

ఎప్పుడూ ఆలోచించలేదు. చెడుగానూ అనుకోలేదు. మన సినిమాలు మనవి... వాళ్ల సినిమాలు వాళ్లవి. వేరే హీరోల సినిమాలు విజయాలు సాధిస్తే మంచిదే కదా! అన్నీ విజయాలు సాధిస్తే చిత్రపరిశ్రమకు మంచిది. కొత్త దర్శకులు వస్తారు. ఇంకా కొత్త కథలు వస్తాయి. నాకు ఈ అవకాశం వచ్చింది... హ్యాపీ. ఇది కాకపోతే... ఇంకొకటి వస్తుంది. ఫ్లాపులు అందరికీ ఉంటాయి. పది ఫ్లాపుల తర్వాత ఒక్క హిట్ వస్తే... అన్నీ సవ్యంగా జరుగుతాయి. అటువంటి సందర్భంలోనే నేను ఉన్నాననుకుంటా.

తరుణ్ కెరీర్ క్లోజ్ అయ్యిందనే కామెంట్స్ ఆమధ్య వచ్చాయి. అవి విన్నప్పుడు మీకు ఎలా అనిపించింది?

నిజం ఏదో మనకు తెలుసు కదా! సినిమాలు చేయకున్నా... అంతకు ముందు రెండు సినిమాలు ఫ్లాప్ అయినా ఇటువంటి మాటలు వినిపిస్తాయి. వాటిని పట్టించుకుంటే ఏదీ చేయలేం. అవన్నీ విని నిరాశలో కూర్చుంటే ఏమవుతుంది? ఏం కాదు. ఎటువంటి ఉపయోగం ఉండదు. ఈ చెవితో విని ఆ చెవితో వదిలేయాలి.

టీనేజ్‌లో స్టార్‌డమ్ చూసిన మీరు ఎంతో నమ్మి చేసిన సినిమాలు ఫ్లాప్ అయ్యినప్పుడు... మీ క్రేజ్ తగ్గుతున్నప్పుడు.. బాధగా ఉండదా?

ఏ సినిమా హిట్టయినా... ఫ్లాప్ అయినా... హీరో, దర్శకుడు, నిర్మాతలది బాధ్యత. మా ముగ్గురికీ నచ్చితేనే సినిమా మొదలవుతుంది కదా! హిట్టయితే నాది... ఫ్లాపయితే నాది కాదు అని చెప్పలేం. ప్రతి సినిమా కథ నచ్చే నేను సినిమా చేశా. ఫ్లాపయినప్పుడు 'ఇది ఎందుకు ఫ్లాప్ అయ్యింది?' అని ఆలోచించుకుంటా. తప్పులను సరి చేసుకోవడానికి ప్రయత్నిస్తాం. మళ్లీ పునరావృతం కాకుండా చూసుకుంటా. హిట్టయితే... 'బాగుంది. ప్రేక్షకులకు ఇటువంటివి నచ్చుతున్నాయి. మన దగ్గరికి వచ్చే కథల్లో ఇటువంటి అంశాలు ఎందులో ఉన్నాయి' అని చూస్తా. సినిమాలనే కాదు... ఎవరు ఏ పని చేసినా తప్పు ఒప్పులు చూసుకుంటారుగా! సినిమా ఫ్లాపయితే కొన్ని రోజులు బాధపడతాం. తర్వాత కొత్త సినిమా మొదలవ్వగానే దానిపై పూర్తిగా దృష్టి పెడతా. అది హిట్టయితే... వెల్ అండ్ గుడ్. లేదంటే... తర్వాత సినిమా బాగా చేయాలని ప్రయత్నిస్తా. బాధపడుతూ కూర్చుంటే... జీవితంలో ఒక్కచోటే ఆగిపోతాం. మనకు ఏది వచ్చినా ముందుకు వెళ్తుండాలి.

మీ ప్రయాణంలో 'నేను ఈ తప్పు చేశా!' అనిపించిన సందర్భం ఏమైనా?

పర్టిక్యులర్‌గా దీని వల్ల తప్పు జరిగిందని కాదు. మనం నమ్మి చేసిన చిత్రం ప్రేక్షకులకు నచ్చలేదు. కథలో మెయిన్ పాయింట్, లేదా అందులో కామెడీ, లేదా మరొకటో ప్రేక్షకులకు నచ్చక సినిమా ఆడలేదు. కొన్ని కథలు విన్నప్పుడు నాకు బాగా నచ్చాయి. సినిమాలు బాగా వచ్చాయి. బహుశా... అవి యాక్షన్ జానర్ కావడం వల్ల ప్రేక్షకులకు నచ్చలేదని అనిపిస్తుంది. నేను ఇటువంటివి చేస్తే ప్రేక్షకులకు నచ్చడం లేదు. మనకు యాక్షన్ జానర్ సూట్ కావడం లేదని అనుకున్నా.

మీకు ఏదైనా కొత్తగా చేయాలనుకుంటే లవర్‌బాయ్ ఇమేజ్ అడ్డొస్తోందా? ఆ ఇమేజ్ మీకు డ్యామేజ్ చేసిందా?


లేదు. లవర్‌బాయ్ ఇమేజ్ నా కెరీర్‌ని డ్యామేజ్ చేసిందనుకోవడం లేదు. మొన్న టూర్‌కి వెళ్ళొచ్చిన తర్వాత అసలు అనుకోవడం లేదు. కాలేజీలకు వెళ్లగానే... స్టూడెంట్స్ అందరూ 'లవర్‌బాయ్... లవర్‌బాయ్...' అని అరిచారు. అబ్బాయిల కంటే అమ్మాయిల నుంచి ఎక్కువ స్పందన లభించింది. ప్రేక్షకుల్లో ఇంకా మన ఇమేజ్ అలాగే ఉంది. వరుసగా సినిమాలు చేయడమే కరెక్టు అనుకున్నా. నా కమ్ బ్యాక్‌కి 'ఇది నా లవ్‌స్టోరీ' సరైన సినిమా అనుకుంటున్నా. మంచి పూర్తిస్థాయి ప్రేమకథా చిత్రమది. ఇదివరకు నేను చేసిన సినిమా తరహాలో మాత్రం ఉండదు. కొత్తగా ఉంటుంది.

ప్రేమకథల్లో నటించడమే సేఫ్ అనుకుంటున్నారా?

నేనెప్పుడూ ఈ జానర్ సినిమాలే చేయాలనుకుని చేయలేదు. ఈ సినిమా తర్వాత కామెడీ చేద్దాం... తర్వాత హారర్ చేద్దాం... అని ఎప్పుడూ ప్లాన్ చేయలేదు. అలా ప్లాన్ చేస్తే.. మన దగ్గరకి ఏ కథ వచ్చినా నచ్చదు. మన మైండ్‌లో ఉన్న కథ కోసమే ఎదురుచూస్తాం. ఏ కథ వచ్చినా నేను నటించడానికి సిద్ధమే. కానీ, నా దగ్గరకు వచ్చే కథల్లో 95 శాతం ప్రేమకథలే ఉంటున్నాయి. అందుకని ఎక్కువగా ప్రేమకథల్లో నటిస్తున్నా. ప్రేమకథలు నాకు బాగా సూటవుతాయని అనుకుంటున్నా. ఐయామ్ కంఫర్టబుల్ విత్ లవ్‌స్టోరీస్.

ఎంతకాలం ఒకే తరహా సినిమాలు చేస్తారు?

ఇప్పుడు యాక్షన్ జానర్ సినిమాలు చేస్తున్న హీరోలు ఎప్పుడూ యాక్షన్ సినిమాలే చేస్తున్నారు కదా! లవ్‌స్టోరీస్



చేసేవాళ్లు చేస్తారు. చేయకూడదని నేనేమీ అనడం లేదు. ప్రేమకథలు చేసినన్ని రోజులు చేద్దాం. మంచి విభిన్నమైన కథలు వస్తే అన్ని రకాల చిత్రాలూ చేయడానికి నేను సిద్ధమే. నా బాడీ లాంగ్వేజ్‌కి, ఏజ్‌కి సూటయితే తప్పకుండా చేస్తా. విడుదలైన తర్వాత ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారనేది వేరే విషయం. ఉదాహరణకు... 'బాహుబలి' వంటి కథ నేను చేద్దామనుకుంటే కుదురుతుందా? అది ప్రభాసే చేయాలి. నాకు వచ్చిన కథల్లో 'ది బెస్ట్' సెలక్ట్ చేసుకుంటున్నా.

ఈ గ్యాప్‌లో ఏం చేశారు?

గ్యాప్ అంటే.. ఖాళీగా ఏం చేయకుండా ఇంట్లో కూర్చోలేదు. 'వేట' తర్వాత 'ఇది నా లవ్‌స్టోరీ' చేశా. ఈ సినిమా కొంచెం ఆలస్యమైంది. గతేడాది సెప్టెంబర్‌కి సినిమా సిద్ధమైంది. కానీ, లాస్ట్ సినిమా విడుదల ఎప్పుడు? ఈ సినిమా విడుదల ఎప్పుడు? అని మాత్రమే ఆలోచిస్తారు. ఇదే జరిగింది! 'ఇది నా లవ్‌స్టోరీ'లో మూడు గెటప్స్ ఉండడంతో మధ్యలో వేరే సినిమా చేయడం కుదరలేదు. మధ్యలో కొన్ని కథలు విన్నా. ఇది విడుదలైన రెండుమూడు వారాల్లో ప్రకటిస్తా.

మీరు ఫ్లాపుల్లో ఉన్నప్పుడు మీ అమ్మగారు సలహాలు ఇచ్చే వారా?

అమ్మ గానీ... నాన్నగారు గానీ... ఏ రోజూ కూడా "ఇలాంటి సినిమా చెయ్! ఈ సినిమా చెయ్! ఈ సినిమా ఎందుకు చేశావ్?" అని ఎప్పుడూ అడగలేదు. తప్పకుండా కుటుంబంలో సినిమాల గురించి చర్చ ఉంటుంది. 'ఆ కథ బాగుంది. నీకు ఇలాంటి కథ, క్యారెక్టర్ బాగుంటాయి' అని మాటల్లో మాటగా చెబుతారు తప్ప... నాపై ఒత్తిడి తీసుకురావడం వంటివి ఉండవు. కూర్చోబెట్టి క్లాసులు పీకడాలు అసలే లేవు. నా ఇంటర్వ్యూలు చదివి, సినిమా వేడుకల్లో నా స్పీచ్ విని తప్పులుంటే చెబుతారు. 'నువ్వు ఆ మాట మాట్లాడకూడదు' అంటారు. అంతకు మించి ఏం ఉండదు. గ్యాప్ వచ్చినప్పుడు ఏం జరిగిందో... ఇప్పుడు ఏం జరుగుతోందో వాళ్లకు తెలుసు. 'వేట' తర్వాత ఆరేడు నెలలు గ్యాప్ వచ్చింది. అప్పుడు చాలా కథలు విన్నా. సరైన కథలు దొరకలేదు. ఏదో ఒకటి చేయడం కన్నా ఏదీ చేయకపోవడమే ఉత్తమం!

మీ కథల్లో, మీ వ్యవహారాల్లో మీ అమ్మగారి జోక్యం ఎక్కువ ఉంటుందని మీపై ఒక కంప్లయింట్. ఆవిడ ఒప్పుకుంటేనే మీరు సినిమా చేస్తారని అంటుంటారు?

ఎప్పుడూ అలా జరగలేదు. ఆ కంప్లయింట్ ఎందుకు వచ్చిందంటే... స్టార్టింగులో 'నువ్వే కావాలి' వచ్చింది. సూపర్ డూపర్ హిట్. నేను బాలనటుడిగా చేసినా... చిత్ర పరిశ్రమ గురించి నాకు పెద్దగా అవగాహన లేదు. 'నువ్వే కావాలి' హిట్‌తో వరుసగా పది, పదిహేను కథలు వచ్చాయి. అప్పుడు నాకు 17 ఏళ్లు. ఆ వయసులో నేను ఎన్ని కథలు వినను? ఏం నిర్ణయాలు తీసుకోను? అప్పుడు మమ్మీ ఏం చేసేవారంటే... చిన్న చిన్న దర్శక-రచయితలు, కొత్తవాళ్లు చెప్పే కథలు వినేవారు. అసలు వచ్చే వ్యక్తి దర్శకుడా? రచయితా? ఏం తెలీదు. అటువంటివి కొన్ని విన్నారు. అందులో బాగున్నవి నాకు చెబితే... నేను వినేవాణ్ణి. అదే... పెద్ద పెద్ద దర్శకులు వస్తే అమ్మ జోక్యం చేసుకునేవారు కాదు. నేనే కథలు వినేవాణ్ణి. ఆ తర్వాత ఏ రోజూ నా కథలు, సినిమాల విషయంలో జోక్యం చేసుకోలేదు. నా ఆడియో వేడుకలకు కూడా అమ్మ రారు. నేను బాలనటుడిగా ఉన్నప్పట్నుంచి షూటింగ్ స్పాట్‌కి వచ్చేవారు కాదు. కేవలం బర్త్‌డే ఫంక్షన్స్‌కి వస్తారు. ఎప్పుడైనా నేనే సరదాగా కథలు చెబుతా. వాళ్ల అభిప్రాయాలు చెబుతారు. 'ప్రియమైన నీకు' దగ్గర నుంచి ఇప్పటివరకూ అమ్మ జోక్యం నా కెరీర్‌లో లేదు.

లవ్ ఎఫైర్స్ వల్ల మీ కెరీర్ ఎఫెక్ట్ అయ్యిందంటారు?

ఎవరిపై పుకార్లు రాలేదు చెప్పండి!? ఏ హీరో హీరోయిన్‌పై రాలేదు. నా నుంచే కాదు కదా... నా కంటే ముందు నుంచీ చిత్రపరిశ్రమలో పుకార్లు ఉన్నాయి. ఇప్పుడూ వస్తున్నాయి. చిత్రపరిశ్రమలో అవి సహజం. వాటివల్లే నా కెరీర్ ఎఫెక్ట్ అయ్యిందనుకోను. ఏదైనా పుకారు వస్తే... దానివల్ల సినిమా చూడకూడదని ఎవరూ అనుకోరు.

ఇండస్ట్రీలో ఎంత కామన్ అయినా అమ్మగారు బాధపడి ఉంటారేమో!

తప్పకుండా ఏ తల్లిదండ్రులకు అయినా బాధగా ఉంటుంది. వాళ్లు లైట్ తీసుకున్నారని చెప్పను. 'చూసుకో... ఇలా వస్తున్నాయి. జాగ్రత్తగా ఉండు' అని చెబుతుంటారు. ఆ పుకార్లకు ఫుల్‌స్టాప్ పడింది, లక్కీగా ఇప్పుడు ఏ హీరోయిన్‌తోనూ నాకు ముడి పెట్టలేదు.

హీరోయిన్లతో మీరు ఫ్రెండ్లీగా ఉంటారా? ఎవరెవరితో మీకు మంచి స్నేహం ఉంది?

యా... ఫ్రెండ్లీగా ఉంటా! ప్రియమణి, జెనీలియా, రిచా, శ్రియ, త్రిష... నాకు మంచి స్నేహితులు. అప్పుడప్పుడూ కలుస్తుంటాం. పుట్టినరోజులు వస్తే.. ఒకరికొకరు విష్ చేసుకుంటాం. హీరోల గురించి అందరికీ తెలుసు. తెలుగు హీరోలందరం కలిసి క్రికెట్ ఆడుతూ కనిపిస్తూనే ఉంటాం. మమ్మల్ని (హీరోల్ని) క్రికెట్ కలిపింది.

జయాపజయాల్లో మీకు నైతిక మద్దతు ఇచ్చిన స్నేహితుడు ఎవరు?

సినిమా హిట్టయ్యిందని... ఫ్లాపయిందని... ఎప్పుడూ స్నేహితులతో సినిమాల గురించి మాట్లాడను. మా మధ్య సినిమా డిస్కషన్లు చాలా తక్కువ వస్తాయి. ఏ సినిమా చేస్తున్నాం? ఇప్పుడు ఏ సినిమా షూటింగ్ జరుగుతోంది? దర్శకుడు ఎవరు? హీరోయిన్ ఎవరు? వంటి మాటలే ఉంటాయి. అంతకు మించి డిస్కషన్ ముందుకు వెళ్లదు. ఉదయం నిద్రలేచిన తర్వాత నుంచి సినిమాల్లోనే ఉంటాం. మళ్లీ స్నేహితుల దగ్గర కూడా ఇదేనా? అనే ఫీలింగ్. 'నువ్వు ఫ్లాపుల్లో ఉన్నావ్? ఇప్పుడీ సినిమా చేస్తే మంచిది?' వంటి టాపిక్ ఎవరి దగ్గరా రాదు. లక్కీగా రాలేదు కూడా! అలాగని, నేను గానీ, ఒకరికరు గానీ సలహాలు ఇవ్వడం వంటివి ఉండదు. ఎవరి జీవితం వాళ్లది. ఒకరికి చెప్పడానికి మనం ఎవరం? 120 సినిమాలు చేసిన శ్రీకాంత్‌గారికి ఎలాంటి సినిమాలు చేయాలో చెప్పే అనుభవం నాకు ఉందా? ఇక, నేను బాగా నిరాశలోకి వెళ్లి, ఎవరికీ కనపడకుండా ఇంట్లో కూర్చుని బాధ పడితే నైతిక మద్దతు కావాలేమో! హ్యాపీగా బయట తిరుగుతున్నా. అందరినీ కలుస్తున్నా.

మీ సమస్యలను ఎవరితో పంచుకుంటారు?

ఏవైనా సమస్యలు ఉంటేగా.. ఒకరితో పంచుకోవడానికి! చిన్న చిన్నవి ఏవైనా వస్తే కుటుంబ సభ్యులతో పంచుకుంటా. బయటకు ఏదీ వెళ్లదు.

ఇంట్లోవాళ్లతో చెప్పుకోలేని సమస్యలు ఉంటే? ఇండస్ట్రీ బయట మీకు స్నేహితులు ఉన్నారా?





సబితా ఇంద్రారెడ్డిగారి అబ్బాయి కర్ణ, జానారెడ్డి గారి అబ్బాయి జయదేవ్, తర్వాత రఘు, స్కూల్ నుంచి నాతో స్నేహంగా ఉంటున్న శశి, క్రికెట్‌లో పరిచయమైన గిరి... చాలా మంది ఉన్నారు. ఏది అయినా... రెండు సెకన్లు అండీ! ఇప్పుడు ఏదైనా సమస్య వచ్చినప్పుడు హీరో శ్రీకాంత్ గారికి తెలిస్తే వెంటనే కాల్ చేస్తారు. 'ఏంటి బాబాయ్ అలా వచ్చిందా? ఏం కాదులే... కంగారు పడకు' అంటారు. లక్కీగా... ఒకరి దగ్గరకు వెళ్లి నేను బాధపడి చెప్పుకునే సందర్భాలు రాలేదు. భవిష్యత్తులో రాకూడదని కోరుకుంటున్నా.

నటన కాకుండా మీకు వ్యాపారం బాగా చేస్తారట! రియల్ ఎస్టేట్‌లో డబ్బులు బాగా సంపాదించారట?

మొన్న విశాఖలోనో... తిరుపతిలోనో... ఇలాంటి ప్రశ్న అడిగారు. 'నేను ఏ వ్యాపారం చేశానో.. ఎందులో కోట్లు సంపాదించానో చెప్పండి' అనడిగా. నాకు ఏ వ్యాపారమూ లేదు. నేను ఏదీ చేయడం లేదు. పదేళ్ల క్రితం స్నేహితులతో కలిసి రెస్టారెంట్ పెట్టాను. సరదాగా చేశామది. ఏడు, ఎనిమిది నెలలకు అందులోంచి బయటకు వచ్చేశా. అది తప్ప నేను ఏదీ చేయలేదు. విశాఖలో మాకు కొన్ని ఆస్తులున్నాయి. అవి చూసుకోవడానికి నాన్నగారు వెళితే... రియల్ ఎస్టేట్ వ్యాపారం అన్నారు. అంత వ్యాపారం చేసేవాడిని అయితే... సినిమాలే చేస్తా కదా! నా సినిమాల్ని నేనే నిర్మించుకుంటాను కదా!


డ్రగ్స్... ఇట్ వజ్ ఎ బ్యాడ్ ఫేజ్!



ఇటీవల ఇండస్ట్రీని కుదిపేసిన డ్రగ్స్ వివాదంలో మీ పేరు వచ్చింది కదా!

నా పేరు చూసి ఇండస్ట్రీలో ప్రముఖులు, ప్రేక్షకులు ఎలా షాకయ్యారో... నేనూ అలాగే షాకయ్యా. నా పేరు ఎందుకు వచ్చిందో నాకూ తెలీదు. ఇప్పుడు దాని గురించి మాట్లాడితే... వేరే అర్థాలు వస్తాయి. బహుశా... గతంలో నేను రెస్టారెంట్ వ్యాపారం చేయడం వల్ల వచ్చిందేమో! ఆ సమస్యపై నా స్పందన ఏంటో? ముందు మన 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' ఛానల్‌లోనే చెప్పా. సరిగ్గా ఆ సమయంలో 'ఇది నా లవ్‌స్టోరీ' టీజర్‌ను నాగార్జున గారు విడుదల చేశారు. రెండు పాటలు విడుదల చేశాం. సినిమాకి మంచి క్రేజ్ వస్తోంది. ఈ టైమ్‌లో ఇలా జరిగిందేంటి? అనుకున్నాం. ఇట్ వజ్ ఎ బ్యాడ్ ఫేజ్. బట్, స్మాల్ ఫేజ్. ఇప్పుడు నా దృష్టి అంతా సినిమాలపైనే ఉంది.

త్రివిక్రమ్‌ను అడగను! చెబుతా!



'నువ్వే నువ్వే'తో దర్శకుడిగా పరిచయమైన త్రివిక్రమ్ ఇప్పుడు స్టార్. ఆయనతో పాటు గతంతో మీరు పని చేసిన స్టార్ దర్శకులతో మళ్లీ సినిమాలు చేయలేదు!

శీను (త్రివిక్రమ్)తో తప్పకుండా చేయాలి. 'నువ్వే నువ్వే' తర్వాత మళ్లీ చేద్దామని అనుకున్నాం. కమిట్‌మెంట్ ఉంది. కానీ, తను వరుసగా పవన్‌కల్యాణ్, మహేశ్‌బాబు రేంజ్‌లో చేస్తున్నాడు. నేను రెండు సక్సెస్‌లు కొట్టి తనను సినిమా చేయమని అడిగితే బాగుంటుంది. ఇటీవల రెండు మూడు వారాల క్రితం శీనుని కలిశా. సరదాగా మాట్లాడుకున్నాం. నేను సక్సెస్‌లు కొట్టిన తర్వాత, చేయమని అడగను! 'నాతో సినిమా చెయ్' అని చెప్తా! ఎందుకంటే... అతనితో నాకు అంత చనువు ఉంది. పైగా, మేమిద్దరం కలిసి చేస్తున్నామంటే ప్రేక్షకుల్లో అంచనాలు కూడా భారీగా ఉంటాయి. భారీ బడ్జెట్ అవుతుంది కూడా.

ప్రియమణి కారు గురించి అడిగేది



హీరో, హీరోయిన్స్ మధ్య గాసిప్స్ సహజమే. ఆర్తీ అగర్వాల్ చనిపోయింది కాబట్టి... ఆమె గురించి మాట్లాడడం కరెక్ట్ కాదు. మంచిది కూడా కాదు. అవి వచ్చిన తర్వాత నేను పెద్ద పెద్ద నిర్మాతలు కేఎల్ నారాయణ, సురేశ్‌బాబు వంటివారితో సినిమాలు చేశా. అది అనుకోవడమే గానీ... సమస్య కాదు. ఫ్లాపులు కెరీర్‌పై కొంచెం ప్రభావం చూపించాయి. అది ఒప్పుకుంటాను. ఒక్కటే వయసు కావడం వల్ల కొంతమంది హీరోయిన్లలో సన్నిహితంగా మెలుగుతాం. మనకు తెలుసు... మనం ఎంత కరెక్ట్‌గా ఉంటామనేది. ప్రతీ హీరోయిన్‌తో ఎఫైర్ అంటగట్టారు. ప్రియమణికి నేను ఇన్నోవా కారో... బెంజ్ కారో ఇచ్చానని రాశారు. మేమిద్దరం పెళ్లి చేసుకోబోతున్నామన్నారు. ఇప్పుడు తను చక్కగా వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. అప్పట్లో ఒక సారి ఆ అమ్మాయి ఫోన్ చేసి 'ఏది? నా కార్ ఏది?' అని జోక్ చేసింది. ఇండస్ట్రీలో ఇవన్నీ కామనే. వస్తుంటాయి... ఏం చేస్తాం చెప్పండి!

రోజూ పూజ చేస్తా!

మీకు భక్తి బాగా ఎక్కువట!

బాగా ఎక్కువ. 100 శాతం పూజ చేయకుండా ఇంట్లో నుంచి బయటకు అడుగుపెట్టను. ఇంట్లోనే కాదు... అవుట్‌డోర్ షూటింగులకు వెళ్లినా పూజ కిట్ తీసుకువెళతా. విదేశాల్లో ఉదయం మూడు, నాలుగు గంటలకు ఎంత చలి ఉన్నా నిద్రలేచి పూజ చేస్తా. మినిమమ్ 30 మినిట్స్ లేదా 45 మినిట్స్ పూజ చేస్తా.

భక్తి ఎప్పుడు మొదలైంది?

చిన్నప్పట్నుంచి ఉంది. పది, పన్నెండేళ్లుగా పూజ చేయడం ప్రారంభించా. వెంకటేశ్వరస్వామి నా ఇష్టదైవం. ఆయనే మెయిన్. మొన్న కూడా తిరుపతి వెళ్లినప్పుడు తెల్లవారుజామున సుప్రభాత సేవ దర్శనం చేసుకుని టూర్ ప్రారంభించాం. మామూలుగా దేవుణ్ణి నమ్మడం ఒకటి. బాగా నమ్మడం ఒకటి. నేను బాగా నమ్ముతా. ఈ పది, పన్నెండేళ్లలో మిస్ అయితే... మూడు నాలుగు రోజులు మిస్ అయ్యుంటానేమో! అదీ తీవ్రమైన జ్వరం వల్ల, స్నానం చేయలేని స్థితిలో ఉండి!

దేవుణ్ణి నమ్మడం వల్ల మీ జీవితంలో అద్భుతాలు ఏమైనా జరిగాయా?

మనం కోరుకునేది కోరుకుంటాం. జరిగేది జరుగుతుంది. అయినా... వెంకటేశ్వరస్వామి బాగా పరీక్షిస్తాడు. మనం కోరుకున్నది ఇస్తాడు. కానీ, ఎవరికి ఏది ఎప్పుడు ఇవ్వాలో అప్పుడే ఇస్తాడు. కొంచెం మెల్లగా ఇస్తాడు. 'ఇది నా లవ్‌స్టోరీ' మొదలైన దగ్గర్నుంచి టీమ్‌తో తిరుపతి వెళ్దామనుకున్నా. నేను, దర్శకులు, నిర్మాతలు వేర్వేరుగా వెళ్లాం. అందరం కలిసి వెళ్లడం కుదరలేదు. చివరికి, ఇటీవల తిరుపతిలో ఒక చిన్న షాట్ చేయాల్సివచ్చింది. ఆయన దగ్గరకు వస్తే గానీ గుమ్మడికాయ కొట్టనివ్వలేదు. ఇలాంటివి చాలా జరిగాయి.

ఇప్పుడు మీకు సింగిలేనా?

యస్... ఐయామ్ సింగిల్. (నవ్వుతూ...) రెడీ టు మింగిల్!

గాళ్‌ఫ్రెండ్ కోసం సెర్చ్ చేస్తున్నారా?

అదేం లేదు. సింగిల్‌గా, హ్యాపీగా ఉన్నాను. (నవ్వుతూ...) ఎందుకొచ్చిన గొడవ!

ఇన్నేళ్లలో మీకు నచ్చిన అమ్మాయి ఎవరూ తారసపడలేదా?

మనసును టచ్ చేసినవాళ్లు ఎవరూ లేరు. ఎక్కడైనా ఎప్పుడైనా ఎవరైనా అమ్మాయిని చూసి బాగుందని అనుకున్నానేమో గానీ... నెక్స్ట్ లెవల్‌కి వెళ్లలేదు.

ఎనీ చైల్డ్‌హుడ్ క్రష్?

చిన్నప్పుడు రమ్యకృష్ణగారు. ఇప్పుడు నయనతార. రమ్యకృష్ణగారంటే నాకు ఎంత అభిమానమో కృష్ణవంశీకి చెప్పాను కూడా! ఈ మధ్యకాలంలో అయితే నయనతారే. కానీ, ఆవిడ ఎక్కువ తెలుగు సినిమాలు చేయడం లేదు.

మరి, లవర్‌బాయ్ తరుణ్ రానున్న లవర్స్‌డేను ఎలా సెలబ్రేట్ చేసుకోబోతున్నాడు?

(నవ్వుతూ...) నేను సినిమాల్లోనే లవర్‌బాయ్. నిజ జీవితంలో కాదు. ఈ ప్రేమికుల రోజు (ఫిబ్రవరి 14)న నేను నటించిన తాజా సినిమా 'ఇది నా లవ్ స్టోరీ' విడుదలవుతోంది. థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి సినిమా చూడాలనుకుంటున్నా. అంతకు మించి ప్లాన్స్ ఏం లేవు. ఐయామ్ సింగిల్ అండీ! సింగిల్‌గా ఉంటే ఏముంటుంది!

ఇప్పుడూ మీ లవర్‌బాయ్ ఇమేజ్ అలాగే ఉందనుకుంటున్నారా?

అవును. 200 శాతం నా ఇమేజ్ ఏమాత్రం పోలేదనుకుంటున్నా. బట్, ప్రేక్షకులు నన్ను మిస్సయ్యారు. నేనూ వాళ్లను మిస్సయ్యాను. వాళ్లల్లో క్రేజ్ అయితే తప్పకుండా ఉంది. 'మళ్లీ ఎక్కువ గ్యాప్ ఇవ్వద్దు' అని వాళ్లు చెబుతున్నారు.

ఇంట్లోవాళ్లు మీకు సంబంధాలు చూస్తున్నారా?

ప్రస్తుతానికి ఏమీ లేదు. కానీ, అప్పుడప్పుడూ పెళ్లి ప్రస్తావన తీసుకొస్తారు. అది అయినప్పుడు కదా! సరే అనుకుని నేను 'ఊ' అనీ అనను. 'ఊహూ' అనీ అనను.. నేను కూడా సరైన టైమ్ కోసం ఎదురుచూస్తున్నా. కెరీర్ పరంగా చిన్న గ్యాప్ వచ్చింది. హిట్స్ లేవు. రెండు మూడు సక్సెస్‌లు వచ్చిన తర్వాత చేసుకుంటే బాగుంటుందని నా భావన. ప్రస్తుతం పెళ్లి చేసుకునే ఆలోచనలో లేను.

• వినాయకరావు, ఫొటో: రాజ్‌కుమార్

సినిమాల్లో ప్రేమకథలు ఒకటో నిమిషంలో మొదలై నూట ఇరవయ్యో నిమిషంలో తేలిపోతాయి. కానీ సినిమా తారల ప్రేమకథలు మాత్రం అలా కాదు. ఒకరోజుతో మొదలై ఏళ్లపాటు కొనసాగుతూనే ఉంటాయి. అందరూ అనుష్కశర్మ, విరాట్ కోహ్లీలాగా ఉండరు కదా! ఏడాదిపాటు ప్రేమించుకుని తర్వాతి ఏడాది పెళ్లి చేసుకోవడానికి! ప్రేమకైనా, పెళ్లికైనా ఓ లెక్క ఉంటుంది. సినిమా తారల ప్రేమకథలు మాత్రం ఓ పట్టాన దరికి చేరడం లేదు. అలాంటి ప్రేమపక్షుల వైపు ఓ లుక్కేద్దాం...

ప్రేమపక్షులు

కంచికి చేరని కథలెన్నో!







జర్నీతో మొదలు..

'జర్నీ' సినిమాతో తమిళ నటుడు జై, తెలుగమ్మాయి అంజలి మధ్య స్నేహం ఏర్పడింది. ఆ తర్వాత వాళ్లిద్దరూ నాలుగైదు సినిమాల్లో కలిసి నటించారు. ఆ తరుణంలోనే అంజలి, జై మధ్య స్నేహం కాస్త ప్రేమగా మారిందని తమిళ ఫిల్మ్ ఇండస్ట్రీ టాక్. వీరిద్దరూ కలిసి ప్రత్యేకంగా పుట్టిన రోజు వేడుకలు, పార్టీలు జరుపుకున్న సందర్భాలు ఉన్నాయి. ఓ సందర్భంలో అంజలి జై ఇంటికి వెళ్లినప్పుడు స్వయంగా ఆయనే దోసెలు వేసి అంజలికి వడ్డించాడు. ఆ ఫొటోలను జై ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తే "మనసుకు ఇష్టమైన వ్యక్తి మనకు వండి పెడుతుంటే ఆ ఆనందమే వేరుగా ఉంటుంది' అని అంజలి రీ-ట్వీట్ చేసింది. ఆ ఫొటోలు బయటికొచ్చాక పెద్ద చర్చే జరిగింది. అంజలి మాత్రం జై తనకు మంచి స్నేహితుడని ఆ సందర్భంలో సమాధానమిచ్చింది. వారి మధ్య అనుబంధం ప్రేమేనని తమిళనాట పెద్ద టాక్ కొంతకాలంగా నడుస్తోంది. కానీ ఇద్దరిలో ఏ ఒక్కరూ అధికారికంగా తమ ఇష్టాయిష్టాలు, ఒకరిఒకరిపై ఒకరికి ఉన్న అభిప్రాయం గురించి ఇప్పటివరకూ వ్యక్తపరచలేదు.



ఓ కొలిక్కి రాలేదు..

నయనతార ప్రేమ, పెళ్లి గురించి ఎప్పుడూ వార్తల్లో వినిపిస్తూనే ఉంటుంది. ఆ మధ్య శింబుతో కొన్నాళ్లు, ప్రభుదేవాతో కొంతకాలం క్లోజ్‌గా ఉంటూ ప్రేమాయణం సాగించిన ఈమె కొన్నాళ్ల క్రితం ఆ బంధానికి బ్రేకప్ చెప్పేసింది. ఆ తర్వాత కొత్త ప్రియుడు, దర్శకుడు విఘ్నేశ్ శివన్‌తో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతోంది. అయితే వీరిద్దరి మధ్య ఉన్నది ప్రేమ, స్నేహమా అన్నది ఇప్పటికీ బయటకు రాలేదు. ఇద్దరూ కలిసి తిరుగుతున్న వైనం చూస్తుంటే ఇద్దరి మధ్య ప్రేమబంధం బలంగా ఉన్నట్లు అర్థమవుతోంది. అందుకు కొన్ని ఫొటోలు నిదర్శనంగా కనిపిస్తున్నాయి. విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో నయన్ నటించిన 'నానున్ రౌడీ దాన్' చిత్రం ఆడియో వేడుకలో ఈ జంట తీసుకున్న ఫొటోలు, లండన్ షూటింగ్‌లో మరీ క్లోజ్‌గా ఉన్న సెల్ఫీలు, ఇటీవల అబుదాబిలో జరిగిన 'సైమా' అవార్డుల వేడుకలో నయన్ మాట్లాడిన తీరు, అల్లు అర్జున్ చేతుల మీదుగా అందుకున్న అవార్డును విఘ్నేశ్‌ను ప్రత్యేకంగా వేదికపైకి ఆహ్వానించి అతని చేతుల మీదుగా అవార్డు అందుకోవడం కాస్త విడ్డూరంగానే అనిపిస్తోంది 'ఈ అవార్డును విఘ్నేశ్ చేతుల మీదుగా తీసుకుంటేనే నాకు సంతృప్తిగా ఉంటుంది' అని నయనతార చెప్పడం ఆహూతుల్ని ఆశ్చర్యపరచింది. ఇవన్నీ చూస్తుంటే త్వరలోనే నయన్, విఘ్నేశ్ పెళ్లిపీటలు ఎక్కడం ఖాయమని తమిళ సినీ ప్రముఖులు చెబుతున్నారు.





ఇలియానాకు పెళ్లి అయిందా?

హిందీలో సినిమాలు చెయ్యడం మొదలెట్టాక ఇలియానాకు ఆస్ట్రేలియా ఫొటోగ్రాఫర్ ఆండ్రూ నీబోన్‌తో పరిచయం ఏర్పడింది. అతి తక్కువ సమయంలో అతనితో ప్రేమలో పడింది ఇల్లీ బేబీ. ఆండ్రూకి మంచి మనసుందనీ, హాస్య చతురత ఎక్కువనీ.. అతని తీరు నచ్చే ప్రేమలోపడ్డాననీ పలు ఇంటర్వ్యూల్లో ఇలియానా తెలిపింది. ఇద్దరం కలిసే ఉంటున్నాం అని కూడా ఓ కార్యక్రమంలో చెప్పింది. వీరిద్దరూ సైలెంట్‌గా పెళ్లి చేసేసుకున్నారని పలు కథనాలు వచ్చాయి. దీనిపై ఈ గోవా బ్యూటీ ఎక్కడా స్పందించలేదు. ప్రియుడు తీసిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి "నా హబ్బీ తీసిన ఫొటోలు ఇవి" అని రాస్తుండటం చూస్తుంటే ఇలియాన ఆండ్రూని పెళ్లాడినట్లే అనిపిస్తోంది. కానీ ఇప్పటి దాకా ఆ సంగతి అధికారికంగా చెప్పి, ప్రేమకథను పెళ్లితీరాలకు చేర్చలేదు.





నా లైఫ్ నా ఇష్టం...

కెరీర్ బిగినింగ్ నుంచీ శృతీహాసన్ తీరు 'నా లైఫ్ నా ఇష్టం' అన్నట్లే ఉంటుంది. స్వతంత్రంగా ఉంటూ తనకు నచ్చింది చేసుకెళ్తే తత్వం ఆమెది. అంతే స్వేచ్ఛ ఆమెకు తన తల్లిదండ్రులు ఇచ్చారు. గత రెండేళ్లగా శ్రుతీహాసన్ లండన్ కుర్రాడు మైఖేల్ కొర్సల్‌తో ప్రేమలో ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విషయమ్మై ఆమె ఇప్పటి వరకూ స్పందించలేదు. ఇటీవల చెన్నైలో జరిగిన కమల్‌హాసన్ సన్నిహితుల పెళ్లిలో శ్రుతి, మైఖేల్ సంప్రదాయమ్మైన దుస్తులు ధరించి మెరిశారు. ఆ సందర్భంలో కమల్ కూడా వారితోపాటే ఉన్నారు. ఇదీ కాకుండా పలు సందర్భాల్లో శృతీ, మైఖేల్ కలిసి పార్టీలకు వెళ్లిన ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇవన్నీ చూస్తుంటే విశ్వనటుడు కమల్‌హాసన్ అనుమతి శ్రుతికి దక్కినట్లే కనిపిస్తోంది. కానీ అధికారిక ప్రకటన వచ్చేదాకా వేచి చూడాల్సిందే! ప్రస్తుతం శ్రుతి, మైఖేల్ లాస్ అమెరికాలోని ఏంజెల్స్‌లో ఉన్నారు. 'ఇన్ ఎల్ఏ విత్ మై సన్‌షైన్' అని ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిందామె.

• ఆలపాటి మధు

అమరగానం.. అమృతపానం



ఘంటసాలను కొంతమందే చూసి ఉండవచ్చు కానీ ఆయన పేరు విననివారు, ఆయన గానమాధుర్యాన్ని చవి చూడని తెలుగువారు లేరనడం అతిశయోక్తి కాదు. భక్తినీ, ముక్తినీ, ఆనందాన్నీ, విషాదాన్నీ.. ఒకటనేమిటి నవరసాలనూ తన కంఠంలో పలికించి, జీవితపు చివరి ఘడియల వరకూ కళాసరస్వతిని ఆరాధించిన చరితార్థుడు ఘంటసాల. ఎన్టీఆర్, ఏయన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, కాంతారావు, కృష్ణంరాజు ... ఇలా ప్రతి ఒక్క హీరోకీ తన గాత్రాన్ని అందించి వారి ఎదుగుదలలో తనూ భాగస్వామి అయ్యారు. కేవలం గానంతోనే కాకుండా సంగీతంతో కూడా తెలుగువారిని పరవశింపజేసిన గానగంధర్వుడాయన. కొన్ని వేల పాటలు పాడారు. నిర్మాతగా మారి సినిమాలు తీశారు (అయితే చిత్రనిర్మాణం ఆయనకు కలసి రాలేదు.. అది వేరే విషయం).

దక్షిణాదిలో ఎన్నో కచ్చేరీలు చేశారు. విదేశాల్లో సైతం వారి విద్వత్తుకు ఆదరణ లభించింది.

ఘంటసాల కన్నుమూసి, ఇప్పటికీ 44 ఏళ్లు పూర్తయినా, ఆయన పాట వింటూ పని మరిచిపోయేవారు, పనికట్టుకొని వారి పాటలు వినేవారు ఎంతో మంది ఉన్నారు. ఘంటసాల పాటలు పాడుతూ తమ సంగీతయాత్రను కొనసాగించే గాయకులు దాదాపు ప్రతి ఊరిలోనూ కనిపిస్తారు. ఇక తన జీవిత చరమదశలో ఘంటసాల అందించిన మధురమైన జ్ఞాపిక లాంటి 'భగవద్గీత'ను నిత్యం వినే వారు ఎందరో!

(ఫిబ్రవరి 11 ఘంటసాల వర్ధంతి సందర్భంగా)

డైలీ సుడోకు 103

6				9			8	
8	5		4				2	
	1				5			
		4	3		8	6		
		7	5		2	4		
			9				1	
	6				3		4	8
	3			8				7

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 102 సమాధానం



అవికా.. డిఫరెంట్‌గా!

అవికాగోర్ అంటే పక్కింటి అమ్మాయిలా కనిపిస్తుంది. తెర మీద చూడగానే టక్కున కనెక్ట్ అయిపోతుంది. తెలుగులో ఇప్పటివరకూ ఆమె చేసినవన్నీ అలాంటి పాత్రలే. రెండేళ్ల క్రితం చేసిన 'తాను నేను' తర్వాత ఆమె మళ్లీ తెలుగు తెరపై కనబడలేదు. 'అరె ఏమైంది...?' అని అనుకొనే లోపు మళ్లీ హిందీ బుల్లితెరపై మెరిసింది. 'బాలికా వధు' అనే హిందీ సీరియల్‌తో బాలనటిగా కెరీర్ మొదలుపెట్టిన అవికాగోర్ ఇప్పుడు మళ్లీ 'లాడో- వీర్‌పూర్‌కి మర్దాని' అనే సీరియల్‌లో నటిస్తోంది. ఇందులో ఆమె పాత్ర పేరు అనుష్క. మొదట్లో కాస్త సరదాగా ఉన్నా, కథలో అనుకోని మలుపు ఆమె పాత్ర తీరుతెన్నులను హఠాత్తుగా మార్చేస్తుందట. స్టన్నింగ్ బ్యూటీ కాస్త, బోల్డ్ అండ్ పవర్‌ఫుల్‌గా మారుతుందట. 'చెల్లి మరణానికి పగ తీర్చుకునే సోదరిగా నా పాత్ర రానున్న ఎపిసోడ్లలో చాలా ఆసక్తికరంగా ఉంటుంది" అని చెప్పుకొచ్చింది అవికా.



కపిల్ ఈజ్ బ్యాక్!

'అయిపోయింది... కపిల్ శర్మ పని ఔట్!...ఇక కనబడే ఛాన్స్ లేదు' అంటూ అతని గురించి మీడియాలో చక్కర్లు కొట్టిన మాటలివి. కానీ ఐ యామ్ బ్యాక్ అంటూ హిందీ సోనీ ఛానెల్‌లో ఓ ప్రోమోతో లేటెస్ట్‌గా కూత పెట్టేశాడు. అదే ఇప్పుడు బీటౌన్‌లో ఆసక్తికరమైన చర్చ. చాన్నాళ్ల క్రితం 'కలర్స్' ఛానెల్‌లో ప్రసారమైన 'కామెడీ నైట్స్ విత్ కపిల్' ఎంత హిట్టో చెప్పనవసరం లేదు. ఒక్క టీవీ షోతో కపిల్‌కి స్టార్ స్టేటస్ వచ్చేసింది. బాలీవుడ్‌లోకి హీరోగా కూడా ఎంట్రీ ఇచ్చేశాడు. 'కిస్ కిస్ కో ప్యార్ కరూ' అనే సినిమాతో బాలీవుడ్ తెరపై హీరోగా మెరిశాడు. కానీ ప్రేక్షకులు రిజెక్ట్ చేశారు. టైమ్ ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా! 'కామెడీ నైట్స్...' షోలోనే తోటి కమెడియన్ సునీల్ గ్రోవర్, కపిల్ ఏదో విషయం మీద మాటా మాటా అనుకున్నారు. ఇంకేముంది అది పెరిగి పెద్దదై షో నిలిపివేసేంత వరకూ వెళ్లింది. అయినా బాలీవుడ్‌లో కపిల్ తన ప్రయత్నాలు ఆపలేదు. రెండో సినిమా చేశాడు. పేరు 'ఫిరంగి'. అదీ అనుకున్నంతగా పేలలేదు. దానికి తగ్గట్టు అనారోగ్య సమస్యలు కపిల్ కెరీర్‌కు బ్రేక్ వేశాయి. గతేడాది కపిల్ బుల్లితెరపై కనబడలేదు. చెప్పాలంటే అతనికి 2017 కలిసి రాలేదనే చెప్పాలి. అందుకు 2018లో రావడానికి సిద్ధమవుతున్నాడు. ఇంకా టైటిల్ అనౌన్స్ చేయలేదు. మార్చిలో ప్రసారం కానున్న ఈ షో కపిల్ కెరీర్‌కు ఎంతవరకు ఊపునిస్తుందో!

టీవీ దృశ్యం

బుల్లితెరపై రాందేవ్ బాబా!



కంగారు పడకండి! ఆయన నటుడి అవతారం ఎత్తడం లేదు. కానీ ఆయన జీవితమే తెరపై రానుంది. ఓ యోగా గురువుగా, ఆధ్యాత్మిక వేత్తగా బాబా రాందేవ్ పరిచయం అక్కర్లేని పేరు. ఆయన జీవిత ప్రయాణాన్ని బుల్లితెరపై ఆవిష్కరించే ప్రయత్నమే 'బాబా రాందేవ్: ఏక్ సంఘర్ష్'. ఇటీవల విడుదలైన ఈ సీరియల్ ట్రైలర్ అంచనాలను పెంచింది. భోజ్‌పూరి నటుడు క్రాంతి ప్రకాశ్ ఝూ టైటిల్ రోల్ పోషించిన ఈ సీరియల్‌కు బాలీవుడ్ నటుడు అజయ్‌దేవగన్ సహ-నిర్మాతగా వ్యవహరించారు. మొత్తం 85 ఎపిసోడ్ల ఈ సీరియల్ సోమవారం నుంచి 'డిస్కవరి జీత్' ఛానల్‌లో ప్రసారం కానుంది.

పద్మ అవార్డులకంటే ఇదే గొప్పది

- కైకాల సత్యనారాయణ



పరుచూరి వెంకటేశ్వరరావు, సుబ్బరామిరెడ్డి,పద్మినీ కొల్హాపురి, మురళీమోహన్, కైకాల

"అవార్డులు ప్రకటించిన ప్రతిసారి మీకు పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి అవార్డులు రాలేదేంటి? అని కనిపించిన ప్రతి ఒక్కరూ అడుగుతున్నారు. అవి నాకు అక్కర్లేదు. ప్రభుత్వం ఇచ్చే పురస్కారాల కన్నా నిత్యం కళల్ని ప్రోత్సహిస్తూ, కళల విలువ, వాటి పట్ల అభిరుచి కలిగిన టి.సుబ్బరామిరెడ్డి ఇచ్చే పురస్కారం చాలా గొప్పది. కళకు నిత్యం సేవ చేస్తున్న ఆయనే నిజమైన కళాకారుడు" అని కైకాల సత్యనారాయణ అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 13 విశాఖతీరంలో నిర్వహించే కోటి లింగాల ప్రతిష్ఠ సందర్భంగా సుబ్బరామిరెడ్డి కళా పరిషత్ ఆధ్వర్యంలో సీనియర్ నటుడు కైకాల సత్యనారాయణను 'విశ్వనట సమ్రాట్' బిరుదుతో సత్కరించనున్నారు. దీనికి సంబంధించి శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో "సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ "కళ అంటే నాకు ప్రాణం. ఆ కారణంతోనే కళాకారులను సత్కరిస్తున్నాను. కైకాల ఎన్టీఆర్, ఏయన్నార్, ఎస్వీఆర్‌కు సమకాలీకులు. వెయ్యి సినిమాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయారు. ఆయనను సత్కరించే అవకాశం దక్కడం ఆనందంగా ఉంది. రాజకీయాలకు అతీతంగా చేస్తున్న కార్యక్రమమిది. 2014లో నెలకొల్పిన యశ్‌చోప్రా జాతీయ అవార్డును ఈ ఏడాది ఆశాభోంస్లేకు ప్రదానం చెయ్యనున్నాం. త్వరలో 'కాకతీయ కళా వైభవం' పేరుతో మహబూబ్‌నగర్‌లో భారీ వేడుక నిర్వహించబోతున్నాం" అని తెలిపారు. వైజాగ్‌లో జరగనున్న ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర గవర్నర్ సి.హెచ్.విద్యాసాగర్, బాలకృష్ణ, మురళీమోహన్, మోహన్‌బాబు తదితరులు హాజరుకానున్నారు.



ఆకాశ్ పూరి

మెహబూబా.. దిల్‌దియా

ఆకాశ్ పూరి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మెహబూబా'. నేహాశెటి కథానాయిక. లావణ్య సమర్పణలో పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్ పతాకంపై రూపొందుతున్న చిత్రమిది. ఇటీవల టీజర్ విడుదల చేశారు. దానికి వస్తోన్న స్పందన గురించి పూరి జగన్నాథ్ మాట్లాడుతూ "1971 ఇండియా-పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో సాగే ప్రేమకథగా ఈ సినిమా తెరకెక్కుతోంది. తెలుగు రాష్ట్రాలు, అమెరికాలో కలిపి 500 థియేటర్‌లలో టీజర్‌ని విడుదల చేశాం. టీజర్‌తోపాటు అందులో 'దిల్‌దియా' అంటూ సాగే నేపథ్య సంగీతానికి స్పందన బావుంది. సమ్మర్‌లో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అని చెప్పారు. ఈ చిత్రానికి సందీప్ చౌతా సంగీతం అందిస్తున్నారు.


గోలీసోడ వినోదాత్మకం...



నిత్య

మానస్, నిత్యా నరేశ్, కారుణ్య కీలక పాత్రధారులుగా నటించిన 'సోడ గోలీ సోడ' చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 16న విడుదలకు సిద్ధమవుతోంది. మల్లూరి హరిబాబు దర్శకత్వం వహించిన చిత్రమిది. భువనగిరి సత్య సింధూజ నిర్మాత. ఆయన మాట్లాడుతూ "వినోదాత్మకంగా సాగే చక్కని కుటుంబ కథా చిత్రమిది. టైటిల్‌కు, అంతా గ్యాసే అన్న ట్యాగ్‌లైన్‌కు స్పందన బావుంది. భరత్ సంగీతం అందించిన పాటలు ఆకట్టుకుంటున్నాయి. సినిమా కూడా అదే తరహాలో ఆద్యంతం ప్రేక్షకుల్ని అలరిస్తుంది" అని చెప్పారు.

కాలా... ఏప్రిల్‌లో '2.0' రాదా?



రజనీకాంత్

గుర్తుపెట్టుకోండి... ఏప్రిల్ 27న రజనీకాంత్ 'కాలా' విడుదలవుతోంది. అభిమానులు క్యాలెండర్‌లో ఆ డేట్‌ను మార్క్ చేసుకోమని చిత్రనిర్మాత, రజనీ అల్లుడు ధనుష్ స్పష్టం చేశారు. 'కబాలి' తర్వాత పా.రంజిత్ దర్శకత్వంలో రజనీ నటించిన చిత్రమిది. ఇందులోనూ ఆయన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. ఏప్రిల్‌లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తుందనే వార్త రజనీ అభిమానులకు సంతోషానిస్తోంది. కానీ, ఇక్కడ క్వశ్చన్ ఏంటంటే... రజనీకాంత్ నటించిన మరో చిత్రం '2.0' ఏప్రిల్‌లో వస్తుందా? రాదా? శంకర్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించిన సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ '2.0'ను ఏప్రిల్‌లో విడుదల చేస్తామని గతేడాది చివర్లో ప్రకటించారు. ఇప్పుడు ఏప్రిల్‌లో 'కాలా'ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఆల్రెడీ '2.0' ఏప్రిల్‌లో కూడా విడుదల కాదని, ఆగస్టులో వచ్చే ఛాన్సులు ఉన్నాయని ఇటీవల వార్తలు వినిపిస్తున్నాయి. ధనుష్ ప్రకటనతో అదే నిజమని అర్థమవుతోంది. ఎందుకంటే... ఏప్రిల్ మొదటివారంలో '2.0'ను విడుదల చేయాలనుకున్నా, అది విడుదలైన మూడు వారాల్లో మరో రజనీ చిత్రం విడుదల చేసే సాహసం చేయరు. తెలుగులో మహేశ్‌బాబు 'భరత్ అనే నేను', అల్లు అర్జున్ 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా' చిత్రాలను ఏప్రిల్ 27న విడుదల చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.

నికిషా 'రౌడీ పోలీస్'



పవన్ కళ్యాణ్ 'పులి' సినిమాతో తెలుగుతెరకు పరిచయమైన కథానాయిక నికిషాపటేల్. కొంతగ్యాప్ తర్వాత ఆమె టైటిల్ పాత్ర పోషిస్తున్న చిత్రం 'రౌడీ పోలీస్'. జానీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి వేణు నిర్మాత. ముకుల్‌దేవ్, భానుచందర్ కీలక పాత్రధారులు. ప్రస్తుతం హైదరాబాద్‌లో క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతోంది. నిర్మాత మాట్లాడుతూ "ఇందులో నికిషా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుంది. యాక్షన్ ఎపిసోడ్స్‌కు స్కోపున్న సినిమా ఇది. నికిషా యాక్షన్ సన్నివేశాలకు డూప్ లేకుండా రియలిస్టిక్‌గా నటించింది. ఇటీవల జరిగిన షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తికావొచ్చింది. త్వరలో సినిమాను విడుదల చేస్తాం" అని అన్నారు.



"మనుషులు ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలి. మనం ఒక చోట ఉంటే ఆ పరిసరాలు ఉల్లాసంగా, ఉత్సాహంగా అనిపించాలి. అంతేగానీ, దిగాలుగా ఏదో పోగొట్టుకున్నట్టు ఉండకూడదు" అని అంటున్నారు పొడవు కాళ్ల సుందరి పూజా హెగ్డే. రోజంతా హుషారుగా ఉండటం గురించి ఈ భామ మాట్లాడుతూ "మనిషి హుషారుగా ఉండాలంటే కేవలం మనసు ఉల్లాసంగా, పాజిటివ్‌గా ఉంటే సరిపోదు. పరిసరాలు కూడా ఉత్తేజవంతంగా ఉండాలి. అన్నిటికీ మించి, సెట్లో మనతో నటించే కోస్టార్స్

కో స్టార్ చాలా కీలకం

- పూజా హెగ్డే

కూడా అంతే ఎనర్జిటిక్‌గా ఉండాలి. సీనియర్ నటులతో సీన్ చేస్తున్నప్పుడు వినయంగా, ఒద్దిగ్గానే ఉంటాం. వారి దగ్గర నుంచి చాలా నేర్చుకుంటాం. వారితో పాటు సెట్లో సమ వయస్కులు ఉన్నప్పుడు ఆ జోష్ వేరుగా ఉంటుంది. జోకులు వేసుకుంటాం. అండర్‌స్టాండింగ్ లెవల్స్ ఎక్కువగా ఉంటాయి. పరస్పరం కంఫర్టబుల్‌గా ఉంటాం. ఆ విషయం నాకు 'ముకుంద' సెట్లో అర్థమైంది. అంతకుముందు, ఆ తర్వాత కూడా నేను పనిచేసిన ప్రతి హీరో మోస్ట్ ఎనర్జిటిక్ పర్సనాలిటీయే" అని అన్నారు పూజా హెగ్డే. ఈ బెంగుళూరు భామకు ప్రస్తుతం తెలుగులో రన్నింగ్‌లో 'సాక్ష్యం', మహేశ్‌బాబు సరసన ఓ చిత్రం ఉన్నాయి. 'రంగస్థలం'లో ప్రత్యేకగీతంలో నర్తించిన విషయం విదితమే.

శీనుగాడు సిన్సియర్



ప్రణవి, శ్రీనివాసరావు

శ్రీనివాసరావు హీరోగా నటిస్తూ, సుష్మ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా పతాకంపై నిర్మిస్తున్న సినిమా 'శీనుగాడి ప్రేమ'. సిన్సియర్ రా మామా... అనేది ఉపశీర్షిక. ఆర్.కె. దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో ప్రణవి, కావేరి, చాందిని హీరోయిన్లు. రమణ సాకే స్వరపరిచిన ఈ చిత్రంలోని గీతాలను శుక్రవారం టీఎఫ్‌సీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ విడుదల చేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ "నాకు నటన అంటే చాలా ఇష్టం. ఒక రోజు నేను డైలాగ్స్ చెప్పే విధానం చూసి మా దర్శకుడు నన్నే నటించమన్నారు. కథ నచ్చడంతో చిత్రాన్ని నేనే నిర్మించా" అన్నారు. "ప్రేమ, వినోదం, కుటుంబ భావోద్వేగాలతో చిత్రాన్ని రూపొందించాం. ఎన్నో అడ్డంకులను అధిగమించి మా నిర్మాత చిత్రాన్ని ఇక్కడి వరకూ తీసుకొచ్చారు" అన్నారు దర్శకుడు ఆర్.కె. ఈ కార్యక్రమంలో వీరశంకర్, సాయివెంకట్, తుమ్మలపల్లి తదితరులు పాల్గొన్నారు.

'వైద్య సీట్లలో తొండి ఆట'పై విచారణ

» క్రీడా ప్రాధికార సంస్థలో అక్రమాలపై ద్విసభ్య కమిటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వైద్య సీట్లకు సంబంధించి క్రీడా కోటాలో చోటు చేసుకున్న అక్రమాలపై ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది. తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ సిఫార్సుల్లో పొరపాట్లు చోటు చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడికావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. క్రీడాశాఖ చీఫ్ విజిలెన్స్ అధికారి రఫత్ అలీ, స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్డీ నర్సయ్యకు ఈ బాధ్యతను అప్పగించారు. క్రీడలు, యువజన సర్వీసులు, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ మేరకు శనివారం ఆదేశాలు జారీ చేశారు. 'వైద్య సీట్లలో తొండి ఆట'పై డిసెంబరు 7న తేదీన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రాథమిక విచారణ జరిపించింది. ఆ నివేదిక ప్రభుత్వానికి అందింది. ప్రాథమిక విచారణ నివేదిక ప్రకారం క్రీడా కోటాలో అభ్యర్థుల సిఫార్సుకుగాను సాంకేతిక విద్యామండలిసంస్థకు 235 మంది అభ్యర్థుల పత్రాలను తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ పరిశీలించింది. వీరిలో 73 మంది అభ్యర్థులను క్రీడా కోటాలో అనర్హులుగా గుర్తించిన కమిటీ.. 162 మంది అభ్యర్థుల పత్రాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంది. అదే సమాచారాన్ని గత ఏడాది ఆగస్టు 24వ తేదీన కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయానికి పంపగా.. జాబితాలో ప్రతిభ ప్రాధాన్యత క్రమం సరిగా లేదని తిప్పి పంపింది. మరోసారి మెరిట్ లిస్ట్ పంపాలని వైద్య విశ్వవిద్యాలయం కోరగా.. 162 మంది అభ్యర్థుల మెరిట్ జాబితాను మరోసారి పంపించింది. ఇందులో అక్రమాలు చోటుచేసుకున్నాయని అభియోగాలున్నాయి. భరత్‌చంద్రారెడ్డి, వర్షితారాజ్ అనే విద్యార్థులు అంతర్జాతీయస్థాయిలో జరిగిన రోలర్ స్కేటింగ్‌లో పాల్గొన్నా సంస్థ పరిగణనలోకి తీసుకోలేదన్నది ఆరోపణ. శాయ్ ధ్రువీకరించనందున వారిని పరిశీలనలోకి తీసుకోలేదని చెబుతున్నారు. వర్షితారాజ్‌కు సంబంధించిన పత్రాలను పరిశీలించినట్లుగా వెల్లడిస్తూనే అభ్యర్థుల నిజాయితీని ధ్రువీకరించడానికి 'శాయ్' తెలిపినందున సిఫార్సు చేయలేదని ప్రాథమిక విచారణ నివేదిక తెలియజేస్తోంది. విశ్వమేటాల అనే అభ్యర్థి జూనియర్ నేషనల్స్‌లో కాంస్య పతకాన్ని సాధించారు. సీనియర్ నేషనల్స్‌లో ఎలాంటి పతకం సాధించలేదు. ఈ అభ్యర్థికి 27 (బీ) ఇవ్వాల్సి ఉండగా 25 (బీ) ఇచ్చినట్లు వెల్లడైందని కమిటీ నివేదికలో వెల్లడించింది. ఈ పొరపాటు ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని, సమయం లేకపోవడం, పని ఒత్తిడే కారణమని తెలిపింది.

ఇక డబ్బాల్లోనూ చేపల ఉత్పత్తి

» అనుమతి కోసం జిల్లాస్థాయి కమిటీలు




హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ తరహాలో ప్రత్యేకమైన డబ్బాల్లో చేపపిల్లల ఉత్పత్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటికి అనుమతులు ఇచ్చేందుకు జిల్లాస్థాయి కమిటీలను వేసింది. ఈ మేరకు ఇదివరకు జారీ చేసిన నిబంధనలను సడలిస్తూ పశుసంవర్ధక, మత్స్యశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శనివారం జీవో జారీ చేశారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, ఆయా జిల్లాల నీటిపారుదల శాఖ అధికారి, వ్యవసాయాధికారి, భూగర్భ జల వనరుల అధికారి సభ్యులుగా, మత్స్యశాఖ అధికారి మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. ఇప్పటివరకు గుంతలు, కార్ప్‌ల్లోనే చేపపిల్లల ఉత్పత్తికి అవకాశం ఉండేది. తాజాగా ప్రత్యేకమైన డబ్బాల్లో వీటిని ఉత్పత్తి చేసేందుకు వీలుగా జీవోను సవరించారు. దీనిప్రకారం బోర్లు నుంచి నీటిని తోడుతూ చేప పిల్లలను పెంచడానికి అనుమతినిస్తారు. డబ్బాల్లో చేపలను పెంచేవారు బయో సెక్యూరిటీ భద్రతా ప్రమాణాలు పాటించాలని నిర్దేశించింది. వీటి అనుమతి కోసం ప్రతి యూనిట్‌కు రూ.5వేలు చెల్లించి జిల్లా స్థాయి కమిటీకి దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా కమిటీ గుంతలు, కార్ప్, డబ్బాలను పరిశీలించి అనుమతినిస్తుంది.

18న ఆమ్రపాలి వివాహం

» ఐపీఎస్ సమీర్‌శర్మతో జమ్మూకశ్మీర్‌లో పెళ్లి
» 23న వరంగల్‌లో, 25న హైదరాబాద్‌లో విందు
» 1100 మంది దాకా అతిథులు.. 26న హనీమూన్‌కు టర్కీకి





Smt. Padmavathi & Prof. Venkata Reddy Kata
solicit your gracious presence on the auspicious occasion of the wedding reception of their daughter
Chi. Sow. Amrapali
with
Chi. Sameer
Son of Smt. Santhosh & Lt.Col R K Sharma (Retd.)
On Sunday the 23rd of February 2018
Venue: Collector's Camp Office, Subedari, Hanamkonda
Dinner: 6:00 pm Onwards

కలెక్టర్ ఆమ్రపాలి వివాహ విందు ఆహ్వాన పత్రం

హన్మకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కలెక్టర్ ఆమ్రపాలి కాటా పెళ్లికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 18న ఐపీఎస్ అధికారి సమీర్ శర్మతో ఆమె ఏడు అడుగులు వేయనున్నారు. ఈ వివాహ వేడుకకు సమీర్ శర్మ సొంత రాష్ట్రం జమ్మూ కశ్మీర్ వేదిక కానుంది. అనంతరం నూతన వధూవరులు ఆమ్రపాలి-సమీర్ తమ వివాహ విందును 23న వరంగల్‌లో, 25న హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. 23న వరంగల్ అర్బన్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగే విందుకు 600మంది ప్రముఖులు, హైదరాబాద్‌లో జరిగే విందుకు 500మంది ప్రముఖులను ఆహ్వానించనున్నట్లు సమాచారం. విందుకు ఆహ్వాన పత్రికలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. కార్డులోపల చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి ఆమ్రపాలి (శ్రీమతి, శ్రీ పద్మావతి, ప్రొఫెసర్ వెంకటరెడ్డి కాటాల పుత్రిక), చిరంజీవి సమీర్ (శ్రీమతి, శ్రీ సంతోష్, రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ ఆర్‌కె శర్మ పుత్రుడు)ల వివాహాన్ని పురస్కరించుకొని ఇస్తున్న విందుకు విచ్చేయవలసిందిగా అతిథులను ఆహ్వానిస్తున్నాం అని ముద్రించారు. 23న జరిగే విందు ఆహ్వానపత్రికలో శుక్రవారం బదులు ఆదివారం అని తప్పుగా పడింది. దీనిని సరిచేసి శుక్రవారం అని స్టిక్కర్ వేసి పంపుతున్నారు. కాగా హనీమూన్ కోసం కొత్త జంట 26న టర్కీకి వెళ్లనుంది. మార్చి 7 వరకు ఆమ్రపాలి దంపతులు అక్కడే ఉంటారు.

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వధువు కావలెను



★ రెడ్డి / విడోవర్ / 50 / 5'9" / Hyd & విజయవాడలో Own ఇండస్ట్రీస్ 6 L P.M. / వెల్ సెటిల్డ్ వరునికి FC/BC వధువు కావలెను. సెల్ : 9394288881 AJH-062

★ వైశ్య 28 ఎరుపు, 5.5 M.Sc, M.Ed, T.T.C ప్రయివేట్ లెక్చరర్ 30వేలు. అబ్బాయికి వైశ్య అమ్మాయి కావలెను. డైరెక్ట్ నల్లగొండ సెల్: 9618418981 సొంత ఇల్లు 3.ఎ.భూమి వీరయ్య MIG 9HB, మునుగోడు రోడ్. AJY-447173

★ మాదిగ గౌ॥ కాంట్రాక్ట్ జాబ్ 20,000/- ఒంటరి 60, 5'.8" జాబ్ సపోర్ట్ ఇవ్వగల Emp VRS Ritired రిచ్ ఆసక్తి గల Old Age ఒంటరి మహిళ వద్ద ఆఫ్టర్ రిటైర్డ్ ఇల్లరికం ఓకె, ఆల్‌బార్స్, నో బ్రోకర్స్ డైరెక్ట్. సంప్ర : 9642394853 AJW-445937

★ నోబ్రోకర్స్ డైరెక్ట్ కమ్మ (లేటు మ్యారేజి) 40/5'6", Xth, 1Cr, స్థిరాస్తి గల వరునికి FC/BC కులాల 1వ / 2వ (30-35) సం॥ పిల్లలు లేని వధువు కావలెను. 7382796075, kababu38@gmail.com AJG-GNT

★ కాపు / 31 / 5'7" / White Complex / Divorce / B.Tech M.S. Networking Kamineni Infotech, Salary 30,000/- PM, Good Family Background. Cell: 7780175333 (Whatsapp) AJV-440865

★ వాల్మికిబోయ: B.Tech/C.Govt Sr. Asst/ పోస్టల్ Dept./45,000/-P.m, 5'-10" ఎత్తు, 28 సం.ల అందమైన వరునికి వధువు కావలెను సెల్ : 9618007823 AJJ-416628

★ క్రిస్టియన్ మాదిగ : B.Tech/ C.Govt మేనేజర్ / SBI బ్యాంక్ / 70,000/-P.m, 5'-10" ఎత్తు, 28సం.ల V.Fair వరునికి వధువు కావలెను సెల్ : 8008939651 AJJ-416628

★ SC హిందు మాల : MSc/ C.Govt ఆఫీసర్ / కెనరా బ్యాంక్ / 50,000/-P.m, 5'-8" ఎత్తు, 29సం.ల అందమైన వరునికి వధువు కావలెను సెల్ : 9618009352 AJJ-416628

వరుడు కావలెను



★ రెడ్డి / లేట్ మ్యారేజ్/28y/ 5'2"/ ఫ్యాషన్ డిజైనర్ / అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. ఫోన్: 7659921467 AJH-062

★ ముదిరాజ్ / డైవర్సీ / 30y/ 5'5"/ ఇంటీరియర్ డిజైనర్ / అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. ఫోన్: 8897055133 AJH-062

★ కుల, ఆస్తి ప్రసక్తిలేదు / 34y/ ఫెయిర్ / విడో / 5'4" / క్లాత్స్ బిజినెస్ / రెంట్స్ / వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7893575126 AJH-062

★ రెడ్డి / డైవర్సీ / 35 / 5'4"/ B.Tech / Govt. స్టెనోగ్రాఫర్ / రైల్వే / 40,000/- P.M. / 10 ఎ॥ పొలం / విజయవాడలో వెల్‌సెటిల్డ్ Family గల వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7893895763 AJH-062

★ కమ్మ / విడో / 42 / 5'4"/ గైనకాలజిస్ట్ / Own Hospital / 3 L P.M. / Own Houses / వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8340826530 AJH-062

★ గౌడ / 29 / 5'5"/ M.S. / USA లో Job / 4 L P.M. / Hydలో స్వంత ఇల్లు / వెల్‌సెటిల్డ్ వధువుకు USA లో Job చేయు వరుడు కావలెను. ఫోన్: 9603059815 AJH-062

★ యాదవ / విడో (కులపట్టింపులేదు) / 50 / 5'4"/ Govt. పెన్షనర్ / 10 ఎ॥ భూమి / Hydలో Own House వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 7993507466 AJH-062

★ రాజులు / లేట్ మ్యారేజ్ / 28 / 5'4"/ చేపల చెరువు బిజినెస్ / అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. ఫోన్: 8106499144 AJH-062

★ కుల పట్టింపులేదు (2వ పెళ్ళి) / 45 / 5'3"/ డిగ్రీ / Govt. స్కూల్ టీచర్ / 30 వేలు P.M. / సొంత ఇల్లు గల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8790045436, 8978894173 AJH-062

★ సెంట్రల్ Govt. ఎంప్లాయి / 40,000/- P.M. / 58 / 5'3"/ ఇంటర్ / (2nd మ్యారేజ్) / సొంత ఇల్లు గల వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7032764715 AJH-062

★ కుల పట్టింపులేదు / విడో / 42 / 5'4"/ Govt. RTCలో Job / 30,000/- P.M. / Hyd లో Own Business / పిల్లలు లేరు / Own House / వెల్‌సెటిల్డ్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9948070006 AJH-062

★ కమ్మ / విడో / 45 / 5'4"/ SWE / 60,000/- P.M. / ఆంధ్ర / Hyd లో Own House (Rents) / 1 పాప (సెటిల్డ్ in USA / వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9912038880 AJH-062

★ కుల పట్టింపులేదు / విడో / 45 / 5'4"/ B.A., B.Ed / Govt. టీచర్ / Own House (Rents) / సొంత ఊరు వరంగల్ / వెల్‌సెటిల్డ్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9912753645 AJH-062

★ రెడ్డి / విడో / 48 / 5'4"/ డిగ్రీ / Own Business (Rents) / సొంత ఊరు జనగాం / Own ల్యాండ్స్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9912916046 AJH-062

★ వైశ్యా / 36 / 5'4"/ సొంత బిజినెస్ & సొంత ఇల్లు / 2 సం॥ పాప కలిగిన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9502993350 AJH-062

★ FC / విడో / 60Y / రిటైర్డ్ పెన్షనర్ / మంచి ఆర్థిక స్థోమత గల బాగా చదువుకున్న సాంప్రదాయ కుటుంబం గల వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7330865089 AJH-062

★ రెడ్డి / విడో / 38Y / 5'4"/ fair / B.Sc., B.Ed / Govt. Job / 45 K P.M. / 2 Cr. ప్రాపర్టీ గల వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7093717220 AJH-062

★ రెడ్డి / 56Y / విడో / ఫైనాన్స్ బిజినెస్ / లేడీస్ హాస్టల్స్ / వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9885989070 AJH-062

★ కమ్మ / 38 / విడో / 5'5" / District Educational Officer (DEO) 2 L P.M. / Duplex House / ఏకైక వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7680061835 AJH-062

★ BC / విడో / 60Y / B.Sc, నర్సింగ్ / 5'3" / V. Fair / Govt. నర్సు (రిటైర్డ్)/ 70K P.M. / సాంప్రదాయ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 8465058052 AJH-062

★ BC / విడో / 54Y / 5'2" / V. Fair / ఫ్యామిలీ పెన్షనర్ / సొంత బిజినెస్ / వెల్‌సెటిల్డ్ / సాంప్రదాయ వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9573380048 AJH-062

★ కుల పట్టింపులేదు / రెండవ పెళ్ళి / విడో / 49Y / ఛామనచాయ / House Wife / 30 K P.M. / 2 ఎకరముల వరి పొలము గల వెల్‌సెటిల్డ్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9705349133 AJH-062

★ 42 / రెండవ పెళ్ళి / 5'2" / M.Sc, B.Ed / బ్రాహ్మిణ్ / కన్వర్టెడ్ క్రిస్టియన్ / Govt. టీచర్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 8686310368 AJH-062

★ రెడ్డి / విడో /ఒంటరి/ 45y / BA / ఓన్ ఇండస్ట్రీ , హైదరాబాద్‌లో ఇల్లు Rents 3L PM /15 కోట్లు ఆస్తి కల్గిన వధువుకి బిజినెస్ చూసుకునే వరుడు కావలెను. నో బ్రోకర్స్. ఫోన్: 9985035976 / 9703247793 AJH-427125

★ వైశ్య / లేట్ మ్యారేజ్ / 39y /5'3" / Fair B.Com / కాస్మొటిక్ షాప్, ఫైనాన్స్ బిజినెస్ 2L PM /10 కోట్ల ఆస్తి కలిగిన వధువుకి బిజినెస్ చూసుకునే వరుడు కావలెను. ఫ్యామిలీ సపోర్ట్. నో బ్రోకర్స్. ఫోన్: 9703238657 / 8142079654 AJH-427125

★ గౌడాస్, డిగ్రీ, 5.3, ఎరుపు 28Y. వడ్డేరాజులు, డిగ్రీ, 5.6, చామనఛాయ, 30Y. కాపులు, డిగ్రీ, 5.3, ఎరుపు, 23Y. యాదవ, డిగ్రీ, 5.3, ఎరుపు, 19Y. డైరెక్ట్: సెల్: 99125 88498. AJB-454278

★ చౌదరి విడో, 27సం॥, B.Tech, 5'5", ఫుల్ ఫెయిర్, పెళ్ళి అయిన కొద్ది రోజులకు భర్తన కోల్పోయిన, 15 కోట్ల ఆస్థి గల అందమైన వధువుకు 1, 2వరుడు కావలెను. Whats app 7075728579 AJG-498

★ హిందూ మాల: 23Y, B.Tech, SWE, Infosys (Hyd) జాబ్ జీతం : 60వేలు గల వధువుకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ /డాక్టర్ జాబ్ / ఇతర స్టేట్స్‌లో జాబ్ చేస్తున్న హిందూ లేక క్రిస్టియన్ వరుడు కావలెను. డైరెక్ట్ : 9121191105. AJG-448549

★ రాజులు విడో, 36సం॥, 5'4", MBA, ఫుల్ ఫెయిర్, Hyde లో గ్రానైట్ బిజినెస్, 15 కోట్ల ఆస్థి గల అందమైన వధువుకు 1, 2 వరుడు కావలెను. Whats app 8341705336 AJG-500

★ చౌదరి విడో, 32సం॥, 5'4", ఫుల్ ఫెయిర్, పిల్లలు లేరు, సొంత బిజినెస్, 16 కోట్ల ఆస్థి గల అందమైన వధువుకు 1, 2 వరుడు కావలెను. Whats app 9515738687 AJG-499

★ లంబాడి: B.Tech / C.Govt క్లర్క్ / క్యాసియర్ / పంజాబ్ నేషనల్ బ్యాంక్ / 25,000/-P.m, 5'-5" ఎత్తు, 25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను సెల్ : 9618008271. AJJ-416628

★ OC, 26 Yrs. Fair, B.Tech, 12 కోట్ల స్థిరాస్తి, సాంప్రదాయ కుటుంబం కలిగిన వధువుకు కులపట్టింపు లేని మధ్యతరగతి వరుడు కావలెను. Whatup No.9160886389 AJA-444473

★ రెడ్డి / విడో /44y / 5'3" / ప్లాస్టిక్ ఇండస్ట్రీ హోల్ సేల్/ షాపు రెంట్స్ / 4 PM / మంచి ఆస్తి గల వధువుకి వరుడు కావలెను ఫోన్: 9849435205, 9177300345 AJH-16181

★ కులపట్టింపులేదు / 48y / విడో / 5'4" / B.Sc / Govt. Job / Own House / వధువుకు FC/BC వరుడు కావలెను ఫోన్: 8187873088 AJH-70

★ వెలమ / 48y /5'4" / PG / Govt. Job / అగ్రికల్చర్ ల్యాండ్ / Own బిజినెస్, Own హౌస్ ఉన్న వధువుకి FC/BC వరుడు కావలెను ఫోన్: 9121954252 AJH-70

★ ముదిరాజు / 48y /5'4" / గ్రాడ్యుయేట్ / Govt. Job / Own ప్లాస్టిక్ ఇండస్ట్రీ బిజినెస్ ఉన్న వధువుకి వరుడు కావలెను ఫోన్: 8187874909 AJH-70

★ క్షత్రియ/ 48y / విడో / 5'4" / డిగ్రీ / Govt. Job / Own House, Own కాస్మొటిక్ షోరూం / వెల్ సెటిల్డ్ అందమైన వధువుకి FC/BC వరుడు కావలెను ఫోన్: 8096757854 AJH-70

★ కాపు / 30y / 5'4" / డైవర్స్ / ఫెయిర్, సొంత టెక్స్‌టైల్స్ & రెడీమేడ్స్ / 1 Cr. ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. Hyd. లో సొంత ఇల్లు. ఫోన్: 8790527332 AJH-411626

★ కమ్మ / 29y / 5'5" / లేట్ మ్యారేజ్ / ఫెయిర్, వెడ్డింగ్ కార్డ్స్ డిజైనర్ / 3 Cr. ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. ఫోన్: 8686683575 AJH-411626

★ రెడ్డి / 32y / విడో / 5'4" /Govt Job. 55000, P/M / సొంత ఇల్లు / ఫైనాన్స్ బిజినెస్ Hyd.లో 8 Cr. ప్రాపర్టీ గల కుల పట్టింపు లేని వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7337508942 AJH-411626

★ రెడ్డి / 29y / 5'5" / డైవర్స్ / ఫెయిర్ / సొంత ఆటో ఫైనాన్స్ / 2 Cr. ప్రాపర్టీ గల తండ్రి లేని అందమైన వధువుకు కుల పట్టింపు లేని బిజినెస్ చూసుకొనే వరుడు కావలెను. ఫోన్: 7997913167 AJH-411626

★ కుల ఆస్తి పట్టింపులేదు / విడో / 45y / Govt Employee Hydలో బిజినెస్ ఉన్న వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8125106266 AJH-16415

★ కుల పట్టింపులేదు / క్షత్రియ / 36y / విడో / 5'3" / గైనకాలజిస్ట్ / Hydలో Own House (Rents) ఆంధ్రాలో బిజినెస్.3L P/M వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9959936450 AJH-16415

★ కుల పట్టింపులేదు / రెడ్డి / 32y / 5'4" / విడో / M.S.,B.Ed., Govt. Employee లెక్చరర్ / వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 8885925554 AJH-16415

శ్రీ పర్వతనేని మ్యారేజ్‌బ్యూరో

కమ్మవారికి మాత్రమే (హైదరాబాద్ -విజయవాడ)

రాజశేఖర్: 8143436464, Hyd: 8143438383, VJA:8143436363, 8143536363, email : spmbhyd@gmail.com, Whats App No.: 8143438383

వరుడు కావలెను

★ కమ్మ (USA): 26/5'8"/ V.Fair, MS $ 140K, Green Card, 40Cr. ★ 26/ 5'7"/ M.Tech (IIT) $ 90K, 8Cr. ★ 25/ 5'3"/ MS $ 60K, 20 Cr. Ph: 8143436464

★ కమ్మ (USA): 27/5'7"/ V.Fair, MBA $ 80K, Microsoft 15Cr. ★ 25/ 5'4"/ V.Fair, MS $ 75K, 10Cr. ★ 27/ 5'4"/V.Fair, M.Sc (Bits) $ 100K, 10 Cr. Ph: 8143438383

★ కమ్మ (USA): 26/5'8"/ Beautiful MS, $ 100K, 10Cr. ★ 27/ 5'6"/ V.Fair, MS $ 140K, 8Cr. ★ 28/ 5'7"/IIT, MS $ 150K, 5Cr. Ph: 8143436363

★ కమ్మ (USA): 26/5'8"/ V.Fair, MS $ 90K, 7Cr. ★ 27/ 5'7"/ V.Fair, MS $ 95K, 5Cr. ★ 26/ 5'8"/V.Fair, MS, $ 85K, 5Cr. Ph: 8143438383

★ కమ్మ (INDIA):26/5'8"/V.Fair, IIT,IIM, 15L PA, 25Cr. ★ 27/5'5"/BE, MBA, 7L PA, 3Cr. ★ 25/ 5'6"/V.Fair, BE, MBA, 9LPA, 10Cr. Ph: 8143436464

★ కమ్మ (INDIA): 24/5'8"/ BE, MBA, 7L PA, 5 Cr. ★ 24/ 5'6"/ BE, MBA, 7.5L PA, 3Cr. ★ 22/ 5'3"/ BE, TCS, 15Cr. Ph: 8143536363

★ కమ్మ (INDIA): 23/5'2"/V.Fair, BE, MS, 5L PA, 25Cr. ★ 24/ 5'5"/V.fair, BE, MBA, 20Cr. ★ 24/ 5'5"/M.Tech, IBM 6L PA, 5Cr. Ph: 8143436363

★ కమ్మ : 22/5'5"/V.Fair, BE, 7Cr. ★ 24/ 5'4"/V.Fair, BE, MBA, 19L PA, 8Cr. ★ 24/ 5'4"/ BE (IIIT) 18 L PA, 4Cr. B' Lore Ph: 8143438383

★ కమ్మ (Doctor): 27/5'6"/V.Fair, MD (Radialogy),100Cr. ★ 26/5'5"/ V.Fair, MD (Dermatology) 15Cr. ★ 26/ 5'8"/V.Fair, MD (Pediatrics) 50Cr. Ph: 8143436464

★ కమ్మ (Doctor): 27/5'5"/V.Fair, MS (OBG) 20Cr. ★ 27/ 5'6"/ V.Fair, MD (GM) 25Cr. ★ 25/ 5'5"/V.Fair, MBBS, 20Cr. Ph: 8143438383

★ కమ్మ (Divorce): 25/5'4"/MS, BUSINESS 40Cr. Hyd. ★ 29/ 5'5"/ MS(OBG) MCH 15Cr. ★ 35/ 5'5"/V.Fair, BE $ 140K, Citizen /USA, 5Cr. Ph: 8143436464

వధువు కావలెను

★ కమ్మ (USA): 27/6'/ MBA (USA) $ 270K, 80Cr. ★ 28/ 5'10"/ MS $ 110K, 50Cr. ★ 27/ 6'/ BE (Bits) MS $ 105K, 50Cr. Ph: 8143438383

★ కమ్మ: 26/5'10"/ MS, $ 90K, 25Cr. ★ 27/ 5'8"/ MS $ 120K, 30Cr. ★ 28/ 6'/ MS, $ 105K, 25Cr. Ph: 8143436464

★ కమ్మ : 28/5'11"/ IIT $ 120K, 15Cr. ★ 27/ 6'2"/ MS $ 80K, 20Cr. ★ 25/6'/ MBA (USA) $ 150K, 30Cr. Ph: 8143436363

★ కమ్మ : 29/5'10"/IIT, IIM, $ 200K, Microsoft 15Cr. ★ 26/ 5'11"/ IIT, MS, $ 100K, IBM, 5Cr. ★ 27/ 6'1"/ MS, $ 140K, Cisco 10Cr. Ph: 8143438484

★ కమ్మ (INDIA): 28/6'/IIT, IIM, 32LPA, 20Cr. ★ 31/5'11"/IIT, IIM, 36LPA, 10Cr. ★ 28/ 6'/BE (NIT) 60L PA, Hyd. Ph: 8143438383

★ కమ్మ: 27/6'/ BE, MS, 22LPA, Hyd, 5Cr. ★ 29/ 5'8"/ BE, (Bits) 24L PA, Hyd. ★ 27/ 6'/ BE, MS, 10 LPA, 15Cr. Ph: 8143436363

★ కమ్మ (Govt): 28/5'9"/MS Dy. E.E. 12 L PA, 4 Cr. ★ 27/ 5'9"/V.Fair, BE, 50K 10Cr. ★ 28/ 5'10"/BE, 6L PA, 2Cr. Ph: 8143438383

★ కమ్మ : 29/5'8"/MS (JNTU) IIL PA 9Cr. ★ 25/ 5'11"/BE, 8LPA, Hyd, 5Cr. ★ 27/ 5'11"/ PG, 2L PM, 10Cr. Ph: 8143436464

★ కమ్మ (Business): 27/5'11"/MS, Business, Hyd 40Cr. ★ 26/5'9"/ MBA Business, Hyd, 50Cr. ★ 27/ 5'11"/ MBA, Business 100Cr. Hyd, Ph: 8143438383

★ కమ్మ (Doctor): 28/6'2"/V.Fair, MS (GS) 50Cr. ★ 29/ 5'10"/ MD (GM) 40Cr. ★ 31/ 6'1"/MS (ortho), 20Cr. Ph: 8143438383

★ కమ్మ (Divorce): 31/5'11"/MS, (Ortho), V.Fair, 30Cr. ★ 29/ 6'2"/ MBA (Bits) 40L PA, 10Cr. ★ 28/ 5'11"/M.Tech (IIT) 30L PA, 15Cr. Ph: 8143436464

★ యాదవ / విడో / 42y / Degree Govt. Job. 50,000/- p.m. హోల్‌సేల్ క్లాత్ షోరూం /Hydలో సొంత ఇల్లు గల వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7093467996 AJH-16415

★ అన్ని కులముల వార్కి మీకు తగిన పెండ్లి సంబంధములు కాకినాడ లేక రాజమండ్రి ఏరియాలకు చెందినవారిలో ఉంటే చూడబడును. వరులు ప్రభుత్వ/ప్రైవేట్ ఉద్యోగస్తులు/ వ్యాపారస్తులై ఉండవలెను. ✆ 9493782649 Whatsapp శ్రీ మాతా మ్యారేజ్ లైన్స్ (రిజి). కాకినాడ-5. AJD-443981

కళ్యాణ వేదిక

★ కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో : 1వ,2వ, లేట్ మ్యారేజెస్, డైవర్సీస్, విడో, విడోవర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి త్వరగా సంబంధాలు కుదుర్చబడును (స్త్రీలకు ఫ్రీ రిజి॥) ఫోన్: 7416303057 AJH-062

★ సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే శ్రీ బాలాజీ మ్యారేజ్ బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. ఫోన్: 8555980066/8328388014 AJH-062

★ శ్రీ గణేష్ మ్యారేజ్‌బ్యూరో అన్ని కులాల, మతాల వారికి 1వ, 2వ, USA సంబంధాలు వెంటనే కుదుర్చబడును. మగవారికి ఫీజు : 1000/-, ఆడవారికి ఫ్రీ. ఫోన్: 7660971900 email:devirazia@gmail.com AJH-062

★ గజలక్ష్మి మ్యారేజ్ బ్యూరో 10వ వార్షికోత్సవం సందర్భంగా 2 సంబంధాలు ఫ్రీగా కుదుర్చబడును. అన్ని కులాల, అన్ని మతాల వారికి, USA సంబంధాలు కూడా కుదుర్చబడును. ఫోన్: 9059900033 AJH-062

★ కమ్మ / రెడ్డి / కాపు, గౌడ్ వారి ఉన్నతమైన సాంప్రదాయ బద్ధమైన వివాహ సంబంధముల కొరకు సంప్ర. Hyd : 8500747535 / విజయవాడ: 9533133969 AJH-15900

★ అన్ని కులాల 1వ, 2వ, లేట్, డైవర్సీ, విడో, పెన్షనర్స్, 23 నుండి 60 సం.ల Pvt. & Govt. Jobs సంబంధములకై సంప్రదించగలరు. Cell: 6300875228, 8008500472 AJH-15946

అన్నపూర్ణ మ్యారేజెస్

● అన్ని కులముల వారికి పెళ్ళి సంబంధములు కుదర్చబడును ●

www.annapurnamarriages.com

గుంటూరు హెడ్ ఆఫీస్ - 9397979718,
విజయవాడ బ్రాంచ్ ఆఫీస్ - 83673 44466, ఒంగోలు బ్రాంచ్ ఆఫీస్ - 93937 63666,
తెనాలి బ్రాంచ్ ఆఫీస్ - 99851 44113, నెల్లూరు బ్రాంచ్ ఆఫీస్-93979 79740

ఫ్రీగా పెళ్ళి కావలసిన వరుడు, వధువు మీ పూర్తి వివరములను ఇచ్చి IDగా రిజిష్టర్ చేసుకోగలరు.

వరుడు కావలెను

★ కాపు- (29338); A-31; 5'5"; Ph.D(Commencing) at USA; ఆదాయం- 15.54Lapa; ఆస్థి- Land& Gold; ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకి USA లో జాబ్ చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 9397979750

★ హిందు మాదిగ - (26449); A-35; 5'3"; MBBS, MS (Medical); Manager Informatics in hospital at USA; ఆదాయం- 55La/Pa వున్న సాంప్రదాయమైన అందమైన వధువుకు హిందువులలో కుల పట్టింపు లేని MS (Medical) / MS(Eng) చదివి USA లో జాబ్ చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 9397979718

★ కమ్మ-(28377); A-25; 5'4"; MD(Medical)-Opthamologist (Commencing); ఆస్థి- 5 Crores; ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకు MD(Medical) చదివిన వెల్‌సెటిల్డ్ Doctor వరుడు కావలెను. 7799389555

★ కాపు-(29441); A-23; 5'2"; B.Tech; SWE; ఆదాయం- 3.5 La/Pa; ఆస్థి- 1House; ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకు B.Tech చదివి SWE జాబ్ చేసే వరుడు కావలెను. 9397979750

★ ఆర్యవైశ్య-(27687); A-28; 5'2"; B.Tech; SWE, ఆదాయం- 4La/Pa; ఆస్థి- Gold ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకు B.Tech చదివి SWE జాబ్ చేసే వరుడు కావలెను. 8184911555

★ రెడ్డి -(29976); A-27; 5'3"; Pharm.D; ఆస్థి-10acrers Land& gold ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకు MD/MS(Medical) చదివిన వెల్‌సెటిల్డ్ Doctor వరుడు కావలెను. 8367055566

★ రెడ్డి-(30527); A-26; 5'8"; MBA; pvt.Job; ఆదాయం- 1.8 La/Pa, ఆస్థి- Land & cash; ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకు B.Tech చదివి SWE జాబ్ చేసే వరుడు కావలెను 8184911555

★ ఆర్యవైశ్య -(30689); A-26; 5'2"; B.Tech;SWE; ఆదాయం- 7La/Pa ఆస్థి- 10Lakhs; ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకు M.Tech/B.Tech చదివి SWE జాబ్ చేసే వరుడు కావలెను. 8297747666

★ యాదవ(29796); A-23; 5'3"; B.Com; ఆస్థి- 4Lakhs; ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకు B.Tech చదివి Govt/ Pvt Job/ Business చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 9397979718

వధువు కావలెను

★ కమ్మ-(19387); A-31; 5'10"; B.Tech; SWE; ఆదాయం- 9 La/Pa; వున్న వెల్‌సెటిల్డ్ వరుడుకు B.Tech చదివి Pvt.Job చేసే సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367055599

★ రెడ్డి-డైవర్సి - (11492); A-41; 6'2"; M.Sc; Business; ఆదాయం- 30 La/Pa; ఆస్థి- 100Cr; ప్రాపర్టీ కలిగిన వరుడుకు MBA/MCA/MSc చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 9397979718

★ కాపు - (30045); A-28; 5'6"; B.Tech; Business; ఆదాయం- 50 La/Pa, ఆస్థి- 1building& 1Site ప్రాపర్టీ కలిగిన వరుడుకు డిగ్రీ చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 9397979718

★ కమ్మ - (28216); A-28; 6'; MS (Eng); SWE at USA; ఆదాయం- 64 La/Pa, ఆస్థి- 3crores ప్రాపర్టీ కలిగిన వరుడుకు MS (Eng) చేసి USA లో జాబ్ చేసే అందమైన వధువు కావలెను. 8184911555

★ విశ్వబ్రాహ్మణ-(29333); A-29, 5'7", B.Pharmacy; Job at Canada; ఆదాయం- 60La/Pa; ఆస్థి- 3crores ప్రాపర్టీ కలిగిన వరుడుకు B.Pharmacy చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 7799389555

★ బ్రాహ్మణ-(25412); A-31, 5'7", B.Tech; Pvt.Job; ఆదాయం- 9.50La/Pa; ఆస్థి- 1House; ప్రాపర్టీ కలిగిన వరుడుకు B.Tech చదివి Pvt.Job చేసే సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367055566

★ కాపు-(28936); A-32, 5'4"; B.Sc; Pvt Job; ఆదాయం- 3.6La/Pa; ఆస్థి- 3Plots; ప్రాపర్టీ కలిగిన వరుడుకు డిగ్రీ చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367055566

★ క్రిస్టియన్ మాల-(29210); A-35; 5'5"; 10th; Finance Business; ఆదాయం- 4La/Pa, Business; చేస్తున్న వరుడుకు 10th చదివిన అందమైన వధువు కావలెను. 7799389555

★ క్రిస్టియన్ మాదిగ-(29954); A-37; 6"; B.Sc; Pvt. Manufacturing Company at USA; ఆదాయం- 41 La/Pa, ఆస్థి- House; ప్రాపర్టీ కలిగిన వరుడుకు డిగ్రీ చదివిన అందమైన వధువు కావలెను. 8297747666

★ మీ అమ్మాయికి / అబ్బాయికి పెళ్లి సంబంధం కావాలా? గత 20 సం॥లుగా విశేష అనుభవం గల సంస్థ. Doctor, PG, Engg., Govt./Pvt. సంబంధాల కొరకు 9849072372, 0891-2739003. www.sweethomemarriage.com AJV_440234

★ వెంకటాద్రి మ్యారేజ్ బ్యూరో. 1st, 2nd & Late Marriages అన్ని కులాల వారికి సంబంధాలు చూడబడును. సంప్ర॥ 9959328840, 8519887907 AJV_440330



గమనిక: ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.



ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ప్రకటనల కొరకు

మీ దగ్గరలోని ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయాలలో సంప్రదించండి

మహబూబ్‌నగర్	: 9985411365	రంగారెడ్డి	: 9985410909	ఒంగోలు	: 9985411483
నిజామాబాద్	: 9985411453	మెదక్	: 9985410904	గుంటూరు	: 9985411217
కరీంనగర్	: 9985411273	కర్నూలు	: 9985411363	విజయవాడ	: 9985411614
ఆదిలాబాద్	: 9985411293	అనంతపురం	: 9985411165	తణుకు	: 9985411543
వరంగల్	: 9985411172	కడప	: 9985411183	కాకినాడ	: 9985411204
ఖమ్మం	: 9985401672	తిరుపతి	: 9985411423	విశాఖపట్నం	: 9985411641
నల్గొండ	: 9985410384	నెల్లూరు	: 9985411013	శ్రీకాకుళం	: 9985411066
				విజయనగరం	: 9985411522

ప్రతి 4 లైన్ల ప్రకటనకు రూ.800/- (కంబైన్డ్)
ప్రతి అదనపు లైన్‌కు రూ.130/- (GST అదనం)

ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నం.76, రోడ్ నం.70, అశ్విని లే అవుట్, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33. ఫోన్: 040-23558233/44/55/66. సెల్: 9985921380.

ఆర్ఇ/మాక్స్ వ్యాపార లక్ష్యం రూ..300 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ బ్రోకరేజ్ సంస్థ ఆర్ఇ/మాక్స్.. భారత్‌లో ఫ్రాంఛైజీ ఇండియాతో కలిసి కొత్త డివిజన్‌ను ఏర్పాటు చేసింది. హై ప్రీమియం గృహ విభాగం కోసం సమగ్రమైన వాణిజ్య, రెసిడెన్షియల్, లీజింగ్ సేవలను అందించేందుకు ఆర్ఇ/మాక్స్ కలెక్షన్ పేరుతో తొలి కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. తొలుత తెలంగాణ, ఎపిలోని నగరాల్లో సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి రానున్నట్లు ఆర్ఇ/మాక్స్ సిఒఒ యతిన్ శర్మ చెప్పారు. దేశంలోని ఇతర ప్రధాన నగరాలకు సేవలను విస్తరించనున్నట్లు తెలిపారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 300 కోట్ల రూపాయల వ్యాపారాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. లగ్జరీ, ఎన్ఆర్ఐ ఆస్తులకు హైదరాబాద్ దేశంలోనే నాలుగో అతిపెద్ద మార్కెట్ ఉందని, ఇక్కడ అపారమైన వ్యాపార అవకాశాలున్నాయని ఎపి, తెలంగాణ హెడ్ కృష్ణన్ మల్హోత్రా తెలిపారు.

తెలంగాణలో మరో పారిశ్రామిక పార్క్

నిర్మాణ, బిల్డింగ్ మెటీరియల్ తయారీ కోసం ఏర్పాటు.. రాష్ట్ర ప్రభుత్వం, కెఫ్ హోల్డింగ్స్ భాగస్వామ్యం

- 250 ఎకరాల విస్తీర్ణంలో పార్క్ అభివృద్ధి
- 10 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి
- రూ.650 కోట్ల పెట్టుబడి పెట్టనున్న కెఫ్ హోల్డింగ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణలో మరో భారీ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నిర్మాణ, బిల్డింగ్ మెటీరియల్ తయారీ కోసం ఈ పార్క్ ఏర్పాటుకానుంది. ఈ రంగంలో అనుభవం కలిగిన కెఫ్ హోల్డింగ్స్ భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పార్క్‌ను నెలకొల్పాలని ప్రతిపాదించడం విశేషం. 250 ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్క్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా 10,000 మందికి ఉపాధి కలుగనుంది. ఈ పార్క్‌లోనే 650 కోట్ల రూపాయల పెట్టుబడితో యుఎఇ కేంద్రంగా ఉన్న కెఫ్ హోల్డింగ్స్‌కు చెందిన కెఫ్ ఇన్‌ఫ్రా తన తయారీ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయనుంది. శనివారంనాడిక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రతిపాదిత పార్క్ వివరాలను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కె తారక రామారావు తెలిపారు. నిర్మాణ, బిల్డింగ్ మెటీరియల్ తయారీ పార్క్ దేశంలో మొదటిదని, హైదరాబాద్ పరిసరాల్లో ఈ పార్క్‌ను ఏర్పాటు చేస్తామని ఆయన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కెటిఆర్. చిత్రంలో కెఫ్ హోల్డింగ్స్ చైర్మన్ ఫైజల్

చెప్పారు. ఈ పార్క్‌కు అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం ఇవ్వడమేకాకుండా మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని, పరిశ్రమల్లో ఉపాధి లభించే విధంగా స్థానిక యువతకు శిక్షణను అందించనున్నామని కెటిఆర్ తెలిపారు. ప్రీఫాబ్రికేటెడ్ విడిభాగాలు, బిల్డింగ్‌లకు అవసరమైన ఉత్పత్తుల వల్ల అతి తక్కువ కాలంలోనే నిర్మాణాలను పూర్తి చేయవచ్చన్నారు. ఇక్కడి పార్క్‌లో తయారయ్యే ఉత్పత్తులను అందుబాటు ధరల్లో నిర్మిస్తున్న గృహాలు, నాలాలు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలోనూ వినియోగించవచ్చని చెప్పారు. ఈ పార్క్ వల్ల తెలంగాణకు చాలా ఉపయోగాలుంటాయని తెలిపారు. కెఫ్ హోల్డింగ్స్‌కు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం లభిస్తుందని చెప్పారు.

ఇతర రాష్ట్రాలను కాదని తెలంగాణకు : ఫైజల్

తమ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని పలు రాష్ట్రాలు ఆహ్వానించినప్పటికీ తాము మాత్రం తెలంగాణలో ప్లాంట్ నెలకొల్పేందుకే ప్రాధాన్యం ఇచ్చామని కెఫ్ హోల్డింగ్స్ అండ్ కెఫ్ ఇన్‌ఫ్రా వ్యవస్థాపకుడు, ఛైర్మన్ ఫైజల్ ఇ కొట్టికొలాన్ తెలిపారు. ప్రభుత్వం పరిశ్రమలకు సానుకూలంగా ఉందని, తమలాంటి పరిశ్రమలకు హైదరాబాద్ చాలా అనువైన ప్రదేశమని ఆయన చెప్పారు. తమిళనాడులోని కృష్ణగిరిలో ప్రపంచస్థాయి టెక్నాలజీతో ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేశామని, ఇప్పటికే అనేక హాస్పిటల్, గృహ, హోటల్, కమర్షియల్ బిల్డింగ్ ప్రాజెక్టులను పూర్తి చేశామన్నారు. తాము తెలంగాణలో ఏర్పాటు చేసే యూనిట్‌కు అనుబంధంగా మరో 16-17 యూనిట్ల ఏర్పాటుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపాదించిన నిర్మాణ, బిల్డింగ్ మెటీరియల్స్ తయారీ పార్క్ ద్వారా 5,000-6,000 కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.



సిఐఐ-దక్షిణ ప్రాంత మండలి సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్

మార్చి 8న వి-హబ్ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణకు అవసరమైన అంతర్జాతీయ ప్రమాణాల కోసం తెలంగాణ పోటీపడుతోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటి రామారావు చెప్పారు. ఇందు కోసం భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) వంటి సంస్థలు నిర్మాణాత్మకమైన సూచనలతో రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సిఐఐ-దక్షిణ ప్రాంత మండలి సమావేశంలో కెటిఆర్ ఈ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కాలేజీలు, పరిశ్రమల అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చి పట్టభద్రులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సహకరించాలన్నారు. ఈ అంతరాన్ని పూడ్చేందుకు త్వరలో అత్యాధునిక తయారీ సంస్థ(ఎఎంఐ)ను ఏర్పాటు చేయబోతున్నట్టు చెప్పారు ఈ సంస్థను జర్మనీ తరహాలో ఏర్పాటు చేయాలా? లేక మరో పద్ధతిలో ఏర్పాటు చేయాలా? అనే విషయంలో సిఐఐ అవసరమైన సూచనలు చేయాలన్నారు. మార్చి 8న అంతర్జాతయ మహిళా దినోత్సవం రోజు టి-హబ్ తరహాలో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా ఒక ఇన్‌క్యుబేటర్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.

విధానాలే సమస్య

ఇటీవల జపాన్‌లో పర్యటించినప్పుడు అక్కడి ఒక పారిశ్రామికవేత్త వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని కెటిఆర్ ఈ సందర్భంగా వెల్లడించారు. 'భారత్‌లో తయారీ మంచి కార్యక్రమం. అయితే భారత్‌లో పెట్టుబడి పెట్టాలంటే ఇప్పటికీ విధానపరంగా కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి' అని ఓ ప్రముఖ జపాన్ పారిశ్రామికవేత్త తనతో అన్నట్టు తెలిపారు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి సిఐఐ అవసరమైన సూచనలు చేయాలని కోరారు. హైదరాబాద్‌లో అనువైన వాతావరణం ఉండబట్టే మైక్రోసాఫ్ట్, గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్ వంటి అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు స్థానికంగా తమ యూనిట్లు ఏర్పాటు చేశాయన్నారు. త్వరలోనే తమ ప్రభుత్వం ఇ-వెహికల్స్ విధానం ప్రకటిస్తుందన్నారు.

వైమానిక, రక్షణ రంగ కంపెనీలను తెలంగాణకు ఆకర్షించడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలిపారు.


ఆర్‌బిఐ బోర్డు సమావేశంలో ఆర్థిక మంత్రి జైట్లీ, సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా, ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్

ముందుచూపు ఉండాల్సిందే..

- ద్రవ్య పరపతి విధాన నిర్ణయాలపై ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్

ధరల్లో రోజువారీ హెచ్చుతగ్గుల ఆధారంగా ద్రవ్యపరపతి విధాన నిర్ణయాలు తీసుకోలేమని, ఈ విషయంలో ముందుచూపు అవసరమని ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల గమనం అంచనా వేయలేకుండా ఉందన్న పటేల్.. ఈ మధ్యకాలంలో ధరలు రెండు వైపులా (ఎగువముఖం, దిగువముఖం) కదలాడుతున్న నేపథ్యంలో పరిణామమేదైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జైట్లీతో పోస్ట్ బడ్జెట్ మీట్ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పటేల్ మాట్లాడుతూ.. మున్ముందు రుణ వృద్ధి పుంజుకోగలదని, కంపెనీలు క్యాపిటల్ మార్కెట్ నుంచి తగినన్ని నిధులు సేకరించగలవని ధీమా వ్యక్తం చేశారు. ఈవారంలో జరిగిన ద్రవ్యపరపతి సమీక్షలో కీలక వడ్డీ (రెపో) రేట్లను యథాతథంగా కొనసాగించడంపై జైట్లీ స్పందిస్తూ.. ఆర్‌బిఐ సరైన నిర్ణయమే తీసుకుందన్నారు.

బుడగల్ని ముందే గ్రహించాలి..

స్టాక్ మార్కెట్‌లో ఏర్పడే వాల్యువేషన్ బబుల్ (బుడగ) భారీ సమస్యకు దారితీయకముందే జాగ్రతపడాల్సిన అవసరం ఉందని, ఆర్థిక సేవల మార్కెట్ నియంత్రణ మండళ్లుగా ఆర్‌బిఐ, సెబి ఈ తరహా సమస్యలను ముందే గుర్తించగలగాలని ఉర్జిత్ పటేల్ అన్నారు.

ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూలతల వల్లే దేశీయ ఈక్విటీ మార్కెట్లు కూడా పతనమయ్యాయని పటేల్ పేర్కొన్నారు.

'లోటు' గీత దాటం

- వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి సర్కారు ఖజానా మళ్లీ గలగల
- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆశాభావం

న్యూఢిల్లీ: ద్రవ్య స్థిరీకరణ లక్ష్యాలికపై గురి తప్పబోవని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19) నుంచి ప్రభుత్వ ఆదాయం మెరుగుపడనుందని ఆయన అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో పెరిగిపోతున్న ముడిచమురు ధరలపై ఆందోళనక్కర్లేదన్న జైట్లీ.. స్వల్పకాలిక హెచ్చుతగ్గుల ఆధారంగా అభిప్రాయం ఏర్పరుచుకోవడం సబబుకాదన్నారు. శనివారం ఆర్‌బిఐ సెంట్రల్ బోర్డుతో సమావేశమైన అనంతరం జైట్లీ మీడియాతో ఈ విషయం చెప్పారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2017-18) ద్రవ్యలోటును తొలుత 3.2 శాతంగా అంచ నా వేసినప్పటికీ.. 3.5 శాతానికి సవరించారు. వృద్ధికి ఊతమిచ్చేలా ప్రభుత్వ పెట్టుబడులు పెంచేందుకు అదనపు రుణాలు సేకరించడంతో ద్రవ్యలోటు అదుపుతప్పింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19) లోటును జిడిపిలో 3.3 శాతానికి కట్టడి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఈ నెల 1న బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా జైట్లీ ప్రకటించారు. గతంలో నిర్దేశించుకున్న ద్రవ్య స్థిరీకరణ రోడ్‌మ్యాప్ ప్రకారంగా ఈసారి లోటును 3.2 శాతానికి, వచ్చేసారి 3 శాతానికి కట్టడి చేయాల్సింది.

రైతులకు పంటసాగుకయ్యే ఖర్చుకు 1.5 రెట్ల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ను చెల్లించనున్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. దీన్ని ఎలా అమలు చేయాలి.. రైతులు, కమోడిటీ ధరలు, ఎగుమతుల పోటీతత్వంపై ఈ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశాలపై ఆర్‌బిఐ బోర్డు సమావేశంలో చర్చించడం జరిగిందని జైట్లీ తెలిపారు. సెబి బోర్డుతో జరిగిన పోస్ట్ బడ్జెట్ సమావేశంలో దీర్ఘకాల మూలధన లాభాల (ఎల్‌టిసిజి) పన్నుపై చర్చించినట్లు ఆయన చెప్పారు.

బాండ్ మార్కెట్ వృద్ధికి మరిన్ని చర్యలు..

కార్పొరేట్ బాండ్ మార్కెట్ మరింత పుంజుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి 'సెబి'ని ఆర్థిక మంత్రి కోరారు. అంతేకాదు, పబ్లిక్ ఆఫరింగ్‌లలో (ఐపిఒ) కొనసాగుతున్న అప్‌ట్రెండ్ వచ్చే ఆర్థిక సంవత్సరం డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాల సాధనకు దోహదపడగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత మార్కెట్ ట్రెండ్స్‌తోపాటు ఈ మధ్యకాలంలో చేపట్టిన చర్యలను సెబి ఛైర్మన్ అజయ్ త్యాగీ మంత్రి జైట్లీకి వివరించారు. సెబికి సంబంధించి బడ్జెట్‌లో ప్రకటించిన నిర్ణయాలపైనా బోర్డు సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు.

మరికొంతకాలం ఊగిసలాట

- స్టాక్ మార్కెట్ ట్రెండ్‌పై సెబి చీఫ్ త్యాగీ



అంతర్జాతీయ మార్కెట్లో ప్రతికూలతల కారణంగా దేశీయ స్టాక్ సూచీలు మరికొంత కాలం తీవ్ర ఊగిసలాటలకు లోనుకావచ్చని సెబి ఛైర్మన్ అజయ్ త్యాగీ అన్నారు. అయితే, మార్కెట్ల భద్రత విషయంలో ఇన్వెస్టర్లకు ఆందోళన అక్కర్లేదని ఆయన పేర్కొన్నారు. వాల్‌స్ట్రీట్ ఇచ్చిన షాక్‌తోపాటు దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టిజిసి) పన్ను విధింపు కూడా తోడై ఈ మధ్యకాలంలో స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. ఏడాదికిపైగా హోల్డ్ చేస్తున్న షేర్ల విక్రయం ద్వారా ఆర్జించిన లాభం రూ.లక్ష దాటితే 10 శాతం ఎల్‌టిసిజి చెల్లించాలని బడ్జెట్‌లో జైట్లీ ప్రకటించారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఇన్వెస్టర్ల నుంచి ఇప్పటివరకైతే ఎలాంటి రిప్రజెంటేషన్లు రాలేదని త్యాగీ వెల్లడించారు. ఎల్‌టిసిజి విధింపుతో ఈక్విటీ మార్కెట్‌పై ప్రభావం స్వల్పమేనన్న త్యాగీ.. అంతర్జాతీయ పరిణామాలతోనే ముప్పు పొంచి ఉందన్నారు. సెబి బోర్డు జైట్లీతో భేటీ అయిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో త్యాగీ ప్రస్తావించిన మరిన్ని ముఖ్యాంశాలు..

విదేశాల్లో దేశీ సూచీల ట్రేడింగ్

భారత స్టాక్ ఎక్స్ఛేంజీలు విదేశాల్లో తమ సూచీల ట్రేడింగ్‌ను నిలిపివేయాలని నిర్ణయానికొచ్చాయి. దీన్ని తిరోగమన చర్యగా చూడరాదు. స్టాక్ ఎక్స్ఛేంజీలు తమ వాణిజ్య ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నాయి.

ఐపిఒలు, కమోడిటీ మార్కెట్లపై ఫోకస్

ఈ ఏడాది సెబి ప్రధానంగా పబ్లిక్ ఆఫరింగ్(ఐపిఒ)లు, కార్పొరేట్ బాండ్లు, కమోడిటీ మార్కెట్లపైనే దృష్టిసారించనుంది. కమోడిటీ మార్కెట్లలోకి మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను అనుమతించే విషయంపైనా త్వరలోనే సెబి తన నిర్ణయాన్ని వెల్లడించనుంది.

డిపాజిట్లకు ఫండ్లు ప్రత్యామ్నాయం కాదు..

బ్యాంక్ డిపాజిట్లకు మ్యూచువల్ ఫండ్లు ప్రత్యామ్నాయం కాదు. డిపాజిట్లలాగా ఫండ్లు అస్యూర్డ్ రిటర్నులు పంచవు. అయితే, క్యాపిటల్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాలనుకునే రిటైల్ ఇన్వెస్టర్లకు ఫండ్లు మంచి మార్గం.

సెప్టెంబరుకల్లా లైట్ టచ్ నిబంధనలు

కార్పొరేట్ బాండ్ మార్కెట్లను మరింత విస్తృతం చేసేందుకు ఈ ఏడాది సెప్టెంబరుకల్లా సెబి లైట్ టచ్ నిబంధనలను ప్రవేశపెడతాం. లిస్టెడ్ కంపెనీలు తమకు అవసరమైన నిధుల్లో 25 శాతం తప్పనిసరిగా బాండ్ మార్కెట్ నుంచి సేకరించేలా నిబంధన విధించాలన్నది ప్రతిపాదన.

పాలన ప్రమాణాలపై వచ్చేసారి చర్చ

కార్పొరేట్ పాలన ప్రమాణాలపై ఉదయ్ కొటక్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ సమర్పించిన నివేదికపై వచ్చే బోర్డు సమావేశంలో చర్చిస్తాం. కమిటీ ప్రతిపాదనలపై కార్పొరేట్ వ్యవహారాలు, ఆర్థిక మంత్రిత్వ శాఖలతో ఇప్పటికే ప్రాథమికంగా చర్చించాం.

ఫోర్టిస్‌పై కన్ను

దేశంలో అతిపెద్ద కార్పొరేట్ హాస్పిటల్స్ నిర్వహణ సంస్థ ఫోర్టిస్ హెల్త్‌కేర్ చుట్టు ముసురుకున్న వివాదంపై కన్నేసి ఉంచాం. నిబంధనలకు విరుద్ధంగా ప్రమోటర్లకు చెందిన ఇతర కంపెనీలకు రూ.500 కోట్ల వరకు నిధులు బదిలీ చేసిందని ఫోర్టిస్ హెల్త్‌కేర్ ఆరోపణలు ఎదుర్కొంటోంది.

త్వరలో బిట్‌కాయిన్ నిబంధనలు

క్రిప్టో కరెన్సీలకు ప్రత్యేక నిబంధనలను త్వరలోనే ప్రకటిస్తాం. బిట్‌కాయిన్‌ల నియంత్రణ విషయంలో ఆయా నియంత్రణ మండళ్ల పాత్రపైనా తుది నిర్ణయం తీసుకుంటాం. బిట్‌కాయిన్లను అధికారిక కరెన్సీగా పరిగణించలేమని బడ్జెట్లో జైట్లీ ప్రకటించారు. గత ఏడాదిలో 20 వేల డాలర్ల స్థాయికి పుంజుకున్న బిట్‌కాయిన్ విలువ.. ఈ ఏడాదిలో భారీ పతనాన్ని చవిచూసింది.

బ్యాంకింగ్ ఉద్యోగుల నేత
లక్ష్మీ నరసయ్య కన్నుమూత



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాల్లో కీలకపాత్ర పోషించిన ఎస్‌బిఐ మాజీ ఉద్యోగి పి లక్ష్మీ నరసయ్య (82) కన్నుమూశారు. అఖిల భారత ఎస్‌బిఐ స్టాఫ్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా, ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ వ్యవస్థాపకుడిగా, అధ్యక్షుడిగా లక్ష్మీ నరసయ్య కీలక పాత్ర పోషించారు. బ్యాంకింగ్ ఉద్యోగుల జాతీయ సమాఖ్య (ఎన్‌సిబిఇ) ప్రధాన కార్యదర్శిగా, యునైటెడ్ ఫోరం ఫర్ బ్యాంక్ యూనియన్స్ కన్వీనర్‌గా కూడా వ్యవహరించారు. 38 ఏళ్ల సుదీర్ఘ సేవల తర్వాత లక్ష్మీ నరసయ్య 1999లో పదవీ విరమణ చేశారు. అయినా ఇప్పటికీ ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పరోక్షంగా మార్గదర్శకం చేసేవారని ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ మాజీ సహాయ ప్రధాన కార్యదర్శి రవీంద్ర రెడ్డి చెప్పారు. రాజకీయ పార్టీలతో ఏమాత్రం సంబంధం లేకుండా బ్యాంకింగ్ ఉద్యోగుల ప్రయోజనాల కోసం పని చేసిన తొలి ఉద్యోగ సంఘాల నేతగా లక్ష్మీ నరసయ్యకు పేరుంది. లక్ష్మీ నరసయ్యకు భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. ఉద్యోగుల ప్రయోజనాలపై రాజీపడకుండానే, బ్యాంకింగ్ రంగంలో ఆధునీకరణ, కంప్యూటరీకరణ తప్పనిసరని నమ్మిన వ్యక్తి ఆయన అని బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు గుర్తు చేసుకున్నాయి.





గ్రేటర్ నోయిడాలో జరుగుతున్న ఆటో ఎక్స్‌పో సందర్శకులతో సందడిగా మారిపోయింది. కార్లు, బైకుల కంపెనీలు ప్రదర్శిస్తున్న కొత్త మోడళ్లను చూసేందుకు జనం భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ప్రదర్శనలో ఉన్న బైక్‌ను ఆసక్తిగా చూస్తున్న సందర్శకులను పై చిత్రంలో చూడవచ్చు. పక్క చిత్రంలో హోండా బైక్‌తో బాలీవుడ్ నటి తాప్సీ పన్ను ఫొటోలకు ఫోజులిచ్చారు.

భారత మార్కెట్‌పై హోకుయాప్స్ దృష్టి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సింగపూర్ కేంద్రంగా ఉన్న హోకుయాప్స్ భారత మార్కెట్‌పై ప్రత్యేక దృష్టిసారించింది. ఆసియా పసిఫిక్, అమెరికా, కెనడా మార్కెట్లలోని క్లయింట్లకు సేవలందిస్తున్న తమ సంస్థ.. ఇకపై భారత్‌పైనా ఫోకస్ చేయనుందని హోకుయాప్స్ ఇండియా భాగస్వామి జయ్ క్రిన తెలిపారు. ఇప్పటికే భారత్‌లోని పలు రియల్టీ, ఆటోమోటివ్ కంపెనీలతో కలిసి పనిచేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సంస్థ రాపిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ ప్లాట్‌ఫాం ద్వారా ఆటోమేటెడ్ కస్టమైజ్డ్ అప్లికేషన్స్ డెవలప్‌మెంట్ సేవలందిస్తోంది. భవిష్యత్‌లో వ్యాపార విజయానికి సంస్థల డిజిటల్ మొబిలిటీ సామర్థ్యమే కొలమానం కానుందన్నారు.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,050	31,150	30,900	31,000	30,230
క్రితం ముగింపు	31,070	31,000	30,970	30,950	30,010
22 క్యారెట్లు	28,750	28,800	28,420	28,630	28,790
క్రితం ముగింపు	28,770	28,800	28,490	28,610	28,660
వెండి (కిలో)	38,700	40,200	38,800	39,000	40,600
క్రితం ముగింపు	39,900	40,200	38,800	39,100	40,900

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	70.00	విజయవాడ	75.00
కరీంనగర్	71.00	గుంటూరు	75.00
వరంగల్	72.00	ఒంగోలు	77.00
మహబూబ్‌నగర్	70.00	చిత్తూరు	65.00
కర్నూలు	70.00	నెల్లూరు	73.00
విశాఖపట్నం	71.00	అనంతపురం	72.00
గోదావరి	74.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	353.00	చిత్తూరు	378.00
వరంగల్	355.00	చెన్నై	385.00
విజయవాడ	343.00	నమక్కల్	370.00
గోదావరి	343.00	బెంగళూరు	368.00
విశాఖపట్నం	355.00	ముంబై	397.00

అమర రాజా లాభం రూ.134 కోట్లు

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్) : డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో అమర రాజా బ్యాటరీస్ ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి కంపెనీ నికర లాభం 19.70 శాతం వృద్ధి చెంది 134.45 కోట్ల రూపాయలుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం 112.32 కోట్ల రూపాయలుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం రాబడులు కూడా 1,513.82 కోట్ల రూపాయల నుంచి 1,570.22 కోట్ల రూపాయలకు పెరిగాయి. ఆటోమొబైల్ రంగం అద్భుతమైన పనితీరును కనబరచటంతో ఆకర్షణీయమైన ఫలితాలను రాబట్టుకోగలిగినట్లు అమర రాజా బ్యాటరీస్ సిఇఒ ఎస్ విజయానంద్ తెలిపారు. ఒఇ, రీప్లేస్‌మెంట్ మార్కెట్ విభాగంలో కంపెనీ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆటోమోటివ్ బ్యాటరీ వ్యాపారం, ఇండస్ట్రియల్ బ్యాటరీ విభాగం విక్రయాలు పెరగటం కలిసి వచ్చిందని కంపెనీ పేర్కొంది.

నెట్‌లింక్స్ రాబడి రూ.5 కోట్లు

ఇంటర్నెట్ సర్వీసుల ప్రొవైడర్ నెట్‌లింక్స్ లిమిటెడ్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో 5.28 కోట్ల రూపాయల కన్సాలిడేటెడ్ నికర రాబడులపై 1.02 కోట్ల రూపాయల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం 90 లక్షల రూపాయలుగా ఉంది. సమీక్షా కాలంలో ఇపిఎస్ 0.89 రూపాయలుగా ఉంది.

భారీగా పెరిగిన వామా ఇండస్ట్రీస్ లాభం

హైదరాబాద్‌కు చెందిన ఐటి ఇన్‌ఫ్రా, ఐటిఇఎస్ సంస్థ వామా ఇండస్ట్రీస్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో 28.95 కోట్ల రూపాయల రాబడులపై 1.28 కోట్ల రూపాయల నికర లాభాన్ని సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ మొత్తం రాబడులు 5.65 కోట్ల రూపాయలుగా ఉండగా నికర లాభం 6.64 లక్షల రూపాయలుగా ఉంది. త్రైమాసిక కాలంలో కొత్త ప్రాజెక్టులను చేజిక్కించుకోవటంతో మొత్తం రాబడులు గణనీయంగా పెరిగాయని వామా ఇండస్ట్రీస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రామరాజు వెల్లడించారు.

కాగా డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికిగాను కంపెనీ 91.62 కోట్ల రూపాయల మొత్తం రాబడులపై 1.47 కోట్ల రూపాయల నికర లాభాన్ని నమోదు చేసింది. గురువారం బిఎస్ఇలో కంపెనీ షేరు 1.62 శాతం లాభంతో 25.10 రూపాయల వద్ద క్లోజైంది.

Q3 ఫలితాలు

కోల్ ఇండియా లాభంలో స్వల్ప వృద్ధి

డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కోల్ ఇండియా 3,004.79 కోట్ల రూపాయల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది (2,883.27 కోట్ల రూపాయలు)తో పోల్చితే నికర లాభం 4.21 శాతం వృద్ధి చెందింది. సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం రాబడులు 23,064.65 కోట్ల రూపాయల నుంచి 22,484.14 కోట్ల రూపాయలకు పడిపోయాయి. జిఎస్‌టి అమలు కారణంగా గత ఏడాది రాబడులను సరిపోల్చలేమని కోల్ ఇండియా తెలిపింది. త్రైమాసిక కాలంలో మొత్తం ఉత్పత్తి 14.773 కోట్ల టన్నుల నుంచి 15.20 కోట్ల టన్నులకు పెరిగిందని తెలిపింది.

కరెంట్ అఫైర్స్

దక్షిణ కొరియాలో వింటర్ ఒలింపిక్స్ - 2018

క్రీడలు



అంతర్జాతీయం

స్టాలిన్‌గ్రాడ్ యుద్ధానికి 75 ఏళ్లు

స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం ముగిసి ఈ ఏడాది ఫిబ్రవరి 2కి సరిగ్గా 75 ఏళ్లు. ఈ నేపథ్యంలో రష్యా ప్రభుత్వం వజ్రోత్సవాలను నిర్వహించింది. ఈ సందర్భంగా వాల్గోగ్రాడ్ (అప్పటి స్టాలిన్‌గ్రాడ్)లో జరిగిన వేడుకల్లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మాట్లాడుతూ.. చరిత్రలో ఇలాంటి యుద్ధం జరగలేదని పేర్కొన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో.. హిట్లర్ నేతృత్వంలోని నాజీ సేనలకు, సోవియట్ యూనియన్ సేనలకు మధ్య దక్షిణ రష్యాలోని స్టాలిన్‌గ్రాడ్ నగరంపై అధిపత్యం కోసం యుద్ధం జరిగింది. ఇందులో సోవియట్ సైనికులు విజయం సాధించారు. 1942 జులైలో ప్రారంభమైన ఈ యుద్ధం 200 రోజులు కొనసాగింది. 1943 ఫిబ్రవరి 2న ముగిసింది.

మాల్దీవుల్లో అత్యవసర స్థితి

రాజకీయ సంక్షోభం నెలకొన్న మాల్దీవుల్లో అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ ఫిబ్రవరి 5న అత్యవసర స్థితి విధించారు. దీంతో భద్రతా దళాలకు విశేషాధికారాలు సంక్రమిస్తాయి. అనుమానితులను వారు అరెస్ట్ చేయొచ్చు, నిర్బంధించొచ్చు. 15 రోజులపాటు అత్యవసర స్థితి అమలులో ఉంటుంది. ఈ నేపథ్యంలో మాజీ అధ్యక్షుడు మౌమూన్ అబ్దుల్ గయూం సహా విపక్ష నేతలందరినీ అరెస్ట్ చేశారు. ఈయన దాదాపు 30 ఏళ్లపాటు మాల్దీవులకు అధ్యక్షుడిగా సేవలందించారు. తొమ్మిది మంది అసమ్మతి నేతలను జైలు నుంచి విడుదల చేయాలని మాల్దీవుల సుప్రీంకోర్టు గత ఫిబ్రవరి 1న ఆదేశించడం, ఇందుకు యమీన్ నిరాకరిస్తున్న నేపథ్యంలో దేశంలో రాజకీయ సంక్షోభం నెలకొంది. తీర్పును వెనక్కు తీసుకోవాలంటూ యమీన్ తాజాగా న్యాయమూర్తులకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో అబ్దుల్లా యమీన్ రాజకీయ ప్రత్యర్థులను విడుదల చేస్తూ ఇచ్చిన ఆదేశాలను అక్కడి సుప్రీంకోర్టు ఫిబ్రవరి 7న వెనక్కితీసుకుంది.

ఫాల్కన్ ప్రయోగం విజయవంతం



ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన రాకెట్ ప్రయోగాన్ని అమెరికాకు చెందిన ప్రైవేట్ అంతరిక్ష పరిశోధన సంస్థ స్పేస్ ఎక్స్ విజయవంతంగా పూర్తి చేసింది. 27 ఇంజన్లను మండించడం ద్వారా పునర్వినియోగ వాహక నౌక ఫాల్కన్ హెవీని ప్రయోగించారు. ఇది స్పేస్ ఎక్స్ కంపెనీ సీఈవో ఎలన్ మస్క్‌కు చెందిన టెస్లా కారును అంగారకుడి సమీప కక్ష్యలోకి చేర్చనుంది. ఈ కారుకు కెమెరాలను అమర్చడంతో పాటు, డ్రైవింగ్ సీటులో స్పేస్ సూట్‌తో డ్రైవర్ నమూనాను ఉంచారు. ఫాల్కన్ హెవీ రాకెట్‌ను మూడు చిన్న ఫాల్కన్ 9 రాకెట్లను కలిపి రూపొందించారు. అంతేకాకుండా పునర్వినియోగించుకోగలగడం దీని ప్రత్యేకత. 230 అడుగుల ఎత్తు ఉండే ఫాల్కన్ హెవీ రాకెట్‌కు సుమారు 64 మెట్రిక్ టన్నుల బరువును కక్ష్యలోకి ప్రవేశపెట్టే సామర్థ్యం ఉంది.

ఖలీదా జియాకు ఐదేళ్ల శిక్ష

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, ప్రస్తుత ప్రతిపక్ష నాయకురాలు, బంగ్లా నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) అధ్యక్షురాలు బేగం ఖలీదా జియా విదేశీ విరాళాల దుర్వినియోగం కేసులో ఢాకా ప్రత్యేక కోర్టు ఆమెను దోషిగా నిర్ధారించింది. ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఫిబ్రవరి 8న తీర్పు వెలువరించింది. బంగ్లాదేశ్‌కు ప్రధానిగా ఖలీదా జియా మూడుసార్లు ఎన్నికయ్యారు. రాజకీయవేత్తగా మారిన నియంత హెచ్.ఎం.ఎర్షాద్‌కూ అవినీతి కేసులో శిక్షపడనుంది. ఆ రకంగా బంగ్లాదేశ్‌లో అవినీతి కేసుల్లో శిక్షలు పడిన ప్రభుత్వాధినేతల్లో ఆమె రెండో వ్యక్తి అవుతారు.

మేధోహక్కులలో భారత్‌కు 44వ ర్యాంకు

అంతర్జాతీయ మేధోహక్కుల (ఐపీ) సూచీలో భారత్ ర్యాంకింగ్ కొంత మెరుగుపడింది. 50 దేశాల జాబితాలో 44వ స్థానాన్ని దక్కించుకుంది. గతేడాది 45 దేశాల సూచీలో భారత్‌కు 43వ ర్యాంకు దక్కింది. అమెరికా చాంబర్స్ ఆఫ్ కామర్స్‌లో భాగమైన గ్లోబల్ ఇన్నోవేషన్ పాలసీ సెంటర్ (జీఐపీసీ) రూపొందించిన వార్షిక నివేదికలో ఈ అంశాలు వెల్లడ య్యాయి. మేధోహక్కుల సూచీలో అమెరికా అగ్రస్థానంలో ఉండగా.. బ్రిటన్, స్వీడన్ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

'క్రిప్టో' ధనవంతుడు క్రిస్ లార్సన్

క్రిప్టో కరెన్సీలో ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల జాబితాను ఫోర్బ్స్ తొలిసారిగా విడుదల చేసింది. ఈ జాబితాలో రిప్పిల్ కో ఫౌండర్ క్రిస్ లార్సన్ 750 - 800 కోట్ల డాలర్ల క్రిప్టో నెట్‌వర్త్‌తో అగ్రస్థానంలో నిలిచారు. క్రిస్ లార్సన్ తర్వాత ఈ జాబితాలో జోసెఫ్ లూబిన్ (100 - 500 కోట్ల డాలర్లు), చాంగ్‌పెంగ్ జోహ్ (100 - 120 కోట్ల డాలర్లు), కామెరాన్, టైలర్ వింకిల్‌వోస్ (90 - 110 కోట్ల డాలర్లు), మాథ్యూ మెల్లన్ (110 కోట్ల డాలర్లు) ఉన్నారు. క్రిప్టోకరెన్సీలో భారీ ఒడుదొడుకులు, అనిశ్చితి నెలకొనటం వంటి అంశాల కారణంగా నెట్‌వర్త్‌ను వివిధ శ్రేణుల్లో అంచనా వేసినట్లు ఫోర్బ్స్ పేర్కొంది. ఈ కరెన్సీల రుజువులను సమర్పించిన వారి ఆస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నట్లు ఫోర్బ్స్ తెలిపింది.

బంగ్లాదేశ్ అధ్యక్షుడిగా హమీద్

బంగ్లాదేశ్ అధ్యక్ష పీఠంపై అబ్దుల్ హమీద్ మరో ఐదేళ్లపాటు కొనసాగనున్నారు. దేశాధ్యక్ష పదవికి ఫిబ్రవరి 7న ఆయన ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. బంగ్లాదేశ్ అధ్యక్షుడిగా రెండో దఫా బాధ్యతలు చేపట్టనున్న ఏకైక నేత ఆయనే కావడం గమనార్హం. హమీద్‌ను అధికార అవామీ లీగ్ పార్టీ నామినేట్ చేసింది.

అండర్ - 19 విజేత భారత్



అండర్ - 19 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను భారత్ గెలుచుకుంది. ఫిబ్రవరి 3న మౌంట్ మాంగనూ (న్యూజిలాండ్)లో జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియాపై విజయ సాధించి నాలుగోసారి ఈ ట్రోఫీని దక్కించుకుంది. భారత్‌కు చెందిన శుభ్‌మన్ గిల్ 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డును గెలుచుకున్నాడు. గతంలో భారత జట్టు 2000, 2008, 2012లలో ఈ టోర్నీలో విజేతగా నిలిచింది.

23వ వింటర్ ఒలింపిక్స్

దక్షిణ కొరియాలోని ప్యాంగ్‌చాంగ్‌లో ఫిబ్రవరి 9న 23వ వింటర్ ఒలింపిక్స్ - 2018 ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 25 వరకు ఈ క్రీడలు జరగనున్నాయి. ఇందులో 92 దేశాలకు చెందిన 2952 మంది అథ్లెట్లు 15 క్రీడా విభాగాల్లో 102 ఈవెంట్లలో పోటీపడనున్నారు. ఈ క్రీడల మస్కట్ తెల్లపులి 'సూహోరంగ'. కొరియా పురాణాలు, సంస్కృతిని దృష్టిలో పెట్టుకుని ఈమస్కట్‌ను రూపొందించారు. ఈ ఒలింపిక్స్‌లో ఇద్దరు ఆటగాళ్లు భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. లూగ్ విభాగంలో కేశవన్, 15 కిమీ. ఫ్రీస్టైల్ స్కీయింగ్‌లో జగదీష్ సింగ్ బరిలోకి దిగనున్నారు.

శుభాంకర్‌కు మలేసియన్ గోల్ఫ్ టైటిల్



మలేసియన్ ఓపెన్ గోల్ఫ్ టోర్నమెంట్‌లో భారత్‌కు చెందిన శుభాంకర్ విజేతగా నిలిచాడు. ఈ విజయంతో శుభాంకర్‌కు ట్రోఫీతో పాటు 5 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీ దక్కింది. అలాగే ఈ ప్రదర్శనతో 193వ ర్యాంకు నుంచి ఏకంగా 70వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

ఫోర్బ్స్ ఇండియా 30లో నలుగురు అథ్లెట్లు

బిజినెస్ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా 30 అండర్ - 30లో నలుగురు అథ్లెట్లు.. క్రికెటర్లు జస్‌ప్రీత్ బుమ్రా, హర్మన్‌ప్రీత్ కౌర్, హాకీ గోల్‌కీపర్ సవితా పూనియా, షూటర్ హీనా సిద్దూలకు చోటు దక్కింది. తమ తమ రంగాల్లో తమదైన ముద్ర వేసిన యువతను ఫోర్బ్స్ ఇండియా - 30కి ఎంపిక చేశారు. సాధించిన ఘనతల ప్రభావం, యథాతథ స్థితిని అస్థిరపరిచే శక్తి, దీర్ఘకాలం నిలవగలిగే సామర్థ్యం ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. ఇప్పటికే మంచి పేరున్న వారిని పరిగణనలోకి తీసుకోలేదు.

ఇండియా ఓపెన్ విజేత బీవెన్ జాంగ్



ఇండియా ఓపెన్ సూపర్ 500 సిరీస్‌లో అమెరికాకు చెందిన బీవెన్ జాంగ్ విజేత నిలిచింది. ఫిబ్రవరి 4న న్యూఢిల్లీలో జరిగిన ఫైనల్లో బీవెన్ భారత్‌కు చెందిన పీవీ సింధుపై విజయం సాధించింది.

క్రికెటర్ జులన్ గోస్వామి రికార్డు



భారత మహిళా క్రికెటర్ జులన్ గోస్వామి మరో అరుదైన ఘనతను అందుకుంది. ఫిబ్రవరి 5న దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి వన్డే మ్యాచ్‌లో 8 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. తద్వారా జులన్ గోస్వామి వెయ్యి పరుగుల మైలు రాయిని అందుకుంది. దీంతో అంతర్జాతీయ మహిళల వన్డే క్రికెట్‌లో వెయ్యికి పైగా పరుగులతో పాటు 150కి పైగా వికెట్లు తీసిన ఏకైక క్రికెటర్‌గా జులన్ గోస్వామి రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు 165 వన్డేలాడిన జులన్ 97 ఇన్నింగ్స్‌ల ద్వారా 1003 పరుగులు సాధించింది. అలాగే 164 ఇన్నింగ్స్‌ల ద్వారా 199 వికెట్లను తన ఖాతాలో వేసుకుంది. అదేవిధంగా ఫిబ్రవరి 7న దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో ఓ వికెట్ పడగొట్టడంతో వన్డే క్రికెట్లో 200 వికెట్లు పడగొట్టిన తొలి మహిళా క్రికెటర్‌గా జులన్ గోస్వామి రికార్డు సృష్టించింది. 35 ఏళ్ల జులన్‌కు ఇది 166వ వన్డే మ్యాచ్. ఆసక్తికర విషయమేంటంటే వన్డే క్రికెట్లో తొలి రెండొందల వికెట్లు పడగొట్టిన పురుష బౌలర్ కూడా భారతీయుడే. కపిల్‌దేవ్ ఈ ఘనత సాధించాడు. బెంగాల్‌లోని చక్దాహ అనే చిన్న పట్టణానికి చెందిన జులన్ 2002లో అరంగేట్రం చేసింది. 2007లో ఐసీసీ మేటి మహిళా క్రికెటర్ అవార్డును అందుకుంది.

జాతీయం


భారత్ నుంచి వెళ్లిపోయిన కుబేరులు 7000 మంది

భారత్‌కు చెందిన అత్యంత సంపన్నులు (నికర ఆస్తుల విలువ మిలియన్ డాలర్లు లేదా అంతకన్నా ఎక్కువ ఉన్న వారు) ఏడు వేల మంది గత ఏడాది దేశాన్ని వీడి వెళ్లిపోయారు. గతేడాదికి సంబంధించి ఈ సంఖ్యలో చైనాది అగ్రస్థానం కాగా భారత్ రెండో స్థానంలో నిలిచింది. ఈ నివేదికను న్యూ వరల్డ్ వెల్త్ రూపొందించింది. 2016లో భారత్ నుంచి తరలి వెళ్లిపోయిన అత్యంత సంపన్నుల సంఖ్య ఆరువేలు. 2015లో ఈ సంఖ్య నాలుగు వేలు. 2017లో చైనా నుంచి తరలివెళ్లిపోయిన కుబేరుల సంఖ్య 10వేలు. భారత్ నుంచి ఎక్కువగా అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌కు తరలి వెళ్లగా చైనావాసులు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాకు తరలి వెళ్లారు. అయితే భారత్, చైనా నుంచి తరలి వెళ్లిపోయిన కుబేరుల కన్నా అక్కడ కొత్తగా అవతరిస్తున్న కుబేరులే ఎక్కువ మంది అని నివేదిక వెల్లడించింది.

అడ్వాంటేజ్ అస్సాం

రాష్ట్రంలో విదేశీ, దేశీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు అస్సాం ప్రభుత్వం ఫిబ్రవరి 3, 4 తేదీల్లో అడ్వాంటేజ్ అస్సాం పేరుతో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్‌ను నిర్వహించింది. ఈ సదస్సును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 3న గువాహటిలో ప్రారంభించారు. గత ఆర్థిక సంవత్సరంలో 60 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3.8 లక్షల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భూటాన్ ప్రధాని షెరింగ్ తోబ్గే, పలువురు కేంద్రమంత్రులు, అస్సాం సీఎం శర్బానంద్ సోనోవాల్, 16 దేశాల రాయబారులు తదితరులు పాల్గొన్నారు. తొలిసారి అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్న అస్సాం.. తమ రాష్ట్రంలో విదేశీ, దేశీయ పెట్టుబడుదారులకు అవసరమైన వాతావరణం, వ్యూహాత్మక అనుకూలతలను సదస్సులో వివరించింది.

తేజస్‌లో అమెరికా, ఫ్రాన్స్ వాయుసేనాధిపతులు



భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ తేజస్‌లో అమెరికా వాయుసేన చీఫ్ ఆఫ్ స్టాఫ్, జనరల్ డేవిడ్ ఎల్ గోల్డ్‌ఫిన్ ఫిబ్రవరి 3న వైస్ ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్‌తో కలిసి 40 నిమిషాల సేపు ప్రయాణించారు. ఇలా ఓ విదేశీ జనరల్ భారతీయ జెట్‌లో ప్రయాణించడం భారతీయ వాయుసేన చరిత్రలో ఇదే తొలిసారి. ఇరు దేశాల మధ్య సత్సంబంధాలను పెంచుకునే దిశగా ఆయన భారత్‌కు విచ్చేశారు. అదేవిధంగా ఫ్రెంచి వైమానికదళం చీఫ్ జనరల్ ఆంద్రూలనాటా కూడా ఫిబ్రవరి 7న 'తేజస్'లో ప్రయాణించారు.

నీతిఆయోగ్ సీఈవో పదవీకాలం పొడిగింపు

నీతిఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ పదవీ కాలాన్ని వచ్చే ఏడాది జూన్ 30 వరకూ పొడిగిస్తున్నట్లు ఫిబ్రవరి 5న కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2016 ఫిబ్రవరి 17న ఆయన ఈ బాధ్యతలు తీసుకున్నారు. ఆయన పదవీ కాలాన్ని పొడిగిస్తూ కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుంది. నీతి ఆయోగ్‌లో సీఈవో పదవి చేపట్టకముందు ఆయన పారిశ్రామిక విధాన, ప్రోత్సాహక విభాగం కార్యదర్శిగా పనిచేశారు. అమితాబ్ కేరళ కేడర్‌కు చెందిన 1980 బ్యాచ్ ఐఏఎస్ అధికారి.

అగ్ని - 1 ప్రయోగం సఫలం

అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన అగ్ని - 1 క్షిపణిని విజయవంతంగా పరీక్షించారు. ఈ క్షిపణి 700 కిలోమీటర్లలోపు స్వల్ప శ్రేణి లక్ష్యాలను విజయవంతంగా ఛేదించగలుగుతుందని భారత రక్షణ శాఖ తెలిపింది. భద్రతా బలగాల సన్నద్ధతను పరీక్షించడంలో భాగంగా ఈ క్షిపణిని ఒడిసా తీరంలోని డాక్టర్ అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఫిబ్రవరి 6న పరీక్షించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ క్షిపణి ఉపరితలం నుంచి ఉపరితలం మీద ఉన్న లక్ష్యాలను ఛేదిస్తుంది. 12వేల కిలోల బరువుండే అగ్ని - 1 క్షిపణి వెయ్యి కిలోల పేలోడ్లను మోసుకెళ్లగలదు. ఈ క్షిపణిని డిఫెన్స్ రీసెర్చి డెవలప్‌మెంట్ ల్యాబోరేటరీ (డీఆర్‌డీఎల్), రీసెర్చి సెంటర్ ఇమ్రాత్ (ఆర్‌సీఐ) సహకారంతో అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ల్యాబోరేటరీ (ఏఎస్ఎల్) అభివృద్ధి చేసింది. క్షిపణి తయారీలో హైదరాబాద్‌లోని భారత డైనమిక్స్ లిమిటెడ్ కూడా కీలక పాత్ర పోషించింది.

పృథ్వీ - 2 క్షిపణి పరీక్ష విజయవంతం



స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన పృథ్వీ - 2 క్షిపణిని భారత్ ఫిబ్రవరి 7న విజయవంతంగా పరీక్షించింది. ఒడిశాలోని చాందీపూర్ సమీకృత పరీక్షా వేదిక (ఐటీఆర్)పై నుంచి దీన్ని ప్రయోగించారు. ఉపరితల లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఈ ఉపరితల క్షిపణి (ఉపరితలం నుంచి ఉపరితలంపైకి) ఛేదించిందని పేర్కొన్నాయి. 350 కి.మీ. పరిధిలోని లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం పృథ్వీ - 2 సొంతం. 500 నుంచి 1000 కిలోల బరువుండే "అణు వార్‌హెడ్ల"నూ ఇది చక్కగా తీసుకుపోగలదు. దీనిలో జంట ఇంజన్లు ఉన్నాయి. అధునాతన మార్గనిర్దేశన వ్యవస్థ సాయంతో ఇది ముందుకు దూసుకెళ్తుంది. అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదిస్తుంది.

రాష్ట్రీయం

ఆంధ్రప్రదేశ్‌కు 'హరిత పాఠశాల అవార్డు'

సెంటర్ ఫర్ సైన్స్, ఎన్విరాన్‌మెంట్ నిర్వహించే 'హరిత పాఠశాల' (గ్రీన్ స్కూల్) - 2017 అవార్డుకు ఆంధ్రప్రదేశ్ ఎంపికయింది. ఈ కార్యక్రమం అమలులో దేశంలోనే మొదటి స్థానాన్ని సాధించింది. రాష్ట్రం నుంచి మూడు ప్రభుత్వ పాఠశాలలు ఈ అవార్డును సాధించాయి. ఫిబ్రవరి 7న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏపీఎన్‌జీసీ సంచాలకులు కృష్ణమూర్తి అవార్డును అందుకున్నారు. సెంటర్ ఫర్ సైన్స్, ఎన్విరాన్‌మెంట్ ప్రతి సంవత్సరం 'హరిత పాఠశాల' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో సహజ వనరుల పరిరక్షణ, వర్షపు నీటిని నిల్వ చేసే విధానం, పరిసరాల పరిశుభ్రత వంటి కార్యక్రమాల అమలుపై విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొనాలి. దేశవ్యాప్తంగా 2860 పాఠశాలలు నమోదు చేసుకోగా, రాష్ట్రం నుంచి 547 పాఠశాలలు పాల్గొన్నాయి. అవార్డులు సాధించిన ప్రభుత్వ పాఠశాలలు జడ్‌పీ ఉన్నత పాఠశాల, పత్తికొండ (గన్నవరం మండలం, చిత్తూరు), కేజీబీవీ, కేవీబీపురం, (చిత్తూరు), జడ్‌పీ ఉన్నత పాఠశాల, లొద్దపుట్టి (శ్రీకాకుళం).


రామచంద్రారెడ్డి ఉప్పుల

చేనేతలో పుట్టపాకకు జాతీయ పురస్కారాలు

యాదాద్రి భువనగిరి జిల్లా పుట్టపాక గ్రామానికి చెందిన జెల్లా వెంకటేశం చేనేత హస్తకళలో సంత్ కబీర్ - 2016 పురస్కారానికి ఎంపికయ్యారు. ఇదే గ్రామానికి చెందిన గజం శ్రీనివాస్ జాతీయ పురస్కారానికి, చెరుపల్లి భావనారుషి మెరిట్ సర్టిఫికెట్‌కు ఎంపికయ్యారు. నల్గొండ జిల్లా చండూరుకు చెందిన గంజి యాదగిరి జాతీయ పురస్కారానికి, కందగట్ల భావనారుషి, చిలుకూరి శ్రీనివాస్ మెరిట్ సర్టిఫికెట్‌కు ఎంపికయ్యారు. ఈమేరకు కేంద్ర చేనేత మంత్రిత్వశాఖ ఫిబ్రవరి 6న 2016 సంవత్సరానికి పురస్కారాల జాబితా ప్రకటించింది. జెల్లా వెంకటేశం 'డబుల్ ఇక్కత్' వస్త్రాన్ని తయారుచేసి ప్రతిభ కనబర్చినందుకు సంత్ కబీర్ అవార్డుకు ఎంపికయ్యారు. గజం శ్రీనివాసు తెలియారుమాలు చీరలు, చెరుపల్లి భావనారుషి నేషనల్ కలాన్, టైఅండ్‌డై, డబుల్ ఇక్కత్, రాజస్థాన్ వస్త్రాలు తయారుచేశారు. యాదగిరి జాందాని భగవత్ సిల్క్‌లో ప్రతిభ కనబర్చినందుకు, కందగట్ల భావనారుషికి డబుల్ ఇక్కత్‌లో ప్రకృతి రంగులతో చీరలను తయారు చేసినందుకు, చిలుకూరి శ్రీనివాస్‌కు జాందాని, కాటన్‌లో వస్త్రాలు తయారు చేసినందుకు పురస్కారాలు దక్కాయి.

జాబ్ కార్నర్

భారతీయ రిజర్వు బ్యాంక్ నోట్ ముద్రణ సంస్థ

భారతీయ రిజర్వు బ్యాంక్ నోట్ ముద్రణ ప్రైవేట్ లిమిటెడ్ - అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఖాళీలు: 7
- విభాగాల వారీ ఖాళీలు: ఇంక్ తయరీ 4, రాజభాష 3
- అర్హత: ఇంక్ తయారీ విభాగానికి 60 శాతం మార్కులతో డిగ్రీ (కెమికల్ ఇంజనీరింగ్/ పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ) ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల అనుభవం ఉండాలి లేదా డిగ్రీ (కెమిస్ట్రీ) / డిప్లొమా (కెమికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతోపాటు అయిదేళ్ల అనుభవం ఉండాలి. రాజభాష అధికారి విభాగానికి 50 శాతం మార్కులతో డిగ్రీ (ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టుగా) తోపాటు పీజీ (హిందీ/ హిందీ ట్రాన్స్‌లేషన్)గానీ డిగ్రీ (హిందీ ప్రధాన సబ్జెక్టుగా)తోపాటు పీజీ (ఇంగ్లీష్) పూర్తిచేసి ఉండాలి. లేదా డిగ్రీ (ఇంగ్లీష్, హిందీ ప్రధాన సబ్జెక్టులుగా)తోపాటు పీజీ (సంస్కృతం) ఉత్తీర్ణులై ఉండాలి. హిందీ నుంచి ఇంగ్లీష్‌లోకి, ఇంగ్లీషు నుంచి హిందీలోకి తర్జుమా చేయడంలో కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. శాస్త్ర, సాంకేతిక పరమైన సాహిత్యంలో పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- వయసు: 31 ఏళ్లు మించరాదు
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 19, 2018.
- వెబ్‌సైట్: www.brbnmpl.co.in

పుష్పంలో ఆకర్షణీయ రంగుల్లో ఉండే నిర్మాణాలు

టార్గెట్ టెట్ / టీఆర్‌టి బయాలజీ



పుష్పాల్లో రెండు రకాలు ఉంటాయి. అవి.. ఏక లింగ పుష్పాలు, ద్విలింగ పుష్పాలు.

ఏకలింగ పుష్పాలు: కేసరావళి గానీ, అండకోశం గానీ ఏదో ఒక ప్రత్యుత్పత్తి భాగం మాత్రమే ఉంటుంది. ఉదాహరణ: సొరకాయ, బొప్పాయి, తాటి.

పురుష పుష్పాలు: కేసరావళి మాత్రమే ఉంటుంది. అండకోశం ఉండదు.

స్త్రీ పుష్పాలు: అండకోశం మాత్రమే ఉంటుంది. కేశరావళి ఉండదు.

ద్విలింగ పుష్పాలు: కేసరావళి, అండకోసం రెండూ ఉన్న పుష్పాలు. ఉదాహరణ: దోస, మందార, ఉమ్మెత్త.

సంపూర్ణ పుష్పం: సంపూర్ణ పుష్పాల్లో నాలుగు వలయాల్లో పుష్పభాగాలు ఉంటాయి. మొదటి వలయంలో రక్షక పత్రాలు, రెండో వలయంలో ఆకర్షణ పత్రాలు, మూడో వలయంలో కేసరావళి, నాలుగో వలయంలో అండకోశాలు ఉంటాయి. ఉదాహరణ: మందార, ఉమ్మెత్త, తూటి పూలు.

అసంపూర్ణ పుష్పాలు: నాలుగు వలయాల్లో ఏ ఒక్క వలయం లేకపోయినా దాన్ని అసంపూర్ణ పుష్పం అంటారు. ఉదాహరణ: దోస, సొర, కాకర.

పుష్ప భాగాలు

మొక్కల కాండంపై ఉన్న గ్రీవం వద్ద పుష్పం ఉంటుంది. ఇది ఒక కాడ సహాయంతో కాండానికి అతుక్కొని ఉంటుంది. దీన్నే పుష్ప వృంతం అంటారు. పుష్ప వృంతంపై ఉబ్బి ఉన్న భాగం పుష్పాసనం.

- **రక్షక పత్రావళి:** ఐదు రక్షక పత్రాలు ఉంటాయి. ఇవి మొగ్గదశలో లోపలి భాగాలను కాపాడతాయి.
- **ఆకర్షణ పత్రావళి:** పుష్పంలో ఆకర్షణీయంగా రంగుల్లో ఉన్న నిర్మాణాలనే ఆకర్షణ పత్రావళి అంటారు. ఇవి కీటకాలను ఆకర్షించి పరాగ సంపర్కానికి తోడ్పడతాయి.
- **కేసరావళి:** ఇవి పురుష ప్రత్యుత్పత్తి అవయవాలు. ప్రతి కేసరానికి కేసర దండం, పరాగకోశం ఉంటాయి. పరాగ కోశంలో పరాగ కణువులు / పుప్పొడి రేణువులు ఉంటాయి.
- **అండకోశం:** స్త్రీ ప్రత్యుత్పత్తి అవయవం. దీనిలో భాగాలు అండాశయం, కీలం, కీలాగ్రం. అండాశయంలో నాలుగు గదులు అండాలతో ఉంటాయి. పుష్పంలో కేసరావళి, అండకోశాలను కలిపి ఆవశ్యక భాగాలని, రక్షక పత్రాలు, ఆకర్షణ పత్రాలను కలిపి అనావశ్యక భాగాలని అంటారు. ప్రతి అండం మధ్యలో పోషక పదార్థాలు, నీరు, స్థూల సిద్ధ బీజకణాలు ఉన్న పిండకోశ నిర్మాణం ఉంటుంది.

పిండకోశ నిర్మాణం

పిండకోశంలో ఏడు కణాలు, ఎనిమిది కేంద్రకాలు ఉంటాయి. ఇక్కడ మొదట స్థూల సిద్ధ బీజం నాలుగు విభజనల తరవాత ఎనిమిది కణాల స్థితిలోకి వస్తుంది. పిండకోశం పై భాగాన పోషణకు సహాయం చేసే మూడు ప్రతిపాదకాలు ఉంటాయి. మధ్య భాగంలో రెండు కణాలు కలిసి ద్వితీయ కేంద్రకం/ కేంద్ర కణం ఉంటుంది. పూర్వ భాగంలో రెండు సహాయ కణాలు, స్త్రీ బీజకణం ఉంటాయి.

- రెండు పురుష బీజాలు ఉన్న పరాగనాళం, పిండ కోశంలోకి ప్రవేశించగానే వాటిలో ఒకటి స్త్రీ బీజకణంతో కలసి సంయుక్త బీజాన్ని ఏర్పరుస్తుంది. దీన్నే ఫలదీకరణం అంటారు. మరో పురుష బీజకణం, ద్వితీయ కేంద్రకం (2n)తో కలసి అంకురచ్ఛదాన్ని ఏర్పరుస్తుంది. ఈ విధంగా రెండుసార్లు ఫలదీకరణం చెందడాన్ని ద్విఫలదీకరణం అంటారు. ద్విఫలదీకరణం పుష్పించే మొక్కల ప్రత్యేకత. సంయుక్త బీజం / పిండం / విత్తం నుంచి పెరిగే కొత్త మొక్కకు అంకురచ్ఛదం, పోషక పదార్థాలను అందిస్తుంది. అంకురచ్ఛదం ఆధారంగా విత్తనాలు రెండు రకాలుగా వర్గీకరించారు. అవి అంకురచ్ఛద రహిత విత్తనాలు, అంకురచ్ఛద సహిత విత్తనాలు.

అంకురచ్ఛద రహిత విత్తనాలు: అంకురచ్ఛదాన్ని పూర్తిగా వినియోగించుకోవడంతో బీజదళాల పరిమాణం పెరిగి ఉంటుంది. ఉదాహరణ: చిక్కుడు, బఠాని, శనగ.

అంకురచ్ఛద సహిత విత్తనాలు: విత్తనాలు అంకురచ్ఛదంతో ఉంటాయి. ఉదాహరణ: మొక్కజొన్న, వరి. ఫలదీకరణం తరవాత పుష్ప భాగంలో మార్పులు వస్తాయి. అండాశయం ఫలంగా, అండం విత్తనంగా, అండకవచం విత్తన కవచంగా మారుతాయి. కీలం, కీలాగ్రం రాలిపోతాయి. తరవాత కేసరావళి, ఆకర్షణ పత్రాలు కూడా రాలుతాయి.

పరాగ సంపర్కం: పరాగ కోశాల నుంచి పరాగ రేణువులు కీలాగ్రాన్ని చేరడమే పరాగ సంపర్కం. ఇది స్వపరాగ / ఆత్మ పరాగ సంపర్కం, పరపరాగ సంపర్కం అనే రెండు విధాలుగా జరుగుతుంది.

పరపరాగ సంపర్కం: పుష్పంలో పరాగ రేణువులు అదే జాతికి చెందిన వేరే పుష్ప కీలాగ్రాన్ని చేరుతాయి. ఉదాహరణ: మందార. ఫలదీకరణం ద్వారా పరాగ సంపర్కం జరిపే మొక్కలు వాలిస్‌నేరియా, హైడ్రిల్లా.


కనుముక్కల నాగేంద్ర బాబు

ఏ ఆటలో అయినా గురుశిష్య బంధం ఎంతో గొప్పది. ఒక ఆటగాడిలో ఎంత ప్రతిభ ఉన్నా.. అతడు సరైన దిశలో పయనించడంలో గురువు పాత్ర కీలకం..! బ్యాడ్మింటన్ లాంటి వ్యక్తిగత క్రీడలో అయితే.. ఇద్దరిదీ విడదీయరాని బంధం..! కోర్టులో ఆడేది షట్లర్ అయినా.. ఆడించేది గురువే..! నిష్ణాతుడైన కోచ్ వెనుక ఉంటే... రాకెట్ స్టార్లకు తిరుగుండదు..! అందుకు సరైన ఉదాహరణ పుల్లెల గోపీచంద్, ప్రపంచ బ్యాడ్మింటన్‌ను శాసించేలా దూసుకెళ్తున్న అతని శిష్య బృందమే..!

కానీ, భారత టాప్ ప్లేయర్ పీవీ సింధును చిత్తుచేసి గత ఆదివారం ఇండియా ఓపెన్ టైటిల్ నెగ్గిన అమెరికా షట్లర్ బీవెన్ జాంగ్ ఇందుకు మినహాయింపు అనాలేమో! ఎందుకంటే, అసలు కోచ్ లేకుండానే జాంగ్ భారత్‌కు వచ్చింది..! అంచనాలే లేకుండా బరిలోకి దిగి.. రౌండ్ రౌండ్‌కూ మెరుగైన ప్రదర్శనతో ఏకంగా విజేతగా నిలిచింది..! హోరాహోరీగా సాగిన ఫైనల్లో సింధును ఆమె ఓడించిన విధానం అందరినీ విస్మయపరిచింది..! ఈ ఒక్క విజయమే కాదు.. ఆమె గురించి తెలుసుకుంటే మరెన్నో విషయాలు ఆశ్చర్యం కలిగిస్తాయి..! చైనాలో పుట్టి.. సింగపూర్‌లో షట్లర్‌గా ఎదిగి.. అవకాశాల కోసం అమెరికాకు వలసపోయిన బీవెన్ ప్రయాణం ఆసాంతం ఆసక్తికరం..!



బీవెన్ జాంగ్

గురువు లేని విజేత!

అది ఢిల్లీలోని సిరిఫోర్ట్ ఇండోర్ స్టేడియం. ప్రేక్షకులతో కిక్కిరిసి అంతా నిశ్శబ్దంగా ఉంది. ఎందుకంటే డిఫెండింగ్ చాంపియన్‌గా, ఫేవరెట్‌గా బరిలోకి దిగిన పీవీ సింధు.. ఇండియా ఓపెన్ ఫైనల్‌కు అండర్‌డాగ్‌గా వచ్చిన బీవెన్‌తో నువ్వానేనా అన్నట్టు తలపడుతోంది. మ్యాచ్‌లో విరామం లభించిన ప్రతీసారి జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్ వెంటనే సింధు వద్దకు వెళ్లి మాట్లాడుతున్నాడు. ఎలా ఆడాలో చెబుతున్నాడు. కానీ, పరిస్థితులు సింధుకు అనుకూలంగా లేవు. 22 ఏళ్ల భారత షట్లర్.. చివరకు తన టైటిల్‌ను కాపాడుకోవడంలో విఫలమైంది. ఇలా ఒత్తిడిలో చిత్తవడం సింధుకు ఇదే తొలిసారి కాదు. రియో ఒలింపిక్స్, వరల్డ్ చాంపియన్‌షిప్, దుబాయ్ సూపర్ సిరీస్, హాంకాంగ్ ఓపెన్ (రెండుసార్లు) ఫైనల్స్‌లో ఓడిపోయింది.



అయితే, ఆ మ్యాచ్‌ల్లో కరోలినా మారిన్, నొజోమి ఒకుహరా, అకానె యమగుచి, తై జుయింగ్ వంటి అగ్ర షట్లర్లకు ఆమె తలొగ్గింది. కానీ, గతవారం సొంతగడ్డపై తక్కువ ర్యాంకర్ జాంగ్ చేతిలో ఓడిపోవడాన్ని సింధు అభిమానులు జీర్ణించుకోలేకపోయారు. అయితే, ఈ మ్యాచ్‌లో సింధు తడబడింది అనే దానికంటే జాంగ్ అద్భుతంగా ఆడిందని చెప్పొచ్చు. కొన్నేళ్లుగా గొప్ప విజయాలతో దూసుకెళ్తున్న సింధు ఆటను అందుకోవాలన్న తపన బీవెంగ్‌లో అడుగడుగునా కనిపించింది. సొంత అభిమానులు సింధుకు మద్దతు ఇస్తూ ఉత్సాహపరుస్తున్నా.. కోర్టులో ఆమెకు పైచేయి సాధించే అవకాశం ఇవ్వలేదు. సుదీర్ఘ ర్యాలీలు.. నాణ్యమైన స్ట్రోక్స్ మొదలు.. కోర్టు కవరేజ్ వరకూ ఎక్కడా గురి తప్పని ఆటతో 27 ఏళ్ల జాంగ్ పూర్తి ఆధిపత్యం చూపించింది. కానీ, చాలా మంది గమనించని విషయం ఏమిటంటే ఆమెకు కోచ్ లేడు. అయినా ఎక్కడా వెనకడుగు వేయలేదామె. ఒక వైపు గోపీ ఎప్పటికప్పుడు సింధుకు మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నాడు. కానీ, తనకు ఎలా ఆడాలో చెప్పేందుకు ఎవరూ లేకున్నా కూడా.. సింధు వ్యూహాలను సమర్థవంతంగా తిప్పి కొట్టింది.

మూడు దేశాలు తిరిగి..

బీవెంగ్ జాంగ్ జీవితం ఒడిదుడుకుల మయం. తన కెరీర్ కోసం ఆమె మూడు దేశాలు తిరిగింది. బ్యాడ్మింటన్ కంచుకోట చైనాలో జాంగ్ 1990లో పుట్టింది. దేశంలో బ్యాడ్మింటన్‌కు క్రేజ్ ఉండడంతో చిన్నప్పుడే ఆమె దృష్టి ఈ ఆటపై మళ్లింది. అక్కడే ఆటలో ఓనమాలు నేర్చుకుంది. అయితే, 13 ఏళ్ల వయసులో అనూహ్యంగా ఆమె సింగపూర్ వెళ్లింది. 'విదేశీ ప్రతిభాన్వేషణ పథకం'లో భాగంగా ఆ దేశం తరఫున ఆడే అవకాశం దక్కించుకుంది. తన ప్రతిభతో సింగపూర్ పౌరసత్వం పొందిన జాంగ్.. ఆ దేశం తరఫున పలు టోర్నీల్లో బరిలోకి దిగింది. 2009 ఆగ్నేయాసియా క్రీడల్లో కాంస్యం నెగ్గిన జట్టులో ఆమె సభ్యురాలు. అయితే, సింగిల్స్ హెడ్ కోచ్ లువాన్ చింగ్‌తో గొడవ కారణంగా 2011లో సింగపూర్ బ్యాడ్మింటన్ సంఘం జాంగ్‌పై వే టు వేసింది. రెండేళ్ల తర్వాత జాంగ్ కుటుంబం అమెరికాలోని లాస్‌వెగాస్‌కు మకాం మార్చింది. అక్కడికెళ్లిన కొద్దికాలంలోనే 4 చాలెంజర్ ట్రోఫీలు గెలిచిన బీవెన్.. యూఎస్, బ్రెజిల్, డచ్ గ్రాండ్ ప్రీలు నెగ్గింది. అలాగే, గత రెండేళ్లలో 2 గ్రాండ్ ప్రీ టోర్నీల్లో విజేత, మరో రెండింటిలో రన్నరప్‌గా నిలిచింది. 2016 ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ సిరీస్ రన్నరప్‌గా నిలిచింది. ఇండియా ఓపెన్‌తో కెరీర్‌లో సూపర్ సిరీస్ నెగ్గాలన్న ఆశను జాంగ్ నెరవేర్చుకుంది. బీడబ్ల్యూఎఫ్ కొత్త పద్ధతిలో ఈ టోర్నీని ఇండియా ఓపెన్ 500గా పిలుస్తున్నా.. ఇంతకుముందు ఇది సూపర్‌సిరీస్ కేటగిరీలోకి వచ్చేది.

కష్టాల ప్రయాణం..

కోచ్ లేకుండా ఆడినా తన ప్రణాళికలను పక్కాగా అమలుపరిచి ఫలితం సాధించడం ఆశ్చర్యం కలిగించే విషయమైనా, జాంగ్‌కు ఇది సాధారణమే. ఎందుకంటే ఏడేళ్లుగా కోచ్ లేకుండా ఆడుతున్న తనకు ఇది అలవాటే అని ఆమె చెబుతోంది. సింగపూర్‌లో ఉన్నప్పుడు జాంగ్‌ను చాలా మంది ఆ దేశ భావిషట్లర్‌గా ఆరాధించారు. కానీ, సింగపూర్ బ్యాడ్మింటన్ వేటు వేశాక ఆమె పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అమెరికాకు వెళ్లాక కూడా తీవ్రంగా శ్రమించి విజయాల బాట పట్టింది. లాస్‌వెగాస్‌లో ఎవరి మార్గనిర్దేశం లేకుండా.. చాలా ఏళ్ల పాటు.. ఒకేఒక్క సహచర షట్లర్‌తో.. అదీ రోజుకు గంట మాత్రమే ప్రాక్టీస్ చేసి తన ఆటను మెరుగుపరుచుకుంది. కొన్నిసార్లు మెరుగైన శిక్షణ కోసం అమెరికా నుంచి సింగపూర్ ప్రయాణించింది. అందుకు సొంతడబ్బులు ఖర్చు చేసింది. ఇప్పుడు కూడా సింగపూర్‌లో కోచ్ లువాన్ చింగ్ సాయం తీసుకుంటోంది. అది కూడా తాత్కాలిక పద్ధతిలోనే. తనతో పాటు కోచ్‌ను వెంట తీసుకెళ్లే స్థోమత లేకపోవడంతో ఆమె ఒక్కతే టోర్నీకి హాజరవుతోంది. అయితే, మ్యాచ్‌లకు ముందు చాంగ్‌తో ఫోన్‌లో మాట్లాడి వ్యూహాలపై చర్చిస్తుంది. ఇద్దరూ ఈ-మెయిల్స్ ద్వారా ప్రణాళికలు రచిస్తారు. 'చింగ్ ఎన్నో ఐడియాలు ఇచ్చారు. గేమ్‌ను స్పష్టంగా వివరిస్తారు. అది గుర్తుంచుకొని.. ప్రత్యర్థి ఆధిక్యంలో ఉన్నప్పుడు ఏం చేయాలో తెలుస్తుంది' అంటోంది జాంగ్. వ్యూహాలను అమలు పరచడంలో బీవెన్ దిట్ట.

పోరాట యోధురాలు..

బీవెన్ రెండునెలల కిందట కూడా భారత్ వచ్చింది. పీబీఎల్‌లో ముంబై రాకెట్స్ తరఫున పోటీపడింది. కానీ, అప్పటికి పాదం గాయం నుంచి కోలుకోకపోవడంతో ఒక్క మ్యాచ్‌లోనూ నెగ్గలేకపోయింది. దాంతో, జాంగ్ కెరీర్‌పై చాలామంది అనుమానం వ్యక్తం చేశారు. ఎందుకంటే పాదానికి గాయమవడంతో మూడువారాలు ఆమె షూ ధరించలేకపోయింది. వాపు రావడంతో చెప్పులు కూడా వేసుకోలేకపోయింది. నొప్పి పూర్తిగా తగ్గలేదని, అయినా సరే టోర్నీలో ఆడతానని కొన్నిరోజుల ముందు జాంగ్ వెల్లడించింది. పూర్తిగా కోలుకోకున్నా ఇండియా ఓపెన్‌లో ఆడిన ఆమె క్వార్టర్స్‌లో సైనా నెహ్వాల్‌ను ఓడించినప్పుడే సంచలనం సృష్టించింది. అదేఊపుతో సెమీస్‌లో ఎన్‌గన్ చుయెంగ్‌ను.. ఫైనల్లో సింధును ఓడించి లక్ష్యాన్ని చేరుకున్నది. ఇందుకు భారత్‌కు చెందిన ట్రెయినర్, ఫిజియోథెరపిస్ట్ ఆనంద్ దూబే జాంగ్‌కు సాయం చేశాడు. ముంబై రాకెట్స్ సహాయ సిబ్బందిలో ఒకడైన దూబే.. పీబీఎల్‌లో ఆమెకు సహకరించడంతో పాటు ఇండియా ఓపెన్‌కు నాలుగైదు రోజుల ముందు ఆమె ఫిట్‌నెస్ మెరుగయ్యేలా చేశాడు. 'బీవెన్ సొంతంగా శిక్షణ తీసుకుంటుంది. కానీ, అందులో ఎంతో తీక్షణత కనిపిస్తుంది. మానసికంగా ఆమె బలవంతురాలు. అదే ఆమెను విజేతగా నిలుపుతుంద'ని దూబే అన్నాడు.

మహాభారతంలో ఏకలవ్యుడి గురించి విన్నాం. తనకు విలువిద్యను నేర్పనని ద్రోణాచార్యుడు గెంటేసినా.. స్వీయశిక్షణతో ఆ ఆటను అవపోసన పట్టిన విధానం.. ద్రోణుడి శిష్యుడు అర్జునుడి కంటే గొప్ప విలుకారుడిగా ఎదిగిన తీరు గురించి గొప్పగా చదువుకున్నాం. ఆ పాత్ర నవీన భారతంలో ఎందరికో స్ఫూర్తినిచ్చింది. స్వీయ శిక్షణతో ఆటలతో పాటు వివిధ రంగాల్లో అత్యున్నత స్థాయికి చెందిన ఎంతో మందిని చూస్తున్నాం. దాదాపు ఇదే కోవకు చెందిన బీవెన్ జాంగ్‌ను మోడ్రన్ ఏకలవ్య అనొచ్చు!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



టోక్యో ఒలింపిక్స్ లక్ష్యంగా..

స్పాన్సర్‌షిప్ లేమి.. సాయం చేసేవారు లేకపోవడంతో బీవెన్ జాంగ్ చాలా పొదుపుగా ఖర్చు చేస్తుంది. టోర్నీల కోసం ఒక్కతే వెళ్తుంది. హోటళ్లలో కాకుండా స్నేహితుల ఇళ్లలో బస చేస్తుంటుంది. ఢిల్లీకి కూడా ఒక్కతే రావడంతో క్వార్టర్‌ఫైనల్‌కు ముందు వరకూ ఆమెకు ప్రాక్టీస్ పార్ట్‌నర్ దొరకలేదు. 'భారత షట్లర్లలో నాకు చాలా మంది స్నేహితులు ఉన్నారు. కానీ, వాళ్లు తమ తమ మ్యాచ్‌ల్లో బిజీగా ఉండిపోయారు. చివరకు తన మ్యాచ్‌లు ఆయిపోయిన తర్వాత కుహూ గార్గ్ నాతో ప్రాక్టీస్ చేసింద'ని జాంగ్ చెప్పింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొనాలని లక్ష్యంగా పెట్టుకున్న జాంగ్.. ఇప్పుడు అమెరికా పౌరసత్వం కోసం ఎదురు చూస్తోంది. అది లభిస్తేనే ఆమె టోక్యోలో పోటీ పడగలదు. అమెరికాకు ప్రాతినిథ్యం వహించే అవకాశం లేకపోవడంతో రియో ఒలింపిక్స్‌కు దూరమైన ఆమె.. వచ్చే విశ్వక్రీడల కోసం ఆత్రుతగా ఉన్నది. ఇండియా ఓపెన్ టైటిల్‌తో తన ఆటపై ఆత్మవిశ్వాసం ప్రోదిచేసుకున్న జాంగ్.. తన కలను నెరవేర్చుకునేందుకు యూఎస్ బ్యాడ్మింటన్ సమాఖ్య, ఒలింపిక్ సంఘం ఆర్థిక సాయం చేయాలని కోరుతోంది.



ఈ భూమ్మీద తెలివితేటలన్నీ మనిషి సొత్తు అనుకునే రోజులు పోయాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో రూపొందిన రోబోలు ఇప్పుడు మనుషులకు చుక్కలు చూపిస్తున్నాయి. మేధావుల ఆటగా పేరొందిన చదరంగాన్ని.. నాలుగంటే నాలుగే గంటల్లో నేర్చుకుంది 'ఆల్ఫాజీరో' అనే ఏఐ రోబో! నేర్చుకున్న వెంటనే చెస్ బోర్డు మీద చకచకా పావులు కదుపుతూ.. ఓ గ్రాండ్ మాస్టర్‌ను కూడా ఓడించింది. మనిషి తెలివితేటలకు చెక్ పెడుతూ.. సరికొత్త చెస్ చాంపియన్‌గా అవతరించింది. ఏఐ కంప్యూటర్ ప్రోగ్రామ్‌తో రోబోకి కేవలం చెస్ రూల్స్ నేర్పారు. కాసేపు తనతో తానే ఆడిన ఆల్ఫాజీరో తర్వాత అసలు పోటీకి సిద్ధమయింది.

రోబో ఆట మొదలైంది..



డిఫెండింగ్ చాంపియన్‌ను చిత్తు చేసింది. అంతేకాదు 1500 ఏళ్ల చదరంగం చరిత్రలో ఎన్నడూ నమోదుకాని ఎత్తులు, గ్రాండ్ మాస్టర్లకు కూడా అంతుబట్టని వ్యూహాలతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ప్రపంచ ప్రఖ్యాత చెస్ గ్రాండ్‌మాస్టర్ గ్యారీ కాస్పరోవ్.. 1997లో ఐబీఎం సూపర్ కంప్యూటర్ 'డీప్ బ్లూ' చేతిలో ఓడిపోయాడు. తాజాగా రోబో.. ఓ గ్రాండ్ మాస్టర్‌ను ఆడుకున్న ఘటనపై కాస్పరోవ్ స్పందించాడు. 'శతాబ్దాల మానవ మేధస్సును, జ్ఞానాన్ని ఓ యంత్రం సవాల్ చేసింది. రానున్న కాలంలో రోబోలు మనుషులను ఆడుకోవడం ఖాయం' అని కాస్పరోవ్ వ్యాఖ్యానించాడు. లండన్‌కు చెందిన 'డీప్ మైండ్' అనే కంపెనీ కృత్రిమ మేధస్సుతో పనిచేసే 'ఆల్ఫాజీరో'ను తయారు చేసింది. ఆ రోబోను 2014లో 400 మిలియన్ పౌండ్లకు గూగుల్ కొనుగోలు చేసింది. కలన గణితం ఆధారంగా చేసిన ప్రోగ్రామింగ్‌తో రోబో ఏ ప్రశ్నకైనా సమాధానాలను వేగంగా వెతుకుతుంది. 'డీప్ మెషీన్ లెర్నింగ్' అనే పరికరంతో ఎంత ఎక్కువ సమాచారాన్నయినా గ్రహించి.. నేర్చుకున్న కొత్త విషయాలతో తనను తాను రీప్రోగ్రామింగ్ చేసుకునే సామర్థ్యం ఆల్ఫా జీరోకి ఉంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కేవలం చెస్ బోర్డుకే పరిమితం కాలేదు. క్యాన్సర్ చికిత్సలో కృత్రిమ మేధస్సు కీలకపాత్ర పోషిస్తోంది. యూనివర్సిటీ కాలేజ్ లండన్ హాస్పిటల్‌లో అభివృద్ధి చేసిన ఏఐ రోబో..గత ఏడాది కాలంలో 11వేలమంది క్యాన్సర్ రోగులకు చికిత్స అందించడం లో తోడ్పడింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందిన రోబోలు.. స్కాన్లను విశ్లేషించడంలో మనుషుల కంటే కచ్చితంగా పనిచేస్తాయని గూగుల్ చెబుతోంది.



రగ్బీ to క్రికెట్

లుంగీ ఎన్‌గిడి ప్రస్థానం

లుంగీ ఎన్‌గిడి.. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పుడో సంచలనం. సఫారీ గడ్డపై తొలిసారిగా టెస్టు సిరీస్‌ను సాధించాలన్న భారత జట్టు ఆశలను ఆవిరి చేసిన పేసర్. రెండో టెస్టుకు ముందు అతడెవరో లోకానికి తెలీదు. కానీ అరంగేట్రం మ్యాచ్‌లోనే ఏకంగా ఏడు వికెట్లు తీసి హడలెత్తించాడు. వెటరన్ ఫాస్ట్ బౌలర్ డేల్ స్టెయిన్ గాయంతో సిరీస్‌కు దూరమైన వేళ సీనియర్ ఆల్‌రౌండర్ క్రిస్ మోరిస్‌ను కాదని 21 ఏళ్ల ఎన్‌గిడిపై టీమ్ మేనేజ్‌మెంట్ ఆశలు పెట్టుకుంది. ఎందుకంటే తను నెట్ ప్రాక్టీస్‌లో ప్రొటీస్ టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌ను తెగ ఇబ్బందిపెట్టాడు. అంతేకాకుండా దక్షిణాఫ్రికా జట్టులో కనీసం ఇద్దరు నల్లజాతి ఆటగాళ్లు ఉండాలన్న నిబంధన ఉంది. కాబట్టి రబాడకు తోడుగా ఎన్‌గిడికి కూడా అవకాశం దక్కింది.

రగ్బీపై ఆసక్తి

డర్బన్‌లో పుట్టి పెరిగిన ఎన్‌గిడిది పేద కుటుంబం. అతడి తల్లిదండ్రులు ఇళ్లల్లో పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. నలుగురు సంతానంలో ఇతడు చిన్నవాడు. ఓ అజ్ఞాత దాత ఆర్థిక సహకారంతో పాఠశాల విద్య కొనసాగించాడు. అయితే బౌలింగ్‌లో ఇంతటి నైపుణ్యం కలిగిన ఎన్‌గిడికి చిన్నప్పటి నుంచే క్రికెట్ అంటే ఇష్టమనుకుంటే పొరపాటే.. విద్యార్థి దశలో అతడి ఫస్ట్ చాయిస్ రగ్బీ మాత్రమే. దక్షిణాఫ్రికాలో క్రికెట్‌కన్నా ఎక్కువగా రగ్బీ ఆటకు పేరుంది. సహజంగానే ఎన్‌గిడి కూడా అటు వైపే ఆకర్షితుడయ్యాడు. చదువుకున్న హిల్టన్ కాలేజీలో మొదట అతడు రగ్బీనే ఎక్కువగా ఆడాడు. దీంతో పాటు క్రికెట్, స్విమ్మింగ్‌లో కూడా కాస్త ప్రావీణ్యం సాధించాడు. అయితే రగ్బీ కారణంగా ఎన్నోసార్లు గాయపడ్డాడు. దీంతో ఎన్‌గిడి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని స్కూల్ కోచ్ అతడిని క్రికెట్ వైపు మరల్చాడు. ఇక బౌలర్‌గా మారడం వెనుక కూడా ఆసక్తికర కథనమే ఉంది. నిజానికి తనకు బ్యాట్స్‌మన్ కా వాలనే కోరిక ఉండేది. కానీ తొలిసారి క్రికెట్ ప్రాక్టీస్ కు వచ్చినప్పుడు అతడి దగ్గర ఎలాంటి కిట్ లేదు. దీంతో బంతి చేతపట్టి బౌలింగ్‌కు దిగాడు. అంతే.. ఎప్పుడూ మొహం మీద చిరునవ్వు కనిపించే ఈ యువ పేసర్ ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను మాత్రం కంగారెత్తించడం అలవాటు చేసుకున్నాడు.

అండర్-13 నుంచే రాణింపు

క్రికెటర్‌గా మారాక ఎన్‌గిడి అండర్-13 నుంచే ప్రతీ ప్రొవిన్షియల్ టోర్నీలో తమ స్కూల్ తరఫున ఆడాడు. 2014లో ఒక అండర్-19 టోర్నీతో అతడు అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఆ తర్వాతి ఏడాది ఆఫ్రికా కప్ టీ20లో ఆరు వికెట్లు తీసి తమ నార్తర్న్ జట్టును గెలిపించడంతో పాటు ప్లేయర్ ఆఫ్ ద ఇయర్‌గా నిలిచాడు. ఇప్పుడు టైటాన్స్ ఫ్రాంచైజీ తరఫున ఆడే ఈ పేసర్ 2015-16 సీజన్‌లో టైటిల్ నెగ్గిన జట్టులో సభ్యుడు. అంతేకాకుండా 2017 జనవరిలో దక్షిణాఫ్రికా టీ20 జట్టుకు ఎంపికై తన తొలి మ్యాచ్‌లోనే మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. ఇప్పుడు టెస్టుతో పాటు వన్డే జట్టులోనూ చోటు దక్కించుకుని హీరోగా నిలవడం విశేషం.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

మీకు తెలుసా?

బెడ్ రేసింగ్



రేసులో ఎన్నో రకాలు.. బైక్, మోటార్ కార్, 100 మీటర్లు, మారథాన్ ఇలా అన్నీ చూస్తూనే ఉంటాం. కానీ బెడ్ రేసింగ్ గురించి తెలుసా.. అవును. ఇది కూడా ఓ రేసే. 1965 నుంచే ఉందిది. అప్పట్లో అమెరికా సైనికులు మాత్రమే ఆటవిడుపుగా ఆడేవారు. క్రమేపీ ఇది విశ్వవ్యాప్తమైంది. ఇందులో ఏడుగురు ఆటగాళ్లు ఓ జట్టుగా పాల్గొంటారు. అయితే వీరికి ఓ చక్రాలున్న మంచం తోడుగా ఉంటుంది. దీనిపై ఓ ఆటగాడు కూర్చుంటాడు. మిగతా ఆరుగురు ఆ మంచాన్ని నెట్టుకుంటూ ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. అంతే కాదండోయ్ చివర్లో ఎదురయ్యే నదిలో నుంచి కూడా ఆ మంచం వెళ్లాల్సి ఉంటుంది. ఇలా మూడు కిలో మీటర్ల దూరంలోని ఫినిష్ లైన్ దగ్గరికి వచ్చేసరికి మిగతా ప్రత్యర్థులను ఓడించాల్సి ఉంటుంది.

ఇండియన్ స్క్వాష్ ఫైనల్లో సౌరవ్



ముంబై: జాతీయ చాంపియన్, టాప్‌సీడ్ సౌరవ్ ఘోషల్ సొంతగడ్డపై టైటిల్ దిశగా దూసుకెళ్తున్నాడు. వేదాంత ఇండియన్ స్క్వాష్ ఓపెన్‌లో సౌరవ్ ఫైనల్లో ప్రవేశించాడు. శనివారం జరిగిన సెమీఫైనల్లో సౌరవ్ 11-8, 13-11, 11-6తో స్కాట్లాండ్‌కు చెందిన మూడోసీడ్ గ్రెగ్ లొబ్బాన్‌పై విజయం సాధించాడు. ఆదివారం జరిగే టైటిల్‌పోరులో రెండోసీడ్, స్విట్జర్లాండ్ ఆటగాడు నికోలస్ ముల్లర్‌తో సౌరవ్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

శిఖర్ 'వంద'నం

టీమిండియా ఒక చరిత్ర ముంగిట నిలిచిన సందర్భం.. శిఖర్ ధవన్ తన కెరీర్‌లో వందో వన్డేలో బరిలోకి దిగిన సమయం..!
అచ్చొచ్చిన వాండరర్స్ మైదానంలో.. ఈ రెండింటినీ చిరస్మరణీయంగా మార్చేందుకు ధవన్ చెలరేగిపోయాడు..! ఈ సిరీస్‌లో గొప్ప ఫామ్‌లో ఉన్న గబ్బర్ సఫారీ బౌలింగ్‌ను చెండాడుతూ బౌండ్రీల వర్షం కురిపించాడు..! ధనాధన్ బ్యాటింగ్‌తో సెంచరీ కొట్టి తన వందో వన్డేను మరపురానిదిగా మార్చుకున్నాడు..!
అతనికి కెప్టెన్ కోహ్లీ మెరుపులు, ధోనీ బాధ్యతాయుత బ్యాటింగ్ తోడవడంతో సఫారీల ముంగిట భారత్ సవాల్ విసిరే లక్ష్యాన్ని ఉంచింది!
ఛేదనలో ఎనిమిదో ఓవర్లోనే ఒక వికెట్ పడగొట్టి గెలుపు బాటలు వేసుకుంది..!
మిగతా వారిని చుట్టేసేందుకు మణికట్టు స్పిన్నర్లు ఆత్రుతగా ఉన్నారు..!
కానీ, వరుణుడి రాకతో ఆట ఆగింది..!



కోహ్లీ (75)



ధవన్ (109)

- వందో మ్యాచ్‌లో ధవన్ సెంచరీ
- సత్తా చాటిన కోహ్లీ, ధోనీ
- భారత్ 289/7
- ఛేదనలో 7.2 ఓవర్లకు సౌతాఫ్రికా 43/1
- గులాబీ వన్డేకు వర్షం ఆటంకం

జొహన్నెస్‌బర్గ్: సౌతాఫ్రికా గడ్డపై తొలిసారి సిరీస్ నెగ్గి చరిత్ర సృష్టించాలన్న సంకల్పంతో శనివారం నాలుగో వన్డేలో బరిలోకి దిగిన టీమిండియాను వరుణుడు అడ్డుకున్నాడు. భారత్ నిర్దేశించిన 290 పరుగుల లక్ష్య ఛేదనలో వర్షంతో ఆట ఆగిన సమయానికి సఫారీ జట్టు 7.2 ఓవర్లలో ఓపెనర్ మార్క్రమ్ (22) వికెట్ కోల్పోయి 43 పరుగులతో నిలిచింది. మరో ఓపెనర్ హషీమ్ ఆమ్లా (19 నాటౌట్) క్రీజులో ఉన్నాడు. ఫలితం తేల్చాలన్నా ఛేదనలో జట్టు కనీసం 20 ఓవర్లు ఆడాల్సి ఉంటుంది. కాగా, అంతకుముందు టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్లకు 289 పరుగులు చేసింది. ఓపెనర్ ధవన్ (105 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 109) తన వందో వన్డేలో శతక మోత మోగించగా.. కెప్టెన్ విరాట్ కోహ్లీ (83 బంతుల్లో 7 ఫోర్లు, సిక్సర్‌తో 75) అర్ధ సెంచరీతో సత్తా చాటాడు. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 158 పరుగులు జోడించారు. మాజీ సారథి ధోనీ (43 బంతుల్లో 3 ఫోర్లు, సిక్సర్‌తో 42 నాటౌట్) ఆకట్టుకున్నాడు. సఫారీ బౌలర్లలో రబాడ, ఎన్‌గిడి చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఆపై, ఛేదనలో ధాటిగా ఆడుతున్న ఓపెనర్ మార్క్రమ్‌ను ఎల్బీగా వెనక్కుపంపిన బుమ్రా పంపి ప్రత్యర్థి పతనానికి బీజం వేశాడు. కానీ, వెంటనే మెరుపులతో కూడిన వర్షం మొదవలడంతో పర్యాటక జట్టు జోరుకు బ్రేకు పడినట్టయింది. ఆరు వన్డేల సిరీస్‌లో భారత్ తొలి మూడు మ్యాచ్‌లు నెగ్గి 3-0తో ఆధిక్యంలో నిలిచిన సంగతి తెలిసిందే.

రోహిత్ ఫట్టు.. ధవన్-కోహ్లీ మళ్లీ హిట్టు

ఈ మ్యాచ్‌లోనూ భారత్‌కు శుభారంభం దక్కలేదు. సఫారీ పర్యటనలో తడబాటును కొనసాగించిన ఓపెనర్ రోహిత్ శర్మ (5) మళ్లీ విఫలమయ్యాడు. స్వభావానికి విరుద్ధంగా రక్షణాత్మక బ్యాటింగ్ చేసినా కూడా ఎక్కువసేపు క్రీజులో నిలువని రోహిత్ నాలుగో ఓవర్లోనే రబాడకు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అయితే, దీని ప్రభావం జట్టుపైన ఏ మాత్రం పడలేదు. భీకర ఫామ్‌లో ఉన్న కోహ్లీ, ధవన్ మరోసారి జట్టుకు పటిష్ఠ పునాది వేశారు. మూడో వన్డే మాదిరిగా ధవన్ తన ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగిపోగా.. విరాట్ అతనికి సహకారం అందించే ప్రయత్నం చేశాడు. వందో మ్యాచ్‌ను ప్రత్యేకంగా మార్చుకోవాలన్న లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన శిఖర్.. ట్రేడ్ మార్క్ షాట్లతో బౌండ్రీలు రాబట్టాడు. కట్, పుల్ షాట్లతో అలరించాడు. ఆఫ్‌స్టంప్‌నకు ఆవలగా ఊరిస్తూ వచ్చిన షార్ట్‌పిచ్ బంతులను కూడా శిక్షించాడు. కోహ్లీ కూడా ముచ్చటైన డ్రైవ్‌లతో ఆకట్టుకున్నాడు. రబాడ వేసిన ఎనిమిదో ఓవర్లో విరాట్, మోరిస్ వేసిన 14 ఓవర్లో ధవన్ రెండేసి ఫోర్లతో జోరు చూపారు. ఇక, ఎన్‌గిడి వేసిన 17వ ఓవర్లో కోహ్లీ క్రీజు ముందుకొచ్చి సైట్ స్ర్కీన్ మీదుగా కొట్టిన సిక్సర్ మ్యాచ్‌కే హైలైట్. ఇక, 53 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న ధవన్ ఆ తర్వాత మరింత వేగం పెంచాడు. పెహ్లుక్వాయో బౌలింగ్‌లో డీప్ మిడ్ వికెట్ మీదుగా భారీ సిక్సర్ కొట్టిన అతను.. మోరిస్ ఓవర్లో ఫుల్‌లెంగ్త్ బాల్‌ను బౌండ్రీకి చేర్చాడు. ఇక, మోర్కెల్ వేసిన 22వ ఓవర్లో ఫోర్ బాదిన విరాట్ 56 బంతుల్లో 50 పరుగుల మార్కు దాటాడు. తర్వాత ధవన్‌తో కలిసి అతను కూడా పోటాపోటీగా బౌండ్రీలు బాదడంతో స్కోరుబోర్డు జెట్ స్పీడులో దూసుకెళ్లింది. డుమిని రాకతో కాస్త వేగం తగ్గినా 30 ఓవర్లకు భారత్ 173/1తో నిలిచి భారీ స్కోరు చేసేలా కనిపించింది. కానీ, సెంచరీ దిశగా దూసుకెళ్తున్న కోహ్లీని 32వ ఓవర్లో మోరిస్ అవుట్ చేసి ఈ జోడీని విడదీశాడు. అయినా ధవన్ ఏ మాత్రం జోరు తగ్గించలేదు. రహానెతో కలిసి ధాటిని కొనసాగించాడు. రబాడ బౌలింగ్‌లో భారీ షాట్‌తో స్క్వేర్ లెగ్ సిక్సర్ కొట్టి అతను.. ఆ వెంటనే మోరిస్ ఓవర్లో బౌండ్రీతో సెంచరీ (99 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. ఈ దశలో ఆకాశం మేఘావృతమై మెరుపులు రావడంతో ఆటకు అంతరాయం కలిగింది. అప్పటికి 34.2 ఓవర్లలో భారత్ 200/2తో పటిష్ఠ స్థితిలో నిలిచింది.

ఆదుకున్న ధోనీ

దాదాపు 45 నిమిషాల తర్వాత ఆట తిరిగి మొదలయ్యాక భారత ఇన్నింగ్స్ తడబడింది. వరుస ఓవర్లలో ధవన్, రహానె (8) వికెట్లు కోల్పోయింది. ధవన్‌ను మోర్కెల్, రహానెను రబాడ అవుట్ చేసి ఆతిథ్య జట్టులో ఉత్సాహం నింపారు. ఈ దశలో ధోనీ, శ్రేయాస్ అయ్యర్ (18) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. తానెదుర్కొన్న నాలుగో బంతినే ధోనీ సిక్సర్‌గా మలచగా.. అయ్యర్ వచ్చీరాగానే బౌండ్రీ కొట్టాడు. కానీ, తర్వాత ఇద్దరూ నెమ్మదించారు. ఆతిథ్య బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో సింగిల్స్‌తో క్రీజులో నిలదొక్కుకునే ప్రయత్నం చేశారు. దాంతో, 38 నుంచి 42 ఓవర్ల మధ్యలో ఒక్క బౌండ్రీ కూడా రాలేదు. తర్వాత చెరో బౌండ్రీ కొట్టి మళ్లీ ఊపులోకొచ్చినట్టు కనిపించారు. అయితే, శ్రేయాస్ మరో షాట్ ఆడే ప్రయత్నంలో ఎన్‌గిడి బౌలింగ్‌లో బౌండ్రీలైన్ వద్ద మోరిస్‌కు క్యాచ్ ఇచ్చాడు. అతని స్థానంలో వచ్చిన హార్దిక్ పాండ్యా (9) కూడా ఇలా వచ్చి అలా వెళ్లిపోయాడు. రబాడ వేసిన 47వ ఓవర్లో మార్క్రమ్ గాల్లోకి ఎగురుతూ ఒంటి చేత్తో పట్టిన అద్భుత క్యాచ్‌కు అతను వెనుదిరిగాడు. అయినా, భువనేశ్వర్ (5) కలిసి కడదాకా క్రీజులో నిలిచిన ధోనీ ఆఖర్లో విలువైన పరుగులు చేర్చాడు. చివరి ఓవర్లో రెండు ఫోర్లు సహా 12 పరుగులు రాబట్టాడు. చివరి 15 ఓవర్లలో భారత్ ఐదు వికెట్లు కోల్పోయి 84 పరుగులు మాత్రమే చేసింది.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (సి అండ్ బి) రబాడ 5, ధవన్ (సి) డివిల్లీర్స్ (బి) మోర్కెల్ 109, కోహ్లీ (సి) మిల్లర్ (బి) మోరిస్ 75, రహానె (సి) రబాడ (బి) ఎన్‌గిడి 8, శ్రేయాస్ (సి) మోరిస్ (బి) ఎన్‌గిడి 18, ధోనీ (నాటౌట్) 42, హార్దిక్ (సి) మార్క్రమ్ (బి) రబాడ 9, భువనేశ్వర్ (రనౌట్) 5, కుల్దీప్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 50 ఓవర్లలో 289/7; వికెట్ల పతనం:** 1-20, 2-178, 3-206, 4-210, 5-247, 6-262, 7-282; **బౌలింగ్:** మోర్కెల్ 10-0-55-1, రబాడ 10-0-58-2, ఎన్‌గిడి 10-0-52-2, మోరిస్ 10-0-60-1, పెహ్లుక్వాయో 6-0-38-0, డుమిని 4-0-20-0.

దక్షిణాఫ్రికా (లక్ష్యం 290): మార్క్రమ్ (ఎల్బీ) బుమ్రా 22, ఆమ్లా (నాటౌట్) 19; **ఎక్స్‌ట్రాలు:2; మొత్తం: 7.2 ఓవర్లలో 43/1; వికెట్ల పతనం:** 1-43; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-27-0, బుమ్రా 3.2-0-14-1.

1 వందో వన్డేలో సెంచరీ చేసిన భారత తొలి బ్యాట్స్‌మన్ ధవన్. ఓవరాల్‌గా తొమ్మిదో ఆటగాడు.

5 భారత్ తరపున వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఐదో బ్యాట్స్‌మన్ విరాట్. 198 ఇన్నింగ్స్‌లో ఇప్పటికి 9423 పరుగులు చేసిన కోహ్లీ.. అజరుద్దీన్ (9378)ను అధిగమించి టాప్-5కి చేరాడు. సచిన్ (18426), గంగూలీ (11221), ద్రావిడ్ (10768), ధోనీ (9954) తొలి నాలుగు స్థానాల్లో ఉన్నారు.

6 ఈ పర్యటనలో ఎనిమిది ఇన్నింగ్స్‌లో రబాడ బౌలింగ్‌లో రోహిత్ అవుటవడం ఇది ఆరోసారి.

8 రెండో వికెట్‌కు వంద పరుగుల భాగస్వామ్యాలు అత్యధికంగా ఎనిమిది సార్లు నమోదు చేసిన భారత తొలి జోడీ ధవన్-కోహ్లీ. మాజీ ఆటగాళ్లు ద్రావిడ్-గంగూలీ జంటను సమం చేసింది.

విరాట్‌కు మావయ్య గిఫ్ట్



ముంబై: విరాట్ కోహ్లీకి అతడి మావయ్య, రిటైర్డ్ కల్నల్ అజయ్ కుమార్ శర్మ ఓ పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చారు. తేజస్వినీ దివ్యా నాయక్ రచించిన ఆ పుస్తకం పేరు 'స్మోక్స్ అండ్ విస్కీ'. సంబంధాలు, వాటివల్ల ఎదురయ్యే ఎత్తు పల్లాలను వర్ణిస్తూ తేజస్వినీ రచించిన 42 కవితల సంకలనమే ఆ పుస్తకం. ఆ కవితలతో ఎంతో ముగ్ధుడైన అజయ్‌కుమార్ శర్మ ఆ పుస్తకాన్ని అల్లుడు విరాట్‌కు బహుమతిగా పంపారు.

అందరికీ ఆమోదయోగ్యంగా !

- ఐపీఎల్ మ్యాచ్‌లపై త్వరలో బీసీసీఐ నిర్ణయం

జొహన్నెస్‌బర్గ్: ప్రతిపాదిత ఐపీఎల్ మ్యాచ్‌ల వేళల్లో మార్పులపై బీసీసీఐ అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయమే తీసుకొనేలా కనిపిస్తోంది. మ్యాచ్‌ల వేళ్లలో మార్పులపై ప్రసార హక్కుదారు స్టార్ ప్రతిపాదనను సమర్థించిన కొన్ని ఫ్రాంచైజీలు తమ నిర్ణయాన్ని ఐపీఎల్ పాలకమండలికి తెలిపాయని సమాచారం. మ్యాచ్‌లపై ప్రభావం పడనంతవరకూ మార్పులకు తాము ఓకేనని కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) అంటున్నాయి. 'మ్యాచ్‌లను అరగంట ముందుగా అంటే.. మధ్యాహ్నం 4 గంటలకు మొదలయ్యే మ్యాచ్‌లను 3.30కు, రాత్రి 8 గంటల పోటీలను 7.30కే ప్రారంభించాలని ఐపీఎల్ పాలకమండలి యోచిస్తోంది. ఇందులో తప్పుపట్టాల్సింది ఏమీలేదు. స్టేడియాలకు వచ్చిన అభిమానులు కూడా త్వరగా ఇళ్లకు వెళ్లిపోతారు' అని కేకేఆర్ సీఈవో వెంకీ మైసూర్ అభిప్రాయపడ్డారు. వాస్తవంగా..మధ్యాహ్నం పోటీలను సాయంత్రం 5.30కు, రాత్రి మ్యాచ్‌లను ఏడింటికి ప్రారంభించాలని పాలకమండలి ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను కొన్ని జట్లు తీవ్రంగా వ్యతిరేకించడంతో దానిలో మార్పులు చేశారు.

గ్రూప్-1లో చోటు పదిలం

- భారత్‌ను గెలిపించిన అంకిత, కర్మాన్
- ఫెడరేషన్ కప్‌లో చైనీస్ తైపీపై విజయం

న్యూఢిల్లీ: సానియా మీర్జా జట్టులో లేని లోటు తెలియనీయకుండా భారత యువ క్రీడాకారిణులు ఫెడరేషన్ కప్‌లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన అంకితా రైనా, కర్మాన్ కౌర్, యడ్లపల్లి ప్రాంజలతో కూడిన భారత జట్టు తమ చివరిపోరులో విజయం సాధించి ఆసియా/ఓషియానా జోన్ గ్రూప్-1లో చోటును నిలబెట్టుకుంది. శనివారం జరిగిన పోరులో భారత బృందం 2-0తో చైనీస్ తైపీని ఓడించింది. తొలి సింగిల్స్‌లో కర్మాన్ కౌర్ 7-6 (4), 6-3తో లీ పీ చిపై గెలుపొంది 1-0 ఆధిక్యం అందించింది. ఇక రెండో సింగిల్స్‌లో అంకిత 6-4, 5-7, 6-1తో చీ యు సూను ఓడించి భారత్‌కు 2-0 ఆధిక్యంతో విజయాన్ని కట్టబెట్టింది. అప్పటికే భారత్ విజయం ఖాయమవడంతో నామమాత్రమైన డబుల్స్ మ్యాచ్‌ను ఆడించలేదు. ఈ ప్రదర్శనతో భారత జట్టు గ్రూప్-1లో తన స్థానాన్ని పదిలం చేసుకుంది. ఇక మరో పోరులో జపాన్ 2-1తో కజకిస్తాన్‌పై గెలిచి వరల్డ్ గ్రూప్ ప్లేఆఫ్‌కు అర్హత సాధించింది.

చివరి వన్డేలో అమ్మాయిల ఓటమి

పాచెఫ్‌స్ట్రూమ్: వరుస విజయాలతో ఊపు మీదున్న భారత మహిళల క్రికెట్ జట్టుకు ఆఖరి వన్డేలో పరాజయం ఎదురైంది. దక్షిణాఫ్రికా చివరి ఓవర్ వరకు పోరాడి ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. అయితే భారత్ 2-1తో ఈ సిరీస్‌ను దక్కించుకుంది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. దీప్తి శర్మ (79), వేద కృష్ణమూర్తి (56) రాణించినా స్మృతి మంధాన డకౌట్ కావడం దెబ్బతీసింది. మిథాలీ రాజ్ (4) కూడా తక్కువ స్కోరుకే అవుట్ కావడంతో భారత జట్టు 57 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. వేదతో కలిసి దీప్తి నాలుగో వికెట్‌కు 83 పరుగులు జోడించింది. చివర్లో శిఖా పాండే (16 బంతుల్లో 6 ఫోర్లతో 31 నాటౌట్) మెరుపులతో స్కోరు పెరిగింది. షబ్నిం ఇస్మాయిల్‌కు 4 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 3 వికెట్లకు 241 పరుగులు చేసి గెలిచింది. మిగ్నాన్ డుప్రీజ్ (90 నాటౌట్), నీకెర్క్ (41 నాటౌట్) నాలుగో వికెట్‌కు 72 పరుగుల అజేయ భాగస్వామ్యంతో జట్టును గట్టెక్కించారు. వోల్‌వార్డ్ (59) అర్ధ సెంచరీ చేసింది.



భారత హృదయాలు గెలిచాడు

జాతీయ జెండాతో అభిమానులకు పోజిచ్చిన అఫ్రీది

సెయింట్ మోర్టిజ్ (స్విట్జర్లాండ్): ఐస్ క్రికెట్ చాంపియన్‌షిప్ సందర్భంగా జరిగిన ఓ సంఘటనతో పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రీది భారత అభిమానుల మనసులు గెలుచుకున్నాడు. వివరాల్లోకెళితే.. శుక్రవారం ఐస్ క్రికెట్ మ్యాచ్ ముగిసిన తర్వాత అఫ్రీదితో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఎగబడ్డారు. చాలామంది తమ దేశ పతాకాలను చేతబూని ఫొటోలు దిగుతున్నారు. ఈ క్రమంలోనే భారత అభిమానుల్లో కొందరు అఫ్రీదితో సెల్ఫీ దిగేందుకు ప్రయత్నించారు. ఇంతలోనే భారత జెండాతో అతను సెల్ఫీ దిగుతాడో లేదోనన్న సంశయంతో దాన్ని వాళ్లు పక్కకు పెట్టారు. అయితే, అఫ్రీది చొరవ తీసుకొని భారత జెండాను ఎదురుగా ఉంచుకొని మరీ అభిమానులతో సెల్ఫీకి పోజిచ్చాడు. ఈ సంఘటనతో అక్కడున్న అభిమానులంతా భారత్‌పై అఫ్రీదీకున్న అభిమానానికి ఎంతో సంతోషించారు. అఫ్రీది చూపిన గౌరవానికి హ్యాట్సాఫ్ అంటూ నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

కోహ్లీతో నా స్నేహానికి పాలిటిక్స్ అడ్డురావు

సరిహద్దు ఉద్రిక్తతలు భారత్-పాకిస్థాన్‌ల నడుమ ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్‌లకు అడ్డుగా నిలిచి ఉండవచ్చు. కానీ ఆ పరిస్థితులు టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీతో తన సుహృద్భావ సంబంధాలపై ప్రభావం చూపబోవని అఫ్రీది స్పష్టంజేశాడు. 'విరాట్‌తో నా స్నేహానికి రాజకీయ పరిస్థితులు అడ్డుకాబోవు. కోహ్లీ అద్భుతమైన వ్యక్తి. అంతేకాదు నేను నా దేశానికి మాదిరి.. కోహ్లీ భారత్‌కు క్రికెట్ రాయబారి' అని సెయింట్ మోరిట్జ్ క్రికెట్ టోర్నీ సందర్భంగా పేర్కొన్నాడు. 'విరాట్ నాపట్ల ఎప్పుడూ గౌరవంగా ఉంటాడు. నా ఫౌండేషన్‌కోసం తన సంతకంతో కూడిన జెర్సీని ఇచ్చాడు' అని అఫ్రీది గుర్తు చేశాడు.

'ముక్కోణం' ఫైనల్లో ఆస్ట్రేలియా

మెల్‌బోర్న్: న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్లతో జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో ఆస్ట్రేలియా మరో మ్యాచ్ మిగిలివుండగానే ఫైనల్లోకి అడుగుపెట్టింది. శనివారం ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ ఏడు వికెట్లతో గెలిచింది. ముందుగా ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 137 పరుగులు చేసింది. ఆ తర్వాత ఆసీస్ 14.3 ఓవర్లలో 3 వికెట్లకు 138 పరుగులు చేసి గెలిచింది.


శ్రీలంకదే సిరీస్

ఢాకా: బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టులో శ్రీలంక 215 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌ను 1-0తో దక్కించుకుంది. ఆఫ్ స్పిన్నర్ అకిల ధనంజయ (5/24) చెలరేగడంతో 339



పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ 29.3 ఓవర్లలో 123 పరుగులకే కుప్పకూలింది. లెఫ్టార్మ్ స్పిన్నర్ రంగన హెరాత్ 4 వికెట్లతో రాణించాడు. దీంతో అతడు టెస్టుల్లో అత్యధిక వికెట్లు (415) తీసిన ఎడమచేతి బౌలర్‌గా అక్రమ్ (414) రికార్డును బ్రేక్ చేశాడు. అంతకుముందు లంక రెండో ఇన్నింగ్స్‌లో 73.5 ఓవర్లలో 226 పరుగులు చేసింది. రోషన్ (70 నాటౌట్) అర్ధ సెంచరీ చేశాడు.

స్వర్ణ బోణీ స్వీడన్‌ది



శివకేశవన్

34వ స్థానంలో కేశవన్

భారత్‌కు చెందిన శివకేశవన్ పురుషుల సింగిల్స్ లూజ్ చాంపియన్‌షిప్‌లో రెండు రౌండ్ల హీట్స్ ముగిసే సరికి 34వ స్థానంలో నిలిచాడు. ఆరోసారి ఒలింపిక్స్ బరిలో దిగిన 36 ఏళ్ల కేశవన్..తొలి హీట్ ముగిసే సరికి 36వ స్థానంలో ఉన్నాడు. రెండో హీట్‌లో పుంజుకొని 40 మందిలో 31వ స్థానం దక్కించుకున్నాడు. అయితే ఓవరాల్‌గా 34వ స్థానంలో కొనసాగుతున్నాడు. విజేతను నిర్ణయించేందుకు ఆదివారం మరో రెండు రౌండ్‌ల హీట్స్ నిర్వహిస్తారు.

ప్యాంగ్‌చాంగ్ (దక్షిణకొరియా): వింటర్ ఒలింపిక్స్‌లో తొలి స్వర్ణాన్ని స్వీడన్ గెలుచుకుంది. శనివారం జరిగిన మహిళల 15 కి.మీ.ల స్కియథ్లాన్‌లో ఆ దేశ స్కీయర్ చార్లొటె కలా అగ్రస్థానంలో నిలిచింది. మారిట్ జొర్గెన్ (నార్వే) రజతం, క్రిస్టా పర్మకోవస్కీ (ఫిన్లాండ్) కాంస్య పతకం నెగ్గారు.


ఆతిథ్య జట్టుకు తొలి స్వర్ణం

ఆతిథ్య దక్షిణ కొరియా.. పురుషుల 1500 మీటర్ల స్పీడ్ స్కేటింగ్‌తో స్వర్ణ బోణీ కొట్టింది. ఆ దేశానికి చెందిన లిమ్ యో జున్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. మహిళల 7.5 కి.మీ.ల స్ప్రింట్ బియాథ్లాన్‌లో జర్మనీకి చెందిన లారా డాల్మియర్ బంగారు పతకం చేజిక్కించుకుంది. మార్టి ఓల్స్‌బు (నార్వే) రజతం, వెరోనికా విట్కోవా (చెక్ రిపబ్లిక్) కాంస్య పతకం నెగ్గారు. మహిళల 3వేల మీటర్ల స్పీడ్ స్కేటింగ్‌లో హాలెండ్ 3 పతకాలతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆ దేశానికి చెందిన కార్లిన్ అచ్టెరీక్టే, ఇరీన్ వుస్ట్, ఆంటోనిట్ డి జోంగ్ వరుసగా తొలి మూడు స్థానాలు దక్కించుకున్నారు.

సంయుక్త కొరియా ఓటమి

ఆరంభ వేడుకల్లో కలిసి మార్చ్‌పాస్ట్ చేయడమేకాదు..మహిళల ఐస్ హాకీలో సంయుక్తంగా బరిలో దిగిన దక్షిణ, ఉత్తర కొరియా జట్టు తొలి మ్యాచ్‌లో పరాజయం చవిచూసింది. ఈ ప్రిలిమినరీ మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ మహిళలు 8-0తో సంయుక్త కొరియాను చిత్తు చేశారు. పోలెండ్‌కు చెందిన కమిల్ స్టాక్ స్కీ జంపింగ్‌లో పసిడి పతకం కైవసం చేసుకున్నాడు.

నల్ల ధనంపై కొరడా!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: నల్లధనంపై కేంద్రం కొరడా ఝుళిపించనుంది. నోట్ల రద్దు తర్వాత తమ వద్ద ఉన్న నల్లధనాన్ని తెలుపు చేసుకునేందుకు నల్లబాబులు అనుసరించిన అన్ని మార్గాలపైనా దృష్టి కేంద్రీకరించింది. 2016-17, 2017-18 ఆర్థిక సంవత్సరాల్లో బ్యాంకుల్లో భారీగా డిపాజిట్లు చేసిన వారిపైనా.. పెద్ద మొత్తాల్లో బ్యాంకు లావాదేవీలు నిర్వహించిన వారిపైనా దృష్టి సారించేందుకు ఆదాయపన్ను శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. చివరిసారిగా ఓ అవకాశం ఇచ్చి.. ఆ తర్వాత భారీ జరిమానాలతో విరుచుకుపడాలని భావిస్తున్నారు. మార్చి 31 నాటికి అవసరమైతే రివైజ్డ్ ఐటీ రిటర్న్‌లు దాఖలు చేసైనా తప్పుదిద్దుకోమని సలహా ఇస్తున్నారు. ఆ తర్వాత ఉపేక్షించేది లేదని అధికారులు ట్విట్టర్ ద్వారా స్పష్టం చేశారు. ఐటీ రిటర్న్‌లను ఆలస్యంగా దాఖలు చేయడం ద్వారానో.. తప్పుడు లెక్కలతో ఐటీ రిటర్న్‌లను దాఖలు చేయడం ద్వారానో.. ఐటీ అధికారులను ఏమార్చే ప్రయత్నం చేయలేరని అందులో స్పష్టం చేశారు.

నోట్ల రద్దు అనంతర లావాదేవీలే లక్ష్యం

పెద్ద నోట్ల రద్దు తర్వాత దేశవ్యాప్తంగా చాలా మంది తమ తమ బ్యాంకు ఖాతాల్లో భారీ ఎత్తున డిపాజిట్లు చేయడంతో పాటు పెద్ద ఎత్తున లావాదేవీలు నిర్వహించారు. అయితే, వాటి లెక్కలను మాత్రం ఐటీ రిటర్న్‌ల్లో చూప లేదు. ఇలాంటి లావాదేవీలపై ఐటీ అధికారులు దృష్టి సారిస్తున్నారు. బ్యాంకు లావాదేవీలకు.. ఐటీ రిటర్న్‌లకు పొంతన లేని వాటిని గుర్తించే పనిలో ఐటీ శాఖ నిమగ్నమైంది. నోట్ల రద్దు తర్వాత చాలా మంది అక్రమమార్గాల్లో తమ వద్ద ఉన్న నల్లధనాన్ని తెలుపు చేసుకునేందుకు ప్రయత్నించారని, అలాంటి వారి గుట్టు రట్టు చేసేందుకు తాము ప్రయత్నిస్తున్నామని ఐటీ అధికారి ఒకరు తెలిపారు. 'నల్ల ధనం కలిగి ఉన్న వారికి 2016 ప్రారంభం నుంచి ప్రభుత్వం చాలా అవకాశాలు కల్పిస్తూ వచ్చింది. ఇన్‌కం డిక్లరేషన్ స్కీం వంటి పథకాలను తీసుకొచ్చింది. కానీ చాలా మంది ఇంకా నల్లధనాన్ని కలిగి ఉన్నారు. అలాంటి వారి భరతం పట్టేందుకు మేం కసరత్తు చేస్తున్నాం.' అని ట్యాక్స్ రీసెర్చ్, హెచ్‌అండ్ ఆర్ బ్లాక్ ఇండియా విభాగాధిపతి చేతన్ చందక్ పేర్కొన్నారు.

జరిమానాల మోత!

ఇన్‌కమ్ డిక్లరేషన్ స్కీం ద్వారా.. తమ వద్ద ఉన్న నల్లధనం ఎలా వచ్చిందో చెప్పకుండా, మొత్తం నల్లధనంలో 50 శాతాన్ని పన్ను రూపంలో చెల్లించి నల్లధనాన్ని తెలుపుగా మార్చుకునేందుకు అవకాశం ఉంది. అయితే ఈ పథకంలో భాగంగా మొత్తం నల్ల ధనంలో 25 శాతాన్ని ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన(పీఎంజీకేవై) పథకంలో నాలుగేళ్ల కాలానికి డిపాజిట్ చేయాలని కేంద్రం షరతు విధించింది. ఈ మొత్తాన్ని ఎలాంటి వడ్డీ లేకుండా నాలుగేళ్ల తర్వాత చెల్లిస్తామని పేర్కొంది. ఈ పథకాన్ని 2017 ఏప్రిల్ వరకు అమలు చేసినా, ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. దీంతో ఆ తర్వాత కూడా జరిమానాల మొత్తాన్ని పెంచుతూ నల్ల ధనం వెల్లడికి కేంద్ర ప్రభుత్వం అవకాశాలు ఇచ్చింది. పీఎంజీకేవై పథకం కింద నల్ల ధనాన్ని వెల్లడించని వారు, ఐటీ రిటర్న్‌ల్లో ఆ మొత్తాన్ని చూపితే 77.25 శాతం జరిమానాగా విధించి, మిగలిన మొత్తాన్ని వైట్ మనీగా మార్చుకునే అవకాశాన్ని ఇచ్చారు. ఈ స్థాయిలోనూ నల్లబాబుల నుంచి పెద్దగా స్పందన లేకపోయింది, దీంతో జరిమానా మొత్తాన్ని భారీగా పెంచిన కేంద్రం.. ఐటీ అధికారుల దాడుల్లో నల్లధనం పట్టుబడితే 107 నుంచి 137 శాతం మొత్తాన్ని జరిమానాగా వసూలు చేయడం ప్రారంభించింది. మార్చి 31 తర్వాత పట్టుబడే నల్లధనంపై ఈ జరిమానా మొత్తాన్ని మరింత భారీగా పెంచాలని కేంద్రం నిర్ణయించింది.



సంజ్‌వాన్ ఆర్మీ శిబిరం వద్ద భారీ భద్రత

సైనిక శిబిరంపై ఉగ్ర దాడి!

- క్వార్టర్లలో జొరబడ్డ ఉగ్రవాదులు
- అమరులైన ఇద్దరు సుబేదార్లు
- ఉగ్రవాదులు ముగ్గురు హతం



ఉగ్రదాడిలో అమరుడైన అష్రఫ్

జమ్ము, ఫిబ్రవరి 10: జమ్మూ శివారులోని సైనిక శిబిరంపై శనివారం తెల్లవారు జామున ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. భారీఎత్తున ఏకే-56 తుపాకులు, పేలుడు పదార్థాలతో మిలిటరీ క్యాంపు వెనుక భాగం నుంచి కంచెను కత్తిరించి లోపలికి జొరబడ్డారు. సెంట్రీని కాల్చిచంపి కుటుంబాలు నివాసం ఉండే క్వార్టర్లలోకి వచ్చారు. విచ్చలవిడిగా కాల్పులు మొదలెట్టారు. సుబేదార్లు మదన్‌లాల్ చౌదరి, మహమ్మద్ అష్రఫ్ మీర్‌లను కాల్చిచంపారు. వీరిద్దరూ సైన్యంలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్లు(జేసీవోలు). ఉగ్రవాదుల దాడిలో చౌదరి కుమార్తె సహా మహిళలు, పిల్లలు ఐదుగురు... సైన్యం నుంచి నలుగురు... మొత్తం తొమ్మిది మంది గాయపడ్డారు. ఉగ్రవాదులు ఇతర క్వార్టర్లలో చొరబడకుండా సైన్యం వారిని చుట్టుముట్టింది. ఒకవైపు ఉగ్రవాదుల కాల్పులకు బదులిస్తూనే మహిళలు, పిల్లలకు రక్షణ వలయంగా ఏర్పడి దాదాపు 150 కుటుంబాలను క్వార్టర్లలోంచి బయటకు తరలించారు. ఈ క్రమంలో తీవ్ర గాయాల పాలైన మేజర్‌ను హెలికాప్టర్‌లో ఉధంపూర్ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉంది. నాలుగు గంటల సుదీర్ఘ పోరాటం అనంతరం ముద్దరు ఉగ్రవాదుల్ని సైన్యం మట్టుబెట్టింది. నలుగురు లేదా అయిదుగురు ఉగ్రవాదులు దాడిలో పాల్గొన్నారని అనుమానిస్తున్నారు. మిగతా వారికోసం గాలిస్తున్నారు. ఉగ్రవాదులు క్వార్టర్లలో నక్కి ఉండడంతో సైనికులు ఆచితూచి వ్యవహరించారు. ఉగ్రవాదులు దాగిన చోటును కచ్చితంగా గుర్తించేందుకు హెలికాప్టర్లు, డ్రోన్లు, ట్యాంకర్లు రంగంలోకి దిగాయి. రాత్రి వేళ ఆపరేషన్ కొనసాగించేందుకు వీలుగా జనరేటర్లు, సెర్చ్ లైట్లను రప్పించారు. జమ్ములో హైఅలర్ట్ ప్రకటించి, భద్రతను కట్టుదిట్టం చేశారు. చుట్టూ అయిదు కిలో మీటర్ల పరిధిలోని పాఠశాలలను మూయించివేశారు. అఫ్జల్ గురును ఉరి తీసి అయిదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జైషే మహమ్మద్ ఉగ్రవాదులు ఆర్మీ శిబిరంపై దాడికి పాల్పడే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు ముందే హెచ్చరించాయి. ఇది జైషే మహ్మద్ పనేనని అంటున్నారు. బీజేపీ, బజరంగ్ దళ్ కార్యకర్తలు ఆర్మీ క్యాంపు బయట జాతీయ పతాకం పట్టుకుని పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జమ్మూ కాశ్మీరులో సైన్యంపై ఉగ్రదాడి జరిగి 15 నెలలు గడిచింది. 2016 నవంబరు 29న నగ్రోటా క్యాంపు మీద దాడి జరిగినపుడు ఇద్దరు జవాన్లు మరణించారు.

తూర్పు జెరూసలెంను రాజధానిగా ఒప్పుకుంటే..

ఇజ్రాయెల్‌తో చర్చలకు సిద్ధం

ఫలస్తీన్ ప్రకటన

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

రమల్లా, ఫిబ్రవరి 10: పూర్తిస్థాయి స్వాతంత్ర్యం కోసం ఫలస్తీన్ జరుపుతున్న పోరాటానికి భారత్ సంఘీభావం ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఫలస్తీన్ పట్టణం రమల్లాలో అధ్యక్షుడు మొహమౌద్ అబ్బాస్‌తో చర్చలు జరిపారు. ఫలస్తీన్ గడ్డపై అడుగిడిన తొలి భారత ప్రధాని మోదీయే. 2015లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జెరూసలెం నుంచి రమల్లాకు వెళ్లారు. ఇజ్రాయెల్‌తో శాంతి చర్చలు జరపడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఫలస్తీన్ ప్రకటించింది. దీనికి కొన్ని షరతులు విధించింది. తూర్పు జెరూసలెంను ఫలస్తీన్ రాజధానిగా ఇజ్రాయెల్ అంగీకరించాలని స్పష్టం చేసింది. 1967 అరబ్ ఒప్పందం ఆధారంగా తాము శాంతి స్థాపనకు కట్టుబడి ఉన్నామని, అంతర్జాతీయ సమాజం తీసుకొనే ఏ తీర్మానాన్నైనా తాము అనుసరిస్తామని అబ్బాస్ చెప్పారు. అనంతరం సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. అన్ని దేశాలతో, ప్రపంచ సంస్థలతో కలిసి ఓ బహుళ పక్ష శాంతి బృందాన్ని ఏర్పాటు చేసి- ఇజ్రాయెల్‌తోనూ, తమతోనూ చర్చలు జరిపి.. దశాబ్దాలుగా సాగుతున్న సంక్షోభానికి తెరపడేట్లు చూడాలని అబ్బాస్- మోదీని కోరారు. ఈ బృందం ఏర్పాటులో, చర్చల్లో భారత్ చొరవ తీసుకోవాలని, భారతే అన్ని పక్షాలనూ ఒప్పించగలదని ఆయన పేర్కొన్నారు. దీనికి వెన్వెంటనే మోదీ ఆమోదించకపోయినా- సర్వ స్వతంత్ర ఫలస్తీన్ ఆవిర్భావాన్ని తాము కోరుకుంటున్నామన్నారు. ఫలస్తీన్‌తో.. విద్య, మహిళా సాధికారికత, ఆసుపత్రులు, రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన ఆరు ఒప్పందాలపై మోదీ సంతకాలు చేశారు.



రమల్లాలో అరాఫత్ సమాధి వద్ద మోదీ నివాళి. చిత్రంలో ఫలస్తీన్ ప్రధాని రమీ హమ్‌దల్లా కూడా ఉన్నారు.

ఆ తర్వాత మోదీ రమల్లాలో ఫలస్తీన్ పితామహుడు యాసర్ అరాఫత్ సమాధి వద్ద నివాళులర్పించారు.

మోదీకి పురస్కారం

పశ్చిమాసియా శాంతికి విశేష కృషి చేస్తున్నందుకు గౌరవ సూచకంగా ఫలస్తీన్ ప్రభుత్వం మోదీకి గ్రాండ్ కాలర్ పురస్కారంతో సత్కరించింది. దీంతో పాటు ఓ ప్రశంసాపత్రాన్ని కూడా మొహమౌద్ అబ్బాస్ - అధ్యక్ష భవనంలో జరిగిన ఓ కార్యక్రమంలో అందజేశారు. ఇది విదేశీ నేతలకిచ్చే అత్యున్నత పురస్కారం.

నేడు అతి పెద్ద కోవెలకు శంకుస్థాపన

అబూదాబిలోనే అతి పెద్ద హిందూ దేవాలయానికి ఆదివారం మోదీ శంకుస్థాపన చేయనున్నారు. 55000 చదరపు మీటర్ల స్థలంలో నిర్మించే ఈ కోవెలలో దేవతామూర్తులందరి ప్రతిమలుంటాయి. 2020కల్లా దీని నిర్మాణం పూర్తవుతుందని అబూదాబిలో భారత రాయబారి నవదీప్ సింగ్ సూరి చెప్పారు. ఎమిరేట్స్‌లలో ఓ హిందూ ఆలయ నిర్మాణం ఇదే ప్రథమం.

మోదీపైనే మా ఆశలు!

భారత ప్రధాని నరేంద్ర మోదీపై పాలస్తీనాలోని ఓ కుటుంబం భారీ ఆశలు పెట్టుకుంది. పాలస్తీనాలోని కొన్ని ప్రాంతాలను ఆక్రమించుకున్న ఇజ్రాయెల్.. అక్కడి పౌరులను ముప్పుతిప్పలు పెడుతోంది. స్వాతంత్ర్యం కోసం గళమెత్తినవారిని తమ దేశానికి తరలించి ఖైదు చేస్తోంది. ఇలాంటి వారిలో చిన్నారి అహెద్ తమీమీ(16) కూడా ఉంది. ఇజ్రాయెల్ సైనికుడిని చెంపదెబ్బ కొట్టిందనే ఆరోపణలపై అహెద్‌ను గత డిసెంబరులో అరెస్ట్ చేశారు. విషయం తెలిసి అక్కడకు వెళ్లిన ఆమె తల్లిని కూడా తీసుకెళ్లి జైల్లో పెట్టారు. రమల్లా నగరానికి సమీపంలోని నబి సలీహ్ గ్రామానికి చెందిన వీరిద్దరి విడుదల కోసం ప్రస్తుతం అహెద్ తండ్రి బసిద్ తమీమీ కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. ఈ విషయంలో తమకు ప్రధాని మోదీ సాయం చేస్తారని, తన ఆశలన్నీ ఆయనపైనే పెట్టుకున్నానని బసీమ్ అంటున్నారు. వారి చెరలో ఉన్న బాలలను విడిచిపెట్టేందుకు చర్యలు తీసుకోవాలని బసీమ్ కోరుతున్నారు. మహాత్మాగాంధీ, నెల్సన్ మండేలా కూడా స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేశారన్నారు.



బుర్జ్ ఖలీఫాపై త్రివర్ణం

ఫలస్తీన్ పర్యటన ముగించుకుని మోదీ మళ్లీ అమ్మాన్‌కు హెలికాప్టర్‌లో వెళ్లి- అక్కడి నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చేరుకున్నారు. ఆయన ఎమిరేట్స్ వెళ్లడం ఇది రెండోసారి. ఆయన రాక సందర్భంగా అబూదాబి నగరాన్ని మువ్వన్నెల జెండాలతో నింపేశారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన కట్టడం బుర్జ్ ఖలీఫాను కూడా త్రివర్ణాలతో ముస్తాబు చేశారు. 828 మీటర్ల ఎత్తులో 163 అంతస్తులతో నిర్మించిన ఈ ఆకాశహర్మ్యం పైనుంచి కింది దాకా- త్రివర్ణ కాంతులీనే విద్యుద్దీపాలను అలంకరించారు. శనివారం సాయంత్రం 7:15 నుంచి రాత్రి 11:15 దాకా ఈ త్రివర్ణకాంతి శోభితమైన అలంకరణ చూపరులను ఆకట్టుకుంది.

ప్రధాని యూఏఈ పర్యటనలో

భద్రతపై కీలక ఒప్పందం

ప్రముఖ పాత్ర పోషించనున్న తెలంగాణ పోలీసులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ప్రధాని నరేంద్ర మోదీ తన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పర్యటనలో భాగంగా పలు ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. వీటిలో కీలకమైనదిగా భావించే భద్రత ఒప్పందంలో తెలంగాణ పోలీసులు కీలక పాత్ర పోషించన్నారు. అమెరికా, గల్ఫ్ దేశాలు కలిసి ఏర్పాటు చేసిన ఇస్లామిక్ ఉగ్రవాద భావజాల నిర్మూలన కార్యక్రమంలో భాగస్వామ్యం కావడానికి భారత్ ఆసక్తి ప్రదర్శిస్తోంది. ప్రధాని మోదీ గత పర్యటనలోనే దీనికి సంబంధించి అవగాహన కుదిరింది. తాజా పర్యటనలో దీనిపై మరింత ముందడుగు వేయనున్నారని సమాచారం. సామాజిక మాధ్యమా లలో ఇస్లాం పేరుతో పెరిగిపోతున్న ఉగ్రవాద భావజాల ప్రచారాన్ని అడ్డుకట్ట వేయడానికి అమెరికా, ఇతర గల్ఫ్ దేశాలతో కలిసి యూఏఈ రెండు కేంద్రాలను నిర్వహిస్తోంది. ఇందులో భారతీయ భాషలతో సహా అనేక భాషల సోషల్‌మీడియా సందేశాలను మానిటరింగ్ చేస్తున్నారు. భారత్‌లో ఇలాంటి విధానాన్ని తెలంగాణ పోలీసులు గత కొంత కాలంగా పటిష్ఠంగా అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రత్యేకించి వాట్సప్, ఫేస్‌బుక్ ఇతర సామాజిక మాధ్యమాల సందేశాల ద్వారా అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులకు సంబంధించి పూర్తిస్థాయిలో సమాచారం సేకరించడానికి ప్రస్తుతం భారత్ మరింత కసరత్తు చేయాల్సి ఉంది. ప్రధాని తాజా పర్యటనలో ఈ దిశగా మరింత ముందడుగు వేయనున్నారు. ఇరు దేశాలు ఇకపై సంయుక్తంగా నిఘా పెంచడానికి ప్రయత్నాలు చేయనున్నట్లు సమాచారం. ఇందులో తెలంగాణ పోలీసులు భారత్ పక్షాన ప్రముఖ పాత్ర వహించే అవకాశం ఉంది. ఆర్థిక రంగంలో ఇప్పటికే భారత్ నుంచి పెద్ద సంఖ్యలో దుబాయ్‌లో పెట్టుబడులు ఉన్నాయి. ఆ స్థాయిలో యూఏఈ, దుబాయ్ నుంచి పెట్టుబడులు పెంచాలని భారత్ కోరుతోంది.



పాక్ సెనేట్‌లో కృష్ణకుమారి?

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 10: పాకిస్థాన్ పార్లమెంటు ఎగువ సభ (సెనేట్)లో ఓ హిందూ మహిళ సభ్యురాలు కాబోతోంది! పాక్ సింధ్ ప్రాంతంలోని కోహ్లి తెగ (ఎస్సీ)కు చెందిన కృష్ణకుమారి (38) పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) తరఫున పార్లమెంటు ఎగువ సభకు పోటీ చేయనున్నారు. మార్చి 3న జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆమె నామినేషన్ దాఖలు చేశారు. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే తొలి హిందూ మహిళా సెనేటర్‌గా రికార్డు సృష్టించనున్నారు. సామాజిక కార్యకర్త అయిన కృష్ణకుమారి తన సోదరుడితో కలిసి పీపీపీలో చేరారు. ఆమె చిన్నతనంలోనే తల్లిదండ్రులతో కలిసి ఓ భూస్వామి నిర్బంధంలో ఉన్నారు. 16 ఏళ్ల వయసులో లాల్‌చంద్‌ను పెళ్లాడిన కృష్ణకుమారి.. ఆయన ప్రోద్బలంతో సింధ్ యూనివర్సిటీ నుంచి పీజీ పూర్తి చేశారు. థార్ ప్రాంతంలో పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడుతూ ఉంటారు.

పాక్‌లోనూ 'తక్షణ తలాక్'ను నిషేధించాలి: ఇస్లామిక్ కౌన్సిల్

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 10: తక్షణ తలాక్.. మనదేశంలో ఇప్పుడిదో పెద్ద చర్చనీయాంశం. ట్రిపుల్ తలాక్‌ను నిషేధించిన మోదీ సర్కారు.. దీనిపై చట్టం కూడా చేయనుంది. ఇప్పుడు పాకిస్థాన్‌లోనూ 'ట్రిపుల్ తలాక్'ను నిషేధించాలని ఇస్లామిక్ సిద్ధాంతాల మండలి (సీఐఐ) సిఫారసు చేయడం విశేషం. తక్షణ తలాక్‌తో విడాకులు తీసుకోవడాన్ని నేరంగా ప్రకటించాలని సీఐఐ చైర్మన్ ఖిబ్లా అయాజ్ పేర్కొన్నారు. దీనిపై తుది నిర్ణయం ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. "పురుషులు తక్షణ తలాక్‌ను వాడుకుంటున్న విధానం సరిగా లేదు. పాక్‌లో దీన్ని నిషేధించాలి. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి తక్షణ తలాక్ చెబితే శిక్షించాలి" అని అయాజ్ పేర్కొన్నట్లు జియో న్యూస్ తెలిపింది.

పంచుడా.. దంచుడా!

(మొదటి పేజీ తరువాయి)

వస్తుంటే.. యూపీకి రూపాయికి 2 రూపాయలు, బిహార్‌కు రూపాయికి రూపాయి చొప్పున ఇస్తోంది కేంద్రం! అదేమని అడిగితే.. పేద రాష్ట్రాలను ఆదుకుంటున్నామంటోంది. శుక్రవారం ఆర్థిక సంఘం ప్రాంతీయ సమావేశంలో ఇదే అంశంపై దక్షిణాది రాష్ట్రాల అధికారులు కేంద్రాన్ని ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న ఈ అన్యాయం మున్ముందు మరింత పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. దీనికి కారణం.. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య పెరిగిపోతున్న జనాభా అంతరం. ఉత్తర భారత రాష్ట్రాల్లో టీఎఫ్ఆర్ (టోటల్ ఫెర్టిలిటీ రేటు.. అంటే సగటున ఒక మహిళకు జన్మించే పిల్లల సంఖ్య) ఎక్కువగా ఉండగా.. గత ఐదు దశాబ్దాల్లో దక్షిణాపథంలో అది తక్కువ అవుతూ వచ్చినట్లు జాతీయ ఆరోగ్య సర్వే వెల్లడించిది. ఉత్తరప్రదేశ్, బిహార్ (దేశంలోనే అత్యధిక జనాభా ఉన్న) రాష్ట్రాల్లో ఫెర్టిలిటీ రేటు వరుసగా 2.74, 3.41గా ఉంది. మధ్యప్రదేశ్‌లో ఆ రేటు 2.8గా ఉంది. అదే సమయంలో.. కేరళలో 1.56, ఏపీ, తెలంగాణల్లో 1.8గా ఉన్నది.

ఉత్తరాది సీట్లు పెరిగిపోతాయ్!

మనదేశంలో అమెరికా పద్ధతుల్ని ప్రామాణికంగా తీసుకుని.. జనాభా ప్రాతిపదికన పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని నిర్ణయించారు. వివిధ రాష్ట్రాల్లో 1971 జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ సీట్ల సంఖ్యను నిర్ధారించారు. 1976లో ఎమర్జెన్సీ సందర్భంగా పార్లమెంటు రాజ్యాంగ సవరణ చేసింది. 1971 జనాభా లెక్కల ఆధారంగా ఒక్కో రాష్ట్రానికి లోక్‌సభ నియోజకవర్గాలను నిర్ణయించింది. 2000 వరకు నియోజకవర్గాల సంఖ్య పెరగరాదని చట్టం ఆదేశించింది. 2001లో గడువు ముగియగా 2026 వరకు పొడిగించారు. దాంతో యాభై ఏళ్ల పాటు నియోజకవర్గం, జనాభా నిష్పత్తికి సంబంధం లేకపోయింది. యూపీలో ఎంపీకి 25 లక్షల మంది ఓటర్లు ఉంటే, బిహార్‌లో 26 లక్షల మంది, బెంగాల్లో 22 లక్షల మంది, తమిళనాడులో 18 లక్షల మంది, కేరళలో 17 లక్షల మంది చొప్పున ఓటర్లున్నారు. 2026 తర్వాత కొత్త జనాభా లెక్కల ప్రకారం మార్పుచేర్పులు చేస్తే.. తక్కువ జనాభా రేటున్న దక్షిణ భారత రాష్ట్రాలు సీట్ల పరంగా నష్టపోతాయి. 2014 ఎన్నికలే తీసుకుందాం.. బీజేపీకి వచ్చిన సీట్లలో 51 శాతం.. యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల నుంచి వచ్చినవే. ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం సీట్ల పునర్విభజన జరిపితే ఈ రాష్ట్రాలకు మరిన్ని సీట్లు వస్తాయి. రాజ్యసభలో సీట్లను కూడా జనాభా ఆధారంగా పునర్వ్యవస్థీకరిస్తే.. అక్కడా హిందీ బెల్ట్ రాష్ట్రాల సీట్లు పెరుగుతాయి. ఇది ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యానికి, దక్షిణాది రాష్ట్రాలు బలహీనపడడానికి దారితీస్తుంది. ఇది మరింత అసమతుల్యతకు, అభివృద్ధి నిరోధానికి దారి తీస్తుంది. ఉదాహరణకు జీఎస్టీ బిల్లే తీసుకుంటే.. దాని వల్ల తమ రాష్ట్రానికి చేటు అని, దాన్ని ఆమోదించబోమని తమిళనాడు మాజీ సీఎం జయలలిత గట్టిగా వాదించారు. కానీ ఆమె మాట నెగ్గలేదు. ఉత్తరాది ఆధిపత్యం కింద దక్షిణాది రాష్ట్రాలు నలిగిపోయాయని ప్రముఖ విశ్లేషకులు అనేక మంది వ్యాఖ్యానించారు. సమాఖ్య వ్యవస్థను ఇది దెబ్బ తీస్తుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు అందుకే చెప్పారా?

ఆంధ్రప్రదేశ్‌ను జపాన్‌తో పోలుస్తూ- మరింత మంది పిల్లల్ని కనండని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు రెండేళ్ల కిందట ఒక వ్యాఖ్య చేశారు. జపాన్‌లో ఫెర్టిలిటీ రేటు దాదాపుగా కేరళ, ఏపీలతో సమానం. అసమతూకం వలసలకు దారితీస్తుండడం వల్ల రాష్ట్రాలకు అనేక రంగాల్లో సాయం కూడా సరిగా అందట్లేదన్న విమర్శలున్నాయి. హైదరాబాద్, బెంగళూరులలో ఇతర రాష్ట్రాల వారు వచ్చి చేరుతున్నారు. సాంస్కృతిక మేళవింపు ఎక్కువవ్వడం వల్ల స్థానిక సంస్కృతికి ప్రాధాన్యం లేకపోయే పరిస్థితులు వస్తాయని, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా లబ్ధిదారుల వర్గీకరణను మార్చుకోవాల్సి వస్తుందని అంటున్నారు.

అప్పుడు 37%.. ఇప్పుడు 317%

1951లో తమిళనాడు జనాభా బిహార్ కంటే ఎక్కువ. కానీ ఇప్పుడు బిహార్ జనాభా తమిళనాడు కంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువ. మధ్యప్రదేశ్ జనాభా ఒకప్పుడు కేరళ కంటే 37 శాతం ఎక్కువ. ఇపుడేమో 317% ఎక్కువ.

వలసల జోరు

మరోపక్క దేశంలో రాష్ట్రాల మధ్య వలసలు కూడా జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా ఉత్తరాది నుంచి దక్షిణాదికి వలస సాగుతోంది. 1991-2001 మధ్యకాలంతో పోలిస్తే 2001-2011 మధ్యకాలంలో రాష్ట్రాల మధ్య వలసలు రెట్టింపయ్యాయి. తమిళనాడుకు వలస 39 రెట్లు పెరిగింది. బిహార్, యూపీల నుంచి ఇతర రాష్ట్రాలకు వలసలు రెట్టింపయ్యాయి. మానవ వనరులు తగ్గడంతో వలసలు అనివార్యంగా మారుతున్నాయి. దీంతో స్థానిక జనాభా ముఖచిత్రం మారుతోంది. అసంతృప్తి పెరుగుతోంది. బెంగళూరులో హిందీ వ్యతిరేక ఉద్యమం ఇటీవల ఉద్ధృతంగా సాగింది. అక్కడ స్థానికులు కన్నడ, తమిళం, తెలుగు, దక్కనీ మాట్లాడుతుండగా, అందరి మధ్యా హిందీ అనుసంధాన భాషగా మారింది. దీన్ని కన్నడిగులు జీర్ణించుకోలేక పోయారు. పొరుగుదేశం చైనాలోనూ రాష్ట్రాల మధ్య వలసలు పెద్ద సమస్యగా పరిణమించాయి. ఉద్రిక్తతలు తలెత్తాయి. అందుకే చైనా సర్కారు వలసలను నియంత్రిస్తోంది. భారత్ కన్నా చాలా చిన్నదైన యురోపియన్ యూనియన్‌లో కూడా వలసలతో ఉద్రిక్తతలు తలెత్తాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.